# ప్రభువు పరిశుద్ధ స్త్రీలు

(రెండవ భాగము)

రచయిత్రి

**శ్రీమతి కెజియా వరప్రసాద రెడ్డి**

ప్రచురణ

**టి. పి. వరప్రసాద రెడ్డి**

**షాలోమ్ చర్చి,**

**జె.యన్.టి.యు. పోస్టాఫీస్**

**అనంతపురము - 515 002**

✆ : 9440285883, 9440669494

**Jesus Christ - Holy Women**

***Smt. Kezia Varaprasada Reddy***

© All Rights reserved

1st Edition - 12-08-2016

Price - Rs. 50/-

Copies available at:

**T.P. Varaprasada Reddy**
Shalom Church, J.N.T.U. Post Office
Ananthapuram - 515 002
cell: 9440285883

**Logos Book Centre**
10/1, Arundalpet,
Guntur - 522 002
cell: 9866296843, 9440260004

**Jeevan Jyothi Press & Publishers**
Mission High School Road,
Roya peta, Narsapur - 543 275

Printed & Published by
***T.P. Varaprasada Reddy***
Shalam Church
J.N.T.U. C. Post Office
ANANTAPUR - 515 002
Andhra Pradesh, India, ✆ : 94402 85883

# విషయసూచిక

1. ఐగుప్తు మంత్రసానులు - షిఫ్రా, పూయ .......................................4

2. పిల్లలను సేవకులుగా చేసిన తల్లి - యోకెబెదు ..............................13

3. ఇశ్రాయేలీయుల ప్రథమ ప్రవక్తిని - మిర్యాము ................................19

4. అందరూ అమ్మాయిలేనా - సిప్పోరా ..........................................31

5. ఇంటివారిని చావకుండ బ్రతుకనిచ్చి రక్షించిన స్త్రీ - రాహాబు ...........47

6. ఇశ్రాయేలీయులకు తల్లి - దెబోరా ..............................................58

7. సింహాన్ని చంపిన మేక - యాయేలు ..........................................69

8. మాటతప్పని తండ్రికి మాటతప్పని తనయ - యెఫ్తా కుమార్తె ..........79

9. ద్రోహిని చంపిన అనామకురాలు - తేబేసు స్త్రీ ..............................92

10. పతికి సిగ్గుతెచ్చిన పడతి - సమ్సోను భార్యయైన తిమ్నాను స్త్రీ ........102

# 1

# ఐగుప్తు మంత్రసానులు - సిప్రా, పూయ

నిర్గమకాండము మొదటి అధ్యాయములో మనకు కనిపించే మంత్రసానుల పేర్లు షిఫ్రా, పూయా అని చదువుతున్నాము. వీరు ఇశ్రాయేలు స్త్రీలకు మంత్రసాని పని చేయువారుగా నియమించబడ్డారు. వారి పేర్లకు అర్థాలను మొదట మనము ధ్యానిద్దాము. షిఫ్రా అను పేరుకు 'సౌందర్యము' అని అర్థము. పేరు యొక్క అర్థమునుబట్టి షిఫ్రా సౌందర్యముగల స్త్రీగా ఉండవచ్చు. ఆమె బాహ్య సౌందర్యాన్ని మనము చూడలేదు కానీ, ఆమె హృదయ సౌందర్యాన్ని నిర్గమ 1:21 చదువుట ద్వారా ఆమె దేవునికి భయపడుటను బట్టి మనము తెలుసుకోవచ్చు. పూయా అను పేరుకు 'ప్రసవవేదన కలిగిన స్త్రీ' అని అర్థము. 'హెల్త్ డిపార్ట్‌మెంట్'లో మిడ్‌వైఫ్‌గా పనిచేస్తున్న ఈమెకు ఆ పేరు సార్థకమైనట్లే ఉంది. కాన్పు కొరకు ఆమె వద్దకు వచ్చే ప్రసవవేదనను అనుభవించే ప్రతి స్త్రీకి, తాను తన కాన్పులలో తాను అనుభవించిన ప్రసవవేదనను బట్టి అందరినీ అనుభవపూర్వకంగా ఆదరించి, అభయమిచ్చి, దయచూపించి, తోడుగా ఉండి, భరోసా ఇచ్చే స్త్రీగా ఉండినదని ఆమె పేరు యొక్క అర్థాన్నిబట్టి భావించవచ్చు. ఈ ఇద్దరు స్త్రీలు మంచి అర్థసహితమైన పేర్లు కలిగినవారుగా ఉన్నారు. అది చాలా మంచిది.

**I. రాజాజ్ఞ పొందిన మంత్రసానులు :** సాధారణముగా చిన్న ఉద్యోగులతో రాజులు మాట్లాడరు. కానీ నిర్గమ 1:15-16 లో రాజు నేరుగా ఈ స్త్రీలతో మాట్లాడినట్లు చదువుతున్నాము. ఈ మాట రాజుకు ప్రధానమైనదిగా తోచింది కనుకనే అతడు వారితో నేరుగా మాట్లాడి చెబుతున్నాడు. రాజు చెప్పినదేమిటంటే - హెబ్రీ స్త్రీలకు మీరు మంత్రసాని పనిచేయునపుడు వారి కాన్పు పీటలమీద చూచినపుడు మగవాడైన యెడల వాని చంపుడి. ఆడుదైన యెడల దానిని బ్రతుకనియ్యుడి' అని చెప్పాడు. ఇలా రాజు చెప్పడానికి కారణము ఇశ్రాయేలీయులు ఐగుప్తీయులకంటే విస్తారంగా, బలిష్టంగా ఉన్నందువల్ల వారు అలాగున విస్తరించకుండునట్లుగా ఫరోరాజు ధాన్యము నిలువచేసుకొనుటకు అవసరమైన పట్టణములను కట్టుటకై కఠినమైన వెట్టిపనులను చేయువారిగా నియమించాలని చాలా యుక్తిగా రాజు వారిపట్ల ఆలోచిస్తున్నాడు. అలా చేసినప్పటికీ వారు దేవుని కృపవల్ల విస్తరిస్తూనే ఉన్నారు. గనుక ఇక వారు విస్తరించకుండునట్లు వారి మగసంతానాన్ని కాన్పుపీటల మీదనే చంపివేయమని రాజు షిప్రా, పూయలకు ఆజ్ఞాపించాడు. 'చెఱపకురా చెడేవు' అను లోక సామెత ప్రకారము మాత్రమే కాక "మీరు చేసినదానిని బట్టి త్వరగా మీ నెత్తిమీదికి రప్పించెదనని' దేవుడు యోవేలు 3:6 చెప్పిన మాట ప్రకారమే అతి త్వరలో ఫరో, అతని ప్రజలైన ఐగుప్తీయుల

జ్యేష్టపుత్రులందరూ ఒకేరోజు చంపబడబోతున్నారు. మగపిల్లలను చంపండి, ఆడుదైతే బ్రతకనివ్వండి అని చెప్పుటలో ఫరో ఉద్దేశమేమంటే, హెబ్రీ స్త్రీలు పనికిరాని వారని, చేతకాని వారని, దద్దమ్మలని తలంచి ఉండవచ్చును. హెబ్రీ స్త్రీలలో తమ జనాంగాన్ని రక్షించుకున్న ఎస్తేరు, తన పిల్లలను రక్షించుకున్న అబీగయీలు, తన దేశాన్ని రక్షించుకున్న దెబోరా, తన పట్టణాన్ని రక్షించుకున్న తెబేసు స్త్రీ, తన పట్టణాన్ని రక్షించుకున్న వివేకపు స్త్రీలాంటి జ్ఞానవంతులైన స్త్రీలు, చురుకైన స్త్రీలు ఉన్నారని ఫరోరాజుకు తెలియదు. వారు 'నివురుగప్పిన నిప్పుల' లాంటివారని అతనికి తెలియదు. రక్షకుణ్ణి లోకానికి తెచ్చిన మరియ ఉన్నదని, రక్షకుని మిన్నగా ప్రేమించిన యెహన్న, సూసన్న, మగ్దలేనె మరియలు ఉన్నారని ఆ రాజుకు తెలియదు. హెబ్రీ స్త్రీలు దండుగవారని ఆ రాజు అనుకుని అలాగున మాట్లాడి ఉంటాడు.

**II. దేవునికి భయపడిన మంత్రసానులు :** వీరు దేవునికి భయపడి మగపిల్లలను బ్రతుకనిచ్చారని 1:17లో చదువుతున్నాము. దేవునికి భయపడ్డారు. అంటే ఏ దేవునికి? ఐగుప్తులోని దేవునికా? ఇశ్రాయేలు దేవునికా? ఇశ్రాయేలు దేవునికే. ఇశ్రాయేలు ప్రజల మధ్య వారు మంత్రసాని పనిచేయుచుండగా ఎంతమంది హెబ్రీ స్త్రీలు వారికి నిజమైన యెహోవా దేవుని సంగతులు చెప్పారో? వారి ద్వారా వినిన సంగతులనుబట్టి వారు యెహోవా దేవునికి భయపడి ఆలాగున మగపిల్లలను చంపలేదని నమ్ముతున్నాను. తమ ఉద్యోగములో రాజు ద్వారా ఇవ్వబడిన అవినీతి, పాపాలను చేయకుండా ఈ మంత్రసానులు రాజుల రాజైన దేవునికి భయపడ్డారు. కానీ భూసంబంధమైన ఫరోరాజుకు కాదు గానీ, జనములకు రాజైన, సర్వభూమికి రాజైన యెహోవాకు భయపడ్డారు (హెబ్రీ 11:23). అలాగే మోషే పుట్టినపుడు అతని తల్లిదండ్రులు రాజాజ్ఞాకు భయపడి మోషేను చంపలేదు. నదిలో పారవేయలేదు. కానీ మూడు నెలలు అతనిని దాచినట్లు చదువుతున్నాము. దానియేలు 3:16 లో 'నెబుకద్నెజరు రాజు తాను నిలబెట్టిన విగ్రహమును పూజించి నమస్కరించాలని, అలా లేనియెడల తక్షణమే మండుచున్న వేడిమిగల అగ్నిగుండములో మీరు పడవేయబడుదురని షద్రక్, మెషెక్, అబెద్నెగోలతో అనినపుడు వారు రాజాజ్ఞకు భయపడక – 'నెబుకద్నెజరూ, ఇందునుగూర్చి ప్రత్యుత్తర మియ్యవలసిన చింత మాకు లేదు. మా దేవుడు మేము సేవించుచున్న దేవుడు మండుచున్న వేడిమిగల ఈ అగ్నిగుండములో నుండి మమ్మును తప్పించి రక్షించుటకు సమర్థుడు. మరియు నీ వశమున పడకుండ ఆయన మమ్మును రక్షించుటకు సమర్థుడు. ఒకవేళ ఆయన మమ్మును రక్షింపకపోయినను రాజా, నీ దేవతలను మేము పూజించము నమస్కరింపమనియు' భయపడకుండా రాజుతో ధైర్యంగా చెప్పారు.

ఆలాగున ఈ స్త్రీలు దేవునికి భయపడి పిల్లలను చంపి పాపము చేయలేదు. ఈనాడు చాలామంది స్త్రీలే తమ పిల్లలను చంపుకుంటున్నారు. గర్భములో ఉన్నది మగపిల్లవాడైతే గర్భమును ఉంచుకుంటున్నారు. మగపిల్లవాడైతే వంశోద్ధారకుడని. పెళ్ళి

సమయములో ఆడపిల్లల దగ్గరనుండి కట్నాలు తెస్తాడని. పున్నామ నరకము నుండి విడిపిస్తాడని. ముసలికాలంలో తల్లిదండ్రులను సాకుతాడని గర్భాన్ని ఉంచుకుంటున్నారు. కడుపులో ఉన్నది అడపిల్ల అని తెలిస్తే అది ఖర్చుకు పుట్టిందని, పెళ్లి సమయములో ఆమెకు కట్నము ఇవ్వాల్సివస్తుందని, ఆమెకు కాన్పులు, ఆపరేషన్లు చేయించి కానుకలు ఇచ్చుకోవాలి. ఖర్చు కొరకై పుడుతుందని భావించి తల్లులే ఈ రోజన గర్భవిచ్ఛిత్తి, అబార్షన్ చేసుకుంటున్నారు. అబార్షన్ ద్వారా పిల్లలు చనిపోయే పరిస్థితి ఈనాడు తల్లుల వల్లనే జరుగుతుండగా, స్వంత పిల్లలనే హతమార్చుకుంటున్న తల్లులకు “మీరు చేసినదానిని బహు త్వరగా మీ నెత్తిమీదకు రప్పించెదనని’ దేవుడు యోవేలు 3:6 లో చెప్పినమాట మీ విషయములో జరిగితే అది బహుత్వరగా జరిగితే ఆ శ్రమకు, ఆ శోకానికి, ఆ రోదనకు మీరు తట్టుకొనగలరా? అబార్షన్ ద్వారా ఒక జీవించుచున్న ప్రాణిని చంపుతున్నామని ఎవ్వరూ అనుకోవడం లేదు. తల్లి గర్భాలే అనేక పసికూనలకు సమాధి స్థలాలవుతున్నాయి. ప్రకటన 6:10 లో బలిపీఠం క్రింద చంపబడినవారి ఆత్మలు ‘నాథా, సత్యస్వరూపీ! పరిశుద్ధుడా! ఎందాక తీర్పు తీర్చకయు మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని బిగ్గరగా కేకలు వేసినట్లు” మనము అబార్షన్ ద్వారా చంపిన మన పిల్లలు మన ప్రతిదండన కోరుతూ దేవుణ్ణి ప్రార్థన చేసే ఏర్పాటు ఉండినట్లయితే మన తీర్పు ఎలా ఉంటుందోనని ఇలాంటి తల్లులారా, ఎప్పుడైన కొంచెము ఆలోచించారా? మీకు తెలియకుండానే మీరు మీ పిల్లలను చంపుతున్నారేమో, ఆలాగున నరహంతకులై ఉన్నారేమో ఆలోచించండి.

‘ఆడపిల్లయై పుట్టుటకంటె అడవిలో మ్రానైపుట్టుట మేలు’ అనుకొని చాలామంది తల్లులు తమకు పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే వెంటనే అబార్షన్ చేయించుకుంటున్నారు. అలాగే చేస్తూపోతే ఒకనాటికి మన మగపిల్లలను పెండ్లి చేసుకొనేందుకు ఆడపిల్లలు కరువౌతారు. బైబిల్ కాలంలో ఇలాగే ఆడపిల్లలను కనకూడదని ఆనాటి తల్లులు అనుకొని వుంటే మనకు ఈ రోజుల్లో పాఠముగా ‘ఎస్తేరులు, బత్షెబ, రాహాబులు’ అలాంటివారు మనకు ఉండేవారా? మరియమ్మ పుట్టకపోతే యేసుప్రభువు ఎక్కడ? ఎస్తేరు పుట్టకపోతే యూదుల రక్షణ ఎలాగున జరిగేది? మగ్దలేనే మరియ లేకపోతే ‘యేసయ్య పునరుత్థాన వార్త శిష్యులకు చెప్పేవారెవరు? కనుక ఆడపిల్లను అలుసుగా చూడకూడదు. అజ్ఞానంతో, అవివేకంతో, అమాయకత్వంతో, పొరపాటుతో ఇంతవరకు చేసిన ఈ ప్రాణహత్యలకు స్వస్థి చెప్పి, ప్రభువును క్షమాపణ అడుగుకొని అలాంటి కార్యాలకు ‘ఫుల్‌స్టాప్’ పెట్టి దేవునికి భయపడి షిఫ్రా, పూయలవలె మాదిరి జీవితాన్ని కలిగియుందుము గాక.

అపొ.కా. 5వ అధ్యాయంలో ప్రజలు అపొస్తలుల ద్వారా స్వస్థత పొందుచుండగా ప్రజలు వారిని ఘనపరచుచుండగా సద్దూకయ్యుల తెగవారు మత్సరముతో నిండుకొని వారిని పట్టణపు చెరసాలలో వుంచగా ప్రభువు దూత రాత్రివేళ ఆ చెరసాల తలుపులు తీసి వారిని వెలుపలికి తీసికొని వచ్చి – మీరు వెళ్ళి దేవాలయములో నిలువబడి ఈ

జీవమును గూర్చి మాటలన్నియు ప్రజలతో చెప్పుదని వారితో అనగా అపొ.కా. 5:28,29 లలో ప్రధాన యాజకుడు వారిని చూచి మీరు ఈ నామమును బట్టి బోధింపకూడదని మేము మీకు ఖండితముగా ఆజ్ఞాపింపలేదా? అని చెప్పినప్పుడు అందుకు పేతురును అపొస్తలులును "మనుష్యులకు కాదు మేము దేవునికే మేము లోబడవలెను (దేవునికే భయపడవలెను) గదా అన్నారు. కనుక మనము దేవునికే లోబడాలి, భయపడాలి. ఈలాగున దేవునికి భయపడితే మనకు వచ్చే లాభమేంటి? సామెతలు 16:6 లో 'కృపాసత్యముల వలన దోషములు ప్రాయశ్చిత్తము కలుగును. యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట వలన మనుష్యులు చెడుతనము నుండి తొలగిపోవుదురు" అని వ్రాయబడిన ప్రకారము దేవునియందు భయభక్తులు కలిగియుండుట వలన మనము చెడుతనము చేయకుండా ఉంటాము. అలాగే షిఫ్రా, పూయ దేవుడైన యెహోవాకు భయపడుట వలన పిల్లలను చంపుట అనే చెడుతనము నుండి తొలగిపోవుటకు ప్రభువు సహాయం చేశాడు.

యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుట వలన వచ్చే లాభాలు కొన్ని క్రింద వ్రాయబడ్డాయి.

1) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట జీవపు ఊట (సామెతలు 14:27).
2) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము (సామెతలు 1:7).
3) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మూలము (సామెతలు 9:10; 2:8).
4) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట చెడుతనము నసహ్యించు కొనుటయే (సామెతలు 8:13).
5) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట వినయమునకు ప్రతిఫలము (సామెతలు 22:4).
6) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట యథార్థముగా ప్రవర్తించుటకు కారణము (సామెతలు 14:2).
7) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహుధైర్యము పుట్టించును (సామెతలు 14:26).
8) యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట దీర్ఘాయువుకు కారణము (సామెతలు 10:27).
9) పాపాత్ములు నూరుమారులు దుష్కార్యము చేసి దీర్ఘాయుష్మంతులైనను దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన సన్నిధికి భయపడువారు క్షేమముగా ఉందురు.

10) యెహోవాయందు భయభక్తులు గల స్త్రీ కొనియాడబడును (సామెతలు 31:30).

11) ఆయన మర్మము ఆయన యందు భయభక్తులు గలవారికి తెలిసియున్నది.

12) ఆయన యందు భయభక్తులు గలవారి నిమిత్తము ఆయన దాచియుంచిన మేలు ఎంతో గొప్పది (కీర్తన 31:19).

13) యెహోవాయందు భయభక్తులు గలవారిచుట్టు ఆయన దూత కావలియుందును (కీర్తన 34:7).

14) ఆయనయందు భయభక్తులు ఉంచువారికి ఏ మేలును కొదువైయుండదు (కీర్తన 34:9).

15). ఆయనయందలి భయము వారికి ఐశ్వర్యము (యెషయా 33:6).

16). ఆయనకు భయపడువారి మీద ఆయన కనికరము నిలుచును (లూకా 1:50).

ఈలాగున దేవునియందు భయభక్తులు గలవారిని గూర్చి కొన్ని వచనాలు గమనిద్దాం:

1) 1రాజులు 18:12 లో 'నేను బాల్యమునుండి యెహోవాయందు భయభక్తులు నిలిపినవాడనని ఓబద్యా అంటున్నాడు.

2) యోబు 1:1 లో 'యోబు దేవునియందు భయభక్తులు గలవాడై చెడుతనమును విసర్జించాడు.

3) నెహెమ్యా 7:2 లో హనన్యా అందరికంటే ఎక్కువగా యెహోవాయందు భయభక్తులు గలవాడు.

4) హెబ్రీ 11:7 లో నోవహు భయభక్తులు గలవాడై తన యింటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను.

ఇన్ని విధములుగా మనము ఆ భీకరమైన దేవుని యందు భయభక్తులను కలిగియున్నామా? జనములకు రాజా, నీకు భయపడనివాడెవడు? . . . నీలాంటివాడు ఎవడును లేడు గనుక నరులు నీకు భయపడుట అనుగుణ్యము అని యిర్మీయా 10:7లో వ్రాయబడినది. యిర్మీయా 5:22 లో, 'నాకు మీరు భయపడరా? నా సన్నిధిని వణకరా? అని అడుగుతున్న ప్రభువుకు భయపడి చెడుతనము నుండి, నష్టముల నుండి తొలగిపోవుదము గాక!

**III. వంశాభివృద్ధి పొందిన షిఫ్రా, పూయా :** షిఫ్రా, పూయా దేవునికి భయపడి మగపిల్లలను బ్రతుకనిచ్చినందున ఆ ఇశ్రాయేలు జనము విస్తరించి మిక్కిలి ప్రబలినట్లు, దేవుడు ఈ స్త్రీలకు కూడా వంశాభివృద్ధి కలుగజేశాడని నిర్గమ 1:21 లో వ్రాయబడినది. ఒకరికి మనము మేలుచేస్తే దేవుడు మన పిల్లలకు మేలు చేస్తాడని దీనివలన మనకు అర్థమౌతున్నది. షిఫ్రా, పూయా హెబ్రీ పిల్లలను విస్తరింపజేయుట వలన దేవుడు ఆ మంత్రసానుల వంశమును వృద్ధిచేసి విస్తరింపజేశాడు.

ఈలాగున దేవుడు దావీదుకు కూడా సంతాన సంబంధమైన వాగ్దానము నిచ్చాడు. 2సమూ 7:11 లో 'నేను నీకు సంతానము కలుగజేసెదను. నీ దినములు సంపూర్ణ మగునపుడు నీవు నీ పితరులతో నిద్రించిన తరువాత నీ గర్భములోనుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి రాజ్యమును అతనికి స్థిరపరచెదనని అతడు నా నామ ఘనత కొరకు ఒక మందిరమును కట్టించును. అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను' అన్నాడు. సొలొమోను విషయములో కూడా 1రాజులు 2:24 లో "తన వాగ్దానము ప్రకారము నాకు కుటుంబము కలుగజేసిన యెహోవా" అని చెప్పబడిన వాగ్దానాన్ని దేవుడు నెరవేర్చాడు. అలాగుననే దేవుడు యరోబాముకు సంతాన విషయములో 1రాజులు 11:38 లో వాగ్దానము చేశాడు. 'నేను నీకు ఆజ్ఞాపించిన దంతయు నీవు విని నా మార్గములననుసరించి నడుచుచు నా సేవకుడైన దావీదు చేసినట్లు నా కట్టడలను నా ఆజ్ఞలను గైకొనిన యెడల నేను నీకు తోడుగా ఉండి దావీదు కుటుంబమును శాశ్వతముగా నేను స్థిరపరచినట్లు నిన్నును స్థిరపరచి ఇశ్రాయేలువారిని నీకప్పగించెదను.'

దేవుడు బైబిల్‌లో మన సంతానమును గురించి కూడా వాగ్దానము చేసిన మరికొన్ని వచనములు మనము గమనించి వాటిని ప్రభువు దగ్గర ప్రార్థించి విశ్వాసముతో పొందుకోవచ్చు.

**1. యిర్మీయా 31:15-21** – ఏడువక ఊరుకొనుము. కన్నీళ్లు విడుచుట మానుము. నీ క్రియ సఫలమై జనులు శత్రువుని దేశమునుండి తిరిగి వచ్చెదరు. రాబోవు కాలమందు నీకు మేలు కలుగును. అతని గురించి నా కడుపులో వేదనగా ఉన్నది. తప్పక నేనతని కరుణింతును.

**2. యిర్మీయా 30:10** – యాకోబూ, భయపడకుము. ఇశ్రాయేలూ, విస్మయ మొందకుము. నేను దూరమున నుండు నిన్నును చెరలోనికి పోయిన దేశముననుండు నీ సంతానపువారిని రక్షించుచున్నాను. బెదరించువాడు ఎవడును లేకుండ యాకోబు సంతతి తిరిగివచ్చి నిమ్మళించి నెమ్మది పొందును.

**3. జెకర్యా 9:13** – సీయోనూ, నీ కుమారులను లేపుచున్నాను. శూరుడు ఖడ్గము ప్రయోగించునట్లు నేను నిన్ను ప్రయోగింతును.

**4. యెషయా 49:22** – నేను జనములతట్టు నా చేయి ఎత్తుచున్నాను. జనముల తట్టు నా ధ్వజము ఎత్తుచున్నాను. నీ కుమారులను రొమ్మున వుంచుకొనుచున్నాను. నీ కుమార్తెలు వారి భుజముల మీద మోయబడుదురు. నీ పిల్లలను నేనే రక్షించెదను.

**5. యెషయా 59:21** – నీ మీదనున్న నా ఆత్మయు నేను నీ నోటనుంచిన నా మాటలను నీ నోటయందును నీ పిల్లల పిల్లల నోటనందును ఈ కాలము మొదలుకొని ఎన్నడును తొలగిపోవు.

**6. యెషయా 44:3** – నీ సంతతి మీద ఆత్మను కుమ్మరించెదను. నీకు పుట్టినవారిని నేను ఆశీర్వదించెదను. నీటి కాలువల మధ్య నిరవంజి చెట్లు గడ్డిలో ఎదుగునట్లు వారు ఎదుగుదురు. ఒకడు యెహోవా వాడనియు మరియొకడు యాకోబు పేరు చెప్పుకొనును. మరియొకడు యెహోవా వాడనని తన చేతిలో వ్రాసి ఇశ్రాయేలు అను మారుపేరు పెట్టుకొనును.

**7. యెషయా 59:20–21** – నీ మీదనున్న నా ఆత్మయు నేను నీ నోటనుంచిన మాటలు నీ నోటనుండియు, నీ పిల్లల నోటనుండియు ఈ కాలము మొదలుకొని ఎప్పుడును తొలగిపోవు.

**8. యెషయా 60:4** – కన్నులెత్తి చుట్టు చూడుము. వీరందరూ కూడుకొని నీ యొద్దకు వచ్చుచున్నారు. వీరందరూ కూడుకొని నీ యొద్దకు వచ్చుచున్నారు. నీ కుమారులు దూరమున నుండి వచ్చుచున్నారు. నీ కుమార్తెలు చంకనెత్తబడి వచ్చుచున్నారు. నిన్ను బాధించినవారి సంతానము నీ యెదుటికి వచ్చి సాగిలపడెదరు. నిన్ను తృణీకరించిన వారందరు వచ్చి నీ పాదముల మీద పడెదరు.

**9. యెషయా 60:20,21** – నీ దుఃఖదినములన్నియు సమాప్తములగును. నీ జనులందరూ నీతిమంతులై యుందురు.

**10. యెషయా 60:9,10** – నీ దేవుడైన యెహోవా నామమునుబట్టి దూరమునుండి నీ కుమారులను, తన వెండి బంగారములను తీసికొని వచ్చుటకు ద్వీపములు నా కొరకు కనిపెట్టుచున్నవి.

**11. యెషయా 62:5** – యౌవనుడు కన్యకను వరించి పెండ్లి చేసికొనునట్లు నీ కుమారులు నిన్ను పెండ్లి చేసికొనెదరు.

**12. యెషయా 65:23** – ఆకస్మికముగా కలుగు అపాయము నొందుటకై మీరు పిల్లలను కనరు. వారు యెహోవా చేత ఆశీర్వదించబడిన వారగుదురు. వారి సంతానపువారు వారి యొద్దనే వుందురు.

**13. యెషయా 54:13** – నీ పిల్లలందరూ యెహోవాచేత ఉపదేశము పొందుదురు. నీ పిల్లలకు అధిక విశ్రాంతి దొరుకును.

**14. యెషయా 61:9** – జనములలో వారి సంతతి తెలియబడును. జనముల మధ్యను వారి సంతానము ప్రసిద్ధినొందును. వారు యెహోవా ఆశీర్వదించిన జనమని వారిని చూచిన వారందరూ ఒప్పుకొందురు.

ఉదా: 1) ఐజక్ న్యూటన్, 2) ప్రేయింగ్ హైడ్, 3) అగస్టీన్, 4) జాన్ వెస్లీ, 5) అబ్రహాం లింకన్, 6) యెఫ్తా కుమార్తె, 7) మోషే,

**15) యెషయా 48:19** – నీ గర్భఫలము దాని రేణువులను విస్తరించును. వారి నామము నీ సన్నిధి నుండి కొట్టివేయబడదు, మరువబడదు.

**16) కీర్తన 115:14,15 -** యెహోవా మిమ్మును మీ పిల్లలను వర్ధిల్లజేయును.

షిఫ్రా, పూయా అను మంత్రసానులకు వంశాన్ని ఇచ్చుట మాత్రమే కాక, ఆ వంశమును అభివృద్ధి చేశారట. అలాగే మనకు దేవుడు సంతతిని ఇచ్చుట మాత్రమే కాక వారు ఆశీర్వదించబడే సంతతిగా ఉండాలి అనే ఉద్దేశముతోనే పైన వ్రాయబడిన వాగ్దానాలు ప్రభువు మనకిచ్చాడు. ప్రియ సహోదరీలారా, ఇంతవరకు మన కుటుంబాలను గురించి పైన చెప్పబడిన కొన్ని వాగ్దానములను మీరు విశ్వాసంతో మీ ప్రార్థనల్లో వాడుకొంటూ మీ పిల్లల విషయమై వీటిని మీరు దేవునిని అధికారముతో అడిగి క్లెయిమ్ చేసుకోవచ్చు. మరిముఖ్యంగా మన పిల్లలకు ఉన్న భౌతిక ఆశీర్వాదము లను బట్టి సంతోషిస్తే లాభము లేదు. ఈ లౌకిక ఆశీర్వాదములతోబాటు ఆత్మీయ ఆశీర్వాదములలో అతి ప్రాముఖ్యమైన రక్షణ ఆశీర్వాదము మన పిల్లల కొరకు తల్లిదండ్రులైన మనము కోరుకోవాలి. రక్షణ ఆశీర్వాదము లేకుండా ఇహలోక ఆశీర్వాదాలు ఎన్ని ఉన్నా అవి పరలోకంలోనికి రాక ప్రభువు రెండవ రాకడలో అవన్నీ అగ్నికి ఆహుతి అవుతాయి. పాప క్షమాపణ, రక్షణ లేకపోతే మన పిల్లల ఆత్మలు కూడ నరకాగ్నికి ఆహుతి అయ్యే ప్రమాదముంది. అలా మన పిల్లల ఆత్మలు నరకాగ్నిలో వేదన పడకుండా ఉండాలంటే, ప్రభువు అపొ.కా. 3:26 లో "మీలో ప్రతివానిని వాని దుష్టత్వము నుండి మళ్లించుట వలన మిమ్మునాశీర్వదించుటకు ఆయనను మొదట మీ యొద్దకు పంపెను" అని వ్రాయబడిన ప్రకారము మన పిల్లలు వారి పాపముల నుండి మళ్లించబడుట అనే రక్షణ ఆశీర్వాదమును ముందు పొందుకోవాలి.

తల్లిదండ్రులమైన మనము రక్షించబడ్డాము. పరలోకం చేరతాము. కానీ మన పిల్లలకు ఇలాంటి ఆశీర్వాదముందా? అపొ.కా. 2:38-39 లో పేతురు 'మీరు మారుమనసు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు నిలిచిన వారందరికిని చెందను" అని చెప్పిన ప్రకారము ఈ రక్షణ ఆశీర్వాదము మనకు మాత్రమే కాక మన పిల్లలకును, దూరస్థులందరికిని చెందుతుందని దేవుడు మనకు వాగ్దానం చేశాడు. ప్రియ సోదరీ, ఆలాగున మీ పిల్లలందరూ రక్షించబడ్డారా? గుణవతియైన భార్య పిల్లలందరూ రక్తవర్ణ వస్త్రములు ధరించినట్లు మీ పిల్లలందరూ క్రీస్తు రక్తములో ముంచబడిన వస్త్రములు ధరించారా? క్రీస్తు రక్తపు గురుతు మీ పిల్లల మీద ఉన్నదా? ఏలయనగా ఆ రక్తము చూచినపుడు నేను మిమ్మును నశింపజేయక దాటిపోవుదునని ప్రభువు నిర్గమ 12:13లో చెప్పాడు. గనుక మన పిల్లలు ఆలాగున సంహార దూతనుండి, నాశనము నుండి తప్పించుకొనేటట్లు తల్లులే వారి రక్షణ కొరకు పాటుపడాలని నేర్చుకుంటున్నాము. ఈలాగున షిఫ్రా, పూయా తమ సంతతికి ఆశీర్వాద కారకులుగా ఉండినట్లు వారు మనకందరికీ మాదిరిగా ఉన్నారు.

పైన మనము మన సంతానము దేవుడిచ్చిన అనేక వాగ్దానములను చూశాము. కానీ తండ్రియైన మన దేవుడు తన కుమారుని గూర్చియైతే ఆయన ఈ భూలోకములో ఆశీర్వదించబడాలని కోరి పంపలేదు. కానీ, తమ అభిషిక్తుని నిర్మూలింపచేయుటకు పంపాడు (దానియేలు 9:26). అతని నలుగగొట్టుటకు తండ్రికి ఇష్టమైనది (యెషయా 53:10). మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడింది (యెషయా 53:5). అన్యాయపు తీర్పు పొందినవాడై అతడు కొనిపోబడ్డాడు (యెషయా 53:8). అతడు సజీవుల భూమిలో నుండి కొట్టివేయబడెను (యెషయా 53:8). అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడింది. అతనికి కలిగిన వేదననుబట్టి అతడు తృప్తిపొందాడు. అనేకుల దోషములను భరించి తనకున్న అనుభవ జ్ఞానముచే అనేకులను నిర్దోషులుగా చేశాడు. మరణము నొందునట్లు తన ప్రాణమును ధారపోశాడు.

ఈలాగున దేవుడు మన పిల్లలకు ఆశీర్వాదాలకు కారణమైన వాగ్దానాల నిచ్చాడు. కానీ తన కుమారునికైతే నలిగిపోవుటకు, నిర్మూలమగుటకు, నశించి పోవుటకు ఈ లోకానికి పంపాడు. శుక్రవారము ప్రాణము పెట్టిన యేసుప్రభువు ఆదివారము తిరిగి లేచాడు. ఆయన ద్వారా లోకము రక్షించబడుట దేవునికి ఇష్టమైనది. ఇందుకై దేవునికి లెక్కలేని స్తోత్రములు.

❄ ❄ ❄ ❄ ❄

# 2

# పిల్లలను సేవకులుగా చేసిన తల్లి - యొకెబెదు

**నిర్గమ 2:1 –** “లేవీ వంశస్థుడొకడు వెళ్ళి లేవీ కుమార్తెను వివాహము చేసికొనెను. ఆ స్త్రీ గర్భవతియై కుమారుని కని వాడు సుందరుడైయుండుట చూచి మూడు నెలలు వానిని దాచెను.”

ఈ లేవీ వంశస్థుడు, లేవీ కుమార్తె ఎవరో నిర్గమ 6:20 వాక్యభాగం మనకు తెలియజేస్తుంది. వారు మేనత్త, మేనల్లుడుగా మనకు కనబడుతున్నారు. వారి కాలములో ధర్మశాస్త్రము ఇంకన వారికివ్వబడలేదు. గనుక వారు వావివరుసలు లేని పెళ్ళి చేసుకున్నారు. కానీ ధర్మశాస్త్రము వచ్చిన తరువాత ఇశ్రాయేలీయుల ఆలాగున వావివరుసలు లేని పెళ్ళిళ్లు చేసికొనలేదు. కానీ 2కొరింథీ 6:15 ప్రకారము విశ్వాస గోత్రానికి చెందిన వ్యక్తి విశ్వాస గోత్రానికి చెందిన వ్యక్తిని వివాహమాడాలి.

“ఆ స్త్రీ గర్భవతియై కుమారుని కని వాడు సుందరుడైయుండుట చూచి మూడు నెలలు వానిని దాచెను” అని చదువుతున్నాము. ఆ కుమారుని పేరే మోషే అని మనమెరుగుదుము. మోషే చాలా క్లిష్ట సమయములో పుట్టాడు. ఎవరికైనా మగపిల్లవాడు పుడితే వానిని నదిలో పారెయ్యాలి అని ఆనాటి ఫరోరాజు ఖండితంగా ఆజ్ఞాపించాడు. కావున అందులోనూ వాడు సుందరుడైయున్న కారణాన ఆ తల్లి వానిని పారవేయలేక మూడు నెలలు వాడిని దాచిందట. నెలలు ఎక్కువయ్యే సరికి పసిపిల్లలు ఆ.. ఊ … అంటూ చిన్న చిన్న శబ్దాలు చేస్తూ ఉంటారు. ఆకలైతే పోరుపెడతారు. కనుక ఆ కేకలు ఇతరులకు వినబడకుండా వాడు కేకలు వేసీ వేయకమునుపే పాలిచ్చి ఆడించి, జోకొట్టి, నిద్రపుచ్చి, లాలించేదేమో. ఏదీ శబ్దమొచ్చేట్లు పెద్దగా మాట్లాడుతూ కాదు, జోలపాట పాడేందుకు వీలుపడదు. శబ్దము రాకుండా గుట్టుగా ఎలా ఆ మూడు నెలలు దాచిందో ఆమెకే తెలియాలి.

ఆ తరువాత వానిని దాచలేక వాని కొరకు ఒక జమ్ముపెట్టె తీసికొని దానికి జిగటమన్నును కీలును పూసి అందులో ఆ పిల్లవానిని పెట్టి యేటి యొడ్డున జమ్ములో దానిని ఉంచినట్లు చదువుతున్నాము. మూడు నెలల తరువాత మోషే వేసే పెద్ద కేకలను విని ఎవరైనా ఈమె ఇంటిలో మగపిల్లవాడు ఉన్నాడని రాజుకు తెలియజేసే అవకాశముంది కనుక ఆ విషయమై దేవుని చిత్తము తెలిసికొనుటకై యొకెబెదు ఎంతగానో ప్రార్థించి యుంటుందని నేను నమ్ముతున్నాను. హెబ్రీ 11:23 లో, మోషే తల్లిదండ్రులు విశ్వాసమునుబట్టి రాజాజ్ఞకు భయపడక ఇంటిలో మూడు నెలలు దాచారని వ్రాయబడుటచే విశ్వాసియైన యొకెబెదు దేవుణ్ణి ప్రార్థించి ఉంటుందని చెప్పుటలో

అనుమానమేమీ లేదు. విశ్వాసముచేత మూడు నెలలు దాచిననూ, ఆ తరువాత బిడ్డ కేకలు, అరుపులు ఎక్కువైపోయాయేమో? పాలిచ్చే తన తల్లి రాగానే ఆమె దుఃఖాన్ని గుర్తించి సంతోషంతో పెద్ద కేక చేస్తున్నడేమో. అమ్మ ఎత్తుకోవాలని గారాబము చేయాలని కేకలేస్తున్నాడేమో. ఇక ఆమె మోషేను దాచలేకపోయింది. ఇంతవరకు ఎంతోమంది పిల్లలను మ్రింగివేసిన ఆ నైలునదిలో పడవేయకుండ ఆ మరణ నది నుండి యోకెబెదు తన కుమారుని విశ్వాసముతో దేవుని కృప వలన కాపాడింది. మోషే ప్రక్కతడుపుతూ ఏడ్వడము ఎక్కువైయ్యిందేమో, చలి తగిలి ఏడ్వడం ఎక్కువయ్యిందేమో, ఇక ఆ బిడ్డను ఆమె దాచలేకపోయింది. రాజాజ్ఞా ఇంత తీవ్రంగా ఉన్న దినాల్లో మనలాంటివారమైతే, ఎందుకు అనసరంగా తెలిసి తెలిసి కష్టాలు కొనితెచ్చుకోవాలి? ఈ దినాల్లో నేడు సంతానము కొరకు ఎందుకు ఆలోచించాలి? అనుకునేవారమేమో కానీ మోషే తల్లిదండ్రులు విశ్వాసంతో ముందుకు వెళ్ళారు. యేసుక్రీస్తు పుట్టినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఉన్నది. రెండు సంవత్సరాలలోపు మగపిల్లలనందరినీ చంపమన్నాడు హేరోదు. అయినా దేవుని కృప వలన శిశువైన యేసుక్రీస్తు నజరేతులో దాచబడ్డాడు.

ఈలాగు కఠినమైన దినాల్లోనే విశ్వాసంతో మోషే తల్లిదండ్రులు మోషేను కనగలిగారు. చైనాలో నేడు చాలామంది గర్భవతులు అబార్షన్ చేయించుకోలేక, (ఆ దేశ చట్టము ప్రకారము) ఇతర దేశాలకు వెళ్తున్నారు. కష్టకాలంలో పుట్టిన పిల్లలే దేవునికి, మానవులకు పనికొస్తారని మోషే ద్వారా యేసుక్రీస్తు ద్వారా తెలుసు కొంటున్నాము.

కానీ, మోషే తల్లిదండ్రులు రాజాజ్ఞకు భయపడలేదు. హెబ్రీ 13:6లో వ్రాయబడిన ప్రకారము, కష్టసమయాల్లో మనము ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను నరమాత్రులు నాకేమి చేయగలరు అని మంచి ధైర్యముతో మోషే తల్లిదండ్రుల వలె చెప్పగలగాలి. కీర్తన 118:6 లో "ప్రభువు నా పక్షమున వున్నాడు. నరమాత్రుడు నన్ను ఏమి చేయగలడు?" అని వ్రాయబడింది. రోమా 8:31 లో 'దేవుడు మనపక్షమున నుండగా మనకు విరోధి ఎవడు?' అని వ్రాయబడింది. కష్టకాలమందు ఆయన మనకు ఆశ్రయమిచ్చేవాడు. అతని రెక్కల క్రింద మనకు ఆశ్రయమున్నది. నీతిమంతుల కష్టదినములు పోగొట్టి దేవుడు వారికి నెమ్మదినిస్తాడు.

ఈలాటి ధైర్యంతో ఇన్నాళ్ళూ దాచిపెట్టిన యోకెబెదు ఇక మోషేను దాచలేక జమ్ముపెట్టెను తయారుచేసి అందులో కుమారుని ఉంచి యేటి ఒడ్డున దానిని వుంచినట్లు చూస్తున్నాము. ఈ మాటనుబట్టి ఆమెకు జమ్ముపెట్టె తయారుచేయడము కూడా వచ్చునని తెలుసుకొంటున్నాము. ఇశ్రాయేలు స్త్రీ పురుషులు తప్పకుండా కొన్ని వృత్తులు వారు చిన్నప్పుడే నేర్చుకుంటారట. అలాగే ఏదో ఒక వాయిద్యము వాయించడము కూడా వారు నేర్చుకుంటారు. ఉదా: పౌలు, అకుల, ప్రిస్కిల్ల గుడారాలు కుట్టేవారు. అలాగే మిర్యాము, యెఫ్తా కుమార్తె తంబూర వాయించేవారు.

యొకెబెదు వలె మనము కూడా మన పిల్లలను దాచలేని పరిస్థితుల్లో ఆత్మ రక్షణలోనికి నడిపించలేని పరిస్థితుల్లో, అవిధేయ పిల్లలను మార్చుకోలేకపోయిన పరిస్థితుల్లో ప్రభువు చేతికి విశ్వాసంతో అప్పగించాలి. ఆయన కృపా వాక్యానికి, అందలి వాగ్దానాలకి అప్పగించాలి. ప్రభువు మన విశ్వాసాన్ని ఘనపరుస్తాడు. విశ్వాసము లేకుండా దేవునికిష్టులైయుండుట అసాధ్యము. కీర్తన 22:29 లో ఉన్నట్లు, మన ప్రాణాలను కూడ కాపాడుకోలేని పరిస్థితుల్లో ఆయన సన్నిధిని విశ్వాసంతో, ప్రార్థనలో మోకరిల్లాలి. అలా మోకరించి ప్రార్థించి వుంటుంది యొకెబెదు. ఆమెకు ఆశ్చర్యకరమైన ఆలోచనా శక్తిగల దేవుడు ఆమెకు ఆశ్చర్యకరమైన ఆలోచన ఇచ్చుటచే 'ఫరోరాజు కుమార్తె స్నానము చేయుటకు నది ఒడ్డుకు వచ్చినపుడు ఆమె ఈ జమ్ము పెట్టెను చూస్తుంది అనే ఆలోచన చేతనే ఆమె ఆ జమ్ముపెట్టెను అక్కడ పెట్టినట్లు చూడగలము (యెషయా 28:29).

కష్టాలలో ప్రార్థించుట మాత్రమే కాక, స్త్రీలమైన మనము వివేకముచే ఆలోచించాలని కూడా ఈ స్త్రీ ద్వారా మనము నేర్చుకొనుచున్నాము. దేవుడే చక్కని ఆలోచన నిచ్చేవాడుగా ఉన్నాడు. మన ఆలోచనకర్త ప్రభువే! దేవుని ఆలోచనలు అతి గంభీరములు (కీర్తన 92:5). మగపిల్లలను చంపాలి అని చెప్పిన రాజుయొక్క కూతురు ఇంటిలోనికి ఒక హెబ్రీ మగపిల్లవాడు వెళ్తున్నాడు అంటే ఆదెంత గంభీరమైన దేవుని ఆలోచన! యెషయా 9:6 లో, ఆయనే మన ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు. నీ ఆలోచనలు పాలుపోని సమయంలో మనకు చక్కని ఆలోచన ఇచ్చే ఆలోచనకర్త మన ప్రభువే. జమ్ముపెట్టెలో మోషే క్షేమంగా ఉండినట్లు ప్రభువు చేతికి అప్పగించబడిన పిల్లలు కూడా క్షేమంగా ఉంటారు.

4వ. లో వానికేమి సంభవించునో అని తెలిసికొనుటకు మోషే అక్క మిర్యాము దూరముగా నిలిచియుండగా ఫరో కుమార్తె స్నానము చేయుటకు యేటికి వచ్చినట్లు చదువుతున్నాము. మోషే పెంపకంలో ముగ్గురు స్త్రీలు ఇక్కడ కనిపిస్తున్నారు. ఒకరు తల్లి కాగా, మరొకరు ఫరో కుమార్తె, మరొక చిన్నది, తన అక్కయైన మిర్యాము. ఈ పెద్ద స్త్రీలలో ఒకతె మోషే తల్లి. మరొకరు మోషే పెంపుడుతల్లి. తల్లి విశ్వాసి. పెంపుడు తల్లి అవిశ్వాసి. ఒకామె కన్నతల్లి, మరొకరు పెంచి చదివించిన తల్లి, ఫరో కుమార్తె ఆ జమ్ముపెట్టెను తెప్పించుకొని తెరిచి చూసింది. వాడు ఏడ్చుచుండగా ఆమె చూచి కరుణించి, 'వీడు హెబ్రీయులలో ఒకడు' అని అనినట్లు చదువుతున్నాము. అప్పుడు మిర్యాము ఫరో కుమార్తెతో, నేను వెళ్ళి హెబ్రీ స్త్రీలలో ఒకదానిని పిలుచుకొని వత్తునా? అని తన తల్లిని తీసికొని వచ్చినట్లు చూస్తున్నాము. అప్పుడు ఫరో కుమార్తె ఆమెతో, "వీనికి నా కొరకు పాలిచ్చి పెంచుము, నేను నీకు జీతమిచ్చెదను" అని చెప్పినట్లు 9వ వచనములో చదువుచున్నాము.

తల్లులమైన మనము శరీర సంబంధమైన పాలు మాత్రమే కాక, ఆత్మ సంబంధమైన దేవుని వాక్యమనే పాలు కూడా మన పిల్లలకిచ్చి పెంచాలి. అప్పుడు

ప్రభువు మనకు కూడా జీతమిస్తాడు. పౌలు కూడా కొరింథీ సంఘస్థులను 1కొరింథీ 3:2 లో 'నేను మిమ్మును పాలతోనే పెంచితిని' అన్నాడు. అలాగున వాక్యమనే పాలనిచ్చి పెంచుట మాత్రమే కాక తన సహోదరులు ఇశ్రాయేలీయులని, వారిని భారాల నుండి విడిపించాలని తల్లి మూడేళ్ళ పాలువిడిచిన బాలుడైన మోషేకు చెప్పింది. కాబట్టే 2:11 లో మోషే పెద్దవాడైనప్పుడు తన సహోదరుల భారాలను చూచుటకు వచ్చాడు. ఇది యొకెబెదు నేర్పే. అపొ.కా. 7:25 లో "తన ద్వారా తన సహోదరులకు రక్షణ దయచేయబడుతుందని మోషే తలంచుటను మనము చూడగా, తన ద్వారా తన సహోదరులకు రక్షణ కలుగుతుందని తన తల్లి అతనికి నేర్పించి ఉంటుంది. ఈ నేర్పు యొకెబెదుదే గాని, ఫరో కుమార్తెది కాదుగదా. మనమును మన పిల్లల ద్వారా దేవుడు ఏమి చేయబోతున్నాడో యొకెబెదు వలె తెలుసుకోగలిగిన ఆత్మీయులుగా తల్లులమైన మనము తెలిసికొని పిల్లలను ఆ ఉద్దేశాలతోనే పెంచాలి.

అలాగున సమూయేలు తల్లియైన హన్నా, తిమోతి తల్లియైన యునీకే తన పిల్లలను పెంచారు. వారు అలాగే తయారయ్యారు. మన పిల్లలను దేవుడు కొద్దిమందిని రక్షణలోనికి నడిపించాలని యిష్టపడుచుండగా మన పిల్లలను దేవుని సేవ కొరకు పెంచుదాం. అలాంటి జీవితమునకు వారు ఆకర్షించబడులాగున వారి కొరకు ప్రార్థించుదాం. మన పిల్లలనందరినీ ఆయన సేవకు సమర్పిద్దాం. యుక్తకాలమున మన ప్రార్థనలను ప్రభువు ప్రతిఫలింపచేసి దేవుడు నమ్మకస్థుడుగా వారిని పిలిచి వాడుకుంటాడు.

ఈ సంగతులు వ్రాస్తున్న కెజియ అను నేను నా ఇద్దరు కుమారులను వారు 5 నెలల పిల్లలుగా ఉన్నపుడే నేను వారిని హన్నావలె దేవుని సేవకు అర్పించాను. ఇప్పుడు నా చిన్న కుమారుని దేవుడు 2012 సం॥ నుండి ప్రత్యేకముగా సేవకు పిలిచి నేటికీ వాడుకుంటున్నాడు. దేవాది దేవునికే లెక్కలేనన్ని స్తోత్రములు. నా పెద్ద కుమారుడు కూడా ఆమెరికాలో ఉద్యోగములో ఉన్నప్పటికీ సేవా జీవితాన్ని యిన్‌డైరెక్ట్‌గా ప్రేమిస్తూ సహకరిస్తూ ఉన్నాడు. ప్రభువు కృపయే దీనికంతా కారణము. ఈలాగున మోషే యొకెబెదు దగ్గర రెండు, లేదా మూడు సంవత్సరములు పాలు విడుచువరకు ఉన్నాడు. ఈ కొంచెము కాలములోనే బిడ్డకు చెప్పవలసిన, లేదా నేర్పవలసిన సంగతులన్నీ నేర్పింది. కనుక మోషే పెద్దవాడైనప్పుడు అనగా 40 ఏండ్లవాడైనప్పుడు తన ప్రజలను వారి భారముల నుండి విడిపించాలి, నేను వారిని ఫరో బానిసత్వము నుండి రక్షించాలి అనే విషయాలను మోషే మరువలేదు. అందుకే సామెతలు 22:6 లో చెప్పినట్లు, 'బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానిలో నుండి తొలగిపోడు' ముసలివాడైనప్పుడు కూడా వాడు దానిలోనుండి అనగా తల్లిగానీ, తండ్రిగానీ నేర్పించిన త్రోవలోనుండి తొలగిపోడు. ఈ రెండు, లేదా మూడు సం॥లలో మోషేకు అంతా నేర్పిందంటే ఆమె తన సమయాన్ని ఎంత చక్కగా ఆ బిడ్డతో గడిపిందో అనిపిస్తుంది.

పిల్లలతో తల్లి గడిపే మొదటి 7 సం॥లు అతి ప్రాముఖ్యమైనవి అంటారు. కానీ ఆమెకు అన్ని సం॥లు ఎక్కడిది? రెండు, లేదా మూడు సం॥లు మాత్రమే కుమారునితో గడిపి, ఎఫెసీ 5:15లో చెప్పినట్లు, "దినములు చెడ్డవి గనుక సమయమును సద్వినియోగము చేసికోవాలి." మొదట ఈ స్త్రీ తన కుమారుని ప్రభువు చేతిలో పెట్టింది. కుమారునికి పాలు విడిచిన తరువాత ఇప్పుడు ఐగుప్తు రాజ్యాధినేత ఫరో ఉండిన రాజ్యానికి, లేదా ఈ లోక రాజ్యానికి అప్పగించవలసిన సమయమొచ్చింది.

అలాగే స్త్రీలమైన మనమందరము ఒకానొక రోజు మన పిల్లలను లోకంలోని చదువులకు, ఉద్యోగాలకు, దేనికో ఒకదానికి పంపక తప్పని రోజొకటి రానే వస్తుంది. ఈ తల్లి తన కుమారుడు తన సహోదరులను రక్షించాలి అన్న తల్లి నేర్పు దేవుని మీద ఈ విషయంలో ఆమె ఉంచిన విశ్వాసము వెంటనే నెరవేర్చబడలేదు. నిర్గమ 2:10,11 లలో దాదాపు 37 సంవత్సరాల తరువాత ఐగుప్తు అనే లోకానికి మోషే గుడ్‌బై చెప్పినపుడు యొకెబెదు విశ్వాసంతో కూడిన ప్రార్థన నెరవేర్చబడింది. హెబ్రీ 11:24-29 లో, మోషే పెద్దవాడైనపుడు విశ్వాసమునుబట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని అల్పకాలపు పాపభగమును అనుభవించుట కంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యోచించి ఫరో కుమార్తె కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు. ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమందు దృష్టి యుంచెను. విశ్వాసమునుబట్టి అతడు అదృశ్యుడైన వానిని చూచుచున్నట్లు స్థిరబుద్ధి గలవాడై రాజాగ్రహమునకు భయపడక ఐగుప్తును విడిచిపోయెను అని చదువుచున్నాము. ఈ ఐగుప్తు అనే లోకము నుండి తన కుమారుని కాపాడమని తల్లి యొకెబెదు చేసిన ప్రార్థన 37 సం॥ల గడిచిన తరువాత నెరవేరిందంటే దేవుడామె ప్రార్థనను మరువలేదు.

ప్రియ సహోదరీలారా, తల్లుల ప్రార్థనకు ఎంత శక్తి ఉన్నదో గమనించండి. మన ప్రార్థనను దేవుడు నిర్లక్ష్యము చేయడు. ఆయన ప్రార్థనను ఆలకించువాడు గనుక సర్వశరీరులలో ఉన్న తల్లులందరూ ఆయన ప్రార్థనా సన్నిధికి రావాలి. తల్లియైన యొకెబెదులో 'విశ్వాసము' అను మాట హెబ్రీ 11:23 లో ఒక్కసారి కనబడితే, మోషే విషయంలో హెబ్రీ 11:24-29 లలో 4 సార్లు విశ్వాసము అను మాట కనబడుతుండటం ఎంత విశేషమో కదా. అవును, తల్లిదండ్రులకంటే ఎక్కువగా మన పిల్లలు అన్ని విషయాలలో ముందంజ వేయడం ప్రభువుకు ఎంత మహిమకరం! చివరకు యొకెబెదు అనే పేరుకు 'యెహోవా మహాత్మ్యము' అని అర్థము. నిజంగా యెహోవా మహాత్మ్యమును మనము తన కుమారుడు నడిపించిన ఇశ్రాయేలీయులకు దేవుడు చేసిన అద్భుత కార్యాలలో, ఆశ్చర్య కార్యాలలో చూడవచ్చు.

## మహాత్మ్యము

**యోబు 37:23 –** సర్వశక్తుడగు మన దేవుడు మహాత్మ్యము గలవాడు.

**యోబు 40:10 –** ఆడంబర మహాత్మ్యములతో నిన్ను నీవు అలంకరించుకొనుమని భక్తుడు వ్రాస్తుండగా అలాగైతే మహాత్మ్యము ఆయన అలంకరణ అని గ్రహించగలము.

**కీర్తన 95:3 –** యెహోవా మహాదేవుడును మహాత్మ్యము గల మహారాజు అని మనము చదువుతున్నాము.

**2పేతురు 1:17 –** ఆయన మహాత్మ్యమును పేతురు, యోహాను, యాకోబులు కన్నులారా చూశామని పేతురు వ్రాస్తున్నాడు.

**యోబు 31:23 –** యోబు దేవుని మహాత్మ్యము ఎదుట తాను నిలువజాలననియు, ఆయన నన్ను నిర్మూలము చేయుననియు భీతిపుట్టెను అని చెబుతున్నాడు.

యోబు వలె మనమును ఆయన మహాత్మ్యము ఎదుట మన పాపములనుబట్టి నిలువలేక నిర్మూలము కావలసియుండగా అభిషిక్తుడైన ఆ ప్రభువే మన కొరకు సిలువలో నిర్మూలమైపోయాడు. ఆయన నిర్మూలమై నశించిపోవుట ద్వారా నశించెడి మనము నశింపబడకుండ ఆయన యందలి విశ్వాసముచే ఆయన రక్తము వలన నీతిమంతులుగా నశించిన మనలను వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చినందువలన మనము రక్షించబడ్డాము. అందుకే దేవునికి స్తోత్రములు!

❊ ❊ ❊ ❊ ❊

# 3

# ఇశ్రాయేలీయుల ప్రథమ ప్రవక్తిని - మిర్యాము

యొకెబెదు, అమ్రాముల ప్రథమ సంతానమే మిర్యాము. మిర్యాము మొట్ట మొదట లేఖనాల్లో నిర్గమ 2:4 లో కనబడుతుంది. ఆమె జీవితాన్ని క్రింది అంశాల ద్వారా ధ్యానిద్దాము :

**I. తమ్మునికి కావలి వున్న మిర్యాము :** తన తల్లియైన యొకెబెదు మోషే అను తన తమ్ముని నైలునది ఒడ్డున ఉంచి వెళ్ళిపోగా, తన తమ్మునికి ఏమి సంభవిస్తుందోనని అక్కయైన మిర్యాము కావలి ఉన్నట్లు ఇక్కడ గమనిస్తున్నాము. తల్లి వదిలేసి వెళ్ళిపోగా మిర్యాము తమ్ముని కావలి కాస్తోంది. ఇంతకు ముందు తల్లి అది నదీతీరము కాబట్టి మొసళ్ళు రావచ్చు, లేదా ఏ కుక్కలైనా మోషేను ఈడ్చుకొనిపోవచ్చు, ఇంకేమైనా కావచ్చు అని అక్క తమ్మునికి కావలి ఉన్నది. సృష్టిలో మొదటి అన్న తమ్ముళ్ళు కయీను, హేబెలులను మనమెరుగుదుము. దేవుడైన యెహోవా, 'నీ తమ్ముడైన హేబెలు ఎక్కడ?' అని ఆది 4:9లో అన్నప్పుడు కయీను 'నేనెరుగను, నా తమ్ముడికి నేను కావలివాడనా?' అన్నాడు. దేవుడు తమ్ముని అర్పణ అంగీకరించి తన అర్పణను అంగీకరించలేదని అతణ్ణి చంపాడు. అన్నా తమ్ముళ్ళు ఒకరికొకరు కావలి ఉండాలి. ఒకరిని గురించి ఒకరు లెక్కచెప్పేవాళ్ళుగా ఉండాలి. ఒకరికొకరు సహాయం చేసుకోవాలి. మనలో ఏ ఒక్కరూ ఒక్కరిగానే ఉండకూడదు.

మొర్దెకై తన పినతండ్రి కుమార్తెయైన ఎస్తేరును తన కుమార్తెలాగా పెంచుకున్నాడు. ఆమెను ఎస్తేరు 2:11లో, ఎస్తేరు ఎలాగుందోనని, ఆమెకు ఏమి సంభవిస్తుందోనని తెలుసుకొనుటకు అంతఃపురము ఆవరణము ఎదుట ప్రతి దినమూ తిరుగులాడుచుండేవాడు. తల్లిదండ్రులు లేని ఆ అనాధను ఏమైనా చేయొచ్చు. ఈనాడు అనేకులు చెల్లెలని చెల్లెలుగా చూడుటలేదు. సమానత్వము లేనివారుగా ఉన్నారు. ఉదాహరణకు, 2సమూ 13:1-19 లో అమ్నోను తన చెల్లెలైన తామారు సుందరివతియై యుండగా ఆమెను మోహించి, ఆమెను బలవంతంగా అనుభవించి ఆ తరువాత తలుపులు తీసి ఆమెను వెళ్ళగొట్టిన దుర్మార్గుడుగా ఉండగా, మొర్దెకై తన చెల్లెలైన ఎస్తేరును కుమార్తెవలే పెంచి రాణిగా తయారుచేశాడు. ఎంత నమ్మకస్తుడైన అన్నగా ఉన్నాడోకదా! నేటి అన్నలైన వారందరికీ మొర్దెకై చెల్లియెడల ప్రేమను, పవిత్రతను చూపించుటలో ఎంత మాదిరిగా ఉన్నాడో కదా!

పరమ 1:6 లో షూలమ్మీతి అన్నలు ఆమెపై కోపించి ఆమెను తన ద్రాక్షాతోటకు కావలికత్తెగా ఉంచారు. ఆమెకు చెల్లిగా ప్రేమించి, ఆమెకు మిర్యాములాగా, మొర్దెకైలాగా

కావలి ఉండి కాపాడినవారుగా ఉండలేకపోయారు. ఆమె ద్వారా లబ్ధిపొందారు గానీ ఆమెకు మేలు చేకూర్చలేదు. సౌందర్యవతియైన ఆమె ఎందుకు మాడిపోయి నల్లనదైపోయేట్లు ఆ చెల్లిని అందరూ చిన్నచూపులు చూచేట్లు చేశారు. ప్రియ అక్కలారా, అన్నలారా, మీ తరువాత పుట్టిన మీ చెల్లెళ్ళను, తమ్ముళ్ళను ప్రేమిస్తున్నారా? వారిని కావలి కాస్తున్నారా? వారు రక్షణను కోరుతున్నారా? కయీను చేసినట్లు వారిని రక్షణలోనికి నడిపించే బాధ్యతను తీసుకొనక వారిని ఆత్మీయంగా చంపేస్తున్నారా? మొర్దెకైలాగా మీ తరువాత పుట్టిన మీ చెల్లెళ్ళ, తమ్ముళ్ళ విషయంలో వారి రక్షణ, ఆత్మీయ ఎదుగుదల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నారా? మీ తమ్ముళ్ళ, చెల్లెళ్ళ మీద కోపగించి మీకు కావలికత్తెలుగా, మీ స్వార్థానికై వాళ్ళను వాడుకొని వారిని అందరూ చిన్నచూపు చూచేట్లు చేస్తున్నారా? దేవుడు కయీనును లెక్క అడిగినట్లు నిన్ను కూడా నీ తమ్ముళ్ళ, చెల్లెళ్ళ విషయంలో లెక్క అడుగుతాడేమో! వారి విషయములో నీ బాధ్యత ఏమిటి? అని ప్రభువు అడుగుతాడేమో. ఆ ప్రేమ, ఆ కన్సర్న్ వారిపై నీకున్నదా?

1తిమోతి 5:2 లో అన్నదమ్ములని యౌవనులను, తల్లులని వృద్ధ స్త్రీలను, అక్కచెల్లెండ్రని పూర్ణ పవిత్రతతో యవనులను హెచ్చరించుమని తిమోతికి పౌలు వ్రాస్తున్నాడు. సంఘములోని యవన స్త్రీలను అక్కా, చెల్లీ అని పూర్ణ పవిత్రతతో హెచ్చరించమన్నాడు. ఆడపిల్లల యెడల సంఘములో పూర్ణ పవిత్రత కలిగి ఉండాలని వాక్యం హెచ్చరిస్తోంది. పిలుపులోనే పవిత్రత ఉండాలి. అంతేకాక ఎంత పవిత్రత భావము హృదయములో ఉండాలో చూడండి. కానీ అమ్నోను తన చెల్లెలైన తామారు యెడల అపవిత్రత కలిగినవాడుగా ఉన్నాడు. చివరికి చంపబడ్డాడు. అక్కా చెల్లెళ్ల యెడల అన్నలు, అక్కలు పూర్ణ పవిత్రత భావాన్ని కలిగి ఉండాలని బైబిల్‌లో ప్రభువు మనకు నేర్పిస్తున్నాడు. ఒకరికి ఒకరు సహోదర, సహోదరీలమైన మనము సంఘములో పవిత్రముగా ప్రేమిస్తూ, చక్కని పవిత్రమైన సంబంధ బాంధవ్యాలు కలిగి ఉందాం.

1యోహాను 2:10లో, తన సహోదరుని ప్రేమించువాడు వెలుగులో ఉన్నవాడు (మొర్దెకై). తన సహోదరుని ద్వేషించువాడు (కయీను) చీకటిలో ఉండి, చీకటిలో నడుచుచున్నాడు. చీకటి తన కన్నులకు గ్రుడ్డితనము కలుగుచేసెను. తానెక్కడికి పోవుచున్నాడో అతనికి తెలియదు అని దేవుని వాక్యము చెబుతోంది. 1యోహాను 4:20లో, ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును. తాను చూచిన తన సహోదరుని ప్రేమించనివాడు తాను చూడని దేవుని ప్రేమించలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడా ప్రేమించవలెని ఆజ్ఞను మనమాయన వలన పొందియున్నాము. అని దేవుని వాక్యము వ్రాయబడియుండగా మన సహోదరులను, మన తరువాత, మనతో కలసి పుట్టన మన అన్న తమ్ముళ్లను ప్రేమించాలని దేవుడు మనకు ఊరకనే చెప్పుట కాదు, ఆజ్ఞాపిస్తున్నాడంటే ఇది ఎంత ప్రాముఖ్యమైన అంశమో మనమందరి బాధ్యతగా గుర్తెరిగి ఆయన ఆజ్ఞను నెరవేరుద్దాం.

## II. తమ్ముని పెంపకాన్ని గురించి ఆలోచించి దాదిని తీసుకువచ్చిన మిర్యాము :

తమ్ముడైన మోషేను కావలి కాచిన మిర్యాము యిపుడు అతనికి పాలిచ్చి పెంచే దాదిని గూర్చి ఆలోచిస్తోంది. అలా ఆలోచించిన ఈ అక్క ఎంత పెద్దది? పెద్దది కాదు, 8వ వచనములో చిన్నది అని వ్రాయబడింది. ఈ సమయంలో ఆ చిన్నదాని వయసు ఎంత ఉంటుందో ఆలోచిద్దామా? నిర్గమ 7:7 లో ఐగుప్తులో ఫరోతో మాట్లాడినపుడు మోషే వయసు 80 ఏండ్లని, అహరోను వయసు 83 ఏండ్లని తెలుస్తోంది. వీరిద్దరికీ 3 సం॥లు తేడా ఉంది. ఆ యోకెబెదుకు మూడేండ్లకొక కాన్పు అనుకుంటే అహరోను కంటే మిర్యాము 3 ఏండ్లు పెద్దదనుకుంటే అక్క వయసు 86 ఏళ్ళు. అలాగైతే మోషే కంటే మిర్యాము 6 ఏళ్ళు పెద్దది. ఆరు ఏళ్ళ చిన్నది తన తమ్ముని కావలి కాస్తూ, అతనికి అవసరమైన పాలను గూర్చి, అతనిని పెంచే దాదిని గూర్చి ఆలోచించిందంటే ఆరేళ్ళ చిన్నదానికి ఎంత పెద్ద ఆలోచనయో కదా.

ఈనాడు క్రొత్తగా ప్రభువును నమ్మిన జూనియర్ విశ్వాసుల ఆత్మీయ ఎదుగుదల నిమిత్తమై సీనియర్స్ అయిన విశ్వాసులు ఆలోచన కలిగి ఉన్నారా? వారి కొరకు దాదులుగా ఉంటున్నారా? లేదా దాదుల యొద్దకు వారిని నడిపిస్తున్నారా? ఈ దాదులు వాక్యమనే పాలను అందించే వాక్య సేవకులు. ఇటువంటి అనుభవజ్ఞుల యొద్దకు క్రొత్త విశ్వాసులను మనం తీసుకువెళ్ళి వాక్యమును వినే అవకాశం వారికి కల్పించాలి. ఈనాడు క్రొత్తగా నమ్ముకున్నవారికి వాక్యమను పాలను అందించుటకు వాక్యమను స్తనములు గల దాదులు ఎంతైనా అవసరం. ఈ చిన్నదైన మిర్యాము మోషేకు పాలిచ్చి పెంచుటకై తన తల్లియైన యోకెబెదునే తీసుకొచ్చింది. ఇదంతా ఒక నాటకీయ శైలిలో జరిగినట్లుంది. ఇలా చేయమని, ఇలా చెప్పమని తల్లియైన యోకెబెదు తన పిల్లయైన మిర్యాముకు చెప్పి ఉంటుంది. ప్రభువు కూడా వారి ఆలోచనలను సఫలీకృతం చేశాడు. ఈ తల్లి రాణి యొక్క ఆహారమును తిని తనను బలపరచుకొని ఎంతో ఆరోగ్యకరమైన పాలను మోషేకు ఇచ్చిందో కదా. ఆ విషయములో ఎంత జాగ్రత్త వహించిందో కదా. ఎందుకంటే ఆ బిడ్డ ఏ కొంచెము బలహీనంగా కనబడినట్లయితే రాణి యోకెబెదును లెక్క అడుగుతుంది. ఆ బిడ్డను బలముగా పెంచితేనే నిజముగా లెక్క (జీతమును) ఇస్తానని చెప్పింది. ఆ కారణమునుబట్టి యోకెబెదు తన ఇంటిలో తన స్వంత కుమారునిగా మోషేను పెంచునప్పటికంటే ఇప్పుడు మోషే రాణి యొక్క కుమారుడుగా అంగీకరించబడిన కారణాన ఇంకెంత శ్రద్ధగా పాలిచ్చి పెంచి ఉంటుందో కదా! సాధారణముగా మానవులము మన స్వంత పనిని అంత శ్రద్ధగా చేయమేమో, అదే ప్రభుత్వ పనియైతే, జీతం తీసుకునే పనిలోనైతే ఎంతో శ్రద్ధగా చేస్తాము. అలాగే ప్రియ సోదరీలారా, సంఘములో క్రొత్తగా నమ్ముకున్నవారికి దాదులమైన మనము ప్రభువు ఇవ్వబోతున్న జీతం పుచ్చుకోబోతున్నాం. కనుక ఈ పాలిచ్చే (వాక్యము చెప్పే) పనిని శ్రద్ధగా చేయాలి. చక్కగా ప్రిపేర్ అయి వాక్యాన్ని సిద్ధపరచి ఆకర్షణీయంగా, ఆత్మీయంగా వారిని ఆకట్టుకునే రీతిగా చెప్పాలి. పౌలు, నేను నాటితిని, అపొల్లో నీరు పోశాడు అని చెప్పాడు. వాక్యమనే నీటిని, లేక పాలను పోసే స్త్రీగా నీవున్నావా? ప్రియ సోదరీ,

యొకెబెదు అలా చేసింది. తన కుమారుని రాణి యొక్క కుమారునిగా చేసింది. దీని విషయమై భారం వహించింది మిర్యాము. మిర్యాము తాను పాలిచ్చి పెంచే పని చేయలేదు. కానీ ఆ పని చేయగల దాదిని మోషే యొద్దకు తీసుకువచ్చింది. సంఘములో భారం కలిగినవారు అనేకులను సంఘములో దాదుల యొద్దకు చేర్చే పనులు తప్పక చేయాలి. అప్పుడే వారు, యవనస్థులారా! మీరు బలవంతులు, ఏలయనగా వాక్యము మీలో నిలుచుచున్నది (1యోహాను 2:14) లో వ్రాయబడిన వాక్యము నెరవేర్చబడుతుంది. మిర్యాములాంటి చిన్నబిడ్డలారా, మీ పనిని మీరు మీ సంఘాల్లో చేస్తున్నారా? ఇదే మిర్యాము యొక్క 'మినీ మినిస్ట్రీ!' ఈ మినీ మినిస్ట్రీ మీద నీకు మినీగానైనా (కొంచెమైనా) మనసుందా? ఆరేళ్ళ చిన్నదానికి ఈ శ్రద్ధ, ప్రేమ ఉంటే, 60 ఏళ్లు వచ్చినా నీకు ఈ శ్రద్ధ, ప్రేమ లేదా? ఈ కాలమునుబట్టి చూస్తే నీవు యొకెబెదులాంటి దాదివిగా ఉండాల్సిన దానివి. కానీ దాది దగ్గరికి తమ్ముణ్ణి చేర్చే భారం, ప్రేమ కలిగిన మిర్యాముగా ఉండేందుకు ప్రభువు సన్నిధిలో ఇప్పటినుంచైనా తీర్మానం చేసుకుంటావా?

**III. ప్రవక్తయైన మిర్యాము:** నిర్గమ 2:7 లో నైలునది ఒడ్డున ఆరేళ్ళ చిన్నదిగా కనబడిన ఈ 'మినీ మినిస్ట్రీ'లో ఉండిన మిర్యాము ఇపుడు మెగా ప్రవక్త్రిగా, 'మెగా మినిస్ట్రీ'లో ఉన్న మిర్యాముగా చూస్తున్నాం. ప్రభువు మనకిచ్చిన చిన్న పనిని నమ్మకముతో జరిగించినట్లయితే మరి పెద్ద పనికి ప్రభువు మనలను వాడుకొనేవాడుగా ఉన్నాడు. 1తిమోతి 3:13 ప్రకారము పరిచారకులైయుండి ఆ పనిని బాగుగా నెరవేర్చినవారు మంచి పదవిని సంపాదించుకొంటారని వ్రాయబడినట్లు పరిచారికగా చిన్న వయసులో పనిచేసిన కారణమున నేడు అనేకులైన ఇశ్రాయేలు స్త్రీల మధ్యలో 86 ఏళ్ళ పెద్దదిగా 'ప్రవక్త్రి'గా మంచి పదవిని సంపాదించుకుంది. అలాగే ఏలీయా చేతుల మీద నీరుపోసే చిన్న పరిచారకునిగా ఉండిన ఎలీషా ఆ తరువాత పెద్ద 'ఎలీషా' ప్రవక్తగా చేయబడుట మనం వాక్యములో చూచాంకదా. అలాగే ఇప్పుడు మిర్యామును ప్రభువు ప్రవక్త్రినిగా చేశాడు. మీకా 6:4 లో, మిమ్మును నడిపించుటకై మోషే, అహరోను, మిర్యాములను పంపించితిని అని వ్రాయబడినట్లు ఇపుడు మిర్యాము ఇశ్రాయేలు స్త్రీలను వాక్యములో నడిపించే నాయికగా వాడుకుంటున్నాడు. వాక్యాన్ని ప్రవచించే ప్రవక్తగా వాడుకుంటున్నాడు. పేరు తెలిసిన మొట్టమొదటి ప్రవక్త్రిగా మిర్యామును మనం చూస్తున్నాము. యొకెబెదు సంతతిలో మొట్టమొదటిగా పుట్టిన మిర్యామును ప్రవక్త్రిగా లేపుకోవడం దేవునికిష్టమయ్యింది. యొకెబెదు సంతతినంతటినీ దేవుడు తన పరిచర్యలో వాడుతున్నాడు. మొదటి అమ్మాయి, ఒకే ఒక్క అబ్బాయి, అల్లారుముద్దుగా, అక్రమంగా పెరగలేదు. ఆ అమ్మాయి ప్రవక్త్రిగా అయ్యిందంటే ఎంత భయభక్తులతో ఆ తల్లి పెంచిందో కదా. తల్లి బోధ ద్వారా, స్ఫూర్తి ద్వారా, దేవుని కృప తోడురాగా మిర్యాము ఈనాడు ప్రవచనాలు చెప్పే ప్రవక్త్రిగా అయిపోయింది. బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము, వాడు పెద్దవాడైనప్పుడు త్రోవను తొలగిపోడు' అని సామెతలు 22:6 లో చెప్పబడిన ప్రకారము మిర్యామును తల్లి ప్రవక్త్రి అవ్వాలని ఆ ప్రవక్త్రి త్రోవలో నడిపించింది. తల్లులమైన మనము మన పిల్లలను దేవుని పిల్లలుగా, సేవకులుగా, సేవకురాండ్రుగా

పెంచుతున్నామా? లేక లోక పదవులకే పంపించుచున్నామా? యోకెబెదు సంతాన మంతయు దేవుని సేవలో ఉన్నారు. ప్రవక్త్రిగా ఉంటూ ఎంతోమందిని వాక్య మార్గములో నడిపించింది. స్త్రీలమందను నడిపించింది. స్త్రీల మధ్య పాడింది. ఇశ్రాయేలు సమాజాన్ని మొత్తము పాటలో నడిపించలేదు, కానీ తమ్ముడైన మోషే పురుషులను నడిపిస్తూ వారి ముందర 'యెహోవాను గానము చేసెదము' అనే పాటను పాడుతూ వెళ్ళగా అదే పాటను అనగా తమ్ముడు పాడుతున్న పాట యొక్క పల్లవినే పాడుతూ స్త్రీలందరూ ఆమె వెంబడి వెళ్ళగా ఆమె స్త్రీలను నడిపించింది. ఆమె ప్రవచనాలు, ఆమె పాటలు, ఆమె తంబుర వాయించుట స్త్రీలు ఆమెను వెంబడి వెళ్ళినపుడు స్త్రీల మధ్యలోనే దేవుని సేవ చేసింది కానీ, పురుషుల మధ్య కాదు. స్త్రీలు ఆమె వెంబడి వెళ్ళగా అనే మాటను మనము ముఖ్యముగా గమనించాలి. సంఘములో స్త్రీలు మౌనముగా ఉండాలి అను 1కొరింథీ 14:34 లోని మాటను మనము ప్రాముఖ్యముగా గమనించాలి. వారు లోబడి యుండవలసినదే గానీ, మాటలాడుటకు వారికి సెలవు లేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది. మిర్యాము పురుషుల మధ్య మాటలాడలేదు. హన్నా కూడా మనసులోనే ప్రార్థించింది. పెదవులు మాత్రము కదలుట ఆమె స్వరము వినబడక ఉండెను అని 1సమూ 1:13లో చదువుతున్నాము.

మనమును మన పిల్లలను దైవసేవకులుగా చేయాలనుకుంటే పూర్వపు ప్రవక్తలు, సేవకులను వారి మాదిరి జీవితాలను పిల్లలకు తెలియచేయాలి. మోషే, యోసేపు, హనోకు, ఏలీయా, ఎస్తేరు, రూతు, మిర్యాము, మగ్దలేనె మరియ, అబీగయీలు, హన్నా వంటి సేవకులు, సేవకురాళ్ళ జీవిత చరిత్రలు మరిముఖ్యముగా మన ప్రభువైన యేసుక్రీస్తు జీవితాలను మన పిల్లలకు చిన్నప్పటినుంచే నేర్పించాలి. ప్రవక్తి ముందుగా దేవుని దగ్గర కనిపెట్టి వినడం, మళ్ళీ వాటిని ప్రజలకు చెప్పడం చేసి వుంటుంది. వారి సమస్యలన్నింటిని విని మరలా వాటిని ప్రభువుకు చెప్పి ప్రార్థించడం చేసి ఉంటుంది. బైబిల్లో మొట్టమొదటి ప్రవక్తగా అయ్యే కృపను మిర్యాము సంపాదించుకుంది. అది ఆమెకు ఎంత అతిశయ కారణమో. ఈ ప్రభువు పని మిక్కిలి గొప్పది. ప్రభుత్వపు పని కాదు. దీనికి జీతము ప్రభువు తన చేతులార పట్టుకొనివస్తాడు. ఆరేళ్ళ చిన్నదిగా ఉన్నపుడే తన తల్లికి ఫరో కుమార్తెనుండి జీతము వచ్చునట్లు కల్పించిన మిర్యాముకు జీతము రేపు రెండవ రాకడలో ప్రభువు పట్టుకొని వస్తాడు. ఓ స్త్రీ, దేవుని డిపార్ట్‌మెంట్‌లో నీవేమి పని చేయుచున్నావు? చిన్నవయసు నుండే మిర్యాము దేవుని పనిలో నిమగ్నమయ్యింది. నీ పిల్లలతో ఈ పని చేయుటకు యోకెబెదు మిర్యాములవలె నీవు సమర్పించుకొని తీర్మానం చేస్తావా?

86వ సం॥లో కూడా ఇంతటి వృద్ధాప్యములో కూడా ప్రవక్త్రి పని చేసిందంటే, తమ్ముడైన మోషేకు 80 సం॥ ఉన్నప్పుడు ఫరో దగ్గరికి వెళ్ళి మాట్లాడారు. అప్పుడు అక్క వయసు 86 సం॥లు. 86 సం॥ల వయసులో ఉన్న దేవుడామెను ప్రవక్త్రి పనిచేయుటకు పిలువగా ఆ వయసులో ఆమె 'ఈ ముసలిదాన్ని ఏమి పని చేయగలను? ఎవరినైనా యంగ్ గర్ల్‌ను ఎన్నుకోకూడదా?' అని దేవునితో చెప్పలేదు. ప్రియ సోదరీ,

నిన్ను ఎప్పుడు దేవుడు పిలిస్తే అప్పుడు దేవునికి విధేయత చూపుట కిష్టపడుతున్నావా? 'అన్న' అను ప్రవక్త్రి లూకా 2:36 లో కన్యత్వము మొదలు అంటే, 13 సం॥ల వయసు మొదలు 7 సం॥ల పెనిమిటితో సంసారము చేసి 84 సం॥లు విధవరాలుగా ఉంటూ దేవాలయమును విడువక రేయింబగళ్ళు సేవ చేస్తూ ఉండేది. అంటే 13 + 7 + 84 = 104 సంవత్సరాల వయసులో కూడా సేవచేస్తూ ఉందంటే, ఎంత గొప్ప మాదిరియో కదా. వృద్ధ స్త్రీలకు కూడా ఈ స్త్రీలు మాదిరి కదా! అనేకమంది ఈ దినాల్లో ముసలమ్మ ముచ్చట్లతో, సీరియల్స్, సినిమాలలో, కోడళ్ళను గురించి ఇతరులతో వ్యతిరేకంగా మాట్లాడడం ఇది సరిపోతుందేమో. పైనున్న స్త్రీలలాగా ప్రభువు సన్నిధిలో, ప్రభువు ప్రజల మధ్య, ప్రార్థనలలో, ప్రకటించడంలో ఆత్మీయ తల్లులుగా ఉంటున్నారా? పరీక్షించుకొనుట చాలా చాలా మంచిది. అది అత్యవసరం. ఈ మిర్యాము ఎన్ని ఏండ్ల వరకు సేవ చేసిందో మనకు ఖచ్చితముగా తెలియనప్పటికీ 86 సం॥రాలలో ప్రవక్తి పని చేసిందని, స్త్రీలను పాటల్లోను, వాక్యంలోను నడిపించిందని మనకు తెలుస్తోంది. 'నీతిమంతులు' ముసలితనమందు వారు ఇకను చిగురు పెట్టుచుందురు అని సారము కలిగి పచ్చగా ఉంటారని వ్రాయబడింది. ముసలితనంలో మిర్యాము చిగురించింది. సారము కలిగి పచ్చగా ఉండుట వలననే ఆ పనులు చేయుటకు బలమిచ్చినవారు వృద్ధాప్యములో ఉన్న మన అందరికీ అదే బలాన్నిచ్చే దేవుణ్ణి స్తుతించి పొందుకుందాము.

**IV. మోషేకు విరోధముగా మాట్లాడిన మిర్యాము:** సంఖ్యా 12:1 లో మోషే కూషు దేశపు స్త్రీని పెండ్లి చేసుకొనుటనుబట్టి మిర్యాము, అహరోను అతనికి విరోధముగా మాటలాడినట్లు మనము చూస్తున్నాము. ఈ 12వ అధ్యాయము ఒక కుటుంబమునకు చెందిన విషయము. అది సేవకుల కుటుంబము. ఈ ఇంటిలోని ముగ్గురు పిల్లలు దేవుని సేవలోనే ఉన్నారు. వారు మనందరి కుటుంబాల్లోలాగే ఒకరికి ఒకరు విరోధంగా మాట్లాడారు. ఇది అందరిల్లులో కామన్‌గా జరిగే విషయమే కానీ దేవుడు దీనిని ప్రత్యేకంగా పట్టించుకున్నాడు. ఇది అందరిళ్ళలో మామూలే అని చూచి చూడనట్లు ఉండిపోలేదు. ఎస్తేరు 1:13 లో అహష్వేరోషు రాజు ప్రతి సంగతిని రాజ ధర్మమును ఎరిగిన వారందరిచేత ఏలాగు పరిష్కరిస్తాడో ఘనమైన మనుష్యుల రాజైన మన ప్రభువు తానే ఈ సంగతిని ఎలా పరిష్కరించారో చూద్దాము.

మోషే కూషు దేశపు స్త్రీని, అనగా నల్లటి జాతియైన ఇతియోపియా దేశస్థురాలిని పెళ్ళి చేసుకున్నాడు. మోషే అపొ.కా. 7:20 ను బట్టి అతడు దివ్యసుందరుడుగా పుట్టాడని చదువుచున్నాము.. కానీ అట్టి దివ్యసుందరుడు మరొక అతిలోక సుందరిని వివాహమాడి ఉంటే ఆ కుటుంబంలో మోషేకు విరుద్ధంగా అక్క, అన్నలు మాట్లాడి ఉండేవారు కారు. కానీ మోషే అనే ఈ తెల్లబ్బాయి ఒక నల్లమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని వారు ఈ విషయమై మోషేకు విరోధముగా మాట్లాడారు. అమ్మాయి నల్లగా ఉండడమే ఇక్కడ ప్రాబ్లమ్. తెల్లగా ఉండివుంటే ప్రాబ్లమ్ ఉండేది కాదు. ఆమె యొక్క నల్లని పైరూపును బట్టి విరోధంగా మాట్లాడడం ప్రభువుకిష్టము లేకుండాపోయింది. ఆమె నల్లనిదని

మిర్యాము, అహరోనులు చిన్నచూపు చూస్తున్నారు. అప్పుడు మోషే 'యెహోవా ఈ విషయమై నాతో పలికించాడని" అన్న, అక్కలకు చెప్పాడు. కానీ వారు సంఖ్యా 12:2లో 'మోషేచేత మాత్రమే యెహోవా పలికించెనా? ఆయన మాచేతను పలికించలేదా? అని చెప్పుకొనగా అంటే సమాజములో వారితో, వీరితో చెప్పుకున్నారేమో. 3వ వచనములో 'యెహోవా ఆ మాట వినెను' అని వ్రాయడింది. యిర్మీయా 17:16 లో 'నా నోట నుండి వచ్చిన మాట నీ సన్నిధిలో ఉన్నది' అను మాటనుబట్టి మిర్యాము, అహరోనులు పలికిన మాటలు దేవుని సన్నిధికి చేరాయి. మన మాటలు గాలిలో కలిసిపోవుట లేదు. అవి ప్రభువు సన్నిధిలో రికార్డ్ అయి ఉన్నాయి. దేహములోని నోటితో మనము మాట్లాడిన ప్రతి మాట విషయమై దేవునికి లెక్క అప్పచెప్పాలి. మలాకీ 3:16 ప్రకారం, 'యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయన నామమును స్మరించుచూ ఉండువారికి జ్ఞాపకార్థముగా ఒక గ్రంథము ఆయన సముఖమునందు వ్రాయబడెను." ఈ మాటనుబట్టి ఆయన నామమును స్మరిస్తే జ్ఞాపకార్థ గ్రంథములో పేరు వ్రాయబడుతుంది. లేకపోతే ఆ మాటలన్నీ ఆయన సన్నిధికెళ్ళిపోతున్నాయి. మన మాటలను గురించి చాలా జాగ్రత్త వహించాలి. ఎటుబడితే అటు మాట్లాడడానికి వీలు లేదు. యెషయా 37:29లో 'నా మీద నీవు వేయు రంకెలును నీవుచేసిన కలహమును నా చెవులలో జొచ్చెను' అని దేవుడు సన్హెరీబు విషయమై వ్రాయించాడు. అక్కడ సన్హెరీబు దేవునిపైనే రంకెలు వేసి, కలహము చేస్తున్నట్లుగా దేవుడు చెబుతున్నాడు. మనము కూడా ఎవరిమీదనైనా ఎద్దులాగా రంకెలు వేస్తున్నామా? కలహమాడుతున్నామా? అవి ప్రభువు చెవులలో జొచ్చుచున్నాయా? 29వ వచనములో నేను నీ నోటికి కళ్లెము వేసి నా గాలమును ముక్కుకు తగిలించెదను అని చెప్పారు. 37 వచనములో సన్హెరీబు తిరిగిపోయి నీనెవె పట్టణములో నిస్రోకు అను దేవత మందిరమునందు మ్రొక్కుచుండగా అతని కుమారులే అతని చంపారని వ్రాయబడినది. దేవునికి విరుద్ధంగా మాట్లాడితే ప్రాణమే పోయింది. ఒక మాట మాత్రమే అన్నానులే అనుకుంటాం. మాటల ఫలితం ఎంత తీవ్రంగా ఉందో చూస్తున్నాము. మాటలు చావును తెచ్చిపెట్టాయి. జీవమరణములు నాలుక వశము. రాహేలు యాకోబుతో 'పిల్లలనియ్యకపోతే చస్తాను' అని అంది. పిల్లలు లేకపోతే చస్తారా? నిజానికి ఆమె పిల్లలకోసం చావలేదు. కానీ రెండవ పిల్లవాడు పుట్టగానే చనిపోయింది. కొద్దిమంది అనాలోచితంగా చావును గురించి మాట్లాడుతూ ఉంటారు. 'నేను చస్తే బాగుండు', 'నేను చస్తే పీడవిరగడవుద్ది' అని తమ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటారు. రాహేలు పిల్లలు లేకపోతే నేను చస్తాను అని భర్తను బ్లాక్‌మెయిల్ చేసి, బెదిరించే మాటలు మాట్లాడుతోంది. మన ప్రతి మాట దేవుని సన్నిధిలోకి వెళ్తుంది. ప్రభువు నోటి మాటలను తీర్పులోనికి తెస్తాడు. ఇది మనమందరమును గుర్తుంచుకోవాలి. ప్రసంగి 5:6 లో 'నీ దేహము శిక్షకు లోపరచునంత పని నీ నోటి వలన జరుగనియ్యకుము. అది పొరపాటుచేత జరిగెనని దూత ఎదుట చెప్పకుము. నీ మాటల వలన దేవునికి కోపము పుట్టించి నీవేల నీ కష్టమును వ్యర్థపరచుకొనెదవు' అని వ్రాయబడింది. ఈ మాటనుబట్టి నోటి మాటల వలన దేహానికి శిక్ష వస్తుందని చెప్పిన ప్రకారమే స్వంత తమ్ముడైన మోషేకు

విరోధముగా మాట్లాడినందువలన మిర్యాముకు దేహములో కుష్టురోగము వచ్చినట్లు లేఖనాల్లో చదువుచున్నాము. అలాగైతే మన మాటల వలన మన దేహము ఎన్ని రోగాలకు గురి అయ్యిందో మనమెరుగుదుమా? మన మాటలు దేవునికి కోపం పుట్టిస్తాయని. అంతమాత్రమే కాక ఆ మాటలు మాట్లాడ్డం వలన మనము పడిన కష్టము వ్యర్థమైపోతుందట. మనం కష్టపడి చేసుకున్న పనుల కొరకు ఎంత ప్రయాసపడ్డామో. ఎంత ఖర్చుపెట్టామో. ఎంత సమయము వెచ్చించామో. అదంతా వేస్ట్ అయిపోతాయట. ఇలాంటి నష్టాలు మన జీవితంలో ఎన్ని అనుభవించామో మనం పరీక్షించుకొని దిద్దుకోవడం ఎంతో అవసరము. యోబు 39:13 లో నిప్పుకోడి నేలలో గ్రుడ్డును పెట్టి దేని పాదమైన వాటిని త్రొక్కవచ్చుననియైనను అది అనుకొనదట. తన పిల్లలు తనవి కానట్టు వాటి యెడల అది కాఠిన్యము చూపుతుందట. దాని కష్టము వ్యర్థమైనను దానికి చింత లేదట. కారణం దేవుడు దానిని తెలివిలేనిదానిగా, వివేచన లేనిదానిగా దాన్ని చేశాడని వ్రాయబడింది. దానికి తెలివి లేదు కాబట్టి తన కష్టము వ్యర్థమైనదని తనకు తెలియలేదు. మరి తెలివి, జ్ఞానం ఉన్న మనకు మనం ఎంత నష్టపోయామో అర్థమయ్యిందా?

మిర్యాము తాను పలికిన మాట ద్వారా ఎంతగా తన జీవితంలో ఏ రూపంలో నష్టపోయిందో అంతమాత్రమే కాక, ఇశ్రాయేలీయులు ఆమె కుష్టరోగాన్ని బట్టి 7 రోజులు పాళెం వెలుపల ఉండడము మూలంగా ఇశ్రాయేలీలు ప్రయాణము వారం రోజులు ఎక్కువయ్యింది. ఇలాగున మన మాటల ద్వారా అనేకులకు కూడా నష్టం కలిగిస్తుందని తెలుసుకుంటున్నాము. మోషే తన పెళ్ళి తన స్వంత తలంపుచే మాత్రమే యెహోవా పలికించెనా? ఆయన మాచేతను పలికించలేదా? అని వారితో, వీరితో తమ్మునికి విరుద్ధంగా చెప్పుకున్నట్లు తెలుస్తోంది. అంటే నీతోనే కాదు దేవుడు మాట్లాడేది, మాతో కూడా మాట్లాడుతున్నాడు. మాకంటే నీవు గొప్పవాడేవేమీ కాదు అన్నట్లుగా మాట్లాడుతున్నారు. ఆ నల్లజాతి స్త్రీని బట్టి మోషేకు విరోధంగా మాట్లాడుతున్నారు. అలాంటప్పుడు 4వ వచనములో మీరు ముగ్గురు ప్రత్యక్ష గుడారమునకు రండని హఠాత్తుగా మోషే అహరోనులకు ఆజ్ఞ యిచ్చెను. 5వ వచనములో యెహోవా మేఘ స్థంభములో దిగి ప్రత్యక్ష గుడారము యొక్క ద్వారమునొద్ద నిలిచి అహరోను మిర్యాములను పిలిచాడు. వారిద్దరూ రాగా, 6వ వచనములో నా మాటలు వినుడి అన్నాడు. అంటే ఇంతసేపు మీ మాటలు విన్నాను, ఇపుడు నా మాటలు వినండి అంటున్నాడు. ఇపుడు తాము ఏ తమ్ముణ్ణి విమర్శించి, విరోధంగా మాట్లాడారో ఆ తమ్ముని గూర్చి గొప్ప సాక్ష్యమిస్తాడు దేవుడు. మోషేను గురించి అతడు అందరు ప్రవక్తల్లాంటివాడు కాదు. అందరు ప్రవక్తలతో నేను కలలో మాట్లాడతాను, నా సేవకుడైన మోషే అట్టివాడు కాదు అని మోషేను గొప్పచేసి మాట్లాడుతుండగా అదే తమ్ముని గురించి అక్క తక్కువచేసి మాట్లాడుతున్నట్లుగా ఉంది. దేవుడు మోషేను అతడు 'నా సేవకుడు' అంటున్నాడు. నీ తమ్ముడు అయితే కావచ్చునేమో కాని ముందు అతడు 'నా సేవకుడు' అంటున్నాడు. నా ఇల్లంతటిలో నమ్మకమైనవాడు అని మరో సాక్ష్యము చెబుతున్నాడు. 'తన ఇల్లు'

అంటే ఇశ్రాయేలు సమాజమే ఆయన ఇల్లు. ఆ ఇంటిలో, ఆ సమాజములో అహరోను, మిర్యాములు కూడా దేవుని పనిని చేస్తున్నారు. మీరిద్దరూ నమ్మకమైనవారే అని అహరోను మిర్యాములను గూర్చి చెప్పలేదు కానీ నా యిల్లంతటిలో మోషే నమ్మకమైనవాడు అని మోషేను గూర్చి మాట్లాడాడు. అంటే మిగతా ఇద్దరూ 'కాదు' అన్నట్టే కదా. నేను అతనికి దర్శనమిచ్చి ముఖాముఖిగా మాట్లాడాను. అతడు నా స్వరూపమును నిదానించి చూచును' అని మోషేను గూర్చి మంచి గొప్ప సాక్ష్యపు మాటలు చెప్పి, అలాటి మోషేను గూర్చి విరోధముగా మాటలాడుటకు మీరేల భయపడలేదు? అని వారితో అన్నాడు. వీరిద్దరు మీ తమ్ముడే కదా, మీలాటివాడే కదా, మీకంటే జూనియర్ కదా. మాతో కూడా దేవుడు పలికిస్తున్నాడు కదా. చిన్నప్పుడు నేనే కదా మోషేను నైలునది నీళ్ళ నుండి రక్షించి తల్లి యొద్దకు చేర్చాను. నేను లేకపోతే ఇతనికి బ్రతుకెక్కడిది? భవిష్యత్తు ఎక్కడిది? అని అనుకుంటున్నదేమో మిర్యాము. మోషే తన పెళ్ళి సమయములో నన్ను పిలిచి ఉంటే ఒక తెల్ల అమ్మాయిని చూచి చేసేదాన్ని కదా. దివ్య సుందరుని ప్రక్కన ఒక దివ్య సుందరిలాంటి అమ్మాయి ఉంటే  ఈడు. జోడు బాగుండేది కదా, అని ఆ నల్లటి అమ్మాయినిబట్టి తమ్మునికి విరోధముగా మాట్లాడిందేమో. ఇలా మాట్లాడుటకు మీరేల అతనికి భయపడలేదు అని దేవుడు వారితో అంటున్నాడు. దేవుని సేవకులతో (ముఖ్యముగా) మాట్లాడునప్పుడు మనము భయము కలిగి మాట్లాడాలని దేవుడు చెబుతున్నాడు. నా తమ్ముడే కదా, జూనియర్ మోస్ట్ కదా! వయసులోనూ, సేవలోనూ నేను సీనియర్ మోస్ట్ కదా అనుకుని తమ్ముణ్ణి తమలాంటివాడే అనుకొంటూ ఉండగా అతని గూర్చి దేవుడు గొప్పగా సాక్ష్యమిచ్చాడు. తమ్ముడిని, మరి ముఖ్యముగా నా సేవకుడు, ఇళ్లంతటిలో నమ్మకమైనవాడు. అతణ్ణి కామెంట్ చేయడానికి మీరేల భయపడలేదు అన్నాడు. మన ఇంటిలోనే మన తమ్ముళ్ళను గాని, అన్నలను గానీ, భర్తలను గానీ, కుమారులను గానీ, కూతుళ్ళను గానీ మరెవ్వరిని గూర్చియైనను ఏమైనా మాట్లాడుటకు మనకు దేవుడు లైసెన్స్ ఇవ్వలేదు. ఒళ్లు దగ్గరపెట్టుకోవాలి. నోటికి కళ్ళెము పెట్టుకోవాలి, భయపడాలి. యాకోబు 3:2 లో, 'మనము అనేక విషయములలో మనమందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను మాటలయందు తప్పని యెడల అట్టివాడు లోపము లేనివాడై తన సర్వ శరీరమును స్వాధీనమందుంచుకొన శక్తి గలవాడగును' అని వ్రాయబడింది. నోటికి కంట్రోలు, కళ్ళెము లేకుండా దేవుడు మన మాటలన్నీ వింటున్నాడు అనే భయము లేకుండా మాట్లాడుతూ శరీరమును స్వాధీన మందుంచుకొనకుండా ఉండుట వలన యెహోవాకు కోపము వచ్చి వారి మధ్య ఆయన ప్రత్యక్షత లేకుండా వెళ్ళిపోయినట్లు సంఖ్యా 12:10 లో చూస్తున్నాం. అప్పుడు మిర్యాము హిమమువంటి తెల్లని కుష్టు గలదై యుండుట అహరోను చూచి, 11వ వచనములో "అయ్యో, నా ప్రభువా, మేము అవివేకులము, పాపులమైన మేము చేసిన పాపమును మామీద మోపవద్దు' అని తమ్ముడైన మోషేతో చెబుతున్నాడు. తమ్మునికి విరోధముగా మాట్లాడము వారి పాపము అని గమనిస్తున్నారు. అహరోను ఈ పాపము అవివేకులమై చేశామని చెబుతున్నారు. మాటల ద్వారా చేసిన అవివేక పాపమును బట్టి మిర్యాముకు

చిన్న రోగము కాదు, పెద్ద రోగమే వచ్చింది. అందులోనూ అది అంటురోగము. ఊరి బయట ఉండవలసిన పరిస్థితి. ఆ దినాల్లో ఆ రోగానికి మందులే లేని పరిస్థితి. సామెతలు 12:13 లో 'పెదవుల వలన దోషము అపాయకరమైన ఉరి' అని వ్రాయబడి ఉంది. అక్క, తమ్ముళ్ళ పెదవుల దోషము అపాయకరమైన 'ఉరి' వలె వచ్చిపడింది. ఈ సంగతినిబట్టి విశ్వాసులమైన మనమందరము నోటి మాటల విషయమై చాలా జాగ్రత్తగా భయముతో, పవిత్రతో మాట్లాడాలని జ్ఞాపకముంచుకోవాలి.

తనకంటే పెద్దవారైన అక్క, అన్న తనకు విరోధముగా వారితో, వీరితో చెప్పుకున్నప్పుడు మోషే ఎవరితోనూ చెప్పుకోలేదు. కానీ అతడు సంఖ్యా 12:3 ప్రకారము, సాత్వీకంగా ఉన్నాడట. 1పేతురు 2:22 లో ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు. ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక న్యాయముగా తీర్పుతీర్చు దేవునికి తనను తాను అప్పగించుకొనెను. అంతేకాక, మన స్వస్థత కొరకు గాయములను కూడ పొందెను అని చదువుతున్నాము. దూషణ లేదు, బెదిరించలేదు, గాయాలు పొందాడు. మనకు స్వస్థత రక్షణ ఇచ్చాడు. తన్నుతాను న్యాయముగా తీర్పుతీర్చు దేవునికే అప్పగించుకున్నాడు. ఈ సందర్భంలో మోషే కూడా అచ్చము యేసు ప్రభువులాగా సాత్వీకముతో దేవునికే అప్పగించుకున్నాడు. ఇప్పుడు అన్నయైన అహరోను. తమ్ముడైన మోషేను 'ప్రభువా' అని గౌరవిస్తున్నాడు. తృణీకరించబడిన తమ్ముని విషయమై దేవుడు గొప్ప సాక్ష్యమిచ్చి మూలకు తలరాయిగా చేశాడని అన్న గమనించగలిగాడు. ధర్మశాస్త్ర కాలములో ఉన్నను మోషే యేసుప్రభువుకు ఎంత సాదృశ్యంగా నడుచుకోవడం కృపాకాలంలో ఉన్న ప్రభువు పెళ్ళి కుమార్తెయైన మనకు ఎంత మాదిరిగా ఉన్నాడు గదా. ఈలాంటి శ్రమల్లో ప్రభువును చూపించడానికి ఈ సమయంలో తీర్మానం చేసుకుందామా? ఈలాంటి ప్రాక్టికల్ లెసెన్స్ నేర్చుకుందామా? మన ప్రవర్తనలో (ప్రసంగాల్లో కాదు) ప్రభువును చూపిద్దామా? మనము మన జీవితంలో ప్రభువును చూపిస్తే ప్రభువు మనలను అందరి యెదుట గొప్పచేస్తాడు. ఇపుడు అవివేక పాపం చేశామంటున్న అక్కకు, అన్నకు అక్కడ దేవుని సన్నిధి లేకపోవుటనుబట్టి 'ప్రభువా, మేము అవివేకులము, ఈ పాపము మామీద మోపవద్దని' మోషేనే దేవునివలె వేడుకుంటున్నారు. ముందేమో, మాతో కూడ దేవుడు పలికించలేదా! అని వాళ్ళను మోషేతో సమానంగా పోల్చుకున్నారు. నాలుగు మంచి సాక్ష్యాలు మోషే మీద దేవుడు చెప్పి ఇపుడు మోషే యొద్దనే వారు మొఱ్ఱపెట్టుకునేలా పరిస్థితిని తీసుకొచ్చాడు. నీ శత్రువులను నీ పాదములకు పీఠంగా దేవుడు చేస్తాడు. మన పద్ధతి ప్రభువు పద్ధతిగానే ఉండాలి. శత్రువులు నన్ను గురించి అందరికీ చెప్పి, నన్ను చెడ్డ చేస్తున్నారని మనమును ఇతరులకు మన శత్రువులను గురించి చెప్పకూడదు.

12వ వచనములో "తన తల్లి గర్భములో నుండి పుట్టినప్పటికే సగము మాంసము క్షీణించిన శిశువువలె మిర్యాము అయిపోయినట్లు ఆహరోను చెబుతున్నాడు. అంటే ఇప్పుడు మిర్యాము వయస్సు 86 కంటే ఎక్కువ. అంత పెద్దదైన వయసు కలిగిన మిర్యామును అహరోను తల్లిగర్భములో నుండి యిప్పుడే పుట్టిన శిశువులను

పోలుస్తున్నాడు. పుట్టిన శిశువు ఒక మూరెడు మీద ఉంటుందేమో! ఆ శిశువు సగము మాంసము క్షీణించిన శిశువువలె అందులోను చచ్చిన శిశు శవమువలె ఉంది అంటున్నాడంటే, మూరెడు సైజులో ఉన్న శిశువు సగం క్షీణించిందంటే మూరెడులో, సగమయ్యిందన్న మాట. అంటే 'జానెడు' సైజులో తయారయ్యింది ఈ 86 ఏండ్ల ముసలి మిర్యాము. మన మాటల పాపము (క్రియల పాపము కాకపోయినా) ఎంత క్షీణతలోనికి మనల్ని తెస్తుందో సాక్ష్యాత్తుగా గ్రహిస్తున్నాము. యెహె 33:10 లో, మనమెందుకు క్షీణిస్తామంటే, మన పాపదోషములనుబట్టి మనము క్షీణిస్తున్నామని, మనమెలా బ్రతుకగలము? అని వ్రాయబడింది. మరణము తప్పించబడి బ్రతకాలంటే యెహె 33:11 లో వ్రాయబడినట్లు, నా జీవముతోడు దుర్మార్గుడు మరణమొందుట వలన నాకు సంతోషము లేదని ప్రభువు చెబుతున్నాడు. ఈనాడు ఆనేకులు రాలిపోతున్నట్లు మనుషులు అధిక సంఖ్యలో మరణిస్తున్నారు. ఆ మరణాల వలన దేవునికి సంతోషము లేదు. దుర్మార్గుడు దుర్మార్గత నుండి మరలి బ్రతుకుట వలన నాకు సంతోషము కలుగునని ప్రభువు చెబుతున్నాడు. ఈ సందేశాన్ని చదువుచున్న ప్రతి దేవుని బిడ్డా, నీవు నీ పాపములచేత (అది ఎటువంటి పాపమైనా) క్షీణించి మరణించబోవుచున్నావని నీకు అర్థమైందా? మిర్యాము అనే ఈ వ్యక్తి ఒకప్పుడు తన తమ్ముని నీటినుండి రక్షించిన వ్యక్తియే. కానీ, తమ్మునికి విరుద్ధంగా మాటలాడిన ఒక మాటను దేవుడు ఎంత సీరియస్ పాపంగా పరిగణించాడంటే, ఈ తప్పు నేడు అందరిళ్ళలో, అన్ని సంఘాల్లో జరుగుతూనే ఉన్నాయి. కృపాకాలంలో అనేకసార్లు ప్రభువు కృపలో క్షమిస్తూ స్పేర్ చేస్తూ వచ్చాడేమో! నీవు చిన్న పాపము, సింపుల్ పాపము, ఇది క్రియా పాపం కాదు. ఈ పాపం, ఈ మాటలు అన్న, అక్క, తమ్ముళ్ళ దగ్గర, భార్యాభర్తల దగ్గర, ఇరుగుపొరుగు వారి దగ్గర, సాధారణంగా జరిగేవే కదా! అని ఈ సంగతిని లైట్‌గా తీసుకుంటూ ఉంటాం. కానీ దేవుడు ఈ సంగతిని ఖచ్చితంగా పరిష్కరించినవాడుగా చూస్తున్నారు. ఎస్తేరు 1:13, రాజు ప్రతి సంగతిని పరిష్కరించువాడు గనుక అని వ్రాయబడినట్లు పరమ రాజైన యెహోవా దేవుడు ఈ సంగతిని ఇలా పరిష్కరించదలిచాడు.

13వ వచనములో మోషే తన అక్కయైన మిర్యామును కుష్టురోగముతో చూచినపుడు ఎలుగెత్తి, 'దేవా, దయచేసి ఈమెను బాగుచేయుమని" యెహోవాకు మొఱ్ఱపెట్టినట్లు చూస్తున్నాము. చూచావా, నా జోలికి ఎవరైనా వస్తే దేవుడు ఈలాగే చేస్తాడు. ఇప్పుడైన తెలిసిందా నా విలువ? అని మోషే తన అక్కతో అనలేదు. ఆమెను కుష్టు రోగముతో చూచే సరికి ఆయన యెలుగెత్తి దేవునికి బిగ్గరగా మొఱపెడుతున్నాడు. తను మాటలచేత గాయపరచిన సంగతి మరచి ఆమె రోగాన్ని చూచిన వెంటనే మోషే ఎలుగెత్తి మొఱపెట్టుట చూడగా, తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని ప్రభువు చేసిన ప్రార్థన మనకు గుర్తుకు వస్తుంది. అలాగే మనము కూడా మన ప్రభువు మాదిరిని చూపాల్సినవారముగా ఉన్నాము.

**V. పాళెము వెలుపట ఉండిన మిర్యాము:** సంఖ్యా 5:2-3 లను బట్టి ప్రతి కుష్టురోగిని, స్రావము గలవానిని పాళెములోనుండి వెలివేయవలెనని ఇశ్రాయేలీయులకు

ఆజ్ఞాపించాడు. నేను నివసించుచుండు వారి పాళెమును వారు అపవిత్రపరచకుండునట్లు, మగవారినేమి, ఆడువారినేమి అందరిని పంపివేయవలెను. వారిని పాళెము వెలుపలికి వెళ్ళగొట్టవలెను అని దేవుడు చెప్పిన ప్రకారము ఇప్పుడు మన పాఠ్యభాగములోని మిర్యాము కూడా తనకు వచ్చిన కుష్ఠురోగమును బట్టి పాళెము వెలుపలికి వెలివేయబడినదిగా చూస్తున్నాము. ఆలాగున మిర్యాము ఏడు దినములు పాళెము వెలుపట ప్రత్యేకముగా ఉన్నది.

అలాగే 1కొరింథీ 5:11 లో వెలివేయబడుటను గురించి పౌలు వ్రాస్తున్నాడు, "సహోదరులనబడిన వాడెవడైనను గాని, లోభిగాని, విగ్రహారాధికుడు గాని, తిట్టుబోతుగాని, దోచుకొనువాడు గాని అయివున్న యెడల అట్టివానితో సాంగత్యము చేయకూడదు, భుజింపను కూడదు." అని మనకు వ్రాయుచున్నాడు. మీరు లోపలివారికి తీర్పు తీర్చువారు గనుక ఆ దుర్మార్గుని మీలోనుండి వెలివేయుడి అని పౌలు చెప్పాడు.

**V.I. తిరిగి చేర్చుకొనబడిన మిర్యాము:** వెలివేయబడిన వారిని తిరిగి చేర్చుకొనవలసిన వారిని గూర్చి పౌలు 2కొరింథీ 2:5లో ఈలాగు వ్రాశాడు. 6వ వచనములో, వెలివేయబడిన వానికి మీలో ఎక్కువమంది వలన కలిగిన యీ శిక్షయే చాలును, గనుక మీరిక వానిని శిక్షింపక క్షమించి ఆదరించుట మంచిది. లేనియెడల ఒకవేళ వాడు అత్యధికమైన దుఃఖములో మునిగిపోవును. కావున వానియెడల మీ ప్రేమ స్థిరపరచవలెనని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను.' పై మాటలను బట్టి వెలివేయబడిన మిర్యాము 7 దినములు పాళెములో ప్రత్యేకముగా ఉన్నప్పుడు ఆమె అనుభవించిన శిక్ష, సిగ్గు ఇక చాలును. ఇక ఆమెను ఆలాగున శిక్షించక, క్షమించి ఆదరించుట మంచిది. లేకపోతే ఆమె అత్యధిక దుఃఖములో మునిగిపోయే అవకాశమున్నది గనుక. ఆమె యెడల ప్రేమను స్థిరపరచుటకై మిర్యాము తిరిగి పాళెములోనికి పిలువబడినదిగా చూస్తున్నాము. తిరిగి పాళెములో చేర్చుకొనబడిన మిర్యాము దేవుని సేవలో కొనసాగినదిగా చూస్తున్నాము.

**VII. కాదేషులో మరణించిన మిర్యాము:** సంఖ్యా 20:1 లో ఇశ్రాయేలీయులు కాదేషులో దిగగా మిర్యాము అక్కడ చనిపోయి పాతిపెట్టబడినదని చదువుచున్నాము. కాదేషు అనగా తెలుపు అని అర్థము. తెలుపు పరిశుద్ధతకు గుర్తు. మిర్యాము పరిశుద్ధతకు గుర్తుగా ఉన్న కాదేషులో చనిపోయింది. మిర్యాము ఇంతకుమునుపు అపరిశుద్ధతను సూచించే విధంగా ఉన్న ఆమె పాళెము వెలుపట జీవితమును ముగించి పరిశుద్ధతను సూచించే కాదేషులోనికి ఆమె చేరి మరణించినట్లు చూస్తున్నాము. మనము మన జీవితంలో పరిశుద్ధతను కలిగి ప్రభువును చేరుట ఎంతో ప్రాముఖ్యమైనది. పరిశుద్ధత నుండి అధిక పరిశుద్ధతకు చేరుకోవాలి. మన జీవితంలో కార్యారంభము కంటే కార్యాంతము మేలుగా ఉండేందుకు జాగ్రత్తపడాలి. జీవితాన్ని పరిశుద్ధతలో ముగించిన మిర్యాము జీవితం అందరికీ మంచి మాదిరిగా ఉన్నది కదా!

❋ ❋ ❋ ❋ ❋

# 4

# అందరూ అమ్మాయిలేనా - సిప్పోరా

అమ్మాయి పుడితే అందరికీ అలుసుగా ఉంటుంది. పాప పుడితే చూడడానికి కూడా వెళ్ళని తండ్రులున్నారంటే ఆశ్చర్యపడనక్కరలేదు. తండ్రికి బాధ, తల్లికి వేదన. ఆడపిల్ల పుట్టినందుకు దేవుని మీద అలిగేవారు లేకపోలేదు. ఆడపిల్లలు ఎక్కువగా ఉన్న ఇంట్లో పెళ్ళి చేసుకొనుటకు ముందుకు రారు. కారణం అమ్మాయిల పెళ్ళి సమయాన తల్లిదండ్రులు అమ్మాయికిచ్చే కట్నకానులకే కారణం. ఆడపిల్లను కనడం కంటే తాము కష్టాల సుడిగుండంలో పడినట్టే అని అనేక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. కొడుకైతే ప్రయోజకుడై ఉద్ధరిస్తాడని, వృద్ధాప్యంలో ఆదరిస్తాడని, ఆపై పున్నామ నరకం నుండి విడిపిస్తాడని వెర్రి భ్రమ కొందరిది. 'కుమార్తెలు ఎదమీది కుంపట్లు' అని చాలామంది ఆందోళన. ఆడపిల్లై పుట్టటకంటే అడవిలో ఒక మ్రానై పుట్టడం మేలని మరికొందరను కుంటారు.

భారత్, చైనాలలో సహజంగా ఉండే స్త్రీల జనాభా కంటే ఏడున్నర కోట్లు తరుగుపడినట్లు తెలుస్తుంది. ఇండియాలో ఏట మరణిస్తున్న మూడు లక్షల పిల్లల్లో మూడువేలమంది చావుకు లింగభేదమే కారణం. గడిచిన రెండు దశాబ్దాల్లో అనగా 20 ఏళ్ళలో కోటిమంది ఆడ శిశువులు తమకు జన్మనిచ్చిన అమ్మ కడుపులోనే సమాధి అయ్యారన్నది కఠోర సత్యం. అలాగైతే అమ్మాయిలు అవసరం లేదా? బైబిలు ప్రకారం కొడుకైనా కూతురైనా ఒక్కటేనని అందరూ గ్రహించాలి. కొద్దిమంది మీకెంతమంది పిల్లలంటే ఒక (ప్లస్), ఒక (మైనస్) అంటారు. అంటే వారి దృష్టిలో ప్లస్ అంటే మగపిల్లవాడని, మైనస్ అంటే ఆడపిల్ల అని వారి భావం. ఆడపిల్లంటే ఖర్చుకు పుట్టిందని వారి ఆలోచన. తల్లి గర్భవతి అవ్వగానే పుట్టబోయేది ఆడశిశువని తెలిస్తే అబార్షన్ చేసుకుంటూ ఒక జీవించుచున్న ప్రాణిని హత్య చేస్తున్న నరహంతకురాలిగా ఆ కర్కశ కార్యానికి పాల్పడి తన సొంత కుమార్తెకు క్షమింపరాని శత్రువుగా తల్లి మారిపోతోంది. ఇలాంటి నరహంతకులైన తల్లుల మధ్య జీవించిన రగూయేలు భార్య వరుసగా ఏడుగురు ఆడపిల్లలను పెంచగలిగిందంటే బహు ఆశ్చర్యమేస్తుంది కదూ. ఆ ఏడుగురు ఆడపిల్లలలో జ్యేష్ఠ కుమార్తె పేరే సిప్పోరా. ఇక చదవండి సిప్పోరా జీవితం.

ఫరో ఎదుటనుండి పారిపోయిన మోషే ఒక బావియొద్ద కూర్చున్నాడు. అది మిద్యాను దేశం. ఆ దేశపు యాజకుడైన రగూయేలుకు ఏడుగురు కుమార్తెలు. ఏడుగురు అమ్మాయిలే కాబట్టి ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఏడ్చినట్టే ఉంది అని మనం అనుకోవచ్చు. మరి ఆ అమ్మాయిలు తల్లిదండ్రులను ఏడ్పించారా? లేక సంతోషింపచేశారా? ముందుముందు చూద్దాం. ఒక భక్తుడు ఇలా అన్నాడు, "నేటి క్రైస్తవులు అబ్బాయి

పుడితే దేవునికి స్తోత్రం అని, అమ్మాయి పుడితే దేవుని చిత్తమండీ, దేవుడు ఎవరినిస్తే వారిని తీసుకోవాలి కదా” అని అంటారట. అబ్బాయి పుడితేనే దేవునికి స్తోత్రమా? అమ్మాయి పుడితే దేవునికి స్తోత్రం లేదన్నమాటనా? పుట్టబోయేది అమ్మాయి అని స్కానింగ్‌లో తేలితే గర్భస్రావానికి పాల్పడే నేటి సమాజానికి అమ్మాయి బరువైపోయింది. కట్నకానుకలు ఇవ్వలేక అమ్మాయి వివాహం పెద్ద సమస్య అయ్యింది. అయితే అమ్మాయి, అబ్బాయిల గురించి దేవుని వాక్యం ఏమి చెబుతుందో చూద్దాం.

“మా కుమారులు ఎదిగిన మొక్కలవలె ఉన్నారు. కుమార్తెలు నగరుకై చెక్కిన మూలకంబములవలె (స్తంభములు) ఉన్నారు (కీర్తన 144:12). ఈ మూలస్తంభాలు కదలక, కొన్నిసార్లు కనబడక, ముసుగులో, తెర వెనకాల, ఎవరికీ తెలియకుండా భారాన్ని భరిస్తూ ఉన్న ఆడవారికి సూచనగా ఉన్నాయి. అలాగు నేడు అనేక స్త్రీలు పరలోకపు నగరికి దేవుని వాక్యమును సుత్తితో చెక్కబడిన మూలస్తభాలవలె ఉండి పరలోకపు తండ్రి భారాన్ని భరించే ఆడవారిగా ఉన్నారు. దంపతులూ, ఆలాగు అమ్మాయిలను పెంచండి. అమ్మాయిలూ, ఆలాగు మీరును పెరగండి. అప్పుడు మీరు ఎవరికీ భారం కారు (మీరే భారం భరిస్తారు కావున). మిద్యాను యాజకుని కుమార్తెలు ఏడుగురు ఏడు స్తంభములుగా తన తండ్రి పనుల భారాన్ని భరిస్తున్నారు. వీరి అందరి పేర్లు మనకు తెలియవు కానీ పెద్దమ్మాయి పేరు సిప్పోరా అని నిర్గమ 2:21 ద్వారా తెలుస్తుంది. ఇప్పుడు సిప్పోరా జీవితాన్ని అంశాలవారీగా ధ్యానిద్దాం.

## 1. తండ్రి పనులమీద ఉన్న సిప్పోరా :

సిప్పోరా అమ్మాయే అయినా తండ్రి మంద త్రాగుటకు నీళ్లు చేది తొట్లను నింపుతుంది. నీవు దేవుని సంఘమనే ఇంటిలో ఒక అమ్మాయివే అయితే రక్షణ ద్వారా పరలోకపు తండ్రికి జన్మించిన ఒక కుమార్తె అయితే బైబిల్ అనే బావి నుండి వాక్యమనే నీటిని నీ హృదయపు తొట్టిలో నింపుకొని స్త్రీల మందకు అందించవచ్చు. రిబ్కా ఆలాగున ఒంటెల దాహాన్ని, ఎలియాజరు దాహాన్ని (పరిశుద్ధాత్మ యొక్క దాహాన్ని) తీర్చింది. యేసుక్రీస్తు పన్నెండేళ్ల బాలుడై ఉన్నప్పుడు తన తల్లిదండ్రులతో ‘నేను’ నా తండ్రి పనులమీద ఉండవలెనని మీరెరుగరా? అన్నాడు (లూకా 2:49). నేడు ఎంతమంది పన్నెండేళ్ళ బాలురు, బాలికలు పరలోకపు తండ్రి పనులమీద ఉంటున్నారు? వీరికి ఇహలోక తల్లిదండ్రుల పనులు కూడా పట్టవు. బాలురు, యౌవనస్తులైతే ఏ క్రికెట్ గ్రౌండులోనో, బజారుల్లోనో, ఇంటర్‌నెట్‌లలోనో కనిపిస్తారు. బాలికలు, యౌవనస్థురాండ్రైతే ఏ ఫ్రెండ్స్ ఇండ్లలోనో, ఏ టీవీల ముందో, ఏ సెల్‌ఫోన్ సంభాషణల్లోనో కనిపిస్తారు. తండ్రి ఇల్లయిన సంఘములో తండ్రి పనులలో, సంఘ పనులలో కనిపించరు. పన్నెండేళ్ళ బాలుడైన యేసు దేవాలయములో కనిపించడం ఈనాటి బాలబాలికలకు, యౌవనస్థులకు, యౌవనురాండ్రకు మాదిరి కాదా!

ప్రియ యౌవనస్థులారా, మీరు రోజులో బైబిల్ అనే బావి నుండి ఎన్ని కడవల నీళ్ళు చేదుతుంటున్నారు? రిబ్కా పది ఒంటెలు త్రాగునంత ఎన్నో గాలన్ల నీరు చేది

పోసింది. ఒంటెలు మనుష్యులకు గుర్తు. ఒంటెలు కొన్ని గాలన్ల నీరు త్రాగి తన కడుపులో స్టోర్ చేసుకోగలవు. యౌవనులైన మీరు ఎంతమంది అలా వాక్యాన్ని మీ హృదయంలో స్టోర్ చేసుకొని పెట్టుకున్నారు? దావీదు 'నీ వాక్యమును నా హృదయములో ఉంచుకొనియున్నాను' అన్నాడు. కానా వివాహంలో ఆరు రాతిబానల నిండా నీరు నింపబడినట్లు నీ హృదయాల నిండుగా దేవుని వాక్యంతో నింపుకోవాలి. సముద్రతీరంలో వెదికితే గవ్వలు, ఇసుక దొరుకుతాయి. ఇంకా లోపలికి వెదికితే చేపలు దొరుకుతాయి. ఇంకా లోపలికి వెళితే ఆణిముత్యాలు దొరకుతాయి. ఈదలేనటువంటిది దేవుని వాక్యము. ప్రియ యౌవనస్థులారా, ఈ వాక్య సముద్రములో ఎంత లోతుకు వెళ్ళావు? ఒక మిషనరీ ఒక గ్రామానికి సేవ కొరకై వెళ్ళగా ఒక స్త్రీ జొన్నరొట్టె మీద మెత్తని బీరకాయ కూరవేసి ఆ మిషనరీకి ఇచ్చిందట. మిషనరీగారు పైన ఉండే ఆ మెత్తటి కూరను తిని అడుగున ఉన్న ఆ జొన్నరొట్టెను పేపర్ ప్లేట్ అనుకొని దూరానికి విసిరిపారేశాడట. బీరకాయ క్రింద ఉన్న జొన్నరొట్టె బీరకాయ కూరకంటే బలమైన ఆహారమని ఆ మిషనరీకి తెలియదు. అలాగే దేవుని వాక్యంలో లోతుకు దిగివెళ్ళి ధ్యానిస్తే బలమైన, పుష్టికరమైన ఆత్మీయ ఆహారం దొరుకుతుందని మీకు తెలుసా? యౌవనుడైన ఇస్సాకు పొలములో సాయంకాలం ధ్యానించుటకు బయలువెళ్ళాడు. దావీదు ప్రతి ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము ధ్యానిస్తూ మొరపెట్టేవాడు (కీర్తన 55:17). బెరయ సంఘమువారు పౌలు, సీల చెప్పిన సంగతులు అలా ఉన్నవో లేవో అని లేఖనాలను పరిశీలించారు. మన పాఠ్యభాగములో సిప్పోరా, ఆమె చెల్లెళ్లు నీళ్ళు చేదే పనిలో ఉన్నారు. ఆమెకు కాబోయే భర్త మోషే కూడా నీళ్ళు చేదేవాడుగా (నిర్గమ 2:19) లో కనిపిస్తాడు. భార్య అనుభవమే భర్తలో, లేక భర్త అనుభవమే భార్యలో ఉండాలి. రెండు ఎద్దులు జోడై చేను బీడుచేయడం కాదు గాని, సంఘమనే చేనును వాక్యంతో తడపాలి. మన సేవాస్థలాలను నీటిమడుగుల్లాగా చేయాలి. అందరూ స్వకార్యాలు చూచుకుంటున్న ఈ తరుణంలో సిప్పోరా, ఆమె చెల్లెళ్ళవలె యేసుక్రీస్తు కార్యములను మనము కాకపోతే ఇంకెవరు చేస్తారు. ఆలాగు నీవు చేయడానికి సిద్ధమేనా?

ఏనుగు ఒకసారి తన తొండముతో నీళ్ళు పీల్చితే ఎనిమిది లీటర్ల నీళ్ళు పీలుస్తుందట. మరి మీరు బైబిల్ దగ్గర కూర్చుంటే లేవకుండా ఎనిమిది అధ్యాయాలు చదవగలుగుతున్నారా? జార్జి ముల్లర్‌గారు తన జీవితంలో 200 సార్లు బైబిల్ చదివి పూర్తిచేశారట. మరి మీ సంగతి ఏమిటి? ఆదోనిరామ్ జడ్సన్‌గారు (బర్మా మిషనరీ) దినమునకు 24 గంటల్లో 14 గంటలు బైబిలు ధ్యానించేవాడట. బ్రదర్ బిల్లీగ్రాహంగారి బైబిల్ ఎప్పుడూ తెరవబడే ఉంటుందట. మరి నీ బైబిల్ రీడింగ్ ఎలా ఉంది? రోజులో ఎంతసేపు బైబిల్ దగ్గర గడుపుతున్నారు? దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడని ప్రభువు చెప్పుచుండగా యౌవనులారా, మిమ్మును మీరు ఈ వాక్యానికి అప్పగించుకొని ధన్యులౌతారా? లేదా ఈ భ్రష్టలోకపు చెత్త సాహిత్యానికి (పత్రికలు, చందమామ, సుచిత్ర వారపత్రికలు, ఫిల్మ్‌ఫేర్‌లు, సితార, డిటెక్టివ్స్, నావెల్స్, అసభ్యకరమైన సెక్స్ పుస్తకాలు మొదలగువాటిని చదివి శాపగ్రస్తులౌతారా?

## 2. మంద కాపరులచే తోలివేయబడిన సిప్పోరా (నిర్గమ 2:17) :

తండ్రి మందకు నీవు చేది పోస్తుండగా సిప్పోరా పురుషులైన మంద కాపరులతో తోలివేయబడింది. సిగ్గును భరిస్తూ తమ తలలు నేలకు వంచుకొని ప్రక్కకు నిలబడ్డారు కాబోలు. మన ప్రభువు కూడా కలువరి సిలువలో తండ్రి కార్యమైన రక్షణ కార్యము చేయుటకు ఈ లోకమునకు వచ్చినప్పుడు (హెబ్రీ 13:12) ప్రకారము యూదులచేత గవిని వెలుపలికి తోలివేయబడ్డాడు. కాబట్టి మనమును ఆయన నిందను భరించుచూ శిబిరము వెలుపలికి ఆయన యొద్దకు వెళ్ళాలి. నిలవరమైన పట్టణము మనకిక్కడలేదు. గాని ఉండబోవుచున్న దాని కోసం ఎదురుచూచుచున్నాము. సిప్పోరాను తోలివేసిన వారు చెడ్డ కాపరులే. వారి సంగతి యెషయా 56:9-12 లలో వ్రాయబడినది.

సంఘమునకు మంచి కాపరియైన యేసుప్రభువుకు, చెడ్డ మందకాపరులైన నామకార్థ (రక్షణలేని) కాపరులకు గల తేడాలను క్రింద చదవండి:

| మంచి కాపరి | చెడ్డకాపరి |
|---|---|
| 1. మన ప్రభువు గొఱ్ఱెలకు మంచికాపరి, గొప్ప కాపరి, ప్రధాన కాపరి | 1. వారు చెడ్డకాపరులు |
| 2. మంచికాపరియైన మన ప్రభువు 7 కన్నులు (ప్రకటన 5:6) గలవాడు. తన ప్రజల బాధ చూచేవాడు (నిర్గమ 3:7). హాగరును చూచిన దేవుడు. మన ప్రభువు చూచే కన్నున్న దేవుడు. | 2. వీరు గ్రుడ్డివారు |
| 3. మంచి కాపరియైన యేసుప్రభువు తెలివిని పుట్టించువాడు. | 3. వీరు తెలివి లేనివారు |
| 4. మన మంచికాపరి మాట్లాడే దేవుడు. | 4. వీరు మూగకుక్కలు. మొరగలేరు, సాక్ష్యమివ్వలేరు. వాక్యం చెప్పలేరు. హృదయపూర్వక ప్రార్థన చేయలేరు. పుస్తకం చూసి ప్రార్థిస్తారు. వారివి కంఠత ప్రార్థనలు. |
| 5. మన ప్రభువు మనలను మరువక నిద్రించక కాపాడువాడు. | 5. వీరు కలవరించుచూ పండుకొనే వారు, నిద్రాశక్తులు. |
| 6. తండ్రి చిత్తమును నెరవేర్చుటయు, దానిని తుదముట్టించుటయు ప్రభువు | 6. వీరికి ఎంత తినినను తృప్తిలేదు, వీరు తిండిపోతులు. |

| | |
|---|---|
| యొక్క అన్నపానములై యుండెను. శత్రువుల యెదుట భోజనము సిద్ధపరచువాడే కానీ, గొఱ్ఱెలను చంపిభుజించు కసాయి కాపరి కాడు. సంఘమనే మందను పచ్చికబయళ్లకు నడిపించువాడు (యెహె 34:14). | |
| 7. మన ప్రభువే జ్ఞానమిచ్చువాడు. ఆయన ఆత్మ జ్ఞాన వివేకములకుఆధారమగు ఆత్మ. | 7. వీరు దేనిని వివేచించజాలరు. |
| 8. మన మంచి కాపరియైన యేసుప్రభువు గొఱ్ఱెలవలె దారితప్పిన వారికి తమకిష్ట మైన మార్గాల్లో వెళ్తున్న పాపులను పరలోక మార్గములో పెట్టినవాడు. | 8. వీరు తమకిష్టమైన మార్గమున వెళ్ళువారు. |
| 9. యేసుప్రభువు అనబడే ఈ మంచి కాపరి తన స్వప్రయోజనము కొరకు ఈ లోకానికి రాలేదు. కానీ అనేకులకు ప్రతిగా తన ప్రాణ రక్తాన్ని సిలువమీద చిందించాడు. పాప మానవాళిని రక్షించుటకే వచ్చాడు. | 9. వీరు స్వప్రయోజనము విచారించే వారు. |
| 10. మంచి కాపరియైన యేసుప్రభువు లూకా 22:18 'ఇకమీదట దేవుని రాజ్యము వచ్చువరకు నేను ద్రాక్షా రసము త్రాగనని తన శిష్యులతో చెప్పాడు. కానీ సిలువలో చేదు కలిపిన ద్రాక్షారసాన్ని లేఖనములు నెరవేరేలా యిప్పించుకొని త్రాగాడు. | 10. వీరు మద్యమును, ద్రాక్షారసమును త్రాగేవారు. |
| 11. యేసుప్రభువుకు జీవితములో ఏదియూ లక్షణముగా జరగలేదు. ఆయన ఎండిన భూమిలో మొలచిన మొక్క. ఆయన పరిస్థితులన్నియు ఎండిన | 11. వీరు నేడు జరిగినట్లు దేవుడు కూడా మరీ లక్షణముగా జరగాలను కునేవారు. వీరి జీవితాలు వడ్డించబడిన విస్తరాకు. ఈ చెడ్డ కాపరులు ప్రభువు యొక్క సంఘ |

పరిస్థితులే. మంచి కాపరియైన యేసు ప్రభువు ఏ అపాయమును రాకుండా తోడై యుండువాడే కానీ, తోలివేయువాడు కాడు. తోలివేయబడిన, వెలివేయబడిన వారిని సమకూర్చువాడు మన ప్రభువు (యెషయా 56:8). యేసుప్రభువు గొర్రెలకు తన ప్రాణాన్నే పెట్టిన కాపరి. తన మందల ప్రాణదానము చేసిన ప్రాణ ప్రియుడు. ఇట్లు ప్రాణదానము చేసిన ప్రభువు సంఘము ద్వారా పుచ్చుకున్న జీతమే లేదు. ఈ లోకము ఆయనకు ఇచ్చిన బహుమానాలు ముళ్ళ కిరీటమే, సిలువ శ్రమలే. పాప మానవాళిని ఉచితంగా రక్షించడమే ఆయన జీతం. ఇలా రక్షించబడినవాడు యుగ యుగాల పరలోకంలో చేరి నిత్యము ఏ బాధ లేకుండా ఆనందించగలరు.

కాపరులను తోలివేసేవారు. గొఱ్ఱెల కొరకు పనిచేయరు, ఇక ప్రాణాలెక్కడ పెడతారు? ఎలాంటి పని చేయక, చేసే వాళ్ళను చేయనివ్వరు. వారు చేస్తున్న పనుల్ని గుర్తించరు, గౌరవించరు. ఈనాడు జీతానికి పనిచేసే, ఉద్యోగాల్లో ఇదొక ఉద్యోగమనుకొని, మారు మనస్సు లేకపోయినా మతస్థులైన ఈ నామకార్థ పాస్టర్లందరూ ఈ కోవకు చెందినవారే. ఇప్పుడైనా కళ్ళు తెరచి, మేలుకొని పాపక్షమాపణ కోసం మంచి కాపరి ప్రభువును వేడుకుని రక్షించ బడితే మంచిది. లేకపోతే నరకంలోనే కళ్లు తెరువవలసి ఉంటుంది. యుగ యుగాల అగ్నిలో మలమల మాడాల్సి వస్తుంది.

---

గదరేనీయులు తమ ఊరిలోని సేనా దయ్యము పట్టినవానిని బాగుచేయగా తమ ప్రాంతము విడిచిపొమ్మని యేసుప్రభువును బ్రతిమాలుకొని తోలివేశారు (మార్కు 5:16). స్వస్థపరచువాడును మంచికాపరియైన యేసుప్రభువును తోలివేయక తమ ఊరిలోనే మరికొన్ని రోజులు ఉండమని సమరయ స్త్రీవలె బ్రతిమలాడి ఆయనను తన ఊరిలో ఉండమని బ్రతిమాలి ఉంటే ఈ ఊరిలో ఎన్నో ఆత్మలు రక్షింపబడి, స్వస్థపరచబడి, ఎన్నో దెకపొలి ప్రాంతాలలో సేవచేసేవారో కదా. ఈ పుస్తకాన్ని చదువుతున్న ఓ యౌవనస్థులారా, మీ హృదయమనే గదరేను దేశములోనికి పాపపు పందులు కలిగిన నీ హృదయ దేశములోనికి పాప ప్రక్షాళన కలిగించే యేసుప్రభువును, పాపుల రక్షకుడైన యేసుప్రభువును ఆహ్వానిస్తారా? లేదా తోలివేస్తారా? నిర్ణయం మీదే. యేసుప్రభువును యూదులు యెరూషలేము వెలుపలికి తోలివేశారు. సంఘము కూడా ప్రభువును బయటకు నెట్టివేయగా ఆయన తలుపువద్దే ఉండి తట్టుచున్నట్టు (ప్రకటన 3:20) గమనిస్తున్నాము కదా. నీ హృదయ ద్వారము తెరిచి ప్రభువా నా రోత హృదయములోనికి రమ్ము, ప్రభువు చోటిస్తే పరలోక రాజ్యములో ఆయన నీకు చోటివ్వగలడు. ప్రభువుతో ఆ ప్రార్థన ఇప్పుడే చేసి రక్షింపబడతావా? నీవు అలా తీర్మానం చేయకపోతే పాపుల అంత్యతీర్పు దినమున ప్రభువు కూడా నిన్ను అపవాదికిని, దాని దూతలతోను సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పొండని త్రోసివేసే మాట చెప్తాడని గుర్తుంచుకో.

## 3. తండ్రి పనులమీద ఉన్న సిప్పోరా :

మా మీద నిన్ను తీర్పరినిగాను, అధికారినిగాను నిన్ను నియమించినవాడు ఎవడని తన సహోదరుల చేత ఒక రీతిగా తోలివేయబడిన మోషే, మందకాపరుల చేత తోలివేయబడిన సిప్పోరాను మోషే ఆ బావి యొద్ద చూశాడు. ఆ బావి యొద్ద సిప్పోరాకు సహాయం చేశాడు (నిర్గమ 2:17). యేసుప్రభువు హెబ్రీ 2:18 ప్రకారము, తాను శోధింపబడి శ్రమపొందిన ప్రకారము శోధింపబడువారికి సహాయమ చేయగలవాడై యున్నాడు. శ్రమలలో మనలను ఒంటరిగా వదలడు. భర్త చనిపోయి ఒంటరిదైన రూతును ఒంటరిగానే ఉంచలేదు కదా. జంటగా బోయజునిచ్చాడు కదా. ఒంటరిగా ఉన్న మనతో జంటగా ఉన్నవాడు మన ప్రభువే కదా. మనం పొందుతున్న శ్రమలన్నీ ఒకప్పుడు మన ప్రభువు అనుభవించినవే కదా. నేడు శ్రమపడుతున్న మనము సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో ఆయన కృపాసనము యొద్దకు చేరాలి (హెబ్రీ 4:16). భూమ్యాకాశములు సృజించిన యెహోవా వలననే మనకు సహాయం కలుగుతుంది (కీర్తన 121:2). మందకు నీరుపెట్టి సిప్పోరాకు సహాయం చేశాడు మోషే. సంఘమనే మందకు వాక్యమనే నీరు పెట్టాలంటే బైబిలు నుండి ఆ వాక్యపు నీటిని ఆయనే చేది ఇస్తాడు. యిర్మీయా 33:3 ప్రకారము, నాకు మొఱ్ఱపెట్టుము, నేను గ్రహింపలేని గొప్ప సంగతులను, గూఢ సంగతులను నీకు తెలియచేసెదను అన్నాడు.

## 4. పనిని త్వరగా ముగించుకొని వచ్చిన సిప్పోరా :

రోజూ ఆలస్యంగా చేరే సిప్పోరా ఆ రోజు మోషే సహాయం పొందిన కారణాన త్వరగా ఇంటికి వచ్చింది. అలాగే మనమును పరమతండ్రి మనకిచ్చిన పనిని ఈ లోకములో త్వరగా ముగించి తండ్రి ఇల్లయిన పరలోకములో త్వరగా చేరుకోగలము. ఆలాగున పౌలు (2తిమోతి 4:6,7 ప్రకారము) 'నేను వెడలిపోవు కాలము సమీపమైనది. మంచి పోరాటము పోరాడితిని. నా పరుగు కాపాడుకొంటుని. ఇకమీదట నా కొరకు నీతి కిరీటము ఉంచబడినదని చెప్పాడు. తండ్రి తనకిచ్చిన పనిని కడముట్టించాడు. కావుననే నేను వెడలిపోవు కాలము సమీపమైనదని తండ్రి ఇల్లయిన పరలోకానికి త్వరగా వెళ్ళుటకు సిద్ధమయ్యాడు. పౌలు తన పనిని త్వరగా ముగించుటకు సహాయము చేసినవాడు మన ప్రభువే. ఎందుకంటే ప్రయాసపడినది నేను కాను. నాకు తోడైయున్న దేవుని కృపయే అని (1కొరింథీ 17:1) పౌలు అంటున్నాడు. అలాగే మన ప్రభువు, చేయుటకు నీవు నాకిచ్చిన పనిని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద నిన్ను మహిమపరచితిని అని యోహాను 15:10 లో అంటున్నాడు. ప్రియ దేవుని బిడ్డా, దేవుడు నీకప్పగించిన పనిని తుదముట్టించావా? పరలోకమనే తండ్రి ఇంటిని చేరడానికి సిద్ధముగా ఉన్నావా? ఇంకను రక్షించబడలేదా? నీ పనేంటో ఇంకనూ తెలియక ఉన్నావా? తెలిసి ఉంటే పని ప్రారంభించావా? ప్రారంభించి ఉంటే ఆ పనిని తుదముట్టించావా?

పనిని తుదముట్టించి వుంటే నీకు ఏ కిరీటం పొందగలవో పౌలువలె చెప్పగలవా? అలాంటి అనుభవాలు నీకు లేకపోతే నీవే రక్షించబడి ఆ పనికి పూనుకుంటావా? అప్పుడు మాత్రమే నీకు తండ్రి ఇల్లయిన పరలోకానికి త్వరగా చేరగలవు. మన పని ముగిస్తే ఒక్క నిముషమైనా ప్రభువు మనలను ఈ భూలోకంలో ఉంచకుండా త్వరగా పరలోకపు ఇంటికి చేరేట్లు చేస్తాడు.

## 5. మోషేను గూర్చ సాక్ష్యమిచ్చిన సిప్పోరా (నిర్గమ 2:19):

**1)** మోషే ఐగుప్తీయుడని సాక్ష్యమిచ్చిన సిప్పోరా : మోషే ఐగుప్తులో పుట్టి ఐగుప్తులో పెరిగి ఐగుప్తు వేషభాషలతో కనబడుచున్నాడు. గానీ ఐగుప్తీయుడు కాదు. అతడు ఇశ్రాయేలీయుడు. కానీ సిప్పోరాకు ఆ సంగతి తెలియదు. తనకు అర్ధమమైనంతవరకే మోషేను గూర్చి సాక్ష్యమిచ్చింది. "బోధ చేయలేను, వాదములకుబోవ నాకదేల నాధుడేసు క్రీస్తు గూర్చి నాకు తెలిసినంతవరకు సాక్ష్యమిచ్చెదన మన స్వామి యేసు దేవుడనుచు సాక్ష్యమిచ్చెద" అని భక్తుడు పాడినట్లు యేసుప్రభువును గూర్చి మనకు తెలిసినదే సాక్ష్యమివ్వాలి.

**2)** మందకాపరుల చేత నుండి విడిపించాడని సాక్ష్యమిచ్చిన సిప్పోరా : మన పాత పాప జీవితానికి కాపరియైన సైతాను చేతిలోనుండి ప్రభువు మనలను విడిపించాడు. ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులుగా ప్రభువు మనలను చేశాడని (కొలస్సీ 1:13) మనము కూడా సాక్ష్యమివ్వాలి. సైతాను చేతిలో నుండి విడిపించబడ్డావా? లేక సాతాను చెరలో ఇంకనూ బందీగా ఉన్నావా? నేడు ఈ విషయమై నీ సాక్ష్యమేమిటి?

**3)** మోషే త్వరగా నీళ్ళు చేదిపోశాడని సాక్ష్యమిచ్చిన సిప్పోరా : బావి నుండి నీటిని రోజూ నిదానముగా చేదుకునే సిప్పోరాకు ఈవేళ మోషే త్వరగా నీళ్ళు చేదిపోశాడు. బైబిలు అనే ఈ పెద్ద బావి దిగుడు బావికి 66 మెట్లు ఉన్నాయి. ఈ 66 గ్రంథాల సారాంశమైన వాక్యపు నీటిని వేగముగా, లేదా త్వరగా మనము గ్రహించుకొనుటకు హృదయపు తొట్లను నింపుకోడానికి ఆరోగ్యకరమైన రాజ్య విభజన చేయుటకు సహాయపడువాడు మన ప్రభువే. ఇశ్రాయేలీయులకు బోధించుటకు దేవుడే తన ఉపకారాత్మను దయచేశాడు. మన్నాను ఇయ్యక మానలేదు. వారి దాహమునకు ఉదకమిచ్చాడు (నెహెమ్యా 9:20). ఆలాగున ప్రభువు ఆత్మయే వాక్యాన్ని మనకు త్వరగా అర్థమయ్యేలా 'ఏకసందాగ్రాహులుగా' చేస్తాడు.

## 6. మోషేను విడిచివచ్చిన సిప్పోరా (నిర్గమ 2:20):

పైన ధ్యానించినట్లు సిప్పోరా మోషే సహాయము ద్వారా పని ముగించుకొని, త్వరగా ఇల్లు చేరి, మోషేను గూర్చి మంచి సాక్ష్యము చెప్పిందే కానీ తనకు సహాయము చేసిన మోషేను తాను సహాయము పొందిన బావి యొద్దే విడిచి వచ్చింది. నేడు

యేసుప్రభువు ద్వారా ఉద్యోగాలు, ఆరోగ్యాలు, ఆనందాలు, ఐశ్వర్యాలు, స్వస్థతలు, చదువుల్లో ఉత్తీర్ణతలు, ఉగ్యోగంలో ప్రమోషన్లు, కాలేజీలలో సీట్లు, ఆస్తిపాస్తులు ఇంకా ఎన్నెన్నో మేలులు పొందుచున్నవారు కూడా ఎక్కడ ఏ స్థలములో ప్రభువు ద్వారా సహాయాలు పొందుచున్నారో అక్కడే ప్రభువును విడిచిపెడుతున్నారు. యేసుప్రభువును "సిలువ వేయుము, సిలువ వేయము" అని కేకలు వేసినవారికి, యేసు వద్దు, ఆయన రక్షణ వద్దు, కానీ యేసు వస్త్రాలు కావాలి. ఇస్కరియోతు యూదాకు యేసు వద్దు కానీ యేసును అమ్ముకుంటే వచ్చే 30 వెండి నాణేలు కావాలి. ఆయన ఇచ్చే స్వస్థత కావాలి, దయ్యాలు వెళ్ళిపోవాలి, ఆయనిచ్చే రొట్టెలు, చేపలు కావాలి. ఆయన పేరు చెప్పుకొని బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ అని చెప్పుకొని స్కాలర్‌షిప్‌లు కావాలి. మైనారిటీ బి.యిడి. కాలేజీస్‌లో బి.యిడి. సీట్ పొందుకొనుటకు బాప్తిస్మము కూడా కావాలి. కానీ బాప్తిస్మానికి ముందు అవసరమైన మారుమనసు వద్దు. రక్షణ వద్దు, రక్షకుడైన యేసుప్రభువు వద్దు. ఆయన తప్ప అన్నీ కావాలి. మదిలో యేసు లేకున్నా ఏది ఉన్నా అది సున్నా. ప్రియసోదరీ, నీ సంగతి కూడా ఇలాగే ఉందా? యేసు . . . అంటే నీవడిగినవన్నీ అందించే ఒక సేవకుడా? ఆనాడు మోషే సహాయం పొందిన సిప్పోరా మోషేను బావియొద్ద విడిచిపెట్టినట్లు చివరకు నీవునూ యేసుప్రభువును విడిచిపెట్టావా? కీర్తన 22:1 లో తండ్రి కూడా తన కుమారుని విడిచినట్లు వ్రాయబడింది. ఆలాగున మనుష్యులందరితో విడువబడిన యేసును చేర్చుకునేదెవరు?

## 7. మోషేను పిలుచుకొని వచ్చిన సిప్పోరా (నిర్గమ 2:20):

సిప్పోరా మోషేను ఎక్కడ విడిచివచ్చిందో అక్కడికే వెళ్ళి మోషేను తన ఇంటికి పిలుచుకొని వచ్చింది. సోదరీ, నీకు ఈ క్షణము వరకు సహాయమ చేస్తూ వచ్చిన యేసుప్రభువును నీవు విడిచిపెట్టే తిరుగుతున్నావా? వెళ్ళి యేసుప్రభువును నీ హృదయమనే ఇంటికి పిలువుమని రగూయేలు సిప్పోరాకు చెప్పినట్లు నీ పరలోకపు తండ్రి నీతో చెప్పుచున్నాడు. పరమ 5:2 ప్రకారము, నాకు హృదయపు తలుపు తీయుమని పరలోకపు ప్రియుడు నీ హృదయపు తలుపు తట్టుచున్నాడు. కుమారుడా, నీ హృదయము నాకిమ్మని సామెతలు 23:26 లో చెప్తుంది. యేసును నీ ఇంటికి పిలుచుటకు ఆయన ఎంతో దూరంలో లేడు. నీ హృదయమనే తలుపునొద్ద నుండి తట్టుచున్నాడు (ప్రకటన 3:20). ఎంతసేపు ఆయనను నిలబెట్టుతావు? ఇప్పుడు హృదయపు తలుపు తెరిచి ప్రభువును నీ హృదయములోనికి చేర్చుకొని యేసు రక్తాన్ని ఆశ్రయించి పాపము నుండి విడుదల పొందు. నీవు ఆయనకు హృదయమిస్తే ఆయన నీకు పరలోకరాజ్యములో చోటిస్తాడు. నిత్యకాలము నీవు ప్రభువుతో నివసిస్తావు.

## 8. మోషేను వివాహమాడిన సిప్పోరా (నిర్గమ 2:21):

తండ్రియైన రగూయేలు ప్రేరణతోనే సిప్పోరా మోషేను వివాహమాడింది. ప్రియసోదరీ, నీ పెళ్ళి నీ పరలోకపు తండ్రి ప్రేరణయా, లేక నీ ఇష్టానుసారమైన

పెళ్ళియా? లేక నీ స్నేహితుల ప్రేరణయా? ఆదాము పెళ్ళి దేవుడే నిశ్చయించాడు. దేవుడే జరిగించాడు. మరి నీ పెళ్ళి దేవుని చిత్తానుసారముగానే జరిగిందని చెప్పగలవా? లేక ఆది 6:2, దేవుని కుమారులు నరుల కుమార్తెలు చక్కనివారని చూచి వారందరిలో తనకు మనస్సు నచ్చిన స్త్రీలను వివాహము చేసుకొన్నట్లు నీ వివాహము నీ ఇష్టమేనా, లేక దేవుని ఇష్టమా? ఈనాడు నీకిష్టమైన పెళ్ళియే రేపు కష్టము కాగలదు. దేవుడు జరిగించిన పెళ్ళిళ్లలోనే నిజమైన ఆశీర్వాదాన్ని, ఆనంద సంతోషాలను ఆయన సన్నిధిని అనుభవించగలము. సోదరీ, నీ పెళ్ళి విషయములో నీవు తప్పటడుగు వేశావని నీవు ఆలస్యముగా తెలిసికొన్నావేమో. ఏ వస్తువైనా మనకు వద్దనిపిస్తే మనము ఎవరికైనా దానమివ్వవచ్చు, లేదా పారవేయవచ్చు. "ఈ పెళ్ళి నాకు ఇష్టంలేదు" అని వివాహమైన తరువాత అంటే ఆ పరిస్థితిని సరిదిద్దుకోవడం చాలా కష్టం. ఏకపత్నీవ్రతులుగా ఉండమని వాక్యం చెబుతుంది గనుక జీవితంలో ఒక్క పెళ్ళే కాని రెండు మూడు చేసుకొనుటకు వీలులేదు. వివాహంలో నీవు చేసిన తప్పు నీ పిల్లల విషయంలో జరుగకూడదనుకుంటే వారి వివాహ విషయంలో దేవుని చిత్తం కొరకు కనీసం ఈనాటినుంచైనా నీవు ప్రార్థించాలి. దేవుని చిత్తాన్ని ప్రార్థించుట ద్వారాను, బైబిల్ చదువుట ద్వారాను ఆత్మ నడిపింపు ద్వారా తెలుసుకోవచ్చు. దేవుని చిత్తాన్ని తెలుసుకోవడానికి సహనంతో దేవుని యొద్ద కనిపెట్టాలి. అలా కనిపెట్టకుండా సొంత ఆలోచనలతో, సొంత నిర్ణయాలతో వివాహ జీవితంలోనికి ప్రవేశించరాదు. అర్జెంట్ పెళ్ళిళ్లు అర్జెంట్ విడాకులకు కారణమౌతాయి. పెళ్ళి చేసుకోబోయే యువతీ యువకుల కొరకు కొద్ది కాలము వ్యక్తిగత ప్రార్థనలోను, కుటుంబ ప్రార్థనలోను, సంఘ ప్రార్థనలోను కనిపెట్టవలసిన అవసరత ఎంతో ఉంది. దూరపు కొండలు ఎప్పుడూ నునుపుగానే కనిపిస్తాయి. దగ్గరకొచ్చినప్పుడే అవి ఎంత గరుకుగా ఉన్నాయో తెలుస్తుంది. వెలిచూపును బట్టే 'ఈ సంబంధం నచ్చింది' అనుకోకూడదు. దేవుని చూపు హృదయం మీద ఉంటుంది. మనిషి చూపు చక్కనిదనము మీద ఉంటుంది. దేవుని చూపు మనిషి హృదయములోని గుణం మీద ఉంటుంది. సామెతలు 6:25 ప్రకారము, దాని చక్కనిదనముయందు నీ హృదయములో ఆశింపవద్దు అని ప్రభువు చెప్పాడు. కావున ఈనాడు ప్రతి యువతీయువకులు "ఆదాము హవ్వల పెళ్ళిని జరిగించిన దేవా, నా పెళ్ళిని కూడా నీ హస్తాలతోనే జరిగించుము" అని ప్రభువుతో చెప్పాలి. తన తండ్రి చిత్తప్రకారము మోషేను పెళ్ళిచేసుకున్న సిప్పోరా ఈ దినములలోని యువతీయువకులకు ఎంతో మాదిరిగా ఆనాడే నిలిచింది. మరి ఈ కాలానికి నీ పెళ్ళి విషయములో నీవు ఇతరులకు మాదిరిగా ఉండుటకు ఇష్టపడుచున్నావా?

## 9. పిచ్చుక అయిన సిప్పోరా :

సిప్పోరా అను పేరుకు 'పిచ్చుక' అని అర్థము. కీర్తన 102:7 లో, మిద్దెమీద ఒంటరిగా ఉన్న పిచ్చుకవలె మోషేను వివాహమాడకముందు సిప్పోరా ఒంటరిగా ఉండేది. మోషేతో వివాహమయ్యాక సిప్పోరాలో ఒంటరితనం పోయి మోషేతో జంటగా అయ్యింది.

ప్రభువును అంగీకరించకమునుపు మనము ఒంటరివారమే. అంగీకరించిన తరువాత ఆయన మనలో ఉన్నాడు గనుక మనము జంట అయ్యాము. వివాహ విషయంలో కూడా ఏకాంగులను కూడా దేవుడు సంసారులుగా చేస్తాడు (కీర్తన 68:6). సోదరీ, నీ జీవితంలో నీకు కావలసిన భాగస్వామిని ఇచ్చి నిన్ను సంసారిగా చేయువాడు ప్రభువే. భర్తను కోల్పోయి ఒంటరిదైన రూతును, అత్తతో కూడా బేత్లెహేము చేరిన రూతుకు బోయజును జతచేసి జంటగా చేయలేదా? నేడు వివాహం కాకుండా, లేదా వివాహం విషయంలో ఆలస్యమైందని అనుకొనుచున్న యౌవనులారా, నాకు జంటకు ఎవరిని యిస్తారని ప్రభువును ప్రార్థనలో అడుగుచున్నావా? అబ్బాయిలైతే నా ప్రక్కటెముక ఎవరని ప్రభువును అడగాలి. అమ్మాయిలైతే నా శిరస్సు ఏవరని ప్రభువును అడగాలి. 'అడుగుడి మీకివ్వబడున'ని చెప్పిన ప్రభువును అన్ని విషయాల కొరకు అడుగుతున్నారేమో, కానీ వివాహ విషయంలో మాత్రం దేవునిని అడుగక నా వివాహ విషయంలో నేను మానేజ్ చేసుకుంటానని అనుకొని మానేజ్ కాదుకదా, డామేజ్ చేసుకుంటున్నారు.

సామెతలు 26:2లో తారేడే పిచ్చుక క్రిందికి దిగని పిచ్చుకగా కనబడుతుంది. తారాడే పిచ్చుక అంటే దేనికోసమో వెదుకుతుంది ఆ పిచ్చుక. దిగకుండా వెదుకుతూ అక్కడే తారాడుచున్న పిచ్చుక నెమ్మదిలేని, విశ్రాంతి లేని పిచ్చుకగా కనిపిస్తుంది. ఈ పిచ్చుకవలె మోషేతో వివాహం కాకముందు సిప్పోరా జీవితంలో విశ్రాంతిలేక మందల పనుల విషయంలోనూ, ఎవరిని వివాహం చేసుకోవాలో తెలియక దేవుని చిత్తం తెలియక తారాడుచున్న పిచ్చుకవలె ఉండింది. ఇప్పుడు మోషేతో వివాహమయ్యాక మందల పని అంటే మందలు కాచే పని, నీళ్ళు పట్టే పని మోషేయే చేస్తున్నాడు కాబట్టి ఇప్పుడు ఆమెకు మంద కాపరుల తోలివేతలు లేవు. తారాడుట లేదు. నెమ్మది, విశ్రాంతి దొరికాయి. యేసుప్రభువును రక్షకుడుగా అంగీకరించాకే మత్తయి 11:28 లో ఉన్నట్లు, ఆయనే మనకు విశ్రాంతిని ఇచ్చాడు. ఆయన వాక్యము కూడా మనకు నెమ్మది ఇచ్చింది.

కీర్తన 84:3 లో ఉన్నట్లు దేవుని మందిరములోని బలిపీఠము దగ్గర నివసిస్తున్న పిచ్చుకగా చూస్తున్నాము. బలిపీఠము దగ్గరకు వచ్చే పిచ్చుక బలిపీఠము మీద దహనమవ్వాల్సిందే, అది ఖాయం. పిచ్చుక సాధారణంగా మన ఇంటిలో గూడుకట్టుకొని నివసించ బూనితే దానిని తోలివేస్తాము. కానీ దేవుడైతే తన బలిపీఠం దగ్గరకొచ్చిన పిచ్చుకలాంటి మనల్ని దహించక తన సన్నిధిలో నుండి తోలివేయక పాపులమైన మనలను రక్షించి తన బలిపీఠము దగ్గరే మనకు తన మందిరములోనే నివసించగల కృపను గూర్చి మన ప్రభువే మనకు ప్రతిగా ఆ సిలువ బలిపీఠము మీద దహనమై మరణించాడు. అందుకే ఎఫెసీ 2:1 లో, మీరు మీ అపరాధములచేతను పాపములచేతను చచ్చినవారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రతికించెను. దేవుడు కరుణాసంపన్నుడై దైవోగ్రతకు పాత్రులమైన మనయెడల తన మహా ప్రేమను చూపించుట చేత మనలను క్రీస్తుతో కూడా బ్రతికించెను.

మత్తయి 10:29లో ఉన్నట్లు రెండు పిచ్చుకలు ఒక కాసుకు అమ్మబడితే రెండు కాసులకు ఐదు పిచ్చుకలు ఇవ్వబడ్డాయి. అంటే నాలుగు పిచ్చుకలు కొంటే ఒక పిచ్చుక ఫ్రీగా ఇవ్వబడుతుంది. అంటే ప్రతి నాలుగింటికి ఒక పిచ్చుక కొసలుగా వచ్చినట్లు. ఆ ఐదవ పిచ్చుక ఖరీదు ఏమీ లేనట్లే ఉంది. ఉచితముగా వచ్చినట్లు విలువలేని పిచ్చుకవలె ఉంది. అటువంటి ధర తక్కువ పిచ్చుకలమైన మనల్ని విలువలేని మనలను విలువైన తన రక్తంతో కొని, కడిగిన మన విలువను పెంచిన మన పరమ మోషే ఎంతగొప్పవాడో కదా. ఆయన ప్రేమ ఎంత గొప్పదో కదా. పిచ్చుకకంటే శ్రేష్టులుగా, గొఱ్ఱెలకంటే శ్రేష్టులుగా మానవులలో కూడా శ్రేష్టులుగా, కుమారులు, కుమార్తెలు అనుబడుట కంటే శ్రేష్టమైన పేర్లు పెట్టి (యెషయా 56:5) పిలిచిన ప్రభువు ప్రేమ ఎంత గొప్పదో కదా! యెషయా 43:4 ప్రకారము, నీవు నా దృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివని ఘనులుగా చేశాడు. లోకంలో ఘనులకు కలిగిన పేరు నీకు కలిగిస్తానని చెప్పాడు.

## 10. మోషేకు ఇద్దరు కుమారులని కనిన సిప్పోరా:

మోషే తన మొదటి కుమారునికి (నిర్గమ 2:21) గెర్షోము అని పేరుపెట్టాడు. గెర్షోము అనగా అన్యదేశములో మోషే తాను పరదేశినై యుంటిని అనే అర్థముతో తన కుమారునికి ఆ పేరు పెట్టడం జరిగింది. మోషే ఆ దినాలలో మిద్యాను దేశములో పరదేశిగా ఉంటూ వచ్చాడు. మోషే మాత్రమే కాక ఈనాడు మనమందరము 1దిన 29:15 ప్రకారము, దేవుని సన్నిధిని అతిథులమును, పరదేశములమునై యున్నాము. పితరులందరివలే పరదేశులమై యున్నాము. 1పేతురు 2:11 ప్రకారము, ఈ లోకములో కూడా మనము పరదేశులమును, యాత్రికులమునై యున్నాము. ఈ లోకం మనకు శాశ్వతము కాదు. సంతకు వచ్చినట్లు ఈ లోకానికి వచ్చాము. సంత ముగించి 'పరలోకానికి' వెళ్ళాలి. అదే శాశ్వతం. ఈ లోకయాత్ర ముగించుకొని పరలోకం చేరతాం. మన పౌరస్థితి పరలోకమందు ఉన్నది. స్థిరమైన నివాసము మనకీ లోకంలో లేదు. కనుక మనము ఉండబోతున్న దానికొరకు ఎదురుచూస్తున్నాము. దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణకుడో పునాదులు గల ఆ పట్టణానికి వెళ్ళబోతున్నాం. ఈ లోకంలోనిది ఏదియు మనము పరలోకానికి కొనిపోలేము. వట్టి చేతుల్తో వచ్చాం. వట్టి చేతుల్తోనే ఈ లోకం విడిచివెళ్తాం. 1పేతురు 1:17లో వ్రాయబడినట్లు, 'మీరు పరదేశులై యున్నంతకాలం భయముతో గడుపమని దేవుని వాక్యం చెబుతోంది. ఈ లోకంలో మనము 70 ఏండ్లు, లేక 80 ఏండ్లు పరదేశులమై ఉంటాం. ఈ సంవత్సరాలన్నియూ భయముతో గడపాలని వాక్యం చెబుతోంది. ఎందుకు భయంతో గడపాలి. 17 వచనం ప్రారంభములో చెప్పినట్లు, పూర్వపు అజ్ఞాన దశలో మనకుండిన లోకాశలను బట్టి ప్రవర్తింపక మనల్ని పిలిచిన మన ప్రభువు పరిశుద్ధుడైన ప్రకారము సమస్త ప్రవర్తనయందు భయము కలిగి పరిశుద్ధులై ఉండాలి. ఎందుకంటే పక్షపాతము లేకుండా క్రియలనుబట్టి ప్రతివానికి తండ్రి తీర్పు తీరుస్తాడు. గనుక భయముతో పవిత్రముగా జీవించాలి. ఎందుకనగా 2కొరింథీ 5:10 లో పైన చెప్పిన సంగతే చదువుతున్నాము. 'ఎందుకనగా తాను జరిగించిన క్రియల

చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు, మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట (తీర్పుకు) ప్రత్యక్ష్యము కావలయును' కనుక భయముతో మనమీ లోకములో పరదేశులమని జ్ఞాపకముంచుకొని జీవించాలి.

అలాగే మోషే తన రెండవ కుమారునికి నిర్గమ 18:4లో ఉన్నట్లు నా తండ్రి దేవుడు నాకు సహాయమై ఫరో కత్తివాత నుండి నన్ను తప్పించెననుకొని, ఎలీయెజరు' అను పేరు పెట్టినట్లు చదువుతున్నాం. ఎలీయెజరు అనగా 'దేవుడు సహాయకుడు' అని అర్థము. మోషే నిర్గమ 2 అధ్యాయంలో ఐగుప్తీయుని చంపిన విషయము ఫరోకు తెలియుట ద్వారా ఫరో అతనిని చంపచూశాడు. ఆ ఫరో యొ్క కత్తివాత నుండి దేవుడతనిని కాపాడాడు కనుక అది జ్ఞాపకముంచుకొని ఆ అర్థమిచ్చునట్లుగా రెండవ కుమారునికి ఆ పేరు పెట్టాడు. అవును, మన తొందరపాటు వల్ల, అజ్ఞానముతో, ఆలోచన లేకుండా అనేక కీడులు మనకు మనమే తెచ్చుకొనిన వారమైనప్పటికీ ప్రభువు తన విశేష కనికరముతో ఎన్నో కీడులు, అపాయముల నుండి సహాయము చేయుట వలన మనము జీవిస్తు ఉన్నాము.

**ఎవరికి ఎప్పుడు దేవుడు సహాయం చేస్తాడు? కొన్ని రిఫరెన్సులు బైబిలు నుండి చూద్దాం:**

**1) 2దిన 14:11 –** బలము లేనివారికి సహాయము చేయుటకు నీకన్న ఎవరును లేరు.

**2) యెషయా 41:14 –** స్వల్ప జనమగు ఇశ్రాయేలూ, నేను నీకు సహాయము చేయుచున్నాను.

**3) రోమా 8:26 –** ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు.

**4) కీర్తన 46:1 –** దేవుడు మనకు ఆపత్కాలములో నమ్ముకొనదగిన సహాయకుడు.

**5) 2దిన 32:8 –** మనకు సహాయము చేయుటకు మన దేవుడైన యెహోవా మనకు తోడుగా ఉన్నాడు.

**6) హెబ్రీ 4:16 –** మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము.

అలాగున మన దేవుడు మనకు బలము లేనపుడు 1) స్వల్ప జనముగా నున్నప్పుడు, 2) బలహీనతలో ఉన్నప్పుడు, 3) ఆపత్కాలములో ఉన్నప్పుడు, 4) మనకు తోడు అవసరమైనప్పుడు, 5) సమయోచితమైన సహాయము అవసరమైనప్పుడు ఇంకనూ అనేక సమయాలలో, ఆయన మనకు సహాయకుడై ఉన్నాడు. ఈ 'ఎబినేజరు' దేవుడు ఇప్పటి వరకు ఇంతవరకే కాదు, ఇక ముందుకును సహాయము చేయగలవాడైయున్నాడు, 7) హెబ్రీ 2:18 ప్రకారము, తాను శోధింపబడి శ్రమ పొందెను గనుక శోధింపబడువారికి సహాయము చేయగలవాడై యున్నాడు.

ఈ రీతిగా మన దేవుడు మనకు సహాయము చేయగలవాడే గాని సహాయము చేయలేనివాడు కాదు. యెషయా 41:13లో, 'నీ దేవుడైన యెహోవానగు నేను భయపడకుము, నేను నీకు సహాయము చేసెదెని నీ కుడిచేతిని పట్టుకొనుచున్నాను' అని చదువుతున్నాము. కుడిచేతిని పట్టుకొని చెబుతున్నాడంటే ఎంత ప్రేమతో చెబుతున్నాడో కదా. కాబట్టి ఏ మాత్రము అధైర్యపడనవసరము లేదు. మన మోషేను ఫరో కత్తివాత నుండి తప్పించి సహాయము చేసినట్లు ప్రభువు మనల్ని కూడా సాతాను కత్తివాత నుండి తప్పించి సహాయము చేస్తున్న దేవుడైయున్నాడు.

## 11. భర్త ప్రాణాన్ని రక్షించిన సిప్పోరా :

సిప్పోరా తన కుమారునికి ఆది 17:14 ప్రకారము పుట్టిన తరువాత 8వ రోజున సున్నతి చేయని కారణమున తన ఆజ్ఞను నిర్లక్ష్యము చేసిన కారణమున మోషేను యెహోవా దేవుడు చంపచూడగా సిప్పోరా తన అవిధేయతను బట్టే తాను ఆటంక పరచుటను బట్టే మోషే తన కుమారునికి సున్నతి చేయలేకపోవుట చూసే దేవుడు తన భర్తను చంపజూశాడని తన తప్పు తెలుసుకొని, వెంటనే వాడియైన రాయి తీసికొని తన కుమారునికి సున్నతి చేసి, ఆ సున్నతి చేయబడిన భాగాన్ని అతని పాదముల యొద్ద పడవేసి, 'నిజముగా నీవు నాకు రక్తసంబంధమైన పెనిమిటివి' అన్నది. ఇక్కడ మనకు చాలా చక్కని పాఠము ఉన్నది.

తమ రెండవ కుమారునికి సున్నతి చేయుటలో భార్యభర్తల్లో ఎవరు ఆటంకము, జ్యాప్యము చేశారో తెలియదు కానీ దేవుని తీర్పు మోషే మీదకు వచ్చింది. సమయస్ఫూర్తిగల సిప్పోరాకు తమ తప్పు అర్థమయ్యింది. అలాగు శ్రమ వచ్చినపుడు ఆ శ్రమ ఎందుకు వచ్చిందోనని మన జీవితాన్ని పరీక్షించుకోవడం మనకు మంచిది. సిప్పోరా ఆ సత్రం దగ్గర తన భర్తను చావునుండి రక్షించినట్లు నేడు ఎంతమంది స్త్రీలు ప్రభువును నమ్మక ఆత్మీయముగా మరణించిన తన భర్తలను రక్షించుకొంటున్నారు? సిప్పోరా మనకెంతో మాదిరిగా నిలిచింది. సున్నతి చేయబడిన రక్తసిక్తమైన భాగాన్ని తన భర్త పాదాల యొద్ద పడవేసి నిజముగా నాకు రక్తసంబంధమైన పెనిమిటివైతివి అని చెప్పుటలో అర్థమేంటి? ఇప్పుడు తన రెండవ కుమారుని పేరు ఎలీయెజెరు. ఈ పేరుకు అర్థము దేవుని సహాయము. ఎలీయెజెరు పేరులో దేవుడు కనిపిస్తున్నాడు. ఈ ఎలీయెజెరు యొక్క రక్తసిక్తమైన సున్నతి చేయబడిన భాగము ద్వారా మోషేకు ప్రాణ విమోచన కలిగింది. ఆ రక్తాన్ని బట్టియే సిప్పోరా – "నీవు నాకు రక్తసంబంధమైన పెనిమిటివైతివి" అని అన్నది.

అమ్మా, నేడు మన భర్తలు దేవుని అద్వితీయ కుమారుడైన యేసు రక్తములో కడుగబడిన భర్తలేనా? లేక యేసు రక్తంలో కడుగబడని, పాపక్షమాపణ పొందని నామకార్థ భర్తలా? ఎలీయెజెరు రక్తము మోషే పాదాల యొద్ద పడినట్లు నేడు యేసు రక్తం అందరికీ అందుబాటులో ఉంది. కానీ హెబ్రీ 10:29లో ఉన్నట్లు, సిలువలో గాయాలు,

దెబ్బలు తిని రక్తసిక్తమైన దేవుని కుమారుని రక్తాన్ని నీ పాదాల దగ్గరికి వచ్చిన రక్తాన్ని నీ పాదాలతో త్రొక్కి, నీవు పరిశుద్ధపరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా యెంచి కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినట్లయితే ఎంతో ఎక్కువైన దండనకు పాత్రురాలవుగా ఎంచబడుచున్నావు కదా. ఎలీయెజరు తన శరీరంలో ఒక్క గాయం ద్వారానే రక్తం కార్చాడు. కానీ యేసుప్రభువు నిలువెల్ల ముళ్ళతో, మేకులతో, కొరడాలతో గాయాలు పొంది మన కొరకు తన రక్తం కార్చాడు. ఎలీయెజెరు దేవుని ఆజ్ఞననుసరించి సున్నతి చేయగా మోషే ఒక్కడే దేవుని తీర్పు నుండి రక్షించబడ్డాడు. యేసుప్రభువు తండ్రి ఆజ్ఞ ప్రకారము సిలువలో ఆయన పొందిన దెబ్బల ద్వారా తన ప్రాణరక్తం సమర్పించగా త్రికాలాల్లో ఉన్న మనుషులందరికీ రక్షణ కలిగింది. మరి సోదరీ, నీ రక్షణ సంగతేమిటి? నీ కాళ్ళ దగ్గరికి వచ్చిన యేసు రక్తం ప్రతి పాపమునుండి నిన్ను కాపాడుతుంది. నీవే ప్రభువు దగ్గర పాపాలను ఒప్పుకొని నీ హృదయంలో ప్రభువుని విశ్వసించి చేర్చుకో.

## 12. మోషే యొద్దకు వచ్చిన సిప్పోరా :

నిర్గమ 2:16 లో కనిపించిన సిప్పోరా మరలా నిర్గమ 18:6 లో కనిపిస్తుంది. అంటే 4:6 నుండి 18వ అధ్యాయము వరకు ఇశ్రాయేలీయులు దేవుని పర్వతం వరకు చేసిన ప్రయాణంలో ఆమె లేదని అర్థమౌతోంది. కారణం, నిర్గమ 18:2 లో మోషే మామ తన యొద్దకు పంపబడిన మోషే భార్యయైన సిప్పోరాను ఆమె ఇద్దరు కుమారులను దేవుని పర్వతం దగ్గర దిగిన మోషే యొద్దకు తీసుకొని వచ్చాడు. అసలు ఆమె కుమారులు మోషే యొద్దకు ఎప్పుడు పంపబడ్డారు? అంటే ఈ క్రింది విధంగా ఆలోచించడానికి ఆస్కారం ఉంది. నిర్గమ 4:25లో ఎలీయెజెరకు సున్నతి చేయగా ఆ బాలుడు గాయపడి, ప్రయాణం చేయుటకు వీలుకాని పరిస్థితులలో ఆ సత్రం దగ్గరనుండి సిప్పోరాను, ఆమె కుమారులను మోషే తన మామ యొద్దకు వారిని పంపి ఉండవచ్చునని ఆలోచించడానికి హేతువగుతుంది. ఆ బాలుడు స్వస్థత పొందాక వారందరిని తీసుకొని మోషే మామ దేవుని పర్వతం దగ్గరకు వచ్చాడు.

ఇక్కడ మరో సంగతి మనం గమనించాలి. కుమారుని 8వ రోజున సున్నది చేయాలనే ఆజ్ఞను నిర్లక్ష్యపెట్టిన మోషే సిప్పోరాలు ఇద్దరూ తమ జీవితంలో ఎంతో నష్టం అనుభవించాల్సి వచ్చింది. మోషేను ప్రాణాపాయం కలిగింది. అలాగే సిప్పోరా ఐగుప్తులో 10 తెగుళ్ళ ద్వారా ఎలా ఐగుప్తీయుల నుండి ఇశ్రాయేలును విడిపించాడో, తన భర్త సూచక క్రియలను దేవుని వలన ఎలా చేశాడో, ఇశ్రాయేలీయులను దేవుడు ఎర్రసముద్రాన్ని ఎలా దాటించాడో, ఆవలి తీరం చేరాక మోషే తన వారందరికి మోషే నేర్పిన కీర్తన ఎలాగున పాడారో, 12 నీటిబుగ్గల్లో 79 ఈతచెట్లు ఎలా అనుభవించారో, మన్నా ఎలా కుమ్మరింపబడిందో, వారు ఎలా భుజించారో, అమాలేకీయులపైన దేవుడు వారికెలా విజయమిచ్చాడో ఇవన్నీ చూడలేక, అనుభవించలేక నష్టపోయింది. ఇద్దరు

భార్యభర్తలు దేవుని ఆజ్ఞకు విధేయత చూపారు గానీ ఎప్పుడు? దెబ్బ పడ్డాక. ఆలస్యముగా విధేయత చూపారు. కనుక ఎంతో నష్టం పొందారు. దేవుని ఆజ్ఞకు సగం విధేయత చూపించి, సగం విధేయత చూపించకపోయినా కూడా సౌలురాజు వలె 1సమూ 15:22,23 లో ఉన్నట్లు నష్టము జీవితములో అనుభవించాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలి. ఆలస్యంగా చూపిన విధేయత కుంటి విధేయతే అవుతుంది.

1కొరింథీ 7:19 ప్రకారం, 'దేవుని ఆజ్ఞలను అనుసరించుటయే ముఖ్యము. గాని సున్నతి పొందుట యందేమియు లేదు. సున్నతి పొందకపోవుటయందు ఏమియు లేదు.' అనగ సున్నతి పొందినా ఏమీ లేదు, పొందకపోయినా ఏమీ లేదు. అయితే దేవుడు ఎందుకు ఆ ఆజ్ఞలు ఇచ్చాడంటే, దేవునికి భయపడి ఆ ఆజ్ఞలను అనుసరించుటయే దేవునికిష్టం. అలాగే అబ్రాహాము దేవుని ఆజ్ఞలకు భయపడుతున్నాడో, లేదో తెలుసుకోడానికి పరీక్ష పెట్టాడు. కనుక - అట్టి ఆజ్ఞలను అనుసరించుట వలన మనం దేవునికి భయపడాలనే దేవుని ఇష్టం. అలా విధేయత చూపిన కారణాన సిప్పోరా దేవుడు తన భర్త ద్వారా చేయించిన గ్రేట్ మిరకిల్ (మహా అద్భుతం) తాను చూసే భాగ్యం పొందలేకపోయింది. ఆమె మాత్రమే కాక, ఆమె పిల్లలు కూడా వాటిని చూడలేకపోయారంటే తల్లి విధేయత పిల్లలకు కూడా గొప్ప నష్టమే వచ్చింది.

## 13. మోషే గుడారములోనికి వచ్చిన సిప్పోరా :

కొంత ఆలస్యముగానైనా సిప్పోరా దేవుని పర్వతం దగ్గర ఉన్న తన భర్తయైన మోషే దగ్గరకు చేరుకుంది. ఆయన గుడారములోనికి చేరుకుంది. అలాగే మనమును ఈలోక ప్రయాణాన్ని ముగించుకొని ఒకరోజు దేవుని సభాపర్వతమున నూతన యెరూషలేమును దేవుడు మన కొరకు సిద్ధపరచిన గుడారములోనికి వెళ్తాం. ఆ దినమెంతో మనకు ఆనందమిచ్చే దినం. ఆ రోజు త్వరలో రాబోతోంది. ఆ ప్రభువును ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నామా? ప్రకటన 21:2-3, 'మరియు నేను నూతనమైన యెరూషలేము అను పరిశుద్ధ పట్టణము తన భార్య కొరకు అలంకరింపబడిన పెళ్ళి కుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్ద నుండి దిగివచ్చుట చూచితిని. అప్పుడు దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉన్నది. ఆయన వారితో కాపుర ముండును. వారు ఆయన ప్రజలై యుందురు. దేవుడు తానే వారికి దేవుడైయుండి వారికి తోడైయుండును.' ఇక ఎక్కడనూ సిప్పోరా మనకు కనిపించదు. ఆమె జీవితం మనకందరికీ పాఠమే కదూ!

❊ ❊ ❊ ❊ ❊

# 5

# ఇంటివారిని చావకుండ బ్రతుకనిచ్చి రక్షించిన స్త్రీ - రాహాబు

నూను కుమారుడైన యెహోషువ కనాను దేశమును వేగుచూచుటకు ఇద్దరు వేగుల వారిని పంపినట్లు యెహో 2:1లో చదువుతున్నాము. అలాగే మన పరమ యెహోషువ నిన్ను, నన్ను ఒక దేశములో, ఒక రాష్ట్రములో, ఒక ప్రాంతములో, ఒక ఊరిలో, ఒక వీధిలో, ఒక ఇంటిలో వేగులవారిగా పెట్టాడు. యెహోషువ పంపిన ఇద్దరు వేగులవారు ఆ దేశపు రాజును గూర్చి, ప్రజల పరిస్థితిని గూర్చి, వారు ఇశ్రాయేలీయులను గురించి ఏమనుకుంటున్నారో ఏ దేశానికి వెళ్ళవలసిన మార్గాలను గురించి ఇంకా అనేక విషయాల గురించి వేగు చూడడానికి వెళ్ళారు. దేవుడు మనల్ని ఆత్మీయ విషయాల్లో మనచుట్టూ ఉన్నవారికి రక్షణ ఉందా, లేదా? ఏ ఊరిలో సువార్త అందించబడలేదు, ఎక్కడ ఆయన మందిరాల్లేవు, ఎక్కడ సేవకుడు లేడు, ఇవన్నీ వేగుచూసి సువార్త పని చేయుటకు మనల్ని కూడా దేశంలో అక్కడక్కడ ఉంచుతూ ఉన్నాడు. యెహోషువ ఇద్దరిని పంపినట్లు ప్రభువు కూడ తన శిష్యులను ఇద్దరిద్దరిని పంపాడు. ఆ దేశములో ముఖ్యముగా 'యెరికో'ను వేగు చూడమని యెహోషువ చెప్పాడు. యెహోషువ ఏ పట్టణాన్ని ముఖ్యముగా వేగుచూడమన్నాడు? యెరికోను. యెరికో అయనకు ముఖ్యమట. ఆనాడు దేవుడు యెహోషువ మనసులో యెరికోను ముఖ్యముగా పెట్టాడంటే యెహోషువ 6:26 లో యెరికో పట్టణపు పునాదులు వేయించేడా? జ్యేష్ఠపుత్రుడు చనిపోతాడని, ఆ పట్టణపు తలుపులు నిలబెట్టువారి కనిష్ఠ పుత్రుడు చనిపోతాడట. ఈ మాటను బట్టి అది శాపగ్రస్త పట్టణము ఆ పట్టణమే. యెహోషువ ముఖ్యముగా వేగుచూడమన్నాడు. అందులో అన్ని ఇళ్లకు వెళ్ళమని ప్రేరేపించలేదు దేవుడు. పేరుగాంచిన వ్యభిచార పాపియైన రాహాబు ఇంటికే వారు వెళ్ళునట్లు ప్రభువు వారిని ప్రేరేపించడం విశేషం. మత్తయి 21:31 లో 'సుంకరులు, పాపులు మీకంటే ముందుగా పరలోక రాజ్యములో చేరుతారని' ప్రభువు చెప్పుటనుబట్టి రాహాబు సమరయ స్త్రీలాంటివారు పరలోకంలో మొదటి పంక్తిలో సింహాసనాసీనులై ఉండుట పరలోకంలోనికి మనమెళ్ళినప్పుడు చూస్తామనేగా అర్థము.

కారణం, వేశ్యలు, సుంకరులు, పాపులు తాము పాపులమని వెంటనే ఒప్పుకొని మారుమనసు పొందుతారు. లూకా 19:8లో సుంకపుగుత్తదారుడైన జక్కయ్య – ఇదిగో ప్రభువా, నా ఆస్తిలో సగము బీదలకిచ్చుచున్నాను. నేనెవనియొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగంతలు మరల ఇత్తునని ప్రభువుతో చెప్పాడు.

ఒకసారి లూకా 18:13 లో సుంకరి దూరముగా నిలువబడి ఆకాశమువైపు కన్నులెత్తుటకు ధైర్యము చాలక రొమ్ముకొట్టుకొనుచు, దేవా, పాపినైన నన్ను కరుణించుమని పలికి నీతిమంతుడుగా తీర్చబడి ఇంటికి వెళ్ళినట్లు చూస్తున్నాము. కనుక వెంటనే పాపాలు ఒప్పుకునేవారు పాపులు, సుంకరులు. కాబట్టే వారు పరలోకంలో మొదటి పంక్తిలో ఉంటారు.

సాధారణముగా వేశ్యలు పురుషులతో శయనించి, అవమానపరచబడతారు. వారు చేయరాని పనులు చేస్తారు. వారు చెరపబడుటకు పురుషులకు అప్పజెప్పుకుంటారు. జనములలో అవమాన కార్యాలను చేస్తారు. కుటుంబికులకు మిగుల కోపము వచ్చే పనులు చేస్తారు. ఈ పనుల్లో పాల్గొనేవారు తాము ఒకరినొకరు 'ప్రేమించుకుంటున్నాము' అనుకొంటారు. కానీ ఆది 30:30లో అలాంటి పనులు వేశ్యల యెడల జరిగించే పనులని వ్రాయబడింది. ప్రియ యవ్వనస్తులారా, ఈ తరము పేరే వ్యభిచార తరము ప్రభువు చెప్పుచూ ఉండగా, మీరు చేసే పనులను బట్టి మనుష్యులే మిమ్మల్ని వేశ్యలు అంటూ ఉండగా ఇక దేవుడు మిమ్మల్ని వ్యభిచారులు, జారులు అని పేరుపెట్టడం సబబే కదా. వ్యభిచారులకు, వేశ్యాసంగులకు దేవుడు తీర్పుతీరుస్తాడు. మీరు పరిశుద్ధులుగా యోగ్యమైన, ఘనమైన, పెళ్ళిళ్లు చేసుకొనక వేశ్యాగమనములో ఉంటున్నారా? పెళ్ళి కాకమునుపే మీ దేహాన్ని అపవిత్రంగా ఉంచుకొంటూ దేవుని తీర్పుకు లోనౌతారా?

**I. వేశ్య యొక్క నోరులోతైనగొయ్యి అను సామెత (23:27):** వేశ్యతో సాంగత్యము చేయువాడు తన ఆస్తిని పాడుచేయును. వేశ్యలతో సాంగత్యము చేసి చిన్న కుమారుడు తన ఆస్తినంతటిని పాడుచేసుకున్నాడు. కానీ రాహాబు ఇంతకుమునుపు అనేకులను పాపపు పురుషులను తన ఇంటికి ఆహ్వానించేది. కానీ ఈనాడు పవిత్రమైన దైవపురుషులను తన ఇంటికి పిలిచింది. వారిని దాచింది. నేటితో ఆమె జీవితం మారిపోయింది. ఎలా మారిందో ముందుకు చదువుదాము. ద్వితీ 23:17 ప్రకారం, ఇశ్రాయేలీయుల కుమార్తెలలో ఎవతెయు వేశ్యగా ఉండకూడదట. అన్యులలో ఉంటారు. దేవుని పిల్లలలో ఉండకూడదు.

**II. దైవ వర్తమానికులను (లేక వర్తమానాన్ని) తన ఇంట (అనగా హృదయంలో దాచిపెట్టిన రాహాబు) :** యెహో 2:4. రాహాబు వేగులవారిని దాచింది. అంటే వారు ఒక వర్తమానాన్ని తెచ్చారు. గనుకవారు తెచ్చిన వర్తమానాన్ని దాచింది. ఆనాడు వారు తెచ్చిన వర్తమానమేంటి? మేము ఈ దేశానికొస్తాము, దీనిని కాల్చివేస్తాము అనేదే ఆ వర్తమానము. అది వారికి దుర్వార్త. ఆ దుర్వార్త విన్న ఆమె రాబోయే ఆ దుర్గతినుండి తప్పించుకొని అగ్ని బారినుండి రక్షించబడాలని వారిని కోరుకుంది. ఈనాడు ప్రభువు మనకు వినిపించేది దుర్వార్త – సువార్త.

పాపము వలన వచ్చు జీతము మరణము. అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తునందు నిత్యజీవము (రోమా 6:23). క్రీస్తునందు విశ్వాసముంచుట

ద్వారా రెండవ మరణమైన నరకాగ్ని నుండి తప్పించుకోవచ్చును అని చెప్పుచున్న దేవుని సువార్తను దేవుడు మనకు వినిపిస్తున్నాడు. ఇట్టి సువార్తను, వాక్యాన్ని నమ్ముతున్నామా? నమ్మినవారు దినదినము దేవుడు మనకిస్తున్న వాక్యాన్ని విని హృదయములో దాచుకుంటున్నామా? రాహాబు జనుపకట్టెలో వారిని దాచింది. దావీదు కీర్తన 119:11 లో, నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యమును ఉంచుకొనియున్నాను. అయినా ఈ వాక్యాన్ని దేనిద్వారా కాపాడుకోవాలి? 2తిమోతి 1:14 ప్రకారం, నీలో ఉన్న పరిశుద్ధాత్మ ద్వారా ఆ మంచి పదార్థమును (వాక్యమును) కాపాడుము అని పౌలు తిమోతికి వ్రాస్తున్నాడు. విత్తువాడు వాక్యమును విత్తుచుండగా కొన్ని త్రోవ ప్రక్కన, కొన్ని రాతినేలలో, మరికొన్ని ముళ్ళకంచెలో, మరికొన్ని మంచి నేలలో పడ్డాయి. మంచి నేలలో పడినవి ముప్పదంతలు, అరువదంతలు, నూరంతలుగా ఫలించాయి. త్రోవప్రక్కన పడినవాటిని ఆకాశ పక్షులు తినివేశాయి. ఇదే సాతాను, వాని దూతలు వచ్చి వినబడిన వాక్యాన్ని ఎత్తుకుపోవుటకు సాదృశ్యముగా ఉన్నది. కనుక సాతాను, వాడి దూతలు విత్తబడిన వాక్యాన్ని ఎత్తికొనిపోకుండునట్లు ఈ వాక్యమనే మంచి పదార్థమును (హిత వాక్యమును) మనలో వున్న పరిశుద్ధాత్మ ద్వారా కాపాడుకోవాలి. అలాగే విన్న వాక్యము మీద లూదియ లక్ష్యముంచింది. కనుకనే దేవుడామెతో పరిశుద్ధాత్మ ద్వారా మాట్లాడి ఆమె హృదయాన్ని తెరిచాడు. కనుక వినబడిన వర్తమానాన్ని మనమును లక్ష్యముంచి మనలో ఉన్న పరిశుద్ధాత్మ ద్వారా కాపాడుకోవాలి.

ఏ వస్తువునైనా మనము దాచాలి. అంటే అది విలువైనదిగా ఉంటేనే దాస్తాము. ఇనుప పెట్టెవంటి హృదయంలో కీర్తన 119:14లో వ్రాయబడియున్నట్లు సర్వసంపదలు దొరికినట్లు దేవుని వాక్యాన్ని దాచుకోవాలి. 119:72 లో ఉన్నట్టు వేలకొలది వెండి నాణెములు, బంగారు నాణెముల కంటే విలువైన వాక్యాన్ని హృదయంలో దాచాలి. 19:10 లో ఉన్నట్లు తేనెకంటెను, జుంటితేనె ధారలకంటెను విలువైన వాక్యాన్ని హృదయంలో దాచాలి. 19:11లో ఉన్నట్లు నీ వాక్యమును గైకొనుటవలన గొప్ప లాభము కలుగును అని వ్రాయబడింది. 19:11 లో ఉన్నట్లు నీ వాక్యము వలన నీ సేవకుడు హెచ్చరిక నొందును అని వ్రాయబడిన ప్రకారము ఇంతటి విలువైన వాక్యాన్ని మనము హృదయంలో దాచుకుంటున్నామా? దానిని కంఠస్థము చేయుట ద్వారా, మనము చేయుట ద్వారా హృదయములో దాచుకోవచ్చు. బైబిల్‌ను మన యవన కాలములో మోస్తే ముసలికాలంలో బైబిల్ మనల్ని మోస్తుంది. మనకు దేవుని వాక్యము ఎంత విలువైనదో కొన్ని వచనాల ద్వారా మనము తెలుసుకున్నాము. ఇపుడు ఆ దేవుని వాక్యము ద్వారా మనకున్న లాభాలేమిటో చూచుకుందాం:

**1) యాకోబు 1:21 –** దేవుని వాక్యము మన ఆత్మలను రక్షించుటకు శక్తి కలిగింది.

**2) కీర్తన 119:9 –** యౌవనస్థుల నడతను దేవుని వాక్యము శుద్ధిచేస్తుంది.

**3) కీర్తన 119:38 –** దేవుని వాక్యము మనుష్యులలో దేవుని మీద భయాన్ని పుట్టిస్తుంది.

**4) కీర్తన 119:105 –** దేవుని వాక్యము మన పాదములకు దీపమును, త్రోవకు వెలుగునిస్తుంది.

**5) ఎఫెసీ 5:27 –** వాక్యమనే ఉదకస్నానము ద్వారా సంఘస్థులమైన మనము పవిత్రపరచబడతాము.

**6) కీర్తన 119:50 –** బాధలో నెమ్మది కలిగించేది దేవుని వాక్యము.

**7) 2పేతురు 1:19 –** దేవుని వాక్యము చీకటిగల చోటున వెలుగునిస్తుంది.

**8) అపొ.కా. 19:20 –** దేవుని వాక్యము ప్రభావముతో ప్రబలి వ్యాపించే వాక్యము.

**9) హెబ్రీ 4:12 –** దేవుని వాక్యము సజీవము గలదై రెండంచులు గల ఖడ్గము వంటిది.

**10) 1యోహాను 2:14 –** దేవుని వాక్యము యౌవనస్థులను పడిపోకుడా బలవంతులుగా చేస్తుంది.

**11) ప్రకటన 19:13 –** చివరకు దేవునికి పెట్టబడిన పేరు కూడా 'దేవుని వాక్యమే.'

దేవుని వాక్యాన్ని కుమారుడు ఎంత ప్రేమించాడు. తండ్రి చిత్తాన్ని నెరవేర్చుటే ఆయనకు అన్నపానాలు అన్నాడు. తన నామము కంటే దేవుని వాక్యాన్నే ఆయన గొప్పచేశాడు. సిలువలో ప్రాణమర్పించే సమయంలో కూడా లేఖనము, అనగా దేవుని వాక్యము నెరవేరునట్లు 'దప్పిగొనుచున్నాను' అన్నాడు. చివరి వరకు వాక్యాన్నే గొప్పచేశాడు. ధర్మశాస్త్రాన్ని కొట్టివేయుటకు కాదు గానీ నెరవేర్చుటకే వచ్చాడు. మరి, మనము నేరవేర్చుచున్నామా?

ప్రియసోదరీ, యౌవనస్థులారా, మీ జీవితంలో దేవుని వాక్యాన్ని గొప్పచేస్తున్నారా? ప్రభువు గొప్పచేసిన ఈ వాక్యాన్ని నీవు కూడా గొప్పచేసి, గొప్ప లాభాలను కలుగచేసే దేవుని వాక్యాన్ని నీ హృదయంలో దాచుకోవడానికి ఇష్టపడుతున్నావా? అలాగైతే ఈ వాక్యము చెంత రోజుకు ఎన్నిగంటలు చదవాలని తీర్మానం చేసుకుంటున్నావు? దావీదు దివారాత్రులు ధ్యానిస్తానన్నాడు. వేకువనే వాక్యాన్ని చదవడానికి తన కన్నులు తెరుచుకుంటాడు. ప్రియ దేవుని బిడ్డా, దేవుని వాక్యాన్ని హృదయంలో నింపుకో, సమృద్ధిగా నింపుకో.

**III. రాజ సేవకులను తరిమిన రాహాబు:** యెహోషువ తన ఇంటిలో తాను దాచిపెట్టిన దైవసేవకులను చంపడానికి వచ్చిన రాజసేవకులతో, 'ఆ మనుష్యులు నా యొద్దకు వచ్చిన మాట నిజమే. కానీ వారెక్కడినుండి వచ్చిరో నేనెరుగను. చీకటిపడుతుండగా ఆ మనుష్యులు వెలుపలికి వెళ్ళారు. వారెక్కడికిపోయారో నేనెరుగను. మీరు వారిని శీఘ్రముగా తరిమితిరా, పట్టుకొందురు' అని రాజసేవకులనే శీఘ్రముగా తరిమినట్లు గమనిస్తున్నాం. రాజసేవకులు ఎవరికి సాదృశ్యం? ఈనాడు దైవజనులైన వారిని క్రీస్తు పక్షముగా సువార్త సేవ చేయుచున్న వారిని హతమార్చుటకు, వారిని జైళ్ళపాలు చేయడానికి, వారిమీద అన్యాయపు కేసులు బనాయించడానికి, క్రైస్తవ దేవాలయాలను

అగ్నిలో కాల్చడానికి, క్రైస్తవులను చంపడానికి ప్రయత్నిస్తున్న ఆత్మాహుతి దాడులు చేసే ఉగ్రవాదులు, తీవ్రవాదులు ఆయా దేశాల్లో చెలరేగి దేవుని దాసులను చంపడానికి పేట్రేగిపోతున్నారు. ఆ దినాల్లో అటువంటి వారిని రాహాబు శీఘ్రమే తరిమేసింది. ఈ దినాల్లో రాహాబులాగా మన శత్రువులను ఎలా తరుమగలము. యాకోబు 4:7 ప్రకారం, దేవునికి లోబడియుండుడి. అపవాదిని ఎదురించుడి. అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును అన్నమాట ప్రకారము మనమును ప్రభువుకు లోబడుతూ ప్రార్థన ద్వారా మన శత్రువులను తరిమివేయగలము.

పేతురు చెరసాలలో వేయబడినపుడు సంఘము అత్యాసక్తితో ప్రార్థన చేయుట ద్వారా పేతురు విడిపించబడుట మనము చదివాము గదా. ఇలా శత్రువును తరమడానికి ముందుగా దేవునికి లోబడి ఉండమని దేవుని వాక్యం యాకోబు 4:7 లో సెలవిస్తోంది. దేవునికి లోబడి ఉండడమంటే ఏ ఏ విషయాల్లో లోబడి ఉండాలో వాక్యంలో చూద్దామా–

**1) రోమా 10:16 –** అందరూ సువార్తకు లోబడలేదు.

**2) హెబ్రీ 13:17 –** సంఘపెద్దలకు లోబడి ఉండాలి.

**3) 1కొరింథీ 14:34 –** సంఘములలో స్త్రీలు మౌనముగా ఉండాలనే దేవుని ఆజ్ఞకు లోబడి ఉండాలి.

**4) ఎఫెసీ 5:25 –** స్త్రీలు అన్ని విషయములలో తమ భర్తలకు లోబడి ఉండాలి.

**5) లూకా 2:51 –** తలిదండ్రులకు లోబడి ఉండాలి.

**6) మత్తయి 8:9 –** అధికారులకు లోబడి ఉండాలి.

**7) రోమా 6:12 –** శరీర దురాశలకు లోబడకూడదు.

**8) 1కొరింథీ 6:12 –** దేనిచేతను లోపరచబడకూడదు.

పై వాక్యాల ప్రకారం ముందు దేవుడు చెప్పిన వాక్యమునకు లోబడి ఉంటే దేవునికి లోబడినట్లే. ఇలా దేవునికి లోబడుతూ అపవాదిని ఎదిరించాలి. సాతానును ప్రార్థనలో ఎదిరించాలి అనుకున్నాము. అలా ప్రార్థనలో ఎదిరించడం శీఘ్రంగా చేయాలి అని రాహాబు అంటోంది. ప్రార్థన శీఘ్రముగానే చేయాలి. అబీగయీలు తన సంతానాన్ని దావీదు కత్తినుండి విడిపించుటకు త్వరపడి దావీదును ఎదుర్కొంది. 1సమూ 25:34 లో, నీవు నన్ను త్వరపడి ఎదుర్కొనకపోతే తెల్లవారే లోపల నాబాలునకు మగవాడు ఒకడును విడువబడడన్న మాట నిశ్చయము అని దావీదు అబీగయీలుతో చెప్పెను. అందుకే దావీదు తెల్లవారకమునుపే నేను మొరపెట్టితిని అని 119:147 లో చెబుతున్నాడు.

ఈలాగు రాహాబు దేవుని వాక్యానికి లోబడి సువార్తకు లోబడి దేవుడు ఇశ్రాయేలీయులకు కనాను దేశాన్ని ఇస్తున్నాడని నమ్మి, అపవాదికి సూచనగా ఉన్న వేగులవారిని తరిమేసేవాళ్ళను ఈమెయే శీఘ్రముగా తరిమింది. అలాగే ఈనాడు కుటుంబాల్లోనూ, సంఘాల్లోనూ తిష్టవేసిన సాతానును శీఘ్రమే తరిమివెయ్యాలి.

**IV. యెహోవాను దేవుడుగా నమ్మి తీర్మానించుకొన్న రాహాబు:** యెహో 2:8-11. ఆ వేగులవారు పండుకొనక మునుపు ఆమె వారున్న మిద్దెమీదికెక్కి, 'మీరు ఐగుప్తులో నుండి వచ్చినపుడు మీ యెదుట యెహోవా ఎఱ్ఱసముద్రమును ఏలాగు ఆరిపోచేసెనో, యొర్దాను తీరముననున్న అమోరీయుల ఇద్దరు రాజులైన సీహోనుకును, ఓగుకును మీరేమి చేసితిరో, వారిని ఏలాగు నిర్మూలము చేసితిరో ఆ సంగతులను మేము వినినపుడు, మా గుండెలు కరిగిపోయెను. మీ దేవుడైన యెహోవా పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడే అని ఆ దేవుని నమ్ముకొని, తీర్మానించుకున్నది. రాహాబుకు యెహోవా దేవుడు ఏమియు మేలు చేయలేదు. కాని ఇశ్రాయేలీయులకు ఒక దేశమిస్తానన్నాడు. తన దేవుళ్లు ఆమెకేమియు ఇవ్వలేని దేవుళ్ళని గ్రహించింది. యెహోవా దేవుడు ఎఱ్ఱసముద్రమును ఎలా ఆరిపోచేసి, అమోరీయుల ఇద్దరు రాజులను ఎలాగు నిర్మూలము చేసి ఆశ్చర్యకార్యాలు చేసిన దేవుడని ఆ కార్యాలను గూర్చి వినింది, చూడలేదు. కేవలము విన్నంతమాత్రమునే ఆమె గుండె కరిగిపోయిందట. ఐగుప్తులో దేవుని 10 తెగుళ్ళను కళ్ళతో చూచిన ఫరోరాజు గుండె కరగలేదు. కానీ మరింత కఠినమయ్యింది.

ప్రియ సోదరీ, నీవు ఈనాడు ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో చూపిన ఆయన ప్రేమను, ఆయన మనకొరకు పొందిన వేదనను, ఆయన చేసిన త్యాగమును, ఆయన పొందిన అన్యాయపు తీర్పును, ఆయన మోసిన నీ యొక్క, నా యొక్క పాపభారాన్ని, ఆయన కార్చిన రక్తాన్ని, ఆయన అనుభవించిన దాహాన్ని, ఆయన అనుభవించిన ప్రయాసను, మిక్కిలి బాధను తెలిసికొనిన నీవు కూడా నీ మనసును కఠినపరచు కొంటున్నావా? నీ హృదయాన్ని ప్రభువుకిచ్చుట లేదా? రాహాబు దేవుడు ఏమీ ఇచ్చినట్లు చెప్పుటలేదు వాక్యము. ఇశ్రాయేలీయులకు ఆ దేశాన్నిస్తున్నాడని ఆమె వినింది. ఆమె వేగులవారికి ఉపకారం చేస్తే వారు ఈమెకు ఉపకారం చేస్తారని ఆ దేశంలో వారితో ఈమె కూడా వుండవచ్చని ఆమె కోరుకుంది. యెహోవా దేవుని యెడల ఒక తీర్మానం చేసుకుంది. మీ దేవుడు పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడని తీర్మానించి చెప్పింది. అవును, ఆయన ఆకాశ సంబంధి, భూ సంబంధి కాదు. ఎజ్రా 1:2; నెహెమ్యా 2:4; ఎజ్రా 5:11; ఎజ్రా 7:21; నెహెమ్యా 1:4; నెహెమ్యా 9:28లలో భూమ్యాకాశముల దేవుడని వ్రాయబడింది. ఆలాగున రాహాబును పాత నిబంధన భక్తులును, నేడును అనేకులు ఒప్పుకుంటున్నట్లు పైన ఆకాశమందును క్రింద భూమియందును యేసు నీ ప్రభువని ఒప్పుకుంటున్నావా? ఆయన ఆకాశమందు, భూమియందు మాత్రమే కాదు, ద్వితీ 10:17 ప్రకారము, యెహోవా పరమ దేవుడును, పరమ ప్రభువునై యున్నాడు. అట్టి ప్రభువు విషయమై నీ తీర్మానమేమిటి?

ఈ సందర్భములో యెహోవా దేవుని యెడల యాకోబు తీర్మానమేమిటో కాసేపు ఆలోచిద్దాము. ఆది 28:20 లలో 'నేను నా తండ్రి యింటికి క్షేమముగా వచ్చునట్లు దేవుడు నాకు తోడైయుండి నేను వెళ్ళు ఈ మార్గములో నన్ను కాపాడి, తినుటకు ఆహారమును, ధరించుకొనుటకు వస్త్రములను నాకు దయచేసిన యెడల యెహోవా నాకు దేవుడైయుండును. మరియు స్తంభముగా నేను నిలిపిన ఈ రాయి దేవుని

మందిరమగును. మరియు నీవు నాకిచ్చు యావత్తులో పదియవ వంతు నిశ్చయముగా నీకు చెల్లింతునని దేవునితో మ్రొక్కుబడి చేసుకున్నాడు. వస్త్రము, ఆహారము మార్గములో తోడిస్తే యాకోబు దేవునిగా నమ్మి, మందిరం కట్టి, పదియవ వంతు ఇస్తాడట. రాహాబుకు దేవుడు ఏమీ ఇవ్వకపోయినా ఆమె ఆయనను దేవునిగా మ్రొక్కుకుని నమ్ముతోంది.

అలాగే దేవుడు రూతుకు ఏమైనా లాభము కలుగజేసి ఉంటేనే రక్షింపబడలేదు. కానీ తన అత్త కుటుంబీకులు దేవునికి విరుద్ధముగా పాపము చేసినందున దేవుడు న్యాయంగా వారికి రావలసిన తీర్పును తీర్చుటవలన ఆ ఇంటిలో మూడు మరణాలు. మూడు గోరీలు. రిక్తులైపోవడం వంటి నష్టాలు, కలిగిననూ, మీ దేవుడే నా దేవుడు, మీ జనమే నా జనము . . . అని తన అత్త దేవుణ్ణి తన దేవునిగా భావించి, తన ఇంటి, కుల, గృహదేవతలను విసర్జించింది. తమకు దేవుణ్ణి నమ్మడంలో రాహాబుకు, రూతుకు స్వంత ఆసక్తి ఏమీ లేదు. ఆలాగున ఈ మాటలు చదువుతున్న మనమును, రాహాబువలె ఆయన పరలోకమిచ్చు దేవుడని, రూతువలె నీతిన్యాయములు జరిగించే దేవుడని యెహోషువ వలె దేవుడిలో యెహోవాయే దేవుడని నమ్మాలి. ప్రియ సోదరీ, యెహోవా దేవుడు ఎవరని నీవు విశ్వసిస్తున్నావు? ఆయన్ను గురించి నీ తీర్మానం ఏమిటి?

రాహాబుది ఓపెన్ కన్‌ఫెషన్. వేగులవారి ఎదుట బహిరంగ సాక్ష్యమిస్తోంది. రోమా 10:9 లో 'యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షించబడుదువని' వాక్యము చెప్పుచుండగా ప్రియ సోదరీ, నీవెన్నడైనా ఇలా బహిరంగముగా సాక్ష్యమిచ్చావా? వాక్యపరిచర్య ముగించిన తరువాత రక్షింపబడవలసినవారు తీర్మానము చేసికొనుటకు దయచేసి ముందుకు రండి అని సంఘపెద్దలు ప్రకటన చేస్తే అలా ముందుకు రావడానికి ఎంతకాలంగా సిగ్గుపడుతున్నావేమో!

బహిరంగంగా సినిమా హాలుకు వెళ్ళడానికి, పాపము చేయడానికి, కొట్లాడు కోవడానికి సిగ్గుపడుట లేదు కానీ, రక్షణ అనే పవిత్ర కార్యములో పాలుపొందడానికి పరిశుద్ధురాలిగా తీర్చబడుటకు సిగ్గుపడాల్సినదేముంది? ఇంతకు మునుపు వేశ్యగా పేరుగాంచిన సమరయ స్త్రీ, నేను చేసినవన్నియు (వ్యభిచార క్రియలన్నియు) నాతో చెప్పినవాడు ఈయన, మెస్సీయ కాదా? అని బహిరంగముగా రక్షణను గూర్చిన ఆమె సాక్ష్యము బహిరంగముగా వచ్చుటకు సిగ్గుపడలేదు కదా. నీ కొరకు సిలువలో దిగంబరిగా వ్రేలాడుటకు ప్రభువు సిగ్గుపడలేదు కదా! 1తిమోతి 6:12 లో, తిమోతి అనేక సాక్షుల ఎదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకున్నాడని పౌలు వ్రాయలేదా? అలాగే 1తిమోతి 6:13లో, సమస్తమునకు జీవాధారకుడైన దేవుని ఎదుటను, పొంతి పిలాతు నొద్ద ధైర్యముగా క్రీస్తుయేసును ఒప్పుకొనలేదా? మరి నీవునూ నీ రక్షణ విషయమై బహిరంగముగా యేసు నీ ప్రభువని ఒప్పుకొని రక్షణ తీర్మానము ప్రభువుతో చేయాలని ప్రభువు ఆత్మ నిన్ను ప్రేరేపించునుగాక!

**V. వేగులవారికి ఉపకారము చేసిన రాహాబు:** (యెహో 2:12) యెహోవా దేవుడు పైన ఆకాశమందును, క్రింద భూమియందును దేవుడే అని తీర్మానించిన తరువాత నేను మీకు ఉపకారము చేసితిని అని వేగులవారితో అంటోంది. ఆమె వారికి ఏ ఉపకారము చేసింది? వారిని పట్టుకోడానికి రాజు తన సైనికులను పంపగా, రాహాబు వారిని తన ఇంటి మిద్దెమీది' 'జనుపనార కట్టె'లో వారిని దాచి, వారిని రాజు చంపకుండునట్లు బ్రతికించి ఉపకారము చేసింది. మన ప్రభువు ఉపకారములు చేసే దేవుడు కనుక మనమును ఒకరికొకరు ఉపకారములు చేయబద్ధులమై ఉన్నాము.

1. యెహోవా అందరికీ ఉపకారి (కీర్తన 145:9). అందరికీ అంటే ఎవరెవరికి?
2. లూకా 6:35 - ఆయన నీతిమంతుల యెడలను దుష్టుల యెడలను ఉపకారి.
3. ఎట్టివారమై యుండగా ఉపకారాలు చేశాడు? (ఆది 32:10) అపాత్రులమై యుండగా సమస్త ఉపకారములను చేశాడు.
4. ఆయన ఉపకారములు చేయుట మానలేదు (రూతు 2:20).
5. అందుకే ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకూడదు (కీర్తన 103:2).

6. సమస్త ఉపకారములను మనకు చేయుచున్న దేవుడు మనల్ని ఏమి చేయమన్నాడు? హెబ్రీ 13:16 లో ఉపకారమును, ధర్మమును చేయ మరచిపోకుడి అన్నాడు. దుష్టుల యెడలను, అందరి యెడలను ఉపకారమును ధర్మమును మరువకుండా చేయాలట. అట్టి యాగములు దేవునికిష్టమట. ఆ ఉపకారములు చేస్తే దేవునికి ఇష్టమైన యాగములు చేసినట్టేనట. అట్టి ఉపకారాలు మన జీవితంలో ఉన్నాయా? అసలు లేవా? లేక చేస్తూ, చేస్తూ మానేశామా? హెబ్రీ 6:10 లో మీరు పరిశుద్ధులకు ఉపచారము చేయుచూ మానకుండా ఇంకనూ ఉపచారము చేయుచుండుట చేత తన నామమున చూపిన ప్రేమను మరచుటకు ఆయన అన్యాయస్థుడు కాదట.

7. అట్టి ఉపకారాలను మనము చేసినందులకు ఆయన మనకేమి ఇస్తాడు? సామెతలు 19:17 - ఉపకారమునకు దేవుడు ప్రత్యుపకారము చేస్తాడట. ఆయన ప్రత్యుపకారము గొప్పదిగా ఉంటుంది. ఉదాహరణకు, 10 ఒంటెలకు, ఎలియాజరుకు రిబ్కా దాహము తీర్చినందుకు దేవుడామెకు 10 తులాల ఎత్తుగల రెండు బంగారు కడియాలు + అరతులము ఎత్తుగల ఒక ముక్కు కమ్మి మొత్తము పదిన్నర తులాల బంగారము ఇవ్వలేదా? ఖరీదు లేని నీళ్ళకు ఈనాటి లెక్కల్లో తులము 30 వేలు అనుకుంటే పదిన్నర తులాలకు $20 \times 30,000 = 6,00,000 +$ అరతులానికి $15,000 =$ రు. 6,15,000 ఎలియాజరు రిబ్కాకు ఇచ్చాడన్నమాట. ఎలియాజరు అనగా ఒక మనిషి ఇచ్చినదే అంత విలువైనదేతే, దేవుడుగా తన శోధింపశక్యము కాని ఐశ్వర్యములో ఇంకెంత ఎక్కువగా ప్రత్యుపకారముగా యిస్తాడో తెలియదు. అందుకే దేవుడు ఉపకారమును ధర్మమును చేయుట మరువవద్దన్నాడు. గనుక ప్రియ సోదరీ, ఇంతవరకూ ఎన్నడూ ఉపకారము చేయకపోతే ఈరోజు నుండైనా ఉపకారము చేయుటకు ప్రారంభిస్తావా?

అలాగైతే మనమేమేమి ఉపకారాలు చేయాలో వాక్యములో నేర్చుకుందామా? మత్తయి 25:44 లో, ఎడమవైపున ఉన్నవారు, ప్రభువా, మేమెప్పుడు నీవు ఆకలిగొనియుండుటయైనను, దప్పిగొనియుండుటయైనను, పరదేశివైయుండుటయైను, దిగంబరివై యుండుటయైనను, రోగివై యుండుటనైనను, చెరసాలలో ఉండుటయైనను చూచి నీకు ఉపచారము చేసితిమని ఆయనను అడుగగా, వారేమేమి ఉపచారాలు చేయాలో 35వ వచనములో చెప్పాడు, 1) నేను ఆకలిగొని ఉంటే భోజన ఉపకారము, 2) నేను దప్పిగొని ఉంటే దాహము ఇచ్చే ఉపకారము, 3) పరదేశినై ఉంటిని అనగా చేర్చుకునే ఉపకారము, 4) దిగంబరినై యుంటిని అంటే వస్త్రాలిచ్చే ఉపకారము, 5) రోగినైయుంటిని అంటే ఆసుపత్రిని, లేక ఇళ్ళను దర్శించి చేసే ఉపకారము, 6) చెరసాలలో ఉంటిని అంటే జైళ్ళను అనగా చెరసాలను దర్శించే ఉపచారమును చేయమని ప్రభువు చెప్పుచున్నాడు.

ప్రియ సోదరీ, ఈ పరిచర్యలలో పాల్గొని మిక్కిలి అల్పులైన సహోదరులకు ఉపచారము చేస్తే అది ప్రభువుకు చేసినట్టేనట. బీదలను కనికరిస్తే యెహోవాకు అప్పిచ్చినట్లుట. సామెతలు 19:17 లో మనము ప్రభువుకు అప్పిచ్చేవాళ్ళమా? కాదు గానీ, బీదలకిస్తే, మిక్కిలి అల్పులకిస్తే ఆయనకిచ్చినట్లే, కనుక రాహాబు నేను మీకు ఉపచారము చేసితిని అని చెప్పినట్లు మనమునూ ప్రభువు పిల్లలైన ముఖ్యముగా విశ్వాస గృహానికి మేలు చేయాలని ప్రభువు గలతీ 6:9లో చదువుతాం.

**VI. తన కుటుంబాన్ని చావకుండునట్లుగా రక్షించుకున్న రాహాబు:** వేగులవారు తాము మొదటిసారి రాహాబు ఇంటికి వచ్చినపుడు ఆమె మరణము నుండి రక్షించబడునట్లు శుభవార్త, రక్షణవార్త చెప్పారు. ఆమె వారు చెప్పిన వర్తమానాన్ని విని మరణము నుండి తప్పించుకున్న తరువాత తన కుటుంబ సభ్యుల రక్షణ విషయమై ఆలోచిస్తోంది. ఆమె పొందిన రక్షణ తన ఇంటివారు కూడా పొందాలని ఆశించింది. ప్రియసోదరీ, నీవైతే రక్షించబడ్డావేమో, మరి నీ కుటుంబం సంగతేమిటి? మరి, వారిని గూర్చి చింత, దిగులు ఉందా? పౌలు రోమా 9:3 లో దేహ సంబంధులైన నా సహోదరుల కొరకు నేను క్రీస్తు నుండి వేరై శాపగ్రస్తుడనై ఉండగోరుదును అంటున్నాడు. యిర్మీయా 9:1లో, నా జనులలో హతమైన వారిని గూర్చి నేను దివారాత్రములు కన్నీరు విడుచునట్లు నా తల జలమయమును, నా కన్నులను కన్నీళ్ళ ఊటగాను ఉండును గాక! అని అంటున్నాడు. అలాగే మోషే నిర్గ 32:31-32 లో, ఇశ్రాయేలీయుల బంగారు దూడను దేవతగా చేసికొని పాపము చేసినపుడు వారిలో 3 వేలమంది ఆ పాపాన్నిబట్టి చనిపోయినపుడు మోషే యెహోవా యొద్దకు తిరిగి వెళ్ళి, "అయ్యో, ఈ ప్రజల పాపమును ఒకవేళ పరిహరించితివా, లేనియెడల నీవు వ్రాసిన నీ గ్రంథములోనుండి నా పేరు తుడిచివేయుమని బ్రతిమాలుతున్నాడు.

ప్రియసోదరీ, మనము కూడా మన ఇంటివారి కొరకు, బంధువుల రక్షణ కొరకు కన్నీటితో, భారంతో ప్రార్థించాలి. పౌలు వారిని రక్షణలోనికి నడిపించే భారము

కలిగుండాలి. ఆలాగు రాహాబు తన కుటుంబీకులను రక్షించమని కోరుతూ కోరడం మాత్రమే కాక, యెహోవా నామము తోడని ప్రమాణము కూడ చేయమని వేగులవారిని కోరింది. అంటే ఆమెకు ఉన్న పట్టుదల ఎంతటిదో మనకర్థమౌతున్నది. వారి దేవతల పేర్లు ఎత్తడం లేదు. కానీ యెహోవా దేవుని పేరే ఎత్తుతోంది. అవును, రక్షణ యెహోవా యొద్దనే దొరుకుతుందని ఆమె పూర్తిగా నమ్ముతోంది. అవును, రక్షణ యెహోవాదే (కీర్తన 3:8).

**VII. తొగరు దారమును కిటికీకి కట్టిన రాహాబు:** వేగులవారు వెళ్ళగానే వారిని తొగరు దారమును అనగా ఎఱ్ఱని దారమును ఆమె వారిని దింపిన కిటికీకి కట్టింది. ఈ ఎఱ్ఱని దారము ప్రభువు మన కొరకు సిలువలో చిందించిన ఎర్రని రక్తమునకు గుర్తుగా వుంది. ఇశ్రాయేలీయులు కూడా పస్కా బలిపశువు యొక్క రక్తాన్ని తమ ద్వారబంధము యొక్క నిలువుకమ్మికి, అడ్డు కమ్మికి పూసుకోవాలి. ఆ రక్తమును నేను చూచినపుడు మిమ్మును సంహరింపక దాటిపోవుదునని ప్రభువు చెప్పినట్లు, రెండవసారి వేగులవారు యెరికోను కాల్చివేయుటకు వచ్చినపుడు, ఆ ఎర్రని దారమును కిటికీకి కట్టుకొనిన ఆ రాహాబు ఇంటివారినందరినీ వేగులవారు రక్షిస్తారని చెప్పినపుడు ఆమె నమ్మి ఆ ఎర్రని దారాన్ని ఆ కిటికీకి కట్టింది. ఈనాడు నరకాగ్ని నుండి రక్షించబడాలనుకునే ప్రతి ఒక్కరు యేసు రక్తమునందు విశ్వసించినచో ఆ రక్తపు గురుతును చూచి ప్రభువు వారిని రక్షిస్తాడు. ప్రియ సోదరీ, నీవు యేసు రక్తాన్ని ఆశ్రయించావా? నీ హృదయముపై ప్రభువు ఆయన రక్తపు గురుతును చూడగలడా?

**VIII. ఇశ్రాయేలీయుల పాళెము వెలుపట నివసించిన రాహాబు:** (యెహోషువ 6:23). వేగులవారు రెండవసారి యెరికో వచ్చినపుడు వేగులవారు రాహాబును, ఆమె ఇంటివారిని వెలుపలికి తోడుకొని వచ్చి ఇశ్రాయేలీయుల పాళెము వెలుపట నివసింపజేశారు. రాహాబు, ఆమె ఇంటివారును అన్యులు గనుక ఇశ్రాయేలీయులు వారిని పాళెము వెలుపల ఉంచారు. ఎఫెసీ 2:11-13 లలో వ్రాయబడినట్లు, రాహాబు, ఆమె ఇంటివారు ఈ విషయములో అన్యజనులుగా, సున్నతి లేనివారుగా, ఇశ్రాయేలీయులలో సహపౌరులుగా కాక, పరదేశులుగా, వాగ్దాన నిబంధనలు లేని పరజనముగా, నిరీక్షణ లేనివారుగా, లోకమందు దేవుడు లేనివారుగా ఇంతవరకూ ఉంటూ వచ్చారు. గనుక ఇశ్రాయేలీయులు వారిని పాళెము వెలుపల ఉంచారు. ఒకప్పుడు ప్రభువుని నమ్మకముందు అన్యజనులమైన మనము కూడా పాళెము వెలుపల ఉండినవారమే. మునుపు మనము దూరస్థులమే. ఈ సంగతి మనము కూడా జ్ఞాపకము చేసికొనవలెనని ఎఫెసీ 3:12 లో మనము చదువుతున్నాము. మన మునుపటి దయనీయ పరిస్థితి ఎప్పుడూ మనము మరువరాదు.

**IX. శల్మానును వివాహమాడిన రాహాబు:** మత్తయి 1:5 ప్రకారము, రాహాబు శల్మానునుండి బోయజును కనెను అని వ్రాయబడిన ప్రకారము రాహాము శల్మానును పెండ్లి చేసుకున్నట్లు మనము గ్రహిస్తున్నాము. ఈ శల్మాను ఎవరనగా యెరికో వేగు చూడడానికి యెహోషువ పంపిన ఇద్దరిలో ఇతడొకడని పండితులు చెబుతున్నారు.

యెహోషువ దేవుని ప్రేరణనుబట్టి రాహాబును పెళ్ళి చేసుకొనుమని శల్మానుతో చెప్పియుండవచ్చునని మనము తలంచగలము. శల్మాను అను పేరుకు 'సమాధానము' అని అర్థము. శల్మాను సమాధానమునకు కర్తయైన మన యేసుక్రీస్తుకు సాదృశ్యముగా ఉన్నాడు. సమాధానకర్తయైన యేసుక్రీస్తుకు సాదృశ్యముగా ఉన్న శల్మాను, పాపచరిత్ర కలిగిన వేశ్య అనిపించుకున్న రాహాబును పెళ్ళి చేసుకోవడానికి ముందుకొచ్చి తన త్యాగాన్ని, ప్రేమను చూపాడు. అలాగే పాపులము, అపరాధులము, అయోగ్యులము, దేవుని దృష్టిలో చచ్చినవారమై, ఏ మంచి లేనివారమై యుండగా, అథములమును, అయోగ్యులమైన మనలను ప్రేమించి తన సిలువ రక్తముతో మన పాపముల నుండి మనలను కడిగి పరిశుద్ధపరచి తన పెండ్లి భార్యగా మనలను చేసికొని తన ఉదారబుద్ధిని, త్యాగనిరతిని చూపి మన గత చరిత్రను మరచి ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొననని చెప్పి, తానున్న చోటికి మనలను చేర్చాలని తిరిగి రెండవసారి ఈ లోకానికి రానైయున్న మన పరమ శల్మానునైన మన ప్రభువు ప్రేమ ఏమని పొగిడితే మన ఋణము ఎలా తీరుతుంది. ఆయన ప్రేమను ఇలా స్మరించుకోవాలే గానీ, తీర్చుకోలేము. అట్టి ప్రేమామయునికే మన జీవితాలు అర్పిద్దాము.

**X. ఇశ్రాయేలీయుల మధ్య నివసించుచున్న రాహాబు:** (యెహోషువ 6:25). పాళెము వెలుపల అన్యజనురాలిగా ఉండిన రాహాబు శల్మానును వివాహమాడుటచే ఇశ్రాయేలీయురాలుగా పరిగణించబడింది. ఇశ్రాయేలీయుల మధ్య నివసించినదని రాహాబు విషయమై వ్రాయబడుట చూచి మనమందరము ఎంతో సంతోషించదగిన విషయము. ఆమె ఇశ్రాయేలీయురాలుగా, సమాజములో పౌరసత్వము పొందినదాని వలె కనబడుచున్నది. అలాగే క్రీస్తుయేసును బట్టి మన పౌరస్థితి కూడా పరలోకములో ఉన్నది (ఫిలిప్పీ 3:20). ఎఫెసీ 2:13 లో వ్రాయబడిన రీతిగా మునుపు దూరస్థులమైన మనము ఇపుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులమై యున్నాము. ఆయన మన పరలోకపు 'శల్మాను'గా మన 'సమాధనమై' ఉండి ఇశ్రాయేలీయులకును, అన్యుజనులమైన మనకును ఉండిన ద్వేషమును అనగా విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమునందు కొట్టివేయుట చేత మన ఇరువురి మధ్య ఉన్న గోడను పడగొట్టి మన ఉభయులను ఏకము చేశాడు. కాబట్టి మనమికమీదట పరదేశులము, పురజనులమునై యుండక రాహాబు, ఇశ్రాయేలీయుల మధ్య నివసించినట్టు మనమును పరిశుద్ధులతో ఏక పట్టణస్థులమును, దేవుని ఇంటివారమునై యుంటున్నాము. రాహాబు ఇహలోక ఇశ్రాయేలు పరిశుద్ధుల మధ్య నివసించింది. మనము పరలోక పరిశుద్ధులతో పరలోకంలో జీవించే ఆధిక్యతను పొందుకునే కృపను ఆ ప్రేమామయుడైన మన ప్రభువు ద్వారానే పొందుకున్నాము. సమస్త ఘనత, మహిమ, ప్రభావమును ప్రభువునకే చెల్లునుగాక. ఈలాగున రాహాబు అనే వేశ్య పావనురాలిగా ప్రభువు ద్వారా తీర్చబడింది. ఇందుకై ప్రభువుకు స్తోత్రములు. ఆమె నేటి తరమున జీవితానికి పోలికగా ఉన్నది.

# 6

# ఇశ్రాయేలీయులకు తల్లి - దెబోరా

ఇశ్రాయేలీయులకు దేవుడు అనుగ్రహించిన న్యాయాధిపతులలో దెబోరా వరుసలో నాలుగవ న్యాయాధిపతి. స్త్రీలలో మొట్టమొదటి మరియు చిట్టచివరి న్యాయాధిపతి ఆమెయే. ఈమెకు ఈమే సాటిగా లేఖనాలలో కనిపిస్తుంది. ఈ దెబోరా న్యాయాధిపతిగా రాకమునుపు దేశములోని పరిస్థితులు ముందు ఎలా ఉన్నాయో కొంత ఆలోచిద్దాము. న్యాయాధి 4:1 లో ఏహూదు మరణమైన తరువాత ఇశ్రాయేలీయులు మరల యెహోవా దృష్టికి దోషులైనట్లు చదువుచున్నాము. వారు ఏ రకమైన దోషము చేశారో న్యాయాధి 5:3ను చదివితే తెలుస్తుంది. 5:8 లో ఇశ్రాయేలీయులు క్రొత్త దేవతలను కోరుకొనగా యుద్ధము ద్వారముల యొద్దకు వచ్చెను అని వ్రాయబడినది. యెహోవా వారికి పాత దేవుడయ్యాడు. క్రొత్త దేవతలనే అనగా అన్యజనుల దేవతలను వారు పూజించారు. ఈనాటి క్రైస్తవులు కూడా యేసుక్రీస్తు దేవుణ్ణి విడిచిపెట్టి సెక్స్, సినిమా, సీరియల్స్, సిగరెట్స్, సెల్‌ఫోన్, బాయ్‌ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్స్, డ్రగ్స్, బ్యాడ్ హ్యాబిట్స్, టి.వి., నిద్ర, తిండిబోతుతనం, త్రాగుబోతుతనం, మత్తుమందులు అనే క్రొత్త దేవతలను, దోషములను పుట్టించి అభ్యంతరములను తన హృదయములలోనే ఉంచుకొని దోషులగుచున్నారు. తద్వారా యుద్ధములు, సమస్యలు, రోగాలు, చిక్కులు, నెమ్మదిలేనితనాలు మానవుల హృదయ ద్వారాల యొద్దకు వస్తున్నాయి.

ఈసారి ఇశ్రాయేలీయుల మీదికి యుద్ధానికి కనాను రాజైన యాబీను, అతని సైన్యాధిపతియైన సీసెరాను తన సర్వసేనతో పంపించాడు. ఇశ్రాయేలీయులను 20 సంవత్సరాలు కఠినమైన బాధపెట్టాడు. యెహోవా దేవుడు విల్లును, బల్లెమును తెగనరకువాడు. భూదిగంతముల వరకు యుద్ధమును మాన్పువాడు (కీర్తన 46:9). ఒకవేళ శత్రువు యుద్ధానికి వస్తే మన పక్షాన మన ప్రభువు యుద్ధము చేయువాడు. యుద్ధము యెహోవాదే. ఆయన యుద్ధశూరుడు, బలశూరుడు. మన యుద్ధములను జరిగించుటకు యెహోవా మనకు తోడుగా (2దిన 32:8) ఉండే దేవుడు. యుద్ధ దినమున మన తలను కాచే దేవుడు (కీర్తన 140:7). యెషయా 41:12 లో మనతో యుద్ధము చేయువాడు మాయమైపోతాడు అని ఉన్నది.

యుద్ధాలను మాన్పువాడు యెహోవా, మాన్పుతున్నాడు అంటే యుద్ధాలు తెచ్చుకునే వారెవరు? యాకోబు 4:1 ప్రకారము, 'మీలో యుద్ధములు పోరాటములు దేనినుండి కలుగును? మీ అవయవములలో నుండి పోరాడు మీ భోగేచ్ఛల బట్టియే కదా మీరు పోట్లాడుదురు. యుద్ధములు చేయుదురు గానీ మీకేమియు దొరకదు' అని ప్రభువు చెప్పుచున్నాడు. కనుక మనము లోకరీతిగా యుద్ధమలు చేసినప్పటికీ లాభము

లేదు. కనుక 2కొరింథీ 10:4 ప్రకారము మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కావు కానీ దేవుని యెదుట దుర్గములను పడద్రోయచాలినంత బలము గలవై యున్నవి.' 2కొరింథీ 6:6-7 లలో వ్రాయబడినట్లు, 1) పవిత్రతతోను, 2) జ్ఞానముతోను, 3) దీర్ఘశాంతముతోను, 4) దయతోను, 5) పరిశుద్ధాత్మ వలనను, 6) నిష్కపటమైన ప్రేమలోను, 7) సత్యవాక్యము చెప్పుట వలనను, 8) దేవుని బలము వలనను కుడి యెడమల ఈ నీతి ఆయుధములను కలిగియుండాలని వాక్యము చెబుతున్నది. కనుకనే ఇశ్రాయేలీయులు యాబీను దాసత్వము కఠినమైన పరిస్థితిలో ఈ నీతి ఆయుధమైన ప్రార్థన చేశారని, దేవునికి మొరపెట్టారని మనము న్యాయాధి 4:3 లో చూస్తున్నాము. ఆలాగున మొరపెట్టినపుడు వారు జవాబును చూశారు.

యిర్మీయా 29:12, మీరు నాకు మొరపెట్టుదురేమి, మీరు నాకు ప్రార్థన చేయుచూ వత్తురేని నేను మీ మనవి ఆలకించెదను. మీరు నన్ను వెదకిన యెడల పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు. నన్ను నేను మీకు కనపరచుకొందును' అనే మాట ప్రకారం వారి ప్రార్థనా ఫలితంగానే దెబోరాను, బారాకును, యాయేలును దేవుడు ఇశ్రాయేలీయుల మధ్య లేపునట్లుగా చూస్తున్నాము. న్యాయాధి 4:4 లో, ఆ కాలమున, అంటే ఇశ్రాయేలీయులు ప్రార్థిస్తున్న కాలమున పై ముగ్గురిని దేవుడు లేపుకుని ఇశ్రాయేలీయులను బానిసత్వము నుండి విడిపించాడు.

**I. లప్పీదోతు భార్యయైన దెబోరా:** న్యాయాధి 4:4 లో దెబోరా లప్పీదోతు భార్య అని గమనిస్తున్నాము. ఆమె ఒక సన్యాసిని కాదు, ఒక సంసారిగా చూస్తున్నాము. భర్త ఉన్నాడు అంటే పిల్లలు కలిగే ఉండవచ్చు. ఇంటిపనులు చూసుకుని పిల్లలను చూసుకుని సరళ వృక్షము క్రింద కూర్చుని ఇశ్రాయేలీయులకు తీర్పు తీర్చేది. ఆ సరళవృక్షానికి 'దెబోరా సరళవృక్షము' అను పేరు కలిగింది. సరళవృక్షము ఎంత స్ట్రెయిట్‌గా (నిలువుగా) ఉండేదో ఆమె జీవితం కూడా అంతే తిన్నగా ఉన్నదని 4,5 అధ్యాయాల్లో మనం గమనించవచ్చును. అందరికీ తీర్పు తీర్చాలంటే ధర్మశాస్త్రమును ఎంత చక్కగా అధ్యయనం చేసి వాక్యజ్ఞానాన్ని సముపార్జించి యుండినదో మనకు అర్థమౌతోంది. లప్పీదోతు అనగా 'దివిటీ' అని అర్థము. దివిటీని వెలుగు కొరకు వాడతారు. వెలుగు అనగా 'నీ వాక్యము నా పాదములకు దీపము, నా త్రోవకు వెలుగునై యున్నదను (కీర్తన 119:105) మాట ప్రకారము దివిటీ అనే మాట వాక్యానికే గుర్తు. దెబోరా అనగా 'తేనెటీగ' అని అర్థము. తేనెటీగ ద్వారానే తేనె వస్తుంది. తేనె కూడా, నీ వాక్యమ తేనె కంటెను జుంటితేనె ధారల కంటెను మధురమైనదను (కీర్తన 19:10) మాట ప్రకారము వాక్యానికే గుర్తుగా ఉన్నవి. వారి పేర్లు, అర్థాల ప్రకారం లప్పీదోతు, దెబోరాలు భార్యభర్తలు ఇద్దరూ వాక్యానికి సాదృశ్యంగా ఉన్నారంటే ఎంత గొప్ప మాదిరి! వారిద్దరూ సమఉజ్జీలుగా కనిపిస్తున్నారు. ఇద్దరూ ఒకే అనుభవాన్ని కలిగి ఉన్నారు. వీరిద్దరూ సమకాడిని మోస్తున్నారు. అననీయ సప్పీరాలు అబద్ధమాడుటలో సమఉజ్జీలుగా కనబడుతున్నారు, ప్రియ సోదరీ, మీ ఇంటిలో, మీ సంఘములో భార్య భర్తలైన మీరిరువురు దేనిలో సమఉజ్జీలుగా ఉన్నారు? పరీక్షించుకో, మార్చుకో.

**II. న్యాయాధిపతియైన దెబోరా:** తీర్పు కొరకై ఇశ్రాయేలీయులు ఆమె యొద్దకు వస్తూ ఉండినట్లు లేఖనాల్లో గమనిస్తున్నాము. అంతమందికి ఓపిగ్గా ఆమె తీర్పు తీర్చేది. ఆమె న్యాయాధిపతిగా వారిమధ్య పనిచేయుటకు దేవుడు ఆమెను ఎన్నుకున్నాడు. యెషయా 66:13లో వ్రాయబడినట్లు, స్థానిక సంఘమనే యెరూషలేములో వాక్యములోనే ఆదరణ మనము సంఘస్తులకు ఇవ్వాల్సి ఉంటుంది. యేసుప్రభువుకు తల్లిగా ఎప్పుడు ఉండగలగడం. మత్తయి 12:49 ప్రకారం, ఆయన చిత్తాన్ని నెరవేర్చేవారే ఆయన తల్లిగా ఉండగలరు.

9వ వచనములో తల్లియైన దెబోరా ఇశ్రాయేలీయులకు యుద్ధములో దేవుడు చేసిన మేలులను గురించి ఎవరెవరు స్తుతించాలో ఆ సంగతిని ఆమెయే వీళ్ళకు నేర్పిస్తోంది. ఆ దినాల్లో గుఱ్ఱాలకంటే పెద్ద సైజులో ఉండే గాడిదలను ముఖ్యముగా ధనికులైనవారు తెల్ల గాడిదల మీద ఎక్కి పనుల కొరకు తిరిగేవారిని, తివాచీల మీద కూర్చుండే ధనికులను యెహోవాను స్తుతించమని నేర్పిస్తోంది. ఆ మేలులు చేసిన దేవుణ్ణి గూర్చి నీరు చేదుకొనే స్థలములలో ఉండే ముఖ్యముగా స్త్రీలు ప్రకటించాలని నేర్పిస్తోంది. విలుకాండ్రు యుద్ధభూమిలో ఉంటారు. విలుకాండ్ర ప్రతిధ్వనికి దూరముగా నుండువారు ఎవరంటే స్త్రీలే! ఆ స్త్రీలు కూడా మినహాయింపు లేకుండా దేవుని కార్యాలను ప్రకటించాలి. ప్రాకారాలు లేని, భద్రత లేని ఈ గ్రామాలను కాపాడి తానే వారికొక ప్రాకారముగా ఉంచి కాపాడిన దేవుణ్ని గూర్చి ప్రకటించాలని దెబోరా చెబుతోంది. దేవుని నీతిక్రియలను ఆ స్త్రీలు ప్రకటించాలని ఆమె చెబుతోంది. కీర్తన 68:11లో వ్రాయబడినట్లు, ప్రభువు మాట సెలవిస్తూ ఉండగా దానిని ప్రకటించు స్త్రీ అని గొప్ప సైన్యముగా ఉన్నారు. గొప్ప సంఖ్యలో ఈనాడు స్త్రీలు దేవుని కార్యాలను ప్రకటించాలి. ముఖ్యముగా ఆయన రక్షణ కార్యాన్ని అందరికీ ప్రకటించాలి. త్రోవను నడుచువారునూ అనగా పరలోకానికి మార్గమైయున్న యేసుక్రీస్తు అను ఆ త్రోవలో నడిచే ప్రతి ఒక్కరూ రక్షించబడిన ప్రతి ఒక్కరూ ఆయన కార్యాలు ప్రకటించాలి. ఇలా వారు ప్రకటిస్తూ ఉంటే యెహోవా జనులు ద్వారములలో కూడుకుంటారట. ప్రకటించువారు లేకపోతే వినుట ఎట్లు? వినుట లేకపోతే విశ్వాసమెట్లు? కనుక ప్రకటించువారు ప్రకటిస్తే, వినేవారు వింటారు. వినేవారు వింటే ప్రభువునందు విశ్వాసముంచగలరు.

12-21 వరకు, యుద్ధానికి యెహోవా సహాయమునకు కూడి వచ్చినవారిని గురించి. అలా యెహోవా సహాయమునకు కూడిరాని వారిని గురించి దెబోరా హెచ్చరిస్తోంది. ఇశ్రాయేలీయులు కనానీయులతో యుద్ధము చేయడానికి వెళ్ళియుండగా యెహోవా ఇశ్రాయేలీయులకు సహాయము చేయడానికి వచ్చియుండగా, కొన్ని గోత్రాలవారు ఆలాగునే యెహోవా సహాయమునకు, అనగా యెహోవా యుద్ధమునకు సహాయము చేయుటకు యుద్ధానికి రాలేదట. దేవుడు జెబూలూను, నఫ్తాలి గోత్రాలలో 40 వేలమందిని మాత్రమే యుద్ధానికి వెళ్ళమని చెప్పినను, సహోదర ప్రేమతో 1) ఎఫ్రాయీము, 2) బెన్యామీను, 3) మనష్షే, 4) ఇశ్శాఖారు గోత్రాలవారు జెబూలూను,

నఫ్తాలి గోత్రికులతో కలిసి యుద్ధానికి వచ్చి సహాయం చేశారు. జెబూలూనీయులు నాయక దండము వహించారు. ఇశ్శాఖారు అధిపతులు దెబోరాతో (దేవుడేర్పరచుకొన్న స్త్రీని చిన్నచూపు చూడక) యుద్ధములో సహాయానికొచ్చారు. ఇశ్శాఖారీయులు అతి వేగముగా బారాకుతో లోయలోనికి చొరబడ్డారు. ఎంత వారి హృదయాలు బారాకు, దెబోరా హృదయాలలో కలిసిపోయాయో! 18వ వచనములో, జెబూలూనీయులు మరణభయము లేక ప్రాణాలను తృణీకరించుకొని యుద్ధము చేశారు. అపొ.కా. 20:24 లో వ్రాయబడినట్లు, కృపా సువార్తను గూర్చి సాక్ష్యమిచ్చుటయందు తన పరుగును, ప్రభువైన యేసు వలన పొందిన పరిచర్యను తుదముట్టించవలెనని తన ప్రాణమును తనకెంత మాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొననట్లు ఈ సంగతులను చదువుతున్న మనమును మన ప్రాణాల్ని ప్రియముగా ఎంచుకొనక ప్రభువు కొరకు సువార్త యుద్ధము చేయాలి. ఈనాడు చిన్న చిన్న ఆటంకములను అభ్యంతరాలుగా పెట్టుకొని ఈరోజు సేవకు వెళ్ళను అని మనమే నిర్ణయించుకొంటున్నాం.

అలాగున యుద్ధములో సహాయము చేయుటకు రానివారిలో రూబేను గోత్రము ముందుండి యుద్ధానికి వెళ్ళాలంటే గొప్ప యోచనలు వారికి కలిగాయట. ఈ యోచనలు తమ మందలను గురించి అని చదువుతున్నాము. అందరిదొక ఆలోచనైతే, వీళ్ళదొక్కరిది మరో ఆలోచన. ఆత్మలేని పశువుల మందలను గురించే దిగులు కానీ, ఆత్మగల మనుషులు యుద్ధములో ఉండగా దానిని గూర్చి వీళ్ళకు కనీసపు ఆలోచన లేదు. వీరికి మార్కు 5:19లో ఉన్నట్టు, వీరికి పందుల మీద చింతయే కాని, పందులు యేసును తమ ప్రాంతములను విడిచిపొమ్మని చెబుతూ ఆయనను వెళ్ళగొట్టడానికైనా సిద్ధమే. దానీయులు కూడా ఓడల దగ్గర వ్యాపారం నిమిత్తం నిలిచిపోయారు. ఆషేరీయులు సముద్ర తీరమున తన షిఫ్‌యార్డ్ డ్యూటీలలో నిలిచిపోయారు. అలాగే 5:23 లో మేరోజును శపించుడి, దాని నివాసుల మీద మహా శాపమును నిలుపుడి అని దెబోరా వ్రాసింది. ఈ మేరోజు ఏ గోత్రములో ఉంటుందో మనకు తెలియదు గానీ, వీరు కూడా యెహోవా సహాయమునకు రాలేదు.

ధర్మశాస్త్రముననుసరించి తీర్పు చెప్పాలంటే రోజూ ఎంత సమయం వారికొరకు వెచ్చించేదో! ఎంత ఓపికతో ఆ పని చేసి ఉంటుందో! ఇద్దరు పిల్లలకే తల్లి తీర్పు చెప్పడంలో తల ప్రాణం తోకకు వచ్చినట్లుంటుంది. లక్షోపలక్షలైన ఇశ్రాయేలీయులకు తానొక్కతే తీర్పు చెప్పగలిగిందంటే, ఇది సామాన్యమైన సంగతి కాదు. ఆ దినాల్లో ఈ పనిని చేయగల పురుషులు ఎవ్వరునూ లేని కారణాన దేవుడు ఈమెను లేపుకున్నట్లు తానే న్యాయాధి 5:7లో ఇశ్రాయేలులో అధిపతులు లేకపోయిరి. దెబోరా అను నేను రాకమునుపు వారు లేకపోయిరి అని ఆమె వ్రాసింది. ధర్మశాస్త్రాన్ని నేర్చుకొన్న పురుషులు ఆ దినాల్లో లేరట. అధిపతి లక్షణాలు కలిగినవాడు ఒక్కడు కూడా లేడంటే ఇశ్రాయేలు ఎంత ఆత్మీయ దారిద్ర్యతలో ఉన్నారో, యెహోవాను, ఆయన ధర్మశాస్త్రాన్ని ఎంత నిర్లక్ష్యపెట్టారో మనకర్థమవుతుంది. అట్టి భయభక్తులు దేవునియందు వారు కోల్పోయిన

కాలంలో ఈమె ఒక్కతే దేవుని దృష్టికి ధర్మశాస్త్రమును గురించి నేర్చుకున్నదానిగా కనబడిందంటేఎంత విశేషము! ఈమె ధర్మశాస్త్ర ప్రేమికురాలు అని చెప్పవచ్చు. కీర్తన 119:165, 'నీ ధర్మశాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలదు. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియు లేదను వాక్య ప్రకారము ఈమె మాత్రమే తొట్రిల్లలేదు. అందరూ తొట్రిల్లి క్రొత్త దేవతలను కోరుకొని దేవుని దృష్టికి దోషులు కాగా, ఈమె మాత్రమే తొట్రిల్లలేదు. ఆమె దేవుని వాక్యము యెడల నమ్మకంగా ఉన్నది. యెహోవా కొరకే కనిపెట్టుకున్నది. కనుక నెహెమ్యా 7:2 ప్రకారము, హనన్యా నమ్మకమైన మనుష్యుడు. అందరికంటే ఎక్కువగా దేవునియందు భయభక్తులు గలవాడు గనుకనే ఆయనను కోటకు అధిపతిగా దేవుడు చేశాడు. అలాగే నమ్మకస్థురాలైన దెబోరాకు దేవుడు ఇశ్రాయేలీయుల మీద, మొదట న్యాయాధిపతిగా ఆధిపత్యాన్ని దేవుడిచ్చాడు. దేవుని కొరకు కనిపెట్టుకొని క్రొత్త దేవతల యొద్దకు వెళ్ళలేదు గనుక కీర్తన 37:34 ప్రకారమ, యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము, ఆయన మార్గమును అనుసరించుము. భూమిని స్వతంత్రించుకొనునట్లు ఆయన నిన్ను హెచ్చించును. కీర్తన 37:9 లో వ్రాయబడినట్లు, యెహోవా కొరకు కనిపెట్టువారు దేశమును స్వతంత్రించు కొందురు అను మాటల ప్రకారము దెబోరా 20 ఏండ్లు కనానీయుల దాసత్వములోను, కఠిన బాధలోను న్యాయాధిపతిగా హెచ్చింపబడింది. అంతమాత్రమే కాక దేశాన్ని స్వతంత్రించుకొని ఒక రీతిగా 'రాణి'గా కూడా కనబడుతున్నది. 40 ఏండ్లు దేశానికి ఈమె పాలనలో నమ్మకము దేశ ప్రజలందరికీ కలిగించగలిగిన సమర్థురాలిగా ఉన్నది. స్త్రీలారా, మనలాంటి అబలగా ఉన్న ఒక స్త్రీ ఏలాగు ఇంత హెచ్చుస్థితికి ఎదగగలిగిందంటే క్రొత్త దేవతల జోలికి వెళ్ళకుండా, ధర్మశాస్త్రాన్ని నేర్చుకొని, అనుసరించి, తొట్రిల్లకుండా జీవించింది కనుకనే దేవుడు ఈమెను హెచ్చించాడు. దావీదు కీర్తన 119:100 లో, వృద్ధులను మించిన విశేష జ్ఞానము నాకు కలదు' అన్నట్లుగా ఆనాటి పురుషుల కంటే విశేష జ్ఞానమును ధర్మశాస్త్రముతో సంపాదించుకున్న తన బిడ్డను దేవుడు ఈ ఉన్నత స్థితికి హెచ్చించాడు. ప్రియసోదరీ, వాక్యములో నీకెంత జ్ఞానాన్ని సముపార్జన చేసుకున్నావు? వాక్యాన్ని ధ్యానించడానికి ఎంత సమయం గడుపుతున్నావు? వాక్యములో అపొల్లో వలె పాండిత్యము సంపాదించాలి. వాక్యములో విద్వాంసులవ్వాలి. ఆ జ్ఞానమే మనల్ని హెచ్చింపులోనికి తెస్తుంది.

న్యాయాధిపతిగా దేవుని నుండి హెచ్చింపు పొందిన దెబోరా ఒకరోజు నఫ్తాలి, కెదెషులో నుండి బారాకును పిలిపించి, నీవు నఫ్తాలీయులలో నుండి జెబూలీనీయులలో నుండి పది వేలమందిని తాబోరు కొండ యొద్దకు రప్పించుము. నేను నీ దగ్గరకు యాబీనును సేనాధిపతియైన సీసెరాను, అతని రథములను, అతని సైన్యములను నీ చేతికి అప్పగించెదనని ఇశ్రాయేలు దేవుడైన యెహోవా చెప్పుచున్నాడని న్యాయాధి 4:6లో చెప్పుచున్నట్లు చూస్తున్నాము. ఇశ్రాయేలీయుల ప్రార్థనకు జవాబుగా ఈ వచనాన్ని దేవుడు దెబోరాతో చెబుతున్నాడు. ఒకప్పుడు కనాను రాజైన యాబీనును చేతికి దేవుడు

ఇశ్రాయేలీయులను అప్పగించాడు. 20 ఏండ్ల తరువాత ఇపుడు ఇశ్రాయేలీయుల చేతికి యాబీనునును అప్పగిస్తాడట. ముఖ్యంగా అతని సైన్యాధిపతి సీసెరా అను మనుష్యుని పేరులోని అర్థమైన ధ్యానించుట అను మాటను బట్టి ఇశ్రాయేలీయుల శత్రువైన ఇతడు చేసిన ధ్యానము ఏమిటి? ఇశ్రాయేలీయులను ఎలా కష్టపెట్టాలి? ఎలా వారితో దాసత్వం చేయించుకోవాలి? ఎలా వారిని కఠినబాధ పెట్టాలి? ఎలా వారిని నశింపజేయాలి? ఇవే కదా సీసెరా ధ్యానాలు. ఈనాడు విశ్వాసులమైన మన శత్రువైన సాతాను మన విషయమై చేసే ధ్యానము, లేదా ఆలోచన ఏమిటి? 1పేతురు 5:8 ప్రకారము, ఎవరిని మ్రింగుదునా? అనే ధ్యానము చేయుటలేదా? సీసెరా యొక్క రాజైన యాబీను అను పేరు యొక్క అర్థము 'తెలివి గలవాడు' అను మాటనుబట్టి సైతాను కంటే తెలివైన వాడెవడు? యెహె 28:12 లో తూరు రాజుకు పోల్చబడిన (లూసీఫర్) సాతాను 2వ వచనములోదాని మేలు కంటే జ్ఞానవంతుడని వ్రాయబడింది. దేవుడు సృజించిన జంతువులన్నిటిలో సర్పము యుక్తిగలదై యుండెను అని మనం బైబిల్లో చదువుచున్నాము. సర్పము సాతానుకే గుర్తుగా ఉన్నది. ఈలాగు సాతానును, వాడి దూతలు మనలను కఠిన బాధలు పెట్టేవారుగా, నాశనకారులుగా, మనయెడల కుయుక్తిపరులుగా ఉంటున్నారు. వీరి చేతిలోనుండి మనల్ని ప్రభువు విడిపించి వారిని మన చేతుల్లో ఎలా పెడతారో ఆ సంగతినే మనము న్యాయాధి 4,5 అధ్యాయాలలో చదువుతాం.

4వ వచనములో సీసెరాను గురించి వ్రాసేటప్పుడు అతనికి 900 ఇనుప రథములున్నట్లు వ్రాయబడింది. అతని గూర్చి వ్రాయాలంటే, పరిశుద్ధాత్మ దేవునికి కనిపించినవి అతని ఇనుప రథాలే. నీ దగ్గర, నా దగ్గర ప్రభువుకు ఏమి కనిపిస్తున్నాయి? వాటియందే మనకతిశయమా? సాధారణంగా రాజులు వేటినిబట్టి అతిశయిస్తారు? కీర్తన 20:7 ను బట్టి కొందరు రథములను బట్టి, కొందరు గుఱ్ఱములనుబట్టి అతిశయిస్తారు. మనమైతే మన దేవుడైన యెహోవా నామమునుబట్టి అతిశయిస్తాము అని వ్రాయబడింది. కీర్తన 147:10లో, దేవుడు గుఱ్ఱముల బలమందైనను నరుల కాలిసత్తువ యందైనను ప్రభువు సంతోషించడు. కానీ తన కృప కొరకు కనిపెట్టువారియందు ఆయన ఆనందిస్తాడు' అని వ్రాయబడింది. యిర్మీయా 9:23 ప్రకారం, "జ్ఞాని తన జ్ఞానమునుబట్టి ఐశ్వర్యవంతుడు తన ఐశ్వర్యమునుబట్టి అతిశయించకూడదు. అతిశయించువాడు దేనిని బట్టి అతిశయించవలెననగా భూమి మీద కృపజూపుచు నీతిన్యాయములను జరిగించు యెహోవాను నేనే అని నన్ను పరిశీలనగా తెలుసుకొనుటనుబట్టియే అతిశయించవలెను." ప్రభువును గూర్చి పరిశీలనగా తెలుసుకోవడంలోనే మనము అతిశయించాలి. వాక్యములో కేంద్ర బిందువైన ప్రభువును పరిశీలనగా తెలుసుకుంటున్నామా? వాక్యంలో ఎక్కువ ప్రభువు మొదటి రాకడ ఎక్కడ ప్రభువు రెండవ రాకడ కనిపిస్తుందో ఎక్కడ సిలువ వేయబడిన ప్రభువు ఎక్కడ పునరుత్థానుడైన ప్రభువు ఎక్కడ ఆయన గుణగణాలు, ఎక్కడ ఆయన ఆరాధన, ఎక్కడ ఆయన మంచితనము, ఎక్కడ ఆయన ప్రేమ, ఎక్కడ ఆయన మహిమ,

గొప్పతనము ఎక్కడ ఆయన నీతిన్యాయాలు ఇవన్నీ పరిశీలనగా తెలుసుకోగలుగుతున్నాము. సోదరీ, అదే మన అతిశయము.

కానీ సీసెరా గుర్రాలు, సర్వసైన్యము, 900 ఇనుప రథాలు వీటిని గూర్చి విజయము నాదే, సందేహము లేదు అనుకున్నాడు. చివరకు అట్టి రథాన్ని దిగి కలవరపడి కాలినడకను పారిపోయి ఒక్క ఇనుప మేకుతో చచ్చాడు. తాను నమ్ముకొన్న సర్వసైన్యములో ఒక్కడునూ మిగిలియుండకుండా కత్తివాత కూలారు. తాను అతిశయించిన 900 ఇనుప రథాలు ఇశ్రాయేలీలకు ఇచ్చిపోవడానికి సీసెరా వచ్చినట్లయ్యింది. ఎంత గొప్ప కృప దేవుడు ఇశ్రాయేలీయులకిచ్చాడో గదా. ఇట్టి అద్భుత విజయమిచ్చిన ప్రభువును పరిశీలనగా తెలిసికొనుటలోనే మనము అతిశయించాలని నేర్చుకోవాలి. ఇటువంటి ప్రభువునుగూర్చి నీకేమేమి తెలుసు? లేఖనాలు అనుదినము బెరయ క్రైస్తవులవలె ధ్యానిస్తావా? దెబోరా దీవెనలకు నీవు కూడా పాత్రురాలౌతావు.

ఈ సీసెరా ఇశ్రాయేలీయులను కఠిన బాధలు పెట్టాడని న్యాయాధి 4:3లో వ్రాయబడింది. కానీ కీర్తన 71:20లో, దేవుడే అనేక కఠిన బాధలు రప్పించాడని వ్రాయబడింది. ఏది సత్యము? రెండునూ సత్యమే. శత్రువైన సాతానుడికి దేవుడు అనుమతిస్తేనే కఠిన బాధలు మనకు వస్తాయని గ్రహించగలము. ఉదాహరణకు, యోబును సాతానుడు శోధించుటకు దేవుని పర్మిషన్ తీసుకొనుటచే శోధించగలిగాడు. దేవుడు అనుమతించాడు. కానీ కీర్తన 71:24లో కఠిన బాధలు కలిగించిన దేవుడే భూమి యొక్క అగాధ స్థలములలోని యోనాను పంపినట్లు మనలను పంపిన దేవుడు మనలను తిరిగి వృద్ధిచేయు దేవుడు. మనతట్టు తిరిగి మనకు నెమ్మది కలుగజేయు దేవుడు. మనకు కీడుచేయ చూచువారు సిగ్గుపడి అవమానము పొందునట్లు మన దేవుడు చేస్తాడు. కాగా మన  నాలుక దినమెల్ల ఆయన నీతిని వర్ణించేట్లు దేవుడు చేస్తాడు. యెహోవా ఇశ్రాయేలీయుల కొరకు న్యాయాధిపతులను పుట్టించెనని న్యాయాధి 2:11లో వ్రాయబడినట్లు దెబోరా ఇశ్రాయేలీయుల మధ్యలోనే పుట్టి, పెరిగి వారికి న్యాయం చేస్తోంది.

**III. ప్రవక్తగా ఉండిన దెబోరా:** ప్రవక్త అనగా దేవుని పక్షంగా మాటలు ప్రజలకు తెలియచేయువాడు. ప్రవక్త ఇక్కడ దేవుని పిలుపునుబట్టి దెబోరా, బారాకులకు దేవుని మాటలు చెప్పుటను గురించి చదువుకున్నాము. ఇపుడు ఈ శత్రువైన యాబీను సేనాధిపతి చేతిలోనుండి ఇశ్రాయేలీయులను విడిపించుటకు దేవుడు అబీనోయము కుమారుడైన బారాకునే ఎందుకు దేవుడు దెబోరా ప్రవక్త్రి ద్వారా పిలిచాడంటే, బారాకు అనగా 'చిలుము' లేకుండా ప్రకాశించువాడు అని అర్థము గనుకనే దేవుడతనిని పిలిచాడు (ఇన్ హిమ్ నోరస్ట్ బట్ షైనింగ్ అని అర్థము). పాపపు చిలుము లేకుండా ప్రకాశించువాడు. వాక్య ప్రకాశము గలవాడు. 1యోహాను 2:14 వ్రాయబడినట్లు, యౌవనస్థులారా, మీరు బలవంతులు అనగా దేవుని వాక్యము మీయందు నిలుచుచున్నది అనుబడు అనుభవము 'బారాకు'లో ఉంది. గనుకనే దేవుడు బారాకును పిలుచుకున్నాడు.

ప్రియ యౌవనరాండ్లారా, మీలో రస్ట్ (చిలుము) లేకుండా వాక్య జీవితాన్ని మాత్రమే కలిగి ఉన్నాం. అలాగైతే ఎవరికీ లేని సేవాబాధ్యతను దేవుడు మీకివ్వడానికి సిద్ధముగా ఉన్నాడు. అలాంటి స్థితిలో మీరున్నారా? వాక్యజీవితానికి అప్పగించుకుంటారా? దెబోరా, బారాకుల వలె దేవునిచే ప్రత్యేక పిలుపుచే పిలువబడతారు. లేకపోతే సామాన్య జీవితంలోనే ఉంటారు. ఎక్స్ట్రా ఆర్డినరీగా ఉండలేరు. లోకములో ఘనులైనవారికి కలిగి పేరు దావీదులాగా నీకుండదు. ఈ దినాల్లో 2కొరింథీ 4:4 లో వ్రాయబడినట్లు దేవుని వాక్యమను బైబిల్ తెలుగులో మన మాతృభాషలో వ్రాయబడినప్పటికీ ఈ సువార్త ప్రకాశము మనుషులకు కనబడకుండు నిమిత్తమై ఈ యుగ సంబంధమైన దేవత (సాతాను) వారి మనోనేత్రములకు గ్రుడ్డితనమును కలుగజేయుచున్నది. కనుక ఈ సువార్త ప్రకాశము ఈ వాక్యవెలుగు వాక్యజీవితం నామకార్ధ క్రైస్తవులలో లేకుండా పోతోంది. అందుకే వారిలో దైవకార్యమైన రక్షణ కార్యము జరుగలేకుండా పోతుంది. అందుకే బారాకులాగా దేవుడు వారిని తన పనికొరకై వాడుకొనుటలేదు.

ఇపుడు దేవుడు బారాకును తన పని కొరకు విడిపించడానికి కారణం ఈ వాక్య ప్రకారము గాక అతడు పాపము అనే 'చిలుము' ముట్టకుండుటయే అని తెలుస్తోంది. ఇతరులకు లేని ఆ గొప్ప భాగ్యమును దేవుడు బారాకుకు ఇచ్చాడు. పైగా బారాకు నఫ్తాలి, కాదేషులో ఉండినవారు. కాదేషు అనగా 'పరిశుద్ధత' అని అర్థము. పరిశుద్ధత కలిగినవాడుగా బారాకును మనము చూస్తున్నాము. కన్య మరియ కన్యకగా పరిశుద్ధ స్థితిలో ఉన్నది కనుక యేసును గర్భము ధరించుటకు దేవుడు ఆమెకు ఆధిక్యత ఇచ్చాడు. పవిత్రస్థితిలో నీవుంటే నిన్ను కూడా దేవుడు తన పని కొరకు వాడుకుంటాడు. పాపమనే చిలుము లేని పవిత్రతను ప్రియసోదరీ, యౌవనస్తులారా, మీరు కలిగి జీవిస్తున్నారా? ఏ పురుషుడును, ఎన్నడూ కూడని రిబ్కావలే నీవు పరిశుద్ధంగా ఉన్నావా? అప్పుడే నీకు ఇస్సాకులాంటి భర్తను పొందగలవు.

ఈలాగున దెబోరా ప్రవచించిన ప్రవచనము బారాకు జీవితంలో నెరవేరుట చూస్తున్నాం. ఈమె ప్రవచించే కృపావరాన్ని కలిగిన బిడ్డగా మనము చూడగలము. 1కొరింథీ 14:4లో ఉన్నట్లు, ఆమె ప్రవచనమును బట్టి ఇశ్రాయేలీయులకు క్షేమాభివృద్ధి కలిగింది. ఆమె ప్రవచన ప్రకారముగా లేపబడిన బారాకు ఇశ్రాయేలీయులను యాబీను చేతినుండి విడిపించి క్షేమాభివృద్ధి కలిగించాడు. ఈ ప్రవచించే వరమును నిర్లక్ష్యపెట్టకుడని 1థెస్స 5:19లో వ్రాయబడింది. ఇపుడు బైబిలు పూర్తిగా వ్రాయబడింది కనుక ఇపుడు క్రొత్తగా ప్రవచించవలసిన ప్రవచనాలేవీ లేవు కానీ, ప్రవచించబడిన దేవుని వాక్యాన్ని పరిశుద్ధాత్మ ద్వారా మనము అర్థము చేసికొని విపులీకరించడమే ఈ దినాల్లో మనము చేయవలసిన పని. వరములలో ఇదే విశేషమైన వరమని, దానిని అపేక్షించమని 1కొరింథీ 14:1 లో వ్రాయబడింది.

ఈనాడు దెబోరా ప్రవచించకపోతే ప్రవక్త పని చేయకపోతే బారాకు చెప్పేవాడే కాదు. బారాకు లేకపోతే ఇశ్రాయేలీయులను బాధపెట్టే యాబీను, సీసెరాల నుండి

విడుదల వచ్చేదే కాదు. ప్రియ సోదరీ, ప్రభువు నీకు ప్రవచించే వరమునిచ్చాడంటే నీవా పని చేయకపోతే దేవుని సేవకు ఎంత నష్టము కలిగించిన వాడవౌతావు. ఒకవేళ నీవు నీ వరాన్ని అలక్ష్యము చేస్తే, దేవుడు మరొకరిని ఆ పనికి లేపి వాడుకుంటాడు. కానీ నీవు దేవునికి లెక్క అప్పచెప్పవలసినదానవై యున్నావు.

**IV. యువనస్థుడైన బారాకును ధైర్యపరచుటకు తోడుగా వెళ్ళిన దెబోరా:** నేను నీ దగ్గరకు యాబీను సైన్యాధిపతియైన సీసెరాను, అతని రథములను, అతని సైన్యమును కీషోను ఏటి యొద్దకు కూర్చి నీ చేతికి అప్పగించెదనని ఇశ్రాయేలు దేవుడైన యెహోవా సెలవిచ్చియుండలేదా అని దెబోరా 4:7 లో చెప్పినప్పటికీ బారాకు – నీవు నాతో కూడ వచ్చిన యెడల నేను వెళ్ళెదను గానీ నీవు నాతోకూడ రానియెడల నేను వెళ్ళనని (న్యాయాధి 4:9) దెబోరాతో చెప్పుట ద్వారా దెబోరా బారాకుతో – నేను అగత్యముగా నీతో వచ్చెదను కానీ నీవు చేయు ప్రయాణము వలన నీకు ఘనత కలుగదు. ఒక స్త్రీ చేతికి దేవుడు సీసెరాను అప్పగించునని చెప్పి తాను లేచి బారాకుతో కూడ కాదేషుకు వెళ్ళింది. సీసెరా కూడా తన రథములన్నిటిని, తన సర్వసేనను పిలిపించగా దెబోరా – లెమ్ము, యెహోవా సీసెరాను నీ చేతికి అప్పగించిన దినము ఇదే. యెహోవా నీకు ముందుగా బయలుదేరును గదా, అని చెప్పి మరొకమారు దెబోరా ధైర్యము చెప్పినపుడు బారాకు 10 వేలమంది మనుషులను వెంటపెట్టుకొని తాబోరు కొండ మీదనుండి సీసెరాతో యుద్ధము చేయుటకు దిగి వచ్చాడని చదువుచున్నాము. అలాగే పెద్దవారమైన మనమును రోమా 16:20 లోని సమాధానపతియైన దేవుడు సాతాను నుండి మీ చేతకాదు, మీ కాళ్ళ క్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును గదా అని వాక్యంలో యుద్ధానికి, ప్రార్థన యుద్ధానికి ధైర్యము చెప్పి వారిని పంపవలసినవారమై యున్నాము.

బారాకు 4:16లో ఆ రథములను, సేనను అన్యుల హరోషెతు వరకు తరిమి సీసెరా యొక్క సర్వసేనను కత్తివాతను ఒక్కడైనను మిగలకుండా కూల్చుటకు దెబోరా వలన ఎంతో ధైర్యము తెచ్చుకోగలిగారు. యెహోషువకు ద్వితీ 3:28 లో, మోషే ఆజ్ఞ ఇచ్చి అతనిని ధైర్యపరచినట్లు 1థెస్స 5:14 లో వ్రాయబడినట్లు వాక్యము చెప్పుటకు ధైర్యము చెడినవారిని ధైర్యపరచవలసినవారమై ఉంటూ ఉండగా అలాంటివారిని వారి వారి తలాంతులను, వరాలను గమనించినవారమై వారి ఆత్మీయ అభిరుచులను, ఆశలను తెలిసికొని వారిని ప్రోత్సహించి, ప్రభువు సేవలో వారిని ప్రోత్సహించి, ధైర్యపరచి ముందుకు నెట్టవలసినవారమై యున్నాము. అప్పుడే, పెద్దవారమైన మన తరము తరువాత నూతన తరము సేవకు రావడానికి ఆవకాశమ కల్పించిన వారమౌతాము. మోషే తన తరువాత యెహోషువను, ఏలీయా తరువాత ఎలీషాను సిద్ధపరచి, ధైర్యపరచినట్లు మనమును ప్రభువు రాకడ చివరిలో ధైర్యపరచవలసినవారుగా ఉంటున్నాం.

అంతమాత్రమే కాక యుద్ధము ముగిశాక దెబోరా బారాకులిద్దరూ 5వ అధ్యాయంలో పాట వ్రాసి, ఇద్దరు కలిసి పాట పాడుటకు కూడా ఆమె బారాకును ప్రోత్సహించినట్లు మనం చూడగలము. ఈ పాటలో 5:12 లో 'దెబోరా మేలుకొనుము'

అని బారాకు కీర్తన పాడుమని దెబోరా, బారాకులిద్దరూ ఒకరినొకరు ప్రోత్సహించు కొనినట్లు మనకు తెలుస్తుంది. పెద్దదాని వలే దెబోరా చిన్నవాడైన బారాకును 'బారాకూ, కీర్తన పాడుము', 'అబీనోయము కుమారుడా, లెమ్ము, చెరపట్టిన వారిని చెరపట్టుము (అనగా ఇస్రాయేలీయులను చెరపట్టిన కనానీయులను చెరపట్టుము అని అతనిని ధైర్యపరచుచూ ఉన్నది. అనగా యుద్ధములో తాను బారాకును ధైర్యపరచిన దానికి గుర్తుగా పాట రూపకంగా కూడా దానికి దాఖలుగా) కూడా దైవ గ్రంథంలో వ్రాయబడింది. ఆలాగున మనము కూడా మన యౌవన పిల్లలను పాడమని, ప్రకటించాలని, సాతాను చెరపట్టినవారిని సువార్త వలవేయుట ద్వారా అనేకులను ప్రభువు కొరకు చెరపట్టి సంఘములో చేర్చాలని చెప్పి ధైర్యపరచాలని నేర్చుకుంటున్నాము.

5:1 లో ఇశ్రాయేలీయులలో యుద్ధశాలురు ధైర్యము కనపరచుటకు కారణము దెబోరాయే. పాటను వ్రాసి, ఆ పాటను బారాకుతో పాడిన దెబోరా. కొద్దిమంది పాటలు వ్రాయుదురు కానీ రాగం కట్టలేకపోతారు. కానీ దెబోరా పాటను కంపోజ్ చెయ్యడం మాత్రమే కాక పాట రాగాన్ని కూడా కట్టగలదిగా కనిపిస్తోంది. 7వ వచనములో ఆమె ఇశ్రాయేలులో తల్లి కాకమునుపు ఇశ్రాయేలులో అధిపతులు లేకపోయారు. అధిపతులుగా ఉండే సామర్థ్యము ఆ పురుషులకు ఉండేది కాదు. ఆమె ధైర్యపరచిన కారణమున వీరు యుద్ధములో ధైర్యమును కనపరిచారు. వారు సంతోషముగా యుద్ధానికి సిద్ధపడ్డారు అని దెబోరా, బారాకు ఇద్దరూ కలిసి పాడిన పాటలు ఇద్దరూ కలిసి పాడుతున్నారు. ఇలాగు బైబిల్లో రెండు డ్యూయట్ ఉన్నాయి. మొదటిది, దెబోరా, బారాకులు, రెండవది పౌలు సీలా కలిసి పాడినపాట (అపో.కా. 16:25).

లేఖనాలలో మిర్యాము కూడా పల్లవి ఎత్తి పాడిందని నిర్గమ 15:21లో వ్రాయబడింది. కానీ, ఆమె ఎత్తిపాడిన పల్లవి మోషే పాడినదిగా చూస్తున్నాం. కానీ ఇక్కడ న్యాయాధి 5వ అధ్యాయంలోని పాటను దెబోరా, బారాకు వ్రాసినట్లు, పాడినట్లు 5:7 వ. ద్వారా చూస్తున్నాం. మనం దేనినైనా నోటితో బోధించినవి అని ఎక్కువకాలము జ్ఞాపకముండకపోవచ్చు. కొందరే ఆ బోధను వినవచ్చునేమో కానీ, మనము వేటినైతే అక్షరరూపంలో పెడతామో అవి చిరస్థాయిగా మిగిలిపోతాయి. అవి అనేకమంది వింటారు, లేక అనేకమంది పాడుకుంటారు. కనుక స్త్రీలమైన మనము నోటితో బోధించుట మాత్రమే ప్రభువు మనకు ఆత్మ ద్వారా బయలుపరచిన సంగతులను పుస్తకరూపంలో పొందుపరచితే అవి శాశ్వతంగా అందరిచేత చదవబడడానికి అవకాశ ముంటుంది.

ఈ పాటలో దెబోరా ముఖ్యంగా యుద్ధంలో సహాయపడిన యెహోవా దేవుణ్ణి ప్రారంభ వచనాల్లో స్తుతించినట్లు 3,4 వచనాల్లో చదవగలము. యెహోవాను గానము చేద్దాము. ఆయనను కీర్తిద్దాము అని వ్రాస్తోంది. ప్రభువు మేలు చేయక మునుపు శ్రమలో ప్రార్థన చేస్తాము. ప్రభువు మేలు చేశాక కృతజ్ఞతతో ఆయనను స్తుతియాగ మర్పించువాడు నన్ను మహిమపరుస్తున్నాడని దేవుడు కీర్తన 50:23లో వ్రాయించాడు. ఆమె ఈ పాటలో దేవుణ్ణి ఎందుకు స్తుతిస్తున్నది? 4వ వచనములో, యెహోవా ఈ

యుద్ధభూమికి శేయీరు నుండి బయలుదేరాడట. ఆయన ఆలాగున బయలుదేరగా, ఎదోము పొలము నుండి బయలుదేరగా భూమి భయపడి వణికింది, ఆకాశము భయపడి నీళ్ళను వర్షమువలె కురిపించిందట. మేఘాలు వర్షించాయంటూ ఇశ్రాయేలు దేవుని సన్నిధిని సీనాయిలో నుండి నీటి ప్రవాహాలు వచ్చాయట. ఆ నీటి ప్రవాహాల ద్వారా యుద్ధములో చచ్చిపోయిన కనాను రాజులు, వారి సైన్యము శవాలుగా మారి, 21వ వచనములో, కీషోను వాగు వెంబడి కొట్టుకొని పోయారట. ఆలాగున దేవుడు చేయుట ద్వారా చచ్చినవారిని పాతిపెట్టడము, కాల్చడము లాంటి పని లేకుండా వాగులో కొట్టుకొనిపోయేట్లు చేయడం ద్వారా దెబోరా దేవుణ్ణి స్తుతించడం కోసమే ఈ పాట స్తుతిపాటగా వ్రాసింది. ఇశ్రాయేలీయులు అప్పుడప్పుడు ఈ పాట పాడుతుండేవారమో!

6వ వచనములో, షమ్గరు, యాయేలు దినములో రాజమార్గాలు ఎడారులయ్యాయట. వీరి భయానికి ప్రయాణస్థులు వారి ఛాయలకు రావడానికి భయపడి చుట్టూ దారులగుండా వెళ్ళేవారట. యాయేలు అంటే ఆ దినాల్లో 'టెర్రర్' అని అందరూ అనుకొనేవారు. దెబోరా తాను తల్లిలాంటి పెద్ద వయసులో ఉన్న స్త్రీ అయినప్పటికీ యవనురాలుగా, చిన్నదిగా వున్న యాయేలును ఎంతగా అప్రిషియేట్ చేయుట ఆమె విశాల హృదయాన్ని చూపిస్తుంది. ఆమెను గూర్చి మరికొన్ని మాటలు ముందు వచనాల్లో వ్రాసింది. 7వ వచనంలో దెబోరా తన్ను గూర్చి ఇశ్రాయేలీయులకు తల్లిగా చెప్పుకొనుట అతిశయోక్తి కాదు. అది నిజమే, యథార్థమే. అధిపతులుగా ఉండతగినవారు, సామర్థ్యము కలిగినవారు ఆ దినాల్లో ఎవరూ లేని కారణాన దేవుడు దెబోరాను తల్లిగా లేపుకున్నాడు. బైబిల్లో హవ్వ జీవముగల ప్రతిదానికి తల్లి అను (ఆది 3:21), రిబ్కా వేలవేలకు తల్లి అని (ఆది 24:60, మరియకు యేసుతల్లి అని (మత్తయి 12:46), రూఫునకు తల్లి పౌలుకును తల్లి అని (రోమా 16:13) వ్రాయబడింది. దెబోరా యుద్ధానికి వెళ్ళగలిగిన నలభై వేలమందికి తల్లి అని చెబుతోంది.

ప్రియసోదరీ, నీవెంతమందికి ఆత్మీయంగా తల్లిగా ఉన్నావు? ఎంతమందిని ఆత్మీయంగా కన్నావు? తల్లిగా ఉన్న దెబోరా వారి మీద నాకు ప్రేమ కలదు అని ఆమెయే యథార్థముగా చెప్పుకుంటోంది. చాలామంది సువార్త ద్వారా అనేకులను రక్షణలోనికి నడిపిస్తున్నారు. కానీ, వారిని వాక్యమనే పాలతో వారియందు ప్రేమ కలిగి పోషించారు. దెబోరా వాక్యముతో వారిని సరళ వృక్షము క్రింద కూర్చుని హెచ్చరిస్తోంది, బోధిస్తోంది. ముఖ్యముగా తల్లిలాగ 40 వేలమందికి వ్యాజ్యెము తీర్చుచున్నదంటే ఎంత ఓపిక ఆమె కలిగి ఉందో వర్ణించలేము. మన కుటుంబాల్లో ఈనాడు ఇద్దరు ముగ్గురు పిల్లలకు వారి వ్యాజ్యాలు తీర్చాలంటే తల ప్రాణం తోకకు వచ్చినట్లుంటుంది. ఈ పని వారి మధ్య ఆమె 40 సం॥లు చేసిందంటే అది వారియందు ఆమెకు గల ప్రేమయే నిదర్శనము. ఉపదేశకులు పదివేలమంది ఉన్ననూ, తండ్రులు అనేకులు లేరని పౌలు వ్రాసినది వాస్తవమే. అలాగే ఈనాడు స్త్రీల మధ్య కూడా ఈలాంటి ప్రేమగల తల్లులు అనేకులను ప్రభువు లేపును గాక. తల్లి పిల్లల్ని కంటుంది. ప్రేమతో పెంచుతుంది, ఆదరిస్తుంది కూడా తల్లిగా దెబోరా.

# 7

# సింహాన్ని చంపిన మేక - యాయేలు

యాయేలు పేరు బైబిల్‌లో న్యాయాధి 4:17 లోనే మొట్టమొదట కనిపిస్తుంది. ఈ పేరు క్రైస్తవులలో అనేకులు యెరుగకుండానే ఉంటున్నారు. ఈ స్త్రీ ఇశ్రాయేలు జాతికి చెందినది కాదు. ఆమె అన్యురాలు. కానీ ఆమె ఆశీర్వాదము, లేదా దీవెన పొందిన స్త్రీగా న్యాయాధి 5:24లో చూస్తున్నాము. కావున దీవెన పొందిన ఈ స్త్రీ జీవితాన్ని స్త్రీలమైన మనమందరము ధ్యానించడము మేలుకరము.

వివరాలలోనికి వెళ్తే, ఈమె భర్తపేరు 'హెబెరు' అని న్యాయాధి 4:11 ద్వారా తెలుస్తుంది. కయినీయుల నుండి వీరు వేరుపడినవారని తెలుస్తుంది.

## I. కయినీయుల నుండి వేరుపడిన యాయేలుగా ఈమెను మొదటిగా ధ్యానించవచ్చు (న్యాయాధి 4:11) :

కయినీయుల నుండి యెహోవా దేవుణ్ణి నమ్ముకున్నారు. అలా ప్రభుని నమ్మిన వీరు ఆ కయినీయుల నుండి వేరైపోవుటకు ఇష్టపడ్డారు. పేతురు ద్వారా సువార్త వినినవారు అపొ.కా. 2:40 లో, మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణ పొందినట్లు మనం వాక్యములో చదువుతున్నాము. 2కొరింథీ 6:18 లో వ్రాయబడినట్లు యాయేలు, హెబెరు దుష్ట ప్రజల నుండి వేరై వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉన్నారు.

ప్రియసోదరీ, నీ సంగతి ఎలా ఉంది? ప్రభువుని నమ్మిన నీవు దేవుని నమ్మని నీ బంధువుల యొద్దనుండి, స్నేహితుల నుండి, అన్యుల నుండి వేరై ప్రత్యేకంగా జీవిస్తున్నావా? నీ మాటలు, నీ చేష్టలు, నీ ఆలోచనలు, నీ ప్రవర్తన నీ చుట్టూ ఉన్న ప్రజల కంటే వేరుగా ఉన్నాయా? లేక అలవాట్లలో, పద్ధతుల్లో, ఆచారాల్లో అన్యులతో ఏకీభవిస్తున్నావా? అన్యుల ఆచారాలు మనమింకనూ ఆచరిస్తున్నామా? యెషయా 8:11 లో, ఈ జనుల మార్గమున నడవకూడదని యెహోవా బలముగా చెప్పాడని వ్రాయబడింది. అన్యులకు తుమ్మినా ఆచారమే, దగ్గినా ఆచారమే. కూర్చున్నా ఆచారమే, లేచినా ఆచారమే. 12వ వచనములో ఈ జనులు బందుకట్టు అని చెప్పినదంతయు, బందుకట్లు అనుకొనకుడి అని ప్రభువు చెబుతున్నాడు. అన్యులు ఏ ఆచార బంధకాలలో ఉన్నారో, ఆ ఆచార కట్టుబాట్లలో ఉన్నారో వాటికి భయపడవద్దని, వాటిని చేయలేకపోయామని దిగులుపడవద్దని, ప్రభువు కొరకే మీరు భయపడాలని దేవుడు చెబుతున్నాడు. అప్పుడు ఆయన మనకు పరిశుద్ధ స్థలముగా ఉంటారట.

అన్యుల ఆచారాలు ఏమిటో కొన్ని చూద్దాం. చంటిపిల్లలు పాలు. వాంతి చేస్తే దిష్టి తగిలిందంటారు, దిష్టితీస్తారు. గడియారం గంటలు కొటితే 'సత్యం' అంటారు. ఇల్లు మారితే వంట ఇంటిలో పాలు పొంగిస్తారు. కీర్తన 23:5 లో ముందే మన గిన్నె నిండి పొర్లి పొంగినట్లు, పారుచున్నట్లు ప్రభువు చెప్పగా ఈనాటి క్రైస్తవులు ఆ వాక్యము

మీద విశ్వాసము లేనట్లు ఈరోజు క్రొత్త ఇంటిలో పాలు పొంగించుకుని అనవసరంగా 'స్టవ్' క్లీన్ చేసుకోవడం చేస్తున్నారు. పెళ్ళిళ్ళ సమయంలో కుడికాలు పెట్టి ఇంటిలోకి ప్రవేశిస్తున్నారు. కుడికాలు చేసిన దేవుడే ఎడమకాలు కూడా చేశాడు కదా. కుడికాలు మీద విశ్వాసముంచుచున్నారు. కానీ దేవుని మీద విశ్వాసముంచుట లేదు. ఎవరింటిలో నైనా గర్భవతి ఉంటే ఆ ఇంటికి 'రూఫ్' వేయకూడదని, ఎవరైనా స్త్రీలకు బ్లౌసెస్ ప్రజెంట్ చేయాలంటే బేసి సంఖ్యలో ఇవ్వాలట. సరిసంఖ్యలో ఇవ్వకూడదంట. సంఖ్యలు (న్యూమెరికల్ నంబర్స్) మీద విశ్వాసముంచుచున్నారు కానీ దేవుని మీద విశ్వాసముంచుట లేదు.

అన్యులకు ఏవైనా రోగములు వచ్చినపుడు మంత్రజ్ఞుల యొద్దకు వెళ్ళి విచారించినట్లు యెషయా 8:19 లో ఇశ్రాయేలీయులు కూడా కర్ణపిశాచి యొద్దకు, కిచకిచలాడి గొణుగు మంత్రజ్ఞుల యొద్దకు వెళ్ళి విచారించారు. కానీ తమ యెహోవా దేవుని యొద్ద విచారించలేదు. ఈ దినాల్లో కడా చాలామంది ఈలాగే మంత్రించుకునే వారుగా ఉంటున్నారు. తమ ఇళ్ళలో పెళ్ళిళ్లు జరగాల్సినపుడు పురోహితులను సంప్రదించి ముహూర్తాలు ఏర్పరచుకుంటున్నారు. చాలామట్టుకు హైందవుల పెళ్ళిళ్ళ రోజుల్లోనే కొద్దిమంది విశ్వాసుల పిల్లల పెళ్ళిళ్లు జరుగుతున్నాయి. అన్యుల్లాగానే కొద్దిమంది చేతులలో ఉప్పుపెట్టకూడదట. ప్లేట్‌లో పెడతారట. అలా చేయకపోతే వారికి కొట్లాట పడుతుందని వారి నమ్మిక. రాత్రిలో 'సూది' ఒకరు మరొకరికి ఇవ్వరట. శుక్రవారం డబ్బు (లక్ష్మి) ఇంట్లో నుండి బయటకు పోకూడదు అంటారు. మంగళవారం ప్రయాణాలు చేయకూడదట. రాహుకాలం పాటిస్తుంటారు. ఈ దినము బాగులేదు అంటుంటారు. 'దినాలు కాదు, మనమే బాగాలేదు. మన జీవితాలు బాగాలేవు' అనుకోరు. ఇలా వ్యర్థమైన అసత్య, అన్య ఆచారాలను నేడు అనేకమంది విశ్వాసులు సహితము ముఖ్యంగా పెళ్ళిళ్ళలో, చావుల్లో పాటిస్తున్నారు. హెబెరు, అతని భార్య యాయేలు వీటన్నిటిని విడిచిపెట్టి అట్టి అన్యాచారాలను పాటించే కెయినీయుల నుండి వేరైపోయి నేటి విశ్వాసులకు ఎంత గొప్ప మాదిరికరంగా ఉంటూ ఉండడం ఎంత మంచి విషయమో కదా. ప్రియ సోదరీ, మరి నీ సంగతి ఏమిటి? నీవు ఈ విషయంలో మాదిరిగా ఉంటున్నవా? లేక అన్యుల ఆచార వ్యవహారాల్లో కలిసిపోయావా? ప్రత్యేకతను పాటించుట, లేదా హోషేయ 7:8 ప్రకారము ఎఫ్రాయిము అన్యజనులతో కలిసిపోయెను. ఎవరును త్రిప్పివేయలేని అప్పమువంటివాడాయెను' అని వ్రాయబడినట్లే నీ సంగతి ఉందా? లోకస్తులతో కలిసిపోయావా? ఇన్నాళ్ళు వాక్యం తెలియక అలా అన్యులతో 'మింగిల్' అయి పోయావేమో. అన్యజనులలో నుండి వేరైపోవాలి. ఈ జనుల మార్గమున నడువకూడదని ప్రభువు యెషయాకు తేలికగా చెప్పలేదు. "ఈ జనుల మార్గమున నడవకూడదని బహు బలముగా యెషయాతో దేవుడు చెప్పాడని వ్రాయబడింది. దేవుణ్ణి నమ్ముకున్న విశ్వాసులారా, దేవుడు మనలో అన్యాచారాలు అనుసరించకూడదని, బహుకాలంగా చెబుతూ ఉండగా వీటన్నిటిని విడిచిపెట్టడానికి మీకు మనసుందా? దేవుని మాటలు మన మేలు కొరకే గదా. పెడచెవిని పెట్టవద్దు. యెషయా 8:13 లో ఆ అన్య ఆచారాలను

బట్టి నడవకపోతే ఏమైనా కీడు వస్తుందేమోనని భయపడకు. మీరు భయపడవలసినవాడు ఆయనే. ఆయన కోసరమే దిగులు పడవలెను. అప్పుడు ఆయన మీకు పరిశుద్ధ స్థలముగా ఉండును అని వ్రాయబడిన సంగతిని ఈ రోజైనా గమనించరా? హృదయములో ఈ సంగతిని గూర్చి ఆలోచించరా?

మత్తయి 6:31 లో, అన్యజనులు విచారించినట్లు వస్త్రముల కొరకు, తిండి కొరకు మీరు విచారించవద్దు అని ప్రభువు చెప్పాడు. అన్యజనులు సంభ్రమపడినట్లు సంభ్రమపడవద్దు అని ప్రభువు చెబుతున్నాడు. వారు పగలబడి గట్టి శబ్దముతో నవ్వుతుంటారు. అలా చేయవద్దని ప్రభువు చెప్పాడు. 1పేతురు 4:3 లో, అన్యజనుల యిష్టము నెరవేర్చకూడదని అలా నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును. అలా వారు చేయకపోవుట చూచి వారు మిమ్మును దూషించుచున్నారని వ్రాయబడింది. ఆలాగున వారి యిష్టప్రకారము నడుచుకొనకపోతే అన్యజనులైనవారు మనల్ని దూషించినప్పటికీ వాటన్నిటికీ ఒక అంత్యము ఉంటుందని 7వ వచనములో చదువు చున్నాము. ప్రభువు చెప్పిన అన్యజనుల మార్గమున, ఆచారముల చొప్పున, వారి కట్టుబాట్ల చొప్పున నడువక ప్రభువుకు భయపడి ప్రభువు వాక్య కట్టుబాట్ల చొప్పున ప్రభువు మీద విశ్వసించి అన్యులకు వేరై జీవించుదముగాక!

**II. కెదెషునొద్దనున్న యాయేలు (న్యాయాధి 4:11) :** కెదెషు అనగా 'పరిశుద్ధత' అని అర్థము. కయీనీయులనుండి వేరుపడి పరిశుద్ధత అను అర్థమిచ్చునట్టి కెదెషుకు యాయేలు వచ్చినట్లు అక్కడ గుడారము వేసినట్లు ఒక పరిశుద్ధ స్త్రీగా ఆమెను గూర్చి మనము ధ్యానించవచ్చు. వాక్య ప్రకారము పరిశుద్ధ స్త్రీలు ఎలా నడుచుకుంటారు? 1పేతురు 3:5 లో పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీల తన స్వపురుషులకు లోబడి ఉండుట చేత తమ్మును తాము అలంకరించుకొనిరి అని వ్రాయబడినట్లు యాయేలు తన భర్తయైన హెబెరుకు లోబడిన స్త్రీగా, అదే సమయములో పరిశుద్ధ స్త్రీగా మనము చూడవచ్చు. న్యాయాధి 4:18-22 లో ఉన్నట్టు ఆమె పరిశుద్ధతన మనము చూడగలము. పరపురుషుడైన సీసెరా యాయేలు గుడారానికి వచ్చినప్పుడు తన భర్త హెబెరు ఇంటిలో లేనట్టుగా గమనిస్తున్నాము. ఒకవేళ ఇశ్రాయేలీయులు యుద్ధభూమిలో తాబోరు కొండమీదికి హెబెరు వెళ్ళియున్నాడేమో. భర్త ఇంటిలో లేనపుడు ఆమె సీసెరాతో తనకున్న పాత పరిచయాన్నిబట్టి, నా యేలినవాడా, నా తట్టు తిరుగుము, తిరుగుము. భయపడకుమని చెప్పి అతనిని చంపడానికే తన గుడారమునకు అతనిని ఆహ్వానించింది. అతనికి చేరువగా వచ్చి దాహమునకు నీళ్ళు ఇచ్చింది. పాలబుడ్డి విప్పి పాలను, మీగడను ఇచ్చింది. గొంగళితో అతనిని కప్పింది. ఈ పనులన్ని ఒక దాదిలాగా చేసింది. పరిశుద్ధతతో చేసింది. సామెతలు 7:10-27 ఉన్న వచనాలలో 'అంతట వేశ్యావేశము వేసికొనివున్న కపటము గల స్త్రీ ఒక పడచువానిని తన భర్త యింటిలో లేనపుడు ఆహ్వానిస్తూ, 16 వచనములో నా మంచము మీద రత్నకంబళ్ళను ఐగుప్తు నుండి వచ్చు విచిత్ర పనిగా నార దుప్పట్లను నేను పరచియున్నాను. నా పరుపుమీద భోళము, అగరు, కారపు చెక్క చల్లియున్నాను. ఉదయమగు వరకు పరస్పర మోహముచేత

చాలా సంతుష్టి నొందుదము రమ్ము. పురుషుడు ఇంట లేడు. దూర ప్రయాణము చేసివున్నాడు. అతడు సొమ్ము సంచి చేతపట్టుకొనిపోయెను. పున్నమినాటి వరకు తిరిగిరాడు' అని తన అపవిత్రతను చాటుకుంటూ వుంది. ఈ కపట వేశ్యకు యాయేలుకూ ఎంత తేడా ఉంది. ఇద్దరి భర్తలు ఇంటిలో లేరు. వేశ్యయైన కపట స్త్రీ తన భర్తకు నమ్మకంగా లేక పెళ్ళికాని ఒక యువకుని ఎంత శోధిస్తూ అపవిత్ర స్త్రీగా కనబడుతోంది? యాయేలు ఎంత పవిత్ర ప్రవర్తన కలదో గమనిస్తున్నాము.

ప్రియ స్త్రీలారా, యౌవనస్థులారా, మనలో ఈ పవిత్రత ఉన్నదా? అన్యులలో నుండి వేరైన యాయేలులో ఇంత పవిత్రత ఉండగా ఆల్‌రెడీ విశ్వాసులమైన మనలో నేడు ఇంత పవిత్రత ఉన్నదా? ఒక ధనవంతుని కుమారుడు తండ్రి ఆస్తిని ఖర్చుపెట్టి విలాసవంతమైన జీవితం జీవిస్తూ అందమైన వేశ్యలతో లాడ్జిలలో గడుపుతున్నాడు. ఒక వేశ్య రాత్రంతా ఆ అబ్బాయితో గడిపి తెల్లవారుజామున తన ఇంటికి వెళ్ళిపోయే సమయాన ఆ అబ్బాయి ఇంకా నిద్రిస్తూ ఉండగా అతని యొక్క విలువైన గాగుల్స్, వాచ్ ఆ అమ్మాయి తన పర్స్‌లో వేసికొని బాత్‌రూమ్‌లోని సింక్‌కు ఎదురుగా ఉన్న మిర్రర్‌లో తన లిప్‌స్టిక్‌తో ఈలాగున వ్రాసి వెళ్లిందట, ఏమని? 'వెల్‌కమ్ టు ఎయిడ్స్' అని వ్రాసి వెళ్ళిపోయిందట. ఈ అబ్బాయి లేటుగా నిద్రలేచి బాత్‌రూమ్‌కు వెళ్ళి ముఖం కడుక్కొని అద్దంలో చూడగా ఆ అమ్మాయి మిర్రర్‌లో వ్రాసి పెట్టింది చదువుకున్నప్పుడు గుండె పగిలిపోయినంత పనైపోయింది. పవిత్ర జీవితం లేని కారణాన ఈనాడు అనేకమంది ప్రాణాంతకమైన వ్యాధులు తెచ్చుకుంటున్నారు. ఈ అబ్బాయి ఇక ఎలా పాపములో సంతోషించగలడు?

ఈనాడు ఐ.టి. ఇన్‌స్టిట్యూట్‌లో జాబ్స్ చేస్తున్న ప్రతి ఇన్‌స్టిట్యూట్ బాత్‌రూమ్స్‌లోని డస్ట్‌బిన్స్ అన్నీ ఉదయమున కండోమ్స్‌తో వుంటున్నాయట. ఈ రోజుల్లో యౌవనస్థులలో ఈ అపవిత్రత ఎంత విరివిగా కనబడుతుందో కదా. 1పేతురు 1:16 లో 'మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడై యున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి' అని ప్రభువు వ్రాయించిన ప్రకారము మన సమస్త ప్రవర్తనలో పవిత్రులమై ఉండాల్సినవారమై యున్నాము. ఎందుకనగా 1పేతురు 2:5 ప్రకారం, యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా నుండునట్లు' దేవుడు మనలను ఏర్పరచుకున్నాడు. 2పేతురు 3:12 లో వ్రాయబడినట్లు, మనము పరిశుద్ధ ప్రవర్తనతోను, భక్తితోను ఎంతో జాగ్రత్త గలవారమై ఉండాలి. యాయేలు అపవిత్రతకు దూరముగా ఉండు నిమిత్తమై 'కెదెషు' అనే స్థలానికి వచ్చి ప్రత్యేక జీవితం జీవిస్తోంది.

**III. పరిచర్య చేసిన యాయేలు (న్యాయాధి 4:18) :** యాయేలు సీసెరాకు దాహమిచ్చి, పాలనిచ్చి, గొంగళిలో కప్పుట వలన ఆమె పరిచర్య చేసే స్త్రీగా ఉన్నట్లు మనకు కనిపిస్తుంది. ఈనాడు మన సంఘాలలో చాలామంది వాక్యపరిచర్య చేయుటకు ఇష్టపడి ముందుకు వస్తున్నారు. కానీ బోధకులు మన సంఘానికి బయటి ప్రాంతముల

నుండి వచ్చినవారిని తన ఇండ్లలో చేర్చుకుని భోజనాల పరిచర్య చేయుటకు ఎవరునూ ముందుకు రావడము లేదు. ఏదో రీతిగా ఈ పరిచర్య చేయకుండ తప్పించుకొని తిరుగుతున్నారు. ఆ దినాలు తమకు అనుకూలము కాదని, ఆ దినాల్లో మేము ఊరిలో ఉండుట లేదని, ఏదో ఒక సాకులు చేప్పి పరిచర్య చేయకుండ తప్పించుకోవడానికి ప్రయత్నిస్నున్నారు.

బైబిల్లో లూకా 8:3 లో, మగ్దలేనె మరియ, యెహన్నా, సూసన్న తమకు కలిగిన ఆస్తిలో యేసయ్యకు ఆయనతో ఉన్న శిష్యులకు ఉపచారము చేయుచూ వచ్చారు. యోహాను 12:2లో, మార్త ప్రభువుకు ఉపచారము చేసేదిగా చూస్తున్నాము. అనాగరికులైన మిలితే గ్రామస్థులు పౌలుకు, పౌలుతోపాటు ఆ ఓడలో ఉన్న 270 మందికి వారుచేసిన ఉపచారము ఇంతింత కాదని వ్రాయబడి ఉన్నది. ఈ ద్వీపవాసులు అన్యులే. అయినా ఒక అన్యజనులు ఉపచారము ఇంతింత కాదు అని అంటే విశ్వాసుల ఉపచారము వారికంటే ఎంత మించిన ఉపచారమై ఉండాలో కదా.

1కొరింథీ 16:15 లో స్తెఫెను వంటివారు పరిశుద్ధలకు పరిచర్య చేయుటకు ఎవ్వరూ వారికి చెప్పలేదు. కాని వారు తమ్మును తామే ఆ పనికి అప్పగించుకున్నారని వ్రాయబడింది. తన పితరుడైన స్తెఫెనును ఆకాల ప్రజలు రాళ్లతోకొట్టి చంపినప్పటికీ వారు ప్రభువునందు విశ్వాసాన్ని కోల్పోకుండా ఆ పనికి ఇంకను తమ్మును తామే అప్పగించుకొని చేస్తున్నారంటే ఎంత గొప్ప సంగతో కదా. అలాగున మనుష్యులే కాక మత్తయి 2:11 లో, ఇదిగో దేవదూతలు వచ్చి ప్రభువుకు పరిచర్య చేసిరి అని వ్రాయబడింది. అలాగే అన్నిటికంటే, అందరికంటే మిన్నగా ప్రభువు లూకా 12:37 లో పెండ్లి విందులో ప్రభువు తానే వచ్చి తన దాసులమైన మనలను భోజన పంక్తిలో కూర్చుండబెట్టు తానే మనకు పరిచారము చేయునని వ్రాయబడింది. ప్రియ సోదరీలారా, మీ బ్రతుకు దినములలో పైన చెప్పబడిన వారివలె పరచర్య చేయుటకు ఇష్టపడుతున్నారా? మీరు ఇలా పరిచర్య చేయువారైతే అలా పరిచర్య చివరివరకు చేసే మిమ్ములను గొఱ్ఱెపిల్ల విందులో తానే భోజన పంక్తిని కూర్చుండబెట్టి, తానే ఉపచారము చేయునంటే ఎంత ప్రేమతో వడ్డిస్తాడో కదా. ఎంత శ్రేష్ఠమైన భోజన పదార్థములు, ఎంత బలవంతమైన ప్రేమతో వడ్డించి, పరలోకపు రుచులు తినిపిస్తాడో కదా.

అయితే, ఈలాగు పరిచర్య చేసినవారికి కలిగే లాభమేమిటి? 1తిమోతి 3:13 లో 'పరిచారకులై యుండి ఆ పనిని బాగుగా నెరవేర్చినవారు మంచి పదవిని సంపాదించుకొని క్రీస్తు యేసునందలి విశ్వాసమందు బహు ధైర్యము గలవారగుదురు' అని వ్రాయబడింది.

ఆలాగున మోషేకు పరిచర్య చేసిన యెహోషువ, మోషే తరువాత మంచి పదవిని మోషేలాంటి నాయకుని పదవిని సంపాదించుకొని ఇశ్రాయేలీయులను వాగ్దాన దేశానికి నడిపించినవానిగా చూస్తున్నాం. అలాగే ఏలీయాకు పరిచర్య చేసిన ఎలీషా. ఏలీయా తరువాత ఏలీయాకున్న మిన్నయైన పదవిని సంపాదించుకొని ప్రవక్తగా రెట్టింపు సూచక క్రియలను చేశాడు. అందుచేత పరిచర్య అనేది చిన్నది కాదు.

హెబ్రీ 6:10 లో 'మీరు పరిశుద్ధులకు ఉపచారము చేయుటకు ఆపకుండా ఇంకనూ ఉపచారము చేయుచుండుట వలన తన నామమున మీరు చేయుచు వచ్చిన పనిని మరచుటకు ఆయన అన్యాయస్థుడు కాడని వ్రాయబడింది. ప్రవక్తను చేర్చుకున్నవాడు ప్రవక్త ఫలము పొందునని, నీతిమంతుని చేర్చుకొనువాడు నీతిమంతుని ఫలము పొందునని, శిష్యుడని యెవడు ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడు చన్నీళ్ళు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొనడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని ప్రభువు మత్తయి 10:40-42 లో చెప్పాడు. దీనినిబట్టి పరిచర్య చేయువారికి వారు చేసిన పరిచర్య చొప్పున ఫలముందని గ్రహిస్తున్నాము.

అలాగున ఆది 18 అధ్యాయంలో అబ్రాహాము, శారాలు ముగ్గురు మనుష్యులను వారి గుడారములో చేర్చుకొని ఆతిథ్య పరిచర్య చేయగా 14వ వచముములో దేవుడైన యెహోవా మీదటికి ఈ కాలమున నిర్ణయకాలమందు నీ యొద్దకు తిరిగి వచ్చెదము, అప్పుడు శారాకు కుమారుడు కలుగునని చెప్పాడు. పరిచర్య ఎప్పుడూ ఫలమునే, మంచి పదవినే తీసుకొని వస్తుందని మనము గ్రహిస్తున్నాము. ఈ ఫలములే, ఈ పదవులే నీవు పొందగోరిన యెడల ఈనాడు నీ సంఘములో పరిచర్య జరిగించుటకు నీవూ, నీ కుటుంబము మిమ్మును మీరే అప్పగించుకొనుటకు 'స్తెఫెను' ఇంటివారివలే అప్పగించుకొనడానికి ఇష్టపడుతున్నారా? పరిచర్యను చిన్నచూపు చూడకు. దేవుడు ఆ కార్యము విషయమై నిన్ను ప్రేరేపించునుగాక!

**IV. సీసెరాను చంపిన యాయేలు (న్యాయాధి 4:21.22) :** యాయేలు సీసెరాను చంపిన యాయేలుగా చూస్తున్నాము. యాయేలు పేరుకు అర్థము 'అడవి మేక' అని ఉన్నది. సీసెరా అనగా 'ధ్యానము' అని అర్థము. సీసెరా ఇశ్రాయేలీయులకు శత్రువు. విశ్వాసులమైన మన శత్రువు సాతానై ఉండగా సాతాను మన విషయమై చేసే ధ్యానమేంటి? 1పేతురు 5:8 ప్రకారము, ఎవని మ్రింగుదునా అని సాతాను వెదకుచూ, తిరుగుతూ ఉండగా యిట్టి సాతాను అను సింహమును మనమేలాగు మన జీవితములో చంపాలో, వానిని మనము ఏలాగు నిర్వీర్యము చేయాలో, ఏలాగు వాని దుష్టపన్నాగములను దునుమాడాలో యాయేలు ద్వారా నేర్చుకుందాం.

అతడు అనగా సీసెరా అలసి గాఢనిద్ర పోవుచుండగా యాయేలు గుడారపు మేకు తీసుకొని, సుత్తె చేతపట్టుకొని అతని యొద్దకు మెల్లగా వచ్చి, నేలకు దిగునట్లుగా ఆ మేకును అతని కణతలలో దిగగొట్టగా అతడు చచ్చెను అని 21వ వచనములో చదువుచున్నాము. ఈ మేకు, సుత్తెలు వేటిని సూచిస్తున్నాయి? ప్రసంగి 12:11లో జ్ఞానులు చెప్పు మాటలు ములుకోలల వలె చక్కగా కూర్చబడి బిగగొట్టబడిన మేకులవలె ఉన్నవి అని వ్రాయబడింది. జ్ఞానుల మాటలు దిగగొట్టిన మేకులవలె ఉన్నవంటే ప్రభువు కంటే జ్ఞాని యెవరు? ఆయన మాటలకంటే చక్కగా కూర్చబడి, ములుకోలలవలె, బిగగొట్టబడిన మేకులవలె ఉంటే మాటలు ఈ లోకంలో ఎక్కడున్నాయి? బైబిల్‌లో

దేవుడు చెప్పిన (ఆదికాండము మొదలుకొని ప్రకటన గ్రంథమువరకు) ప్రతి మాట దిగగొట్టబడిన మేకులే. దిగగొట్టబడిన మేకువలె దేవుని ప్రతి మాట కదలని స్థిరమైన మాటయే. భూమి, ఆకాశము గతించినా నా మాటలెన్నడూ గతించవు అని ప్రభువు చెప్పాడు. దేవుడు స్థిరపరచిన ప్రతి మాట ద్వారా వాక్యానుసారమైన ప్రార్థనగా దిగగొట్టిన మేకుగా చేసి, ఆ తరువాత యిర్మీయా 23:29 ప్రకారం, ఆయన మాట అగ్నివంటిదిగా, బండను బ్రద్దలుచేయి సుత్తెగా ఉండగా ఆ వాక్యమనే సుత్తెతోనే వాక్యానుసారమైన ప్రార్థన అనే మేకును దిగగొట్టి ఈనాడు మన ఇండ్లలో, మన పిల్లలలో నమ్మని బంధువుల జీవితాల్లో వీరవిహారము చేయుచూ, వారి జీవితాల్లో తిష్టవేసుకొనిన సైతానును మన ప్రార్థన ద్వారా, వాక్యము ద్వారా కొట్టవలసినవారముగా ఉన్నాము. విశ్వాస సహితమైన వాక్యానుసార ప్రార్థన గొప్ప కార్యములు మన ఇండ్లలో, సంఘాలలో చేసేదిగా ఉన్నది. 2కొరింథీ 10:3-4 లలో వ్రాయబడినట్లు, 'మా యుద్ధోపకరములు శరీర సంబంధమైనవి కావు గాని దేవుని యెదుట దుర్గములు పడద్రోయజాలినంత బలము గలవై యున్నవి' అని వ్రాయబడినందున ప్రభువు నెరిగిన మనమందరమును ఆలాగుననే శత్రువైన సాతానును ప్రార్థన ద్వారాను, వాక్యము ద్వారాను జయించవలసిన వారముగా ఉన్నాము.

కావున స్త్రీలమైన మనము ఇంటిలోనే ఉంటాము. తెర వెనకాలే ఉంటాము. గుడారములలోనే ఉంటాము. కానీ మనము చేయు వాక్యానుసారమైన ప్రార్థనలు, వాగ్దానములను నమ్మి వాటిని ఆధారము చేసుకొని చేయు ప్రార్థనల ద్వారా సాతాను దుర్గములను పడద్రోయగలము. అలాగున యాయేలు సాతానును ప్రతిరూపముగా ఉన్న సీసెరాను చంపుట ద్వారా ఈనాటి స్త్రీలమైన మనకందరికి మంచి మాదిరిగా నిలిచింది. మేకలాంటి యాయేలు సింహములాంటి సీసెరాను వాక్యానుసారమైన ప్రార్థన ద్వారా చంపాలని విశ్వాస స్త్రీ లోకానికి చాటిచెబుతోంది.

**V. ఘనతనొందిన యాయేలు (న్యాయాధి 4:9) :** 'నీవు ప్రయాణములో నీకు ఘనత కలుగదు.' ఒక స్త్రీ చేతికి యెహోవా సీసెరాను అప్పగించును' అని దెబోరా చెప్పినందునబట్టి సీసెరాను చంపే ఘనత దేవుడు స్త్రీ చేతికి ఇచ్చినట్లు తెలుస్తుంది. సీసెరాకు ప్రతిరూపంగా ఉన్న సాతానును చంపే ఘనత ఈ రోజుల్లో మనకందరికీ దేవుడు అనుగ్రహించాడు. ఇశ్రాయేలు స్త్రీలకు ఎవరికి లేని ఘనత క్రొత్తగా వచ్చి కెదెషులో కాపురముంటున్న దేవుని నమ్ముకున్న యాయేలుకు దేవుడిచ్చాడు. ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు వాడిగా ప్రభువు చూశాడు. ఈలాగున నేటి దినములలో అన్యులు ప్రభువును నమ్ముకొని క్రైస్తవ విశ్వాసులకంటే ఆత్మీయముగా ముందుకు వచ్చి అనేక రీతులుగా ప్రభువు కొరకు వాడబడుతూ అనేక రీతులుగా సంఘాలలో ఆత్మీయ ఘనతలు కలిగి ప్రభువు కొరకు వాడబడుతున్నారు. మిగతావారు నోళ్ళు తెరుచుకుని వింటూ వెళ్ళిపోతున్నారు.

**నేడు దైవగ్రంథమైన బైబిల్‌లో అనేక ఘనతలున్నాయి. కానీ కొన్ని మాత్రమే సందర్భాన్నిబట్టి ధ్యానిద్దాం.**

**1) కీర్తన 149:9** లో, వారిచేతిలో రెండంచుల ఖడ్గమున్నది. ఆయన భక్తులందరికి ఘనత యిదే' అని వ్రాయబడియున్నది. తన భక్తులైనవారందరి చేతులలో బైబిలు ఉండుటయే ఘనత అన్నప్పుడు ఈ రోజుల్లో బైబిల్‌ను తమ చేతుల్లో ఉంచుకొనుట కాదు గానీ మా చేతుల్లోని సెల్‌ఫోన్స్‌లో బైబిలు ఉందని సెల్‌ఫోన్స్ పట్టుకొనుటయే ఘనత అనుకుంటున్నాడు. బైబిల్‌ను పట్టుకోవడానికి ఇష్టపడుట లేదు. ఈ వచనాన్నైనా చదువుకొని బైబిల్ ద్వారా ఘనత పొందుకోవచ్చు. బైబిల్‌ను చేతుల్లో పట్టుకోవడమే ఘనత అయితే ఆ బైబిల్‌ను అనుసరించడం మరెంత ఘనతయోకదా. నిజంగా బైబిల్‌ను పట్టుకోవడం మనకు గర్వకారణమే. ఈ రెండంచులు, రెండు నిబంధనలు కలిగిన ఈ వాక్య ఖడ్గము ద్వారానే అన్యజనులకు ప్రతిదండన చేయుటకు, ప్రజలను శిక్షించుటకు, గొలుసులతో వారి రాజులను, ఇనుప సంకెళ్ళతో వారి ఘనులను బంధించుటకు, విధింపబడిన తీర్పును వారిమీద నడుపుటకును దేవుడు ఈనాడు మన చేతుల్లో పెట్టాడట. ఎంత గొప్ప ఘనత ప్రభువు మనకిచ్చాడో కదా. డాక్టరు చేతుల్లో స్కెతస్కోప్ ఉంటుంది. స్టూడెంట్స్ చేతుల్లో బుక్స్ ఉంటాయి. విశ్వాసుల చేతుల్లో బైబిల్స్ విధిగా ఉండాలి. అవియే మనల్ని మార్చుతాయి. ఆ బైబిల్స్ మన ద్వారా దేవుడు మనతో మాట్లాడతాడు. రేపు దానితోనే మనం అన్యజనులను, రాజులను బంధించి విమర్శ చేస్తాము. బైబిల్ ప్రాముఖ్యత ఇప్పుడైనా తెలిసిందా? ఇప్పుడైనా బైబిల్‌ను ప్రేమించు.

**2) సామెతలు 11:16** లో, నెనరుగల స్త్రీ ఘనత నొందునని వ్రాయబడింది. నెనరు అనగా ప్రేమ. ప్రేమించే స్త్రీ ఘనపరచబడుతుందట. ప్రియ సోదరీ, ఎవర్ని ప్రేమించాలి? మనల్ని ప్రేమించే వారినే మనం ప్రేమిస్తాము. అది సాధారణము. కొద్దిమంది ఆ ప్రేమ కూడ చూపరు. కానీ, మన ప్రభువు మనకు నేర్పించినట్లు నీ శత్రువులను ప్రేమించు. వారు దప్పిగొని ఉంటే దాహమిమ్మన్నాడు. ఆకలిగొని యుంటే అన్నము పెట్టమన్నాడు. శపించవద్దన్నాడు. దీవించుడి అన్నాడు. సిలువలో తనను కొట్టి, దూషించి బాధించి ఉమ్మివేసిన వారిని గూర్చి తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరిని క్షమించుమని ప్రభువు ప్రాక్టికల్‌గా మనకు చేసి చెప్పాడు  గనుక మనమును మన శత్రువులను, మనకు హాని, కీడు చేసినవారిని మన పేరును, సాక్ష్యాన్ని పాడుచేసినవారిని, మనల్ని నిందించినవారిని ప్రభువు వలె ప్రేమిస్తే, ప్రభువు క్షమించినట్లు క్షమిస్తే ప్రభువు మనల్ని ఘనతకు తీసుకొస్తాడని నేర్చుకుంటున్నాము. అలా నేర్చుకోవడానికి నీకిష్టమా? సోదరీ!

**3) సామెతలు 29:23** లో వ్రాయబడినట్లు వినయ మనస్కులమైతే ఘనత పొందుతాము.

**4) సామెతలు 20:3** లో వ్రాయబడినట్లు కలహమునకు దూరముగా ఉండుట ఒక ఘనతయే. కనీసము ఈ నాలుగు ఘనతలైనా స్త్రీలమైన మనము సుళువుగా పొందుకోగలము కదా. సామెతలు 31:25 లో, బలమును, ఘనతయు గుణవతియైన

భార్యకు వస్త్రములు అని వ్రాయబడిన ప్రకారము మనము పొందిన ఘనతలే మన బలమే మనకు వస్త్రాలట. ప్రియసోదరీ, అలాంటి ఘనతకు సంబంధించిన వస్త్రాలు (ఆత్మీయంగా) నీకెన్ని ఉన్నాయి? రకరకాల వస్త్రాలు మన బీరువాల్లో కలిగి ఉన్నామేమో!కానీ మనము ప్రభువును కలిగిన ఘనతలే మన వస్త్రాలుగా కలిగియుండుట అనే అనుభవం ఎంత గొప్పదో, మారిదికరమో కదా!

**VI. గుడారములలో నుండు స్త్రీలలో దీవించబడిన యాయేలు:** శత్రువైన సీసెరాను చంపి ఇశ్రాయేలు దేశానికి ఎంతో మేలు చేసింది కనుక ఆమె దీవెన పొందుతుందని దెబోరా ఆమెను గురించి న్యాయాధి 5:24-27 వరకు నాలుగు వచనాలు వ్రాసింది. ఒక స్త్రీ మరో స్త్రీని గురించి మంచి సాక్ష్యము వ్రాయడానికి సాధారణముగా ఇష్టపడరు. కానీ, దెబోరా యాయేలును గురించి వ్రాయకుండా ఉండలేకపోయింది. యాయేలు దీవెన పొందాలని కోరుకొని ఆమెను గూర్చి దీవెన వచనం వ్రాసింది.

'దీవెన' అనగానే అందరికీ ఆ దీవెన ఇష్టమే. యాయేలుకు దేవుడిచ్చిన దీవెన ఎలాంటిది? దీవెన అంటూనే చాలాసార్లు శరీర దీవెనలనే చాలామంది కోరుకుంటారు. దేవుడు ఈమెకు ఏ శరీర దీవెనలనిచ్చాడో తెలియదు. కానీ గుడారములలో ఉండు స్త్రీలలో యాయేలు దీవెన నొందును అని వ్రాయబడింది. గుడారములలో ఉండిన స్త్రీలు బైబిల్లో, ఎంతోమంది ఉండవచ్చు. ఆ అందరి స్త్రీలలో ఈమె మాత్రమే దీవెన నొందిన స్త్రీగా మనము ఆమెను గూర్చి చదువుతున్నాము. గుడారములలో నుండే స్త్రీలు చాలావరకు బీదలే. యాయేలు యెహోవా దేవుని నమ్ముకొని కయీనీయుల నుండి వేరుపడి, పరిశుద్ధ స్త్రీగా జీవిస్తుండగా ఆమె శత్రువుని చంపి దేశానికి శత్రు బాధ లేకుండా దేశ ప్రజలకు బానిసత్వము నుండి విమోచించగలుగుటకు కారణమయ్యింది. కనుక దేవుడు ఆమెను ఎన్నెన్ని రీతులుగా ఆశీర్వదించాడో మనకు వివరాలు వాక్యములో లేవు. ఎంత ఆత్మీయమైన దీవెనలు ఆమె పొందిందో మనకు తెలియదు. తన చుట్టూ ఉన్న ప్రజలకు 'మహారాణి'గా కనిపించింది. అబ్రాహాము కూడా ఆ దినాలలో బట్ట గుడారములోనే జీవిస్తూ దేవుడు దేనికి శిల్పియూ, నిర్మాణకుడై యున్నాడో, పునాదులు కలిగిన పరలోకపు పట్టణము కొరకు ఆయన ఎదురుచూసినట్టు మనము చూస్తున్నాము. అయినా అబ్రాహాము దీవెన పొందాడు. తన చుట్టూ వారికి దీవెనకరంగా కూడా ఉంటూ వచ్చాడు (ఆది 12:2).

అలాగే లూకా 1:42లో, 'స్త్రీలలో నవు ఆశీర్వదించబడినదానవు. నీ గర్భఫలమును ఆశీర్వదించబడును గాక' అని మరియ విషయమై ఎలిజబెతు పలికిన మాట దేవుడు బైబిల్‌లో వ్రాయించాడు. దేవుని మాటను విని కన్యకగా ఉన్నప్పుడే గర్భమును ధరించి యేసుప్రభువును లోకానికి రక్షకునిగా అందించుట ద్వారా ఆమె దీవెన నొందినదని వ్రాయబడింది. కానీ ఇల్లు, వాకిలి, ధన ధాన్యాలన్నీ దీవించబడ్డాయా? కాదు, కాదు. ఆ నజరేతులో యేసయ్య ఇంటిని చూచివచ్చినవారు అది ఏ మాత్రము జీవించడానికి అనువైన, సౌకర్యమైన ఇల్లు కానేకాదని అంటున్నారు. యేసయ్య ఆమెకు

పుట్టుట ద్వారా ఆమెకు గానీ, యేసుప్రభువుకు గానీ ఏ దీవెనలు లేవు. అలా శరీర దీవెనలు వచ్చి ఉంటే యేసయ్యను ఎందుకు ఆమె పొత్తిగుడ్డలచేత చుట్టి ఉంటుంది? ఆమె దీవెన ఆత్మీయ దీవెనయే.

ప్రియ సోదరీలారా, ఆనాటి కాలంలో ప్రభువు రక్షింపబడిన మనలనందరినీ ఆత్మీయంగాను, ఆర్థికంగానూ, జీవానికి, భక్తికి కావలసిన వన్నియును అనుగ్రహించి, దీవిస్తూ ఉన్నాడు. ఈనాడు ఎన్ని సౌకర్యాలు, సుఖాలు, ఎన్నో ఇచ్చాడు. నిన్ను తలగానే ఉంచుతాను గానీ తోకగా కాదని ప్రభువు చెప్పాడు. కానీ మనము పొందిన దీవెనలనుబట్టి ఎంతమందికి దీవెన కలిగించేవారుగా ఉన్నాము? మన దీవెనలు మన సంతానము కూడా పొందుకోవాలి? మరియ దీవెన పొందుటయేకాక, ఆ దీవెనలు తన గర్భఫలము కూడా పొందును గాక అని వ్రాయబడినట్లు ఈనాడు నీవు పొందిన దీవెనలు నీ సంతానము కూడా పొందాలని నీవు ప్రార్థించుకో. అపో.కా. 2:38, 39 లో, పేతురు 'మీరు మారుమనస్సు పొంది క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము నొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురని ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్థులందరికిని అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారందరికిని చెందును గాక. అని వ్రాయబడినట్లు తల్లిదండ్రులమైన మనం పొందుకున్నఆ దీవెనలన్నీ మన పిల్లలకు, దూరస్థులకు అందరికీ రావాలని దేవుని ఉద్దేశము. అలా తలిదండ్రులమైన మనము మాత్రమే కాక, మన పిల్లలు కూడా ఆ దీవెనలు పొందాలని మనము ప్రయత్నించువారమై యుందుము గాక. దేశానికంతటికీ యాయేలు దీవెనకరముగా ఉన్నట్లు ప్రతి క్రైస్తవ విశ్వాస స్త్రీ తానున్నచోట అందరిలో దీవెన నొంది, అందరికీ దీవెనకరముగా ఉండుటకు ప్రయత్నించుదుము గాక. గుడారములలో ఉంటూనే యాయేలు ఆత్మీయముగా అనేకులకు దీవెనకరముగా ఉన్నది. న్యాయాధి 5:28లో వ్రాయబడినట్లు, సీసెరా తల్లి అల్లిక కిటికీలు కలిగిన అంతఃపురములో ధనిక సంపన్నమైన రాజసౌధములో ఉంటూ కూడా ఆమె ఏ దీవెనను దేవుని ద్వారా పొందలేకపోయింది. కేవలము లోకమిచ్చు దీవెనలు: 1) దోపుడు సొమ్ము, 2) ఒక స్త్రీ, 3) ఇద్దరేసి స్త్రీలు, 4) రంగు వేయబడిన వస్త్రము, 5) రంగువేయబడిన విచిత్ర వస్త్రములు, 6) రెండు వైపుల రంగు వేయబడిన విచిత్ర వస్త్రములు, 7) మెడకు తగిన వస్త్రము అనే ఇహలోక దీవెనలు కోరుకుని దేవుడిచ్చే నిత్యజీవమనే రక్షణను పొందలేక దేవునికి శత్రువులై నశించిపోయారు. యాయేలు బట్ట గుడారములో నివసించినప్పటికీ ఆత్మీయ దీవెన పొంది. ఇశ్రాయేలు దేశానికి, ఆ దేశ ప్రజలకు ఎంతో దీవెనకరంగా జీవించింది. మనమును ఇట్టి 'యాయేలు' వలె అనేకులకు దీవెనకరముగా ఉండాలని ప్రయత్నించుదము గాక!

❊ ❊ ❊ ❊ ❊

# 8

# మాటతప్పని తండ్రికి మాటతప్పని తనయ -యెఫ్తా కుమార్తె

ఇశ్రాయేలీయులను ఏలిన పదమూడుమంది న్యాయాధిపతులలో యెఫ్తా ఎనిమిదవవాడు. అతనికి ఒక కుమార్తెను దేవుడిచ్చాడు. ఆమె కాక అతనికి మగ సంతానమే గాని ఆడు సంతానమే గాని లేదు. ఒక్క కుమార్తె పుట్టినా, ఆమె గారాబంగా పెరగలేదు. కానీ నేటి దినాల్లో ఉంటున్న అనేకమంది యౌవనస్థులకు మంచి మాదిరిగా నిలిచింది. ఆమె జీవితపు వివరాలలోకి ఇక వెళ్దామా.

**I. తండ్రిని సంతోషముతో ఎదుర్కొన్న యెఫ్తా కుమార్తె (న్యాయాధి 11:34):** యెఫ్తా అమ్మోనీయులతో యుద్ధములో గెలిచి విజయోత్సవముతో ఇంటికి తిరిగి వస్తున్న సందర్భములో తంబురతో నాట్యముతో తండ్రిని సంతోషముతో ఎదుర్కొంటున్న కుమార్తెను న్యాయాధి 11:34 లో చూస్తున్నాము. ఈనాడు పిల్లలందరూ తమ తల్లిదండ్రులకు సంతోషము కలిగించాలని దేవుడే తన వాక్యము ద్వారా చెబుతున్నాడు. పిల్లలు ఏమి చేస్తే తండ్రి సుఖిస్తాడు? సామెతలు 10:1 – జ్ఞానము గల కుమారుడు తండ్రిని సంతోషపరచును. బుద్ధిలేని కుమారుడు తన తల్లికి దుఃఖము పుట్టించును. అని వ్రాయబడినది. జ్ఞానము అంటే ఎవరు? 1కొరింథీ 1:31 ప్రకారము 'దేవుని మూలముగా యేసుక్రీస్తు మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనము నాయెను' అని వ్రాయబడింది. మన ప్రభువే మనకు జ్ఞానమైయున్నాడు. జ్ఞానము కలిగిన కుమారుడు తండ్రిని సంతోషపరుస్తాడు అంటే యేసుప్రభువును హృదయ మందుంచుకున్నవాడే తండ్రిని సంతోషపరుస్తాడని అర్థమవుతున్నది. అనగా ప్రభువును తన స్వంత రక్షకునిగా అంగీకరించినవాడే జ్ఞానము కలిగినవాడని నిజమైన అర్థము. సామెతలు 23:25 లో 'నీ తలిదండ్రులను నీవు సంతోషపెట్టవలెను' అని వ్రాయబడి ఉండగా చాలామంది పిల్లలు తండ్రిని సంతోషపరుస్తారు. కానీ తల్లిని నిర్లక్ష్యపెడతారు. కాని 25వ వచనములో క్రింది లైన్‌లోని వాక్యము, "నిన్ను కనిన తల్లిని ఆనందపరచవలెను" అని వ్రాయబడివుంది. తల్లికి చదువు లేదని, నాగరికత తెలియదని, మోటుదని ఇంట్లోనే ఉండేదని ఆమెను నిర్లక్ష్యము చేస్తారు. కానీ నిన్ను కన్నతల్లి, నవమాసములు మోసి ప్రసవవేదన అనబడు గండములోనుండి నిన్ను కనిన తల్లి గనుక ఎట్టి పరిస్థితిలోనూ ఆమెను ఆనందపరచవలెను అనే విషయాన్ని నేటి పిల్లలు తెలుసుకోవలసి ఉన్నది. ఎప్పుడు తలిదండ్రులు ఆనందిస్తారు? 26వ వచనములో, 'నా కుమారుడా, నీ హృదయము నాకిమ్ము' అని ప్రభువు పిల్లలను అడుగుతున్నాడు.

పిల్లలు తమ చిన్నవయసులోనే మీ హృదయాలు తండ్రియైన దేవునికియ్యాలి అన్నాడు. హృదయు ప్రభువుకివ్వడం మాత్రమే కాక, నా మార్గములు నీకింపుగా ఉండనిమ్ము అని ప్రభువు చెబుతున్నాడు. కొద్దిమంది పిల్లలు ప్రభువును నమ్మి తీర్మానము చేయుచున్నారే గానీ, ఆయన మార్గములలో యింపుగా ఇష్టముగా నడుచుట లేదు. తమ స్వంత మార్గములలోనే వారి ఇష్టాల ప్రకారమే నడుచుకొనుచుండుట గమనిస్తున్నాం. ఇక్కడ యెఫ్తా కుమార్తె తండ్రి యిష్టము చొప్పున తండ్రి మాట ప్రకారమే నడుచుకొంటున్నది. ఇటువంటివారి విషయమై తలిదండ్రులకు సంతోషమే. ఈ మాటలను చదువుచున్న ప్రియ యౌవనబిడ్డలారా, మీ హృదయాలు ప్రభువునకిచ్చారా? హృదయాన్ని ప్రభువుకిచ్చి ఆయన మార్గాల్లో నడుస్తున్నారా? ఆయన మార్గాలు మీకు ఇంపుగా ఉన్నాయా? ఆయన మీయందు సంతోషిస్తున్నాడా? మీరు ప్రభువుకు సంతోషాన్ని కలిగిస్తున్నారా? తంబూర వాయించుచూ నాట్యమాడుతూ యెఫ్తా కుమార్తె తండ్రిని ఎదుర్కొంటోంది. నాట్యము కాని, ఏ సంగీత వాయిద్యముగాని ఎవ్వరికైనా సంతోషాన్నే కలిగిస్తాయి. ఒకవేళ తన తండ్రి వేటివలన సంతోషిస్తాడో తెలిసిన కుమార్తె వాటి ద్వారానే అనగా తంబూర, నాట్యము ద్వారానే తండ్రిని సంతోషపరచింది. అలాగే పరమ తండ్రి సంతోషపడేది ఆత్మ రక్షించబడినపుడే ప్రభువు తన దూతలను పిలిచి వారితో కూడ సంతోషిస్తాడు. కనుక యువతీ యువకులారా, మీరందరూ ప్రభువుకు మీ ఆత్మలను అర్పించి ఆయనను సంతోషపెట్టాలని ప్రభువు కోరుతున్నాడు.

**A. కుమార్తెను చూసి కృంగి తల్లడిల్లిపోయిన తండ్రియైన యెఫ్తా:** కుమార్తెను చూచి నీవు నన్ను కృంగచేసితివి అన్నాడంటే తండ్రి కృంగిపోయేటంత చెడ్డపని కుమార్తె ఏదియూ చేయలేదు. ఆయన తల్లడిల్లిపోయే అవమానకరమైన పని ఏదియూ చేయలేదు. ఈ సందర్భానికి ముందుగా జరిగినదేమిటంటే, యెఫ్తా అమ్మోనీయుల మీదికి యుద్ధానికి వెళ్ళినపుడు క్షేమముగా తిరిగి ఇంటికి వచ్చినపుడు తన యింట ద్వారమునుండి బయలుదేరి వచ్చునదేదో అది యెహోవాకు ప్రతిష్ఠితమగును,మరియు దహనబలిగా దానినర్పించెదనని తాను దేవునికి ప్రమాణము చేసికొని వెళ్ళాడు. దేవుడతనిని ఇప్పుడు క్షేమముగా ఇంటికి తీసుకొని వస్తూ ఉండగా తన యింటి ద్వారము నుండి తన ఏకైక కుమార్తె బయటికి వస్తూ, తండ్రిని ఎదుర్కొనుట చూచి, నా కుమారీ, నీవు నన్ను బహుగా కృంగచేసితివి, తల్లడింపజేసితివి అన్నాడు. ఆయన ప్రమాణము చేసినపుడు తన కుమార్తె ఇంటి ద్వారము నుండి వస్తుంది అనుకొని ఉండడు. ఏదో ఒక గొఱ్ఱె, ఎద్దు వస్తుందని అనుకొని వుంటాడు. వాటి స్థానంలో తన ఏకైక కుమార్తెను చూచినప్పుడు ఆయన చేసికొనిన ప్రమాణము చొప్పున ఆమెను దేవునికి ప్రతిష్ఠించి, దేవునికి దహనబలిగా సమర్పించుటకు ఆయన సిద్ధముగా లేడు. కానీ కృంగిపోయాడు, తల్లడిల్లిపోయాడు.

కానీ, ఈ సమయములో మన పరమతండ్రియైన దేవుణ్ణి గురించి ఆలోచించి నపుడు, తన స్వంత జనితైక కుమారుని పాపాత్ములమైన మన కొరకు సమర్పించడానికి

జగదుత్పత్తికి పూర్వమే ఆయన ఇష్టపడ్డాడు. ఎఫెసీ 1:5 ప్రకారము తన కుమారుని పోగొట్టుకొని యేసుక్రీస్తు ద్వారా మనలను కుమారులుగా స్వీకరించుట కొరకై మనలను ముందుగా నిర్ణయించుకొన్నాడు. మనకు ప్రతిగా తన కుమారుడు మన స్థానము తీసికొని సిలువలో మేకుల ద్వారా, ముళ్లద్వారా, కొరడాల ద్వారా, దాహము, ఆకలి, ఎండ, దిగంబరత్వము, అన్యాయపు తీర్పు, వేదన, రోగాలు, వ్యసనాలు, అవమానము, ఉమ్మివేత ఇవన్నీ బాధలు అనుభవించుట చూచి తండ్రియైన దేవుడు తల్లడిల్లిపోలేదు. మనము మన పాపాల ఫలితమైన నరకవేదన అనుభవించడం ఆయన చూడలేక మనకు ప్రతిగా తన కుమారుని మన పాప ఫలితాన్ని పడవేయుట కిష్టపడ్డాడు. నా దేవా, నా దేవా, నన్నేల చేయి విడిచితివని కుమారుడు మొఱ్ఱపెట్టిననూ ఆయన కుమారుని చేయి విడిచిపెట్టి పాపులమై, జిగటగల దొంగ ఊబిలో దిగిపోవుచున్న నీ చెయ్యి, నా చెయ్యి పట్టుకొని తన కుమారుని చెయ్యి వదిలిపెట్టుట చూడగా దేవుని ప్రేమ మనమీద ఎంత విశేషంగా ఉన్నదో మనము చూడగలము. దేవుడు మనం నరకంలోకి వెళ్ళడం చూడలేక మన కొరకు తల్లడిల్లిపోయాడు. తన కుమారుడు అనుభవించే దారుణమైన సిలువ బాధ చూడకుండా ముఖము త్రిప్పివేసుకున్నాడు. కానీ మనము నరకంలో బాధపడడం ఆయన కిష్టము లేకపోవుట చూడగా ఆయన మనల్ని తన కుమారునికంటే ఎంతగా ప్రేమించాడో అర్థమౌతున్నది. యెఫ్తా తన కుమార్తెను చూచి ఆమెను దేవునికి ప్రతిష్ఠించడం, దహనబలి చేయడం ఇష్టంలేక బట్టలు చింపుకున్నాడు. కానీ సిలువలో బట్టలు లేక దిగంబరిగా చేయబడిన తన కుమారునికి ప్రేమతో బట్టలు సప్లై చేయలేదు. కానీ తన కుమారుని రక్తమునందు విశ్వసించి కడుగబడిన మనకు 1) నీతి వస్త్రము, 2) రక్షణ వస్త్రము, 3) ప్రశస్థ వస్త్రము, 4) ఉల్లాస వస్త్రము, 5) పెండ్లి వస్త్రము, 6) స్తుతి వస్త్రము, 7) ప్రకాశములును, నిర్మలమునునైన సన్నని నారవస్త్రములు అనే అనేక వస్త్రములు చూడగా స్వీకృత పుత్రులమైన మనయెడల తాను కన్న కుమారునికంటే ఎక్కువగా ప్రేమించడం చూడగా అట్టి ఆయన ప్రేమకై మనమెంతో స్తుతిస్తూ కృతజ్ఞులమై ఉండాలి.

యెఫ్తాకి తన ఒక్కతైన తన కుమార్తెను అర్పించుటకు కృంగిపోయి తల్లడిల్లి పోయినా న్యాయాధి 11:35 లో 'యెహోవాకు మాట యిచ్చియున్నాను గనుక వెనుకతీయలేను' అనే మంచిమాట పలికాడు. అలాగే దేవునికిచ్చిన మాటను వెనక్కు తీసుకోలేదు. నేరవేర్చుటకే ఇష్టపడి మాటకు కట్టుబడి ఉన్నాడు. యెఫ్తా వేశ్యకు పుట్టిన కుమారుడైనా యెహోవాను నమ్ముకొని, తన తల్లియైన వేశ్య గుణాలు కాక, నమ్మకస్తుడై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటూ యెహోవాకు ఇచ్చిన మాటను వెనుకకు తీసుకోలేను అంటున్నాడంటే, ఎంత భక్తిపరుడుగా, నీతిమంతుడుగా ఉంటూ కుమార్తెను పోగొట్టుకోవడానికైనా ఇష్టపడుతున్నాడు కానీ యెహోవాకిచ్చిన మాటను పోగొట్టుకోడానికి ఇష్టపడుట లేదంటే ఆయన ఎంత నిజాయితీపరుడో. ఎంత ప్రిన్స్‌పల్ మ్యాన్‌గా కనబడుతున్నాడో, ఎంత జీవిత విలువలు కలిగియున్నవాడో అనిపిస్తుంది. ఇటువంట

వారు ఈనాడు కానరారనిపిస్తుంది. అలాగే రోమా 8:32 లో తండ్రి తన స్వంత కుమారుని మనకోసం అనుగ్రహించుటకు వెనుకతీయక మనందరి కొరకు సిలువకు అప్పగించుట మాత్రమే కాక, సమస్తమును మనకు అనుగ్రహించుటలో దేవుని ప్రేమ ఎంత విస్తారమైనదో కదా!

**II. నీ నోటి మాట చొప్పున నాకు చేయుమని చెప్పిన యెఫ్తా కుమార్తె:** తండ్రియైన యెఫ్తా యెహోవాకు మాట ఇచ్చాడు. వెనక్కు తీసుకోలేను అని కుమార్తెతో చెప్పగా అది విని ఆ అమ్మాయి దిగ్భ్రాంతి చెందలేదు, బెదిరిపోలేదు. 'నా తండ్రీ, యెహోవాకు మాట ఇచ్చి ఉంటివా, నీ నోటి మాట చొప్పున నాకు చేయుము' అని తండ్రి మాటనుబట్టి ఆశ్చర్యము చెందక, దిగులుపడక ఎంతో తాపీగా తండ్రితో చెబుతోంది. తండ్రి మాటకు ఎంత విధేయత చూపుతుందో కదా. దేవునికి ప్రతిష్ఠించబడుటకు, దహనబలి అయ్యేందుకు ఎంత సంసిద్ధతను కనబరుస్తుందో కదా. కన్యకగా, యవన దశలో ఉంటున్నప్పటికీ యవనేచ్ఛలు, లోకేచ్ఛలు, దురితేచ్ఛలు, శరీరేచ్ఛలు నెరవేర్చుకొనే మనస్సు ఆమెలో లేదు. తండ్రి దేవునికిచ్చిన మాటలను నెరవేర్చుటకే తన మనసును అంకితము చేసుకున్నది. పుడితే ఇలాంటి పిల్లలే పుట్టాలి అని ఈ విషయాన్ని చదివే మీకు సోదరీలైన మీకు అనిపించుటలేదా? ఇంత మంచి అమ్మాయి బైబిల్‌లో మరెవ్వరైనా కనిపిస్తారా? మగ పిల్లలలో ఇస్సాకు తన మీదికి తండ్రియైన అబ్రాహాము కత్తి ఎత్తినా, మౌనంగా ఉన్న ఇస్సాకు కనిపిస్తున్నాడు. బ్రతుకు దినములన్నిటను వాడు యెహోవాకు ప్రతిష్ఠింతును అని తల్లియైన హన్నా చెప్పగానే, యెహోవాకు అక్కడనే మ్రొక్కిన, తల్లి మాటను వినిన సమూయేలు కనిపిస్తున్నాడు కానీ ఆడపిల్లలు యెఫ్తా కుమార్తెలాంటి మరెవ్వరు బైబిలులో కనిపించుటలేదు. ఈ అమ్మాయి అందరిలో అసమానమైనదే. ఎంత విధేయత ఆమెది!

ఈనాడు పిల్లలకు ఈ అమ్మాయి ఎంత మాదిరోకదా! ఈ యెఫ్తాలాగా అనేకమంది తలిదండ్రులు తమకు దేవుడు సంతానమిస్తే వారిని దేవుని సేవకిస్తామని తీర్మానం చేసుకుంటున్నారు. కాని పిల్లలు ఒప్పుకుంటున్నారా? మీరు దేవునికి ప్రమాణము చేసి వుంటే చేసి ఉండవచ్చు. నేను మాత్రం ప్రమాణం చేయలేదు. నన్ను అడగకుండా నా గురించి మీరే ఎలా తీర్మానం చేస్తారు? నా ఇష్టం, నా రాజ్యం, మీరెవ్వరు అలా నా విషయం ప్రమాణం చెయ్యడానికి? అని ఎదురు మాట్లాడేవారు కోకొల్లలు ఉన్నారు. ఒక్కతే కుమార్తె అయినా, గారాబంగా హద్దుమీరి ప్రవర్తించలేదు యెఫ్తా కుమార్తె. తండ్రి విధేయతలో పెరిగింది. 'తండ్రీ, నీ నోటమాట చొప్పున నాకు చేయుము' అని అంటున్నది. ఆమె యవ్వనస్తులకే కాదు, పెద్దవారందరికీ కూడా మాదిరిగా ఉన్నది. యోహాను 2:6 లో కానా వివాహంలో మరియ పరిచారకులతో 'ఆయన మీతో చెప్పునది చేయుడి' అనింది. మన ప్రభువు చెప్పినట్లే మనం చేయాలని మరియ ద్వారా నేడు మరోసారి ప్రభువు గుర్తు చేస్తున్నాడు. ఆది 3:17 లో దేవుడు ఆదాముతో నీవు నా మాట వినలేదు, నీ భార్య మాట విని తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలమును తింటివి కనుక 1) నీ నిమిత్తము నేల శపించబడియున్నది, 2) నీ ప్రయాసముతోనే నీవు బ్రతుకు

దినములన్నియు దాని పంటను తినెదవు, 3) అది ముండ్ల తుప్పలను, గచ్చపొదలను నీకు మొలిపించును, 4) నీ ముఖము చెమటకార్చి ఆహారము తిందువు, 5) నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువు అని శపించాడు. ఒక ఆజ్ఞ వినకపోతే 5 శాపాలు మనకు వచ్చాయని తెలుస్తుంది. అనగా ఆజ్ఞ వినకపోతే 'శాపములు' వస్తాయి అనే విషయాన్ని ఆలోచిస్తే ఎంతో భయమనిపిస్తుంది.

యెఫ్తా కుమార్తె శారీరక తండ్రికీ అంత విధేయత చూపించందంటే ఇక దేవాది దేవునికి విధేయత చూపమని ఎవ్వరూ ఆమెకు చెప్పాల్సిన అవసరమే లేదు కదా. తన మాట వినమని మనతో చెప్పిన దేవుడు తల్లిదండ్రుల మాట కూడా వినమని దేవుడు వారికి విధేయులై ఉండమని దేవుడు ఎఫెసీ 6:1 లో చెప్పాడు. అలా తలిదండ్రుల మాట వినుట పిల్లల ధర్మమని కూడా దేవుడు చెప్పాడు. ఈ ధర్మాన్ని యెఫ్తా కుమార్తె కలిగి ఉంది. ప్రియ యౌవనస్థులారా, మీరును మీ తలిదండ్రులకు యెఫ్తా కుమార్తెవలె మీ ధర్మాన్ని నెరవేరుస్తున్నారా? మన ప్రభువైన యేసుక్రీస్తు ఫిలిప్పీ 2:8 లో, యేసుప్రభువు ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా తండ్రికి విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించుకొన్నాడు. యేసుక్రీస్తు విధేయత అసమానమైన విధేయత. యేసుక్రీస్తు తండ్రితో, 'తండ్రీ, నేను నరుల కొరకు ప్రాణము పెట్టాలి. నా యిష్టమైన మరణము పొందుతాను' అని చెప్పాడనుకోండి. అది సంపూర్ణ విధేయత కాదు. మరణాలు చాలా రకాలు ఉన్నాయి. కానీ తండ్రి తన కుమారుని సిలువ మరణమే పొందాలన్నాడు. తండ్రి చెప్పినట్లే కుమారుడు దేవుని స్వరూపము గలవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని ఎంచుకొనక, 1) మనుష్య పోలికగా పుట్టడానికి, 2) అందులోను దాసుని స్వరూపము ధరించుకొనడానికి, 3) అందులోనూ రిక్తుడైన దాసునిగా ఉండడానికి, 4) సిలువ మరణము పొందడానికి విధేయత చూపాడు. తండ్రి చెప్పిన ప్రకారమే ఏ మార్పులు చేయక తండ్రి చెప్పినట్లే చేసి విధేయత చూపాడు. అందుకనే తండ్రి ఫిలిప్పీ 2:9 లో పరలోకమందున్న వారిని గానీ, భూమి మీద ఉన్నవారిలో కానీ, భూమి క్రింద ఉన్నవారిలో గానీ, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లు, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించాడు. కుమారుని విధేయతనుబట్టి తండ్రి ఆయనను అత్యధికంగా హెచ్చించినట్లు దేవుడు యెఫ్తా కుమార్తెను కూడా ఈ లోకములో హెచ్చిస్తాడని మనము నమ్మడానికి ఆస్కారమున్నది.

ప్రియ యౌవనస్థులారా, పెద్దలారా, తనకు విధేయులైనవారందరికి దేవుడు ఈ లోకంలోనే ఇచ్చే పరిశుద్ధాత్మను గురించి ప్రభువు అపొ.కా. 5:32 లో వ్రాయబడినది. కనుక మనము దేవునికి విధేయులమైతే మన విధేయతనుబట్టి, అవసరాన్నిబట్టి సమృద్ధియైన ఆత్మ నింపుదలను (తీతు 3:7) ప్రభువు మనకిస్తాడు. ఈలాగున మనము

దేవునికి, తల్లిదండ్రులకు మాత్రమే కాక, భార్యలైనవారు అన్ని విషయములలో భర్తలకు విధేయులై ఉండాలని కొలస్సీ 3:18 సెలవిస్తోంది. అంతమాత్రమే కాక 1పేతురు 1:16 ప్రకారము, విధేయులైన పిల్లలవలె సమస్త ప్రవర్తనలో పరిశుద్ధులై ఉండాలని దేవుడు కోరుతున్నాడు.

**III. రెండు నెలలు తనను విడువమని తండ్రితో చెప్పిన యెఫ్తా కుమార్తె (న్యాయాధి 11:37):** రెండు నెలలు తనను విడువుమని తండ్రితో కుమార్తె చెప్పిందంటే విడువకుండా తండ్రి కుమార్తెను పట్టుకొన్నాడని అర్థమవుతుంది. ఎందుకంటే, తాను దేవునికిచ్చిన మాట ప్రకారం ఆమెను వెంటనే దేవునికి ప్రతిష్ఠించి, దహనబలిగా చేయాలి గనుక ఇక ఆమె బ్రతికే సమయం కొంచెమే, ఇక ఆమె తనకు దొరకుండా దహనబలిగా అర్పించబడుతుంది గనుక వదలకుండా కుమార్తెను పట్టుకున్నాడు. అప్పుడైనా కుమార్తె తండ్రి చేతుల్లోంచి విడిపించుకొంది కాబోలు. తండ్రీ, 2 నెలల వరకు నన్ను విడిచిపెట్టు, నేను కొండలమీదికి వెళ్ళి నా కన్యాత్వమును గూర్చి ప్రలాపిస్తానని తండ్రిని సెలవు అడుగుతుండగా ఇక్కడ తండ్రీ కుమార్తెల ఇద్దరి సమర్పణను మనము గ్రహించవచ్చును.

త్వరలో దేవునికి అర్పణ కాబోతున్న కుమార్తె తన నుండి దూరం కాకూడదని ఆమెను వదలకుండా పట్టుకున్న తండ్రి, తనను 2 నెలలు గడువు కోరిన కుమార్తెకు ఆ రెండు నెలలు కొండలకు వెళ్ళి దేవుని సన్నిధిలో కాలము గడుపుటకు అనుమతి ఇచ్చుట చూడగా చివరి దినాల్లో కూడా ఆమె తన దగ్గర ఉంచుకోకుండా ఆమెను కొండకెళ్ళుటకు అనుమతి ఇచ్చాడంటే రెండింతలుగా ఆమెను దేవునికి సమర్పించాడని మనము గ్రహించవచ్చు. యెఫ్తా తన కుమార్తెను 2 నెలలు తనకు దూరంగా కొండల మీద గడుపుటకు ఇష్టపడి త్యాగము చేయగా తండ్రియైన దేవుడు తన ప్రియ కుమారుని మూడున్నర సంవత్సరాలు ఈ లోకానికి పంపాడంటే దేవుని త్యాగము ఎంత అసమానమైనదో అని అనిపిస్తుంది. యెఫ్తా కుమార్తె తన కన్యాత్వాన్ని గురించి కన్నీరు కార్చితే దేవుని కుమారుడైన యేసుక్రీస్తు పాపులమైన మనందరి కొరకు సిలువలో రక్తము కార్చి మన కన్నతండ్రిగా అయ్యాడు. ఈ సందర్భములో తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు త్యాగాలు ఎంతో పొగడతగినవి.

అలాగే యెఫ్తా కుమార్తె తాను జీవించబోయే ఆ రెండు నెలలు తన శారీరక తండ్రితోను, తన బంధువులతోను, తన చివరి దినములు గడపాలనుకోలేదు. గానీ, ఈ చివరి దినములు పరలోక తండ్రితోను, తన ఆత్మీయ బంధువులైన తనతో కూడ దేవుని సన్నిధిలో ప్రలాపించుటకు వస్తున్న తన స్నేహితులతోను ప్రార్థించుటకు ఒప్పుకుంది. అంటే ఆ కుమార్తె యొక్క త్యాగము కడా ఎంత గొప్పదో కదా. తండ్రి ఎంత త్యాగమూర్తియో, కుమార్తెయూ అంతే త్యాగమూర్తిగా కనబడుచుండగా ఎంత తండ్రికి తగిన తనయగా ఉన్నదో మనకు అర్థమవుతుంది.

**IV. తన చెలికత్తెలతో కన్యాత్వమును గూర్చి స్నేహితులతో కూడా ప్రలాపించిన యెఫ్తా కుమార్తె (న్యాయాధి 11:38):** యెఫ్తా కుమార్తె కన్యాత్వమును గురించి ఎందుకు ప్రలాపించింది? ఆమె దేవునికి ఇప్పుడు దహనబలిగా అర్పించబడితే, తన తండ్రికి తాను ఒక్కతే కుమార్తె కాబట్టి. ఆమె కన్యాత్వములో ఉన్నది కాబట్టి. కనుక తనకు సంతానము లేదు. కాబట్టి తన తండ్రికి మనుమలు, మనుమరాళ్లు లేరు కాబట్టి. తాను లేని లోటును తండ్రికి తీర్చేవారు లేరు కాబట్టి. ఆమె తన కన్యాత్వాన్నిట్టి ప్రలాపించింది. న్యాయాధి 10:3-4 లో యెఫ్తాకు ముందున్న న్యాయాధిపతియైన యాయీరుకు 30 మంది కుమారులున్నారు. కానీ యెఫ్తాకు ఈ కుమార్తె తప్ప వారసులెవరూ లేరు. తన తండ్రి పేరును నిలబెట్టేవారు ఎవరునూ లేరు. ఈమె మరణంతో యెఫ్తా వంశవృక్షము కూలిపోతుంది. కాబట్టి ఆమె ప్రలాపిస్తోంది. న్యాయాధి 12:8-9 లలో తన తరువాతి న్యాయాధిపతియైన ఇబ్సానకు కూడా 30 మంది కుమారులు, 30 మంది కుమార్తెలు ఉన్నారు.

యెఫ్తా కుమార్తెకు ఇంకా పెళ్ళి కాలేదు. కనుక ఆమె మాతృమూర్తి కాలేక పోయింది. ఇశ్రాయేలు స్త్రీలు సంతానము లేకపోవుటను ఒక శాపముగా పరిగణిస్తారు. మెస్సీయను కనే తల్లిగా ఉండాలని చాలామంది స్త్రీలు ఆశించేవారు. అలాంటి తల్లి కానందుకు యెఫ్తా కుమార్తె తాను సంతానమను పొందలేని కన్యకనుగా ఈ లోకాన్ని వదిలిపోవాల్సి వచ్చినందుకే ప్రలాపించుచుండగా యేసుప్రభువును నమ్ముకొని ఆయనను ప్రధానము చేసికొని, రేపు ప్రభువు వస్తే ఆయన పెండ్లి భార్యగా కాబోయే ప్రియసోదరీ, ఈ లోకం విడువక ముందే, రాకడలో ఎత్తబడకముందే యేసుప్రభువుకు ఆత్మలనేమైనా కన్నావా? అలా ఆత్మలను కనకుండా కన్యక దశలోనే ఉంటూ, ఆత్మీయంగా తల్లివిగా లేనందుకు ప్రలాపము లేకపోయినా, కొంచెమైనా దుఃఖము లేదా? ఆత్మల కోసం విలపించుట లేదా? శరీర రీతిగా సంతానము లేకపోతే డాక్టర్స్ చుట్టూ, హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతుంటారు గానీ ఆత్మీయంగా పిల్లలను కనలేకపోతున్నామే అన్న చింతలేదా?

లేయా ద్వేషిస్తున్న తన భర్త కొరకు ఆరుగురిని కనియున్నాను అని చెప్పింది. నీ పరమ ప్రభువు నిన్ను ద్వేషించుట లేదుకదాయ ప్రేమిస్తూనే ఉన్నాడు కదా. మరి, ఆయన కొరకు ఆత్మీయముగా ఎందుకు పిల్లలను కనలేకపోవుచున్నావు? జాన్ నాక్స్ అనే భక్తుడు, 'నాకు స్కాట్లాండ్ దేశాన్ని ఇవ్వు, లేకపోతే నన్ను తీసుకో' అని దేవుణ్ణి ప్రార్థించేవాడట. అపొస్తలుడైన పౌలు అనేకులను రక్షణలోనికి నడిపించి అనేక సంఘాలను కట్టాడు. పేతురు మొదట 3,000 మందిని, ఆ తరువాత 5,000 మందిని, ఆ తరువాత మరెంతమందినో ఆత్మలను సంపాదించాడు. 1కొరింథీ 9:19-20 లో, అందరి విషయము స్వతంత్రుడనై యున్నాను, ఎక్కువమందిని సంపాదించుకొనుటకై అందరికిని నన్ను నేనే దాసునిగా చేసికొంటిని. యూదులను సంపాదించుకొనుటకు యుదులకు యూదునివలె ఉంటిని. ధర్మశాస్త్రమునకు లోబడినవారిని సంపాదించుకొనుటకు . . . ధర్మశాస్త్రమునకు లోబడినవానివలె ఉంటిని. బలహీనులను సంపాదించుకొనుటకు

బలహీనులకు బలహీనుడనైతిని. ఏ విధము చేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధములవాడనై యున్నాను' అన్నాడు. రోమా 9:3 లో, 'దేహసంబంధమైన నా సహోదరుల కొరకు నేను క్రీస్తునుండి వేరై శాపగ్రస్తుడనై యుండగోరుదును' అని భారంతో మాట్లాడాడు. రోమా 15:21 లో, 'క్రీస్తు నామమెరుగని చోట్లను సువార్తను ప్రకటింపవలెనని మిక్కిలి ఆశగలవాడనై యుండి అలాగున ప్రకటించితిని' అని పౌలు ఆత్మల విషయమై భారంతో ఉన్నాడు. ప్రియ సోదరీ, నీకు అలాంటి భారమున్నదా?

యిర్మీయా 9:1లో, 'నా జనులలో హతమైనవారిని గూర్చి నేను దివారాత్రము కన్నీరు విడుచునట్లు నా తలను జలమయముగాను నా కన్నీళ్ళు ఊటగాను ఉండును గాక' అని యిర్మీయా ఏడుస్తూ ఉన్నాడు. అదే యిర్మీయా 9:17 లో వ్రాయబడినట్లు నశించి నరకాగ్నిలో పడిపోవు వారి కొరకు రోదించు స్త్రీలను, తెలివిగల స్త్రీలను కన్నులు కన్నీళ్లు విడుచునట్లుగాను, కనురెప్పల నుండి నీళ్ళు ఒలుకునట్లుగాను వారు త్వరపడి మనకు రోదన ధ్వని చేయమని యిర్మీయా ఆ స్త్రీలను పిలిపించి చెప్పమని వ్రాశాడు. ప్రియ సోదరీ, అలా రోదించి, కన్నీళ్ళు విడిచే స్త్రీలుగా ఉన్నామా? విలాప 2:19 లో వ్రాయబడినట్లు మన పసిపిల్లల, యవనస్థుల, భర్తల, బంధువుల, అత్తమామల రక్షణకై రేయి మొదటిజామున లేచి నీళ్ళు కుమ్మరించినట్లు ప్రభువు సన్నిధిని కుమ్మరించే స్త్రీలుగా ఉన్నామా? యిర్మీయా 31:15-16 లో రాహేలు తన పిల్లలను గూర్చి ఏడుస్తోంది. ఆమె ఓదార్పు పొందనొల్లక ఏడుస్తోంది. అలాగున ప్రియసోదరీ, నీ పిల్లల కొరకు ఏడుస్తున్నావా? ఆది 21:16, హాగరు తన కుమారుడైన యిష్మాయేలు చావు చూడలేను అనుకొని వింటివేత దూరము వెళ్ళి ఎదురుగా కూర్చుండి ఎలుగెత్తి ఏడ్చినట్లు నీ కుమారుల కొరకై, కుమార్తెల కొరకై, కోడండ్ర, అల్లుళ్ళ, అత్తమామల కొరకై ఎలుగెత్తి ప్రార్థిస్తున్నావా? 1సమూ 30:3లో, దావీదును అతని జనులను సిక్లగు పట్టణమునకు వచ్చి అది కాల్చబడియుండుటయు, తమ భార్యలను కుమారులను, కుమార్తెలను చెఱలోనికి కొనిపోబడియుండుటయు చూచి ఇక ఏడ్చుటకు శక్తిలేకపోవునంత బిగ్గరగా ఏడ్చారట. ప్రియసోదరీ, అంతటి బిగ్గరగా ఏడ్చే భారం నీకున్నదా? అందరికంటే మిన్నగా మన ప్రభువైన యేసుక్రీస్తు లూకా 19:41 లో, యెరూషలేము పట్టణమును చూచి దానిని గురించి ఏడ్చి, 'నీవును ఈ నీ దినమందైనను సమాధాన సంబంధమైన సంగతులను అనగా సమాధాన సువార్తను గూర్చిన సంగతులను, రక్షణార్థమైన సంగతులను తెలిసికొనిన యెడల నీకెంతో మేలు' అని ఏడ్చి చెప్పినట్లు చూస్తున్నాము. ప్రియ సోదరీలారా, పైన ఆత్మల కొరకై కన్నీరు కార్చిన, విలపించిన, రోదించిన అనేకులను ఉదాహరణగా చూశాం. అలాగున మనమందరము కన్నీటితో విలపించి, రోదించి ప్రార్థించుదుము గాక!

యెఫ్తా కుమార్తె తానొక్కతే కాక తన చెలికత్తెలతో కూడ ప్రలాపించిందని చదువుచున్నాము. సాధారణంగా స్నేహితురాండ్రు సంతోష సమయాలకు మన ఇళ్లకు వస్తారు. కాని ప్రలాపించి ప్రార్థించే సమయానికి, అందులోను ఇంటికి కాదు, కొండల మీది విహారయాత్ర కొరకు వస్తారేమో కానీ ప్రలాపించుటకు ఎవరైనా వస్తారా?

అందులోను రెండు నెలలు ప్రలాపించుటకు వారొచ్చారు. అంటే ఆ చెలికత్తెలు ఎంత భక్తిగల స్నేహితులో కదా. సంతోషించువారితో సంతోషించుడి అన్న వాక్యాన్ని రోమా 12:15,16 లోని వాక్యాన్ని నెరవేర్చేవారు అత్యధికులు ఉంటారు కానీ ఆ వచనములోనే 'ఏడ్చువారితో ఏడ్వుడి' అనే మాటను నెరవేర్చేవారెవరూ ఉండరు. కానీ ఈమె స్నేహితులు నిజమైన భక్తిగల స్నేహితులు. ఎస్తేరు యొక్క చెలికత్తెలు కూడా మూడు రోజులు అనగా ఆరు పూటలు ఉపవాస ప్రార్థనలో ఎస్తేరు కొరకు ప్రార్థించారు. ఒక్క పూట ఉపవాస ప్రార్థనకు ఒకవేళ అతి కష్టముతో కొద్దిమంది వస్తారామే కానీ, తొమ్మిది పూటలు ఉపవాస ప్రార్థన నేడు ఎవరు చేస్తారు? ఎస్తేరు, యెఫ్తా కుమార్తె చెలికత్తెలు చాలా మాదిరిగా ఉన్నారు.

ప్రియ సోదరీ, ఈనాడు నీ స్నేహితులెవరు? కీర్తన 119:63 లో దావీదు, 'నీయందు భయభక్తులు గలవారందరికిని, నీ ఉపదేశములను అనుసరించువారికిని నేను చెలికాడను' అని అన్నాడు. నీ ఫ్రెండ్ ఎవరో చెప్పు, నీవెట్లాడివాడివో నేను చెబుతాను' అనే సామెత (Tell me about your friend, I will tell what you are) ఒకటి ఉంది. ఈ సామెత ప్రకారం నీ స్నేహితులెవరు? ఆరు నెలలు ఎవరైన ఇద్దరు కలసి ఉంటే వారు వీరు అవుతారు. వీరు వారు అవుతారు అని అంటుంటారు. కీర్తన 119:79 లో, నీ యందు భయభక్తులు గలవారును నీ శాసనములను తెలిసికొనువారును నా పక్షమున ఉందురుగాక అని దావీదు అంటున్నాడు. 2తిమోతి 2:22 లో పౌలు, నీవు యవనేచ్ఛల నుండి పారిపొమ్ము. పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితో కూడ నీతిని, విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడుము' అని పవిత్ర హృదయములతో ప్రార్థించువారితో స్నేహించాలని చెబుతున్నాడు. స్కూల్‌లో గానీ, కాలేజీలలో గానీ, యూనివర్సిటీలలో గానీ, జాబ్స్‌లో గానీ క్రొత్తగా జాయిన్ అయ్యేవాళ్ళు విశ్వాసులైన, భక్తిపరులైన, ప్రార్థనాపరులైన స్నేహితులు ఇవ్వాలని ప్రభువును ప్రార్థించుకోవాలి. అట్టి స్నేహితులతో మనం చక్కని సహవాసం పొందుకోగలము, ప్రభువును మహిమపరచగలము.

**V. మాటతప్పని తండ్రికి మాటతప్పని యెఫ్తా కుమార్తె:** 'యెహోవాకు మాట యిచ్చియున్నాడు గనుక వెనుకతీయలేనని' తండ్రి కుమార్తెతో చెప్పగా, తండ్రిలాగానే ఈమె కూడా తండ్రికి తానిచ్చిన మాటనుబట్టి కొండపై తన కన్యాత్వమునుబట్టి ప్రలాపించిన తరువాత తానిచ్చిన మాట ప్రకారమే తండ్రి యొద్దకు తిరిగి వచ్చింది. తండ్రి ఏలాగున మాటను ఇచ్చి నెరవేర్చేవాడో అలాగే కుమార్తె కూడా మాట ఇచ్చి నెరవేర్చేదిగా కనబడుతోంది. కీర్తన 15:4లో వ్రాయబడినట్లు ప్రమాణం చేయగా నష్టము కలిగినను మాట తప్పని వ్యక్తిగా యెహోవా గుడారములో అతిథిగా ఉండతగిన వ్యక్తివలె కనబడుతోంది. తన తండ్రి దేవునితో తన విషయము ప్రమాణము చేయుట వలన ఆమె దేవునికి దహనబలిగా చేయబడుట వలన తనకు ప్రాణనష్టము కలిగిననూ, తండ్రి దేవునికిచ్చిన మాటను తాను నెరవేర్చుటకే ఆమె దేవుని గుడారములో అతిథిగా

ఉండదగినదిగా కనబడుతోంది. అతిథి మన ఇంటికి వస్తే ఎలా భోజన సత్కార్యాలు చేస్తామో దేవుడు తన పరలోకపు ఇంటిలో ఈ కుమార్తెకు తానే అతిథి సత్కార్యాలు చేస్తాడని మనము పై వాక్య ప్రకారము తెలుసుకుంటున్నాము. సంఖ్యా 23:19 ప్రకారము, 'మన దేవుడు మాటయిచ్చి స్థాపించకుండా నెరవేర్చకుండా ఉండే దేవుడు కాబట్టి మనమందరమూ ఆయనలాగే ఉండాలని నేర్చుకుంటున్నాము.

**VI. తాను మ్రొక్కుకొనిన మ్రొక్కుబడి చొప్పున తన కుమార్తెకు చేసికొనిన యెఫ్తా (న్యాయాధి 11:39):** తన తండ్రి మొక్కబడి చొప్పున తన కుమార్తెకు చేసెను అని అంటే ఆమెను యెహోవాకు ప్రతిష్ఠించి దహనబలిగా అర్పించాడని దాని భావమా? అలాగున కాదని వాక్యసేవకులు నమ్ముతున్నారు. యెషయా 66:3 ప్రకారము, ఎద్దును చంపితే నరుని చంపినట్టేనట. గొఱ్రెపిల్లను అర్పిస్తే కుక్కమెడను విరిచినట్లుట. ఇక మనిషిని అర్పిస్తే దేవుడు ఇష్టపడతాడా? నరబలి ఆయన స్వీకరించువాడు కాదు. అలా స్వీకరించేవాడైతే ఇస్సాకు మీద నీ చెయ్యి వేయవద్దు అని అబ్రాహాముతో దేవుడు చెప్పేవాడా? సంఖ్యా 18:15లో మనుష్యుని తొలిచూలు పిల్లను వెలయిచ్చి విడిపింపవలెను అని చెప్పుట చూడగా నరబలి దేవుడు ఇష్టపడడని మనకు తెలుస్తుంది. కనుక యెఫ్తా తన కుమార్తెను దేవునికి సేవకురాలిగా ప్రతిష్ఠించి, దేవుని మందిరములో తన జీవితాంతము మందిర సేవ చేయుటకు సమర్పించియుండవచ్చునని అనేకమంది వాక్య సేవకులు అంగీకరించుచున్నారు.

ఈనాడు ఎంతమంది తండ్రులు తమ పిల్లలను ప్రభువు సేవకు సమర్పిస్తున్నారు? ఫిలిప్పుకు 4గురు కుమార్తెలు. వారు కన్యకలుగా ఉన్నారు. ఒకరి తరువాత ఒకరు పెళ్ళిళ్లకు వరుసగా వయసురీత్యా సిద్ధముగా ఉన్నారు. పెళ్ళి ఈడు వచ్చినవారుగా ఉన్నారు. వారికి తమ పెండ్లిని గూర్చి చింత లేదు. కానీ ఆ నలుగురు ప్రవచిస్తున్నారని లేఖనములో వ్రాయబడింది. వారి తండ్రిలాగానే వారునూ ప్రభువు సేవకు అర్పించుకున్నారు. వారి తండ్రి కూడా ఆ నలుగురు కుమార్తెలను సంతోషంగా ప్రభువు సేవకు సమర్పించాడు. ప్రియసోదరీ, నీకొక్కదైన నీ కుమార్తెను గానీ, ఒక్కడైన నీ కుమారుని గానీ దేవుడడిగితే అబ్రాహాము వలె, యెఫ్తావలె, హన్నావలె సమర్పించగలవా? తండ్రియైన దేవుడు కూడా తనకొక్కడైయున్న అద్వితీయ కుమారుని మనకొరకు అర్పించడానికి వెనుకతీయలేదు కదా. ఆయనతోపాటు సమస్తమును మనకనుగ్రహించానన్నాడు కదా. ఆలాగున ప్రియ సోదరీ, నీ పిల్లలను ప్రభువు సేవకు అర్పించే భారము కలిగి ఉన్నావా? ప్రార్థించు. ప్రభువు భారమిస్తాడు. యెహోషువ చెప్పినట్లు నీవును నీ యింటివారును యెహోవానే సేవించులాగున సమర్పించుకో.

**VII. పురుషుని ఎరుగనేలేదు అని చక్కని సాక్ష్యము పొందిన యెఫ్తా కుమార్తె (న్యాయాధి 11:40):** ప్రత్యేకంగా, ప్రాముఖ్యంగా యెఫ్తా కుమార్తె పురుషుని ఎరగనేలేదు అని వ్రాయించుటలో దేవుని ఉద్దేశమేమిటి? ఆ దినాల్లోని కుమార్తెలు అందరూ పురుషుని

ఎరిగినవారుగా ఉంటూ ఉండరేమో. ఈ యెఫ్తా కుమార్తె మాత్రమే పవిత్రంగా జీవిస్తోందేమో. అందుకే ఈమె విషయమై 'పురుషుని ఎరుగనే' లేదు అని వ్రాయించాడు. ఆ కాలములోని కుమార్తెలకు భిన్నంగా ఈ కుమార్తె పవిత్రముగా నడుచుకుంది. ఆది 6వ అధ్యాయములోని నరుల కుమార్తెలు దేవుని కుమార్తెలతో పాపము చేస్తూ వచ్చారని వ్రాయబడింది. ఆది 24:16 లో రిబ్కాను గురించి 'ఏ పురుషుడును ఆమెన చూడలేదు' అని స్పెసిఫిక్‌గా వ్రాయబడింది. మరి న్యాయాధిపతుల కాలంలో పాపం ఇంకా పెచ్చుపెరిగిపోయి ఉంటుంది. న్యాయాధి 19 అధ్యాయములో రాజులేని దినములలో ఒక లేవీయుడిని ఉపపత్నిని ఆనాటి బెన్యామీనీయులు బలవంతము చేయగా ఆమె ఏలాగున మరణించిందో మనకు తెలుసు. న్యాయాధి 19:24లో, ఇశ్రాయేలీయులలో జరిగిన వెఱ్ఱితనము అని వ్రాయబడింది. అట్టి భయంకరమైన వ్యభిచార, జారత్వ పాపము ఇశ్రాయేలీయుల మధ్యలోనే జరుగుతున్న రోజుల్లో యెఫ్తా కుమార్తె తన పవిత్రతను, తన శీలాన్ని ఎంతగా కాపాడుకున్నదో అనే విషయం నేటి ఆడపిల్లలకు మాదిరి కాదా!

ఈనాడు క్రైస్తవ విశ్వాసుల పిల్లలే అన్యులను స్నేహించి వారి వెంబడి వెళ్తున్నారు. చిన్నప్పటి నుండి నేర్చుకున్న వాక్యాలు ఏమయ్యాయో! లేక వాక్యాన్ని వినకుండా చెవిటి దయ్యాలు వారిలో పనిచేస్తున్నాయేమో, లేక దేవునియందు భయభక్తులు పిల్లల్లో లేకుండా ఉంటున్నారో! లేక సినిమాలననుసరిస్తున్నారేమో ఏమో అనిపిస్తుంది. ఎవరు నచ్చితే వాళ్ళతో వెళ్ళిపోతున్నారు. ఈలాగు చేయడం అన్యులే కాదు, మన విశ్వాసుల పిల్లలే అలా చేస్తున్నారు. సెకెండ జెనరేషన్ పిల్లలే అలా చేస్తున్నారంటే, అతి చిన్న వయసులో నుండే పిల్లలకు మ్యారేజ్ గురించి కౌన్సిలింగ్ ఇవ్వాల్సి ఉంది. ఈ తరమువారికి యేసుప్రభువు వ్యభిచార తరము అని పేరుపెట్టాడు. ఇట్టి తరమువారిలో నుండి బయలువెళ్ళి ప్రత్యేకముగా ఉండండని 2కొరింథీ 6:18 లో వ్రాయబడిన ప్రకారము యెఫ్తా కుమార్తెవలె యౌవన పిల్లలు తమ పవిత్రతను కాపాడుకోవాలి.

ప్రియ యౌవ్వలారా! మీ కన్యాత్వాన్ని కాపాడుకుంటున్నారా? పెళ్ళి కాకముందే పురుషునితో అడుగులు వేస్తున్నారా? చాలామంది అమ్మాయిలు అబ్బాయిలతో గంటలకొలది సెల్‌ఫోనులలో సంభాషణలు చేస్తున్నారు. 'హోలి' పండుగలో అబ్బాయిలు అమ్మాయిలకు రంగులు పూస్తున్నారు. అమ్మాయిలు వారిచే రోడ్లలో రంగులు పూయించుకుంటున్నారు. అందరూ చూస్తున్నారేమో నన్న సమాజ భయము కూడా ఉండడము లేదు. ఈలాగున అనేకమైన అనవసర సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఆడపిల్లలూ, జాగ్రత్త. అరిటాకు ముళ్ళ మీద పడినా, ముల్లు అరిటాకు మీద పడినా డ్యామేజ్ అరిటాకువంటి ఆడపిల్లకే. క్షణికకాల సంతోషాలకు మీ జీవితాలను ఫణంగా పెట్టుకోవద్దు. మగపిల్లలతో కలిసి సినిమాలకు, షికార్లకు, పబ్స్‌కు, హోటల్స్‌కు, ఆయా స్థలాలకు వెళ్ళకండి. జ్ఞానయుక్తంగా నడుచుకోండి. రిబ్కా, యెఫ్తా కుమార్తె వివాహాల వరకు కన్యలుగానే ఉండినారు. అందుకే వారు మంచి సాక్ష్యాలు కలిగిన 'మహామాదిరిగా' వాళ్ళ జీవితాల్లో పేరుతెచ్చుకున్నారు. దేవుణ్ణి మహిమపరిచారు. ఈలాటి పిల్లలు చాలా

అరుదుగా ఉన్నారు ఈ రోజుల్లో. అట్టివారిలో ప్రియబిడ్డా, నీవున్నావా? నీ పెళ్ళి కాకముందు నీ ఒళ్ళు కాపాడుకున్నావా? ఏలయనగా నీ దేహము దేవుని ఆలయం. దానిని గురించి దేవుడు నిన్ను లెక్క అడుగుతాడు. పెళ్ళికి మునుపే పురుష సాంగత్యము చేసి గర్భవతులై అబార్షన్ చేసుకుంటూ నరహత్య చేస్తున్నారు. మరికొందరు దొంగగా పిల్లలను కనేసి డస్ట్‌బిన్స్‌లో పారేస్తున్నారు.

ఇలాగే ఒకమ్మాయి తన అక్రమ సంబంధంతో కనిన పిల్లను ఎలా వదిలించు కోవాలో తెలియక ఒక పాత్రలో నీళ్ళు పోసి అందులో ఈ పసికందును పెట్టి ఆ పాత్రను వెలిగించిన స్టౌమీద పెట్టి ఇల్లు తాళంవేసి వెళ్ళిపోయిందట. విషయం తెలుసుకున్నవారు పోలీస్ కంప్లెయింట్ ఇవ్వగా వారు ఆ బిడ్డ తల్లిని కటకటాల వెనక్కి పంపడం జరిగింది. అబార్షన్ చేసుకోవడం వల్ల తల్లుల గర్భాశయాలే పిల్లలకు సమాధులౌతున్నాయి. దేవుడివన్నీ తీర్పులోనికి తీసికొనిరాడా? కొద్దిమంది అక్రమ సంబంధము ద్వారా కనిన పిల్లలను హాస్పిటల్స్‌లో వదిలెయ్యడమో, బస్‌స్టాండ్స్‌లోనో, రైల్వేస్టేషన్స్‌లోనే వదిలెయ్యటమో చేస్తున్నారు. ఒకసారి ఎవరో ఇలాంటి ఒక చిన్న పసికందును ఎవరో ముళ్ళకంపలో పారేసి వెళ్ళగా ఒక కుక్క ఈ పసికందును తీసికొని వచ్చి జనాల మధ్యలో వదిలి వెళ్ళిందట. చూడండి, మనిషికి లేని దయ, కనికరం కుక్కలో ఎంతగా ఉన్నాయో. ఇట్లు వదిలివేయబడిన పిల్లల ఆలనా, పాలనా, పోషణ, సంరక్షణల సంగతేంటి? వారిని పట్టించుకునే నాధులెవరు? అట్టి అనాధ పిల్లలు దొరికితే ఆడపిల్లను డబ్బుకు అమ్మేసుకుంటున్నారు మరికొందరు. ప్రియ యవనస్థులారా, ఎందుకీ అవినీతి జీవితము? తల యెత్తుకొని జీవించే పవిత్ర జీవితం కావాలా? నేడే యేసుప్రభువుని ఆశ్రయించు. మారుమనస్సు పొందుకో. పాపాలన్నీ ఒప్పుకో. అపనమ్మకస్థుడైన ఆ పరాయివాడికి నీ జీవితాన్ని అర్పించుకొనే బదులు, నమ్మకస్థుడును, సత్యసాక్షియైన ప్రభువుని నీ ప్రాణనాధునిగా నమ్ముకొని గుణవతిగా, సౌశీల్యవతిగా తీర్చిదిద్దబడాలని కోరుతున్నాడు నీ నిజ ప్రేమికుడైన ప్రాణమిచ్చిన యేసుప్రభువు.

ప్రియ యవ్వనబిడ్డలారా, మీరు జారత్వపు పాపములో పడితే మీరు అపవిత్రులవ్వడం మీ స్వంత కన్న తండ్రులకు మాత్రమే కాక మీ ఆత్మీయ తండ్రియైన మీ పరలోక తండ్రియైన దేవుణ్ణి మీరు అపవిత్రునిగా చేసినవారౌతారు. వ్రాయబడినట్లు మిమ్మునుబట్టియే కదా నా నామము దూషణపాలగుచున్నదని ప్రభువు చెబుతున్నాడు. ఇదేనా నీవు దేవునికి తెచ్చిన చెడ్డపేరు. ఈలాటి జీవితం నీవు జీవించుట కొరకేనా ప్రభువు నిన్ను రక్షించింది? నీ పాపాలు ప్రభువు దగ్గర ఒప్పుకొని దావీదు లాగా పశ్చాత్తాపము పొందు. పశ్చాత్తాపము రక్షణార్థమైన మారుమనసును కలిగిస్తుంది. 2కొరింథీ 11:2 ప్రకారం, పవిత్రురాలైన కన్యకనుగా ఒక్కడే పురుషునికి అనగా క్రీస్తుకు నిన్ను సమర్పించుకో. 1కొరింథీ 7:34 ప్రకారము శరీరమందును, ఆత్మయందును పవిత్రురాలై ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతింతము.

**VIII. ప్రసిద్ధికెక్కిన యెఫ్తా కుమార్తె (న్యాయాధి 11:40):** ఇంతవరకు యెఫ్తా కుమార్తెను గురించి 1) తండ్రిని సంతోషపరచినదిగాను, 2) తండ్రి నోటిమాట చొప్పున జీవించేదిగాను, 3) రెండు నెలలు తండ్రిని విడిచి ప్రార్థించుటకు కొండలకెళ్ళినదానిగాను, 4) మాటతప్పని తండ్రికి మాటతప్పని కుమార్తెగాను, 5) తండ్రి మ్రొక్కుబడి చొప్పున దేవునికి అర్పించుకొనినదానిగావీ, 6) పురుషుని ఎరుగనిదానిగాను ఆరు రీతులుగా ఆమెను గూర్చి మంచి సాక్ష్యము చూశాము. ఇట్టి చక్కని మాదిరియైన సాక్ష్యము కలది కాబట్టియే ఇశ్రాయేలు కుమార్తెలు యెఫ్తా కుమార్తెను ప్రతి సంవత్సరము 4 రోజుల ప్రసిద్ధి చేస్తారట. ఇంతటి విధేయురాలు లేఖనాలలో ఈమెయే అనిపిస్తుంది.

ఎవరైనా ప్రపంచానికిగానీ, దేశానికిగానీ, రాష్ట్రానికిగానీ, ఊరికిగానీ, కుటుంబానికి గానీ మేలు చేస్తే వారిని సంవత్సరములో ఒకరోజు ప్రసిద్ధి చేస్తాము. కానీ యెఫ్తా కుమార్తెను నాలుగు రోజులు ప్రసిద్ధి చేస్తారు. అంటే ఈమె జీవితము ఎంత గొప్పదో కదా. ఈమెను 'విధేయత'కు ప్రతీకగా మనము చెప్పుకోవచ్చు. ఆలాగు మన ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియైన దేవునికి చూపిన విధేయతను ఈమె మనకు గుర్తుచేసేదిగా ఉన్నది. ఫిలిప్పీ 2:6-11 లలో వ్రాయబడిన ప్రకారము 1) దేవుని స్వరూపము గలవాడై యుండి, 2) దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టని భాగ్యమని ఎంచుకొనక, 3) మనుష్యుని పోలికగా, 4) దాసుని స్వరూపమును, 5) రిక్తుడైన దాసుని స్వరూపమును దాల్చి, 6) సిలువ మరణము పొందుటకు (శాపాస్పదమైన మరణమును), 7) తన్ను తానే తగ్గించుకున్నాడు. 7 రీతులుగా యేసు ప్రభువు తగ్గించుకున్నాడు. యెఫ్తా కుమార్తె విధేయురాలే కానీ, యేసు ప్రభువు 7 రీతులుగా అనగా సంపూర్ణ విధేయత చూపాడు. కనుక తండ్రియైన దేవుడు ఆయనను హెచ్చించి ఆయన నామమును అన్ని నామములకంటే హెచ్చైన నామమును ఆయనకు అనుగ్రహించాడు.

ఈ యెఫ్తా కుమార్తెను సంవత్సరానికి నాలుగు రోజులు ప్రసిద్ధి చేశారంటే, పాప మానవాళి కొరకు ప్రాణదానము చేయుటలో 7 రీతులుగా మన కొరకు దేవుని యెదుట తగ్గించుకొని విధేయత చూపిన ప్రభువు మరి ఇంకెంతగా ప్రసిద్ధి చేయాలో కదా. కీర్తన 76:1లో యూదాలో దేవుడు ప్రసిద్ధుడని వ్రాయబడింది. ఒక యూదాలో మాత్రమే కాదు, సర్వలోకములో ఆయనే ప్రసిద్ధుడు. కీర్తన 92:14లో ఆయన యందు ఏ చెడుతనము లేదని ఆయనను ప్రసిద్ధి చేయుటకై నీతిమంతులు ముసలితనమందు చిగురుపెట్టుచూ ఉంటారని వ్రాయబడింది. కీర్తన 22:30 లో ఒక సంతతివారు ఆయనను సేవింతురు. రాబోవు తరమునకు ప్రభువును గూర్చి వివరింతురు. వారు వచ్చి ఆయన దీని చేసెనని పుట్టబోవు తరమునకు తెలియజేతురు. అలా తరతరములకు యుగయుగములకు ఆయన చేసిన కార్యములనుబట్టి ముఖ్యముగా ఆయన సిలువలో చేసిన రక్షణ కార్యమునుబట్టి, సృష్టికార్యములు, భీకర కార్యములు, బలవత్కార్యములు, ఆశ్చర్యకార్యములు, అద్భుత కార్యములు, పరిశోధింపజాలని మహాత్కార్యములను బట్టి ఆయన నామము యుగయుగములు, తరతరములు ప్రసిద్ధి నొందే దేవుడు. ఆయనకే యుగయుగములు మహిమ, ప్రభావము, ఘనత కలుగును గాక!

# 9

# ద్రోహిని చంపిన అనామకురాలు - తేబేసు స్త్రీ

తేబేసు స్త్రీని గురించి న్యాయాధిపతులు 9:50-57 వరకు వ్రాయబడింది. ఈ స్త్రీని గురించి ధ్యానించడానికి పూర్వము అబీమెలెకును గురించి ముందు తెలుసుకోవాలి. గిద్యోను అను న్యాయాధిపతికి అనేకమంది భార్యలు ఉన్నందువలన కడుపున కనిని డెబ్బది కుమారులు అతనికున్నారు. షెకెములోనున్న అతని ఉపపత్ని కూడా అతని అబీమెలెకుకు అను కుమారుని కనింది. అబీమెలెకు తన రక్తసంబంధులైన షెకెమువారితో 'మీకేది మంచిది? యెరుబ్బయలు కుమారులైన డెబ్బదిమంది మనుష్యులందరు మిమ్మును ఏలుట మంచిదా? ఒక్క మనుష్యుడు మిమ్మును ఏలుట మంచిదా? నేను మీ రక్తసంబంధినని జ్ఞాపకము చేసికొనుడి' అని చెప్పాడు. వారు' ఇతడు మన సహోదరుడు అనుకొని తన హృదయము అబీమెలెకు తట్టు త్రిప్పుకొని 70 తులముల వెండి అతనికియ్యగా వాటితో అబీమెలెకు అల్లరి జనమును కూలికి పెట్టుకున్నాడు. ఆ తరువాత అతడు ఒఫ్రాలోనున్న తన తండ్రి కుమారులైన డెబ్బదిమందిని ఒక్క రాతిమీద చంపించాడు. గిద్యోను (యెరుబ్బయలు) చిన్న కుమారుడైన యోతాము మాత్రమే దాగియుండి ప్రభువు కృపవల్ల తప్పించుకున్నాడు. అప్పుడు షెకెము యజమానులు షెకెములో అబీమెలెకును రాజుగా చేసుకున్నారు.

ఈ సంగతి యోతాముకు తెలిసినపుడు అతడు గెరీజీము కొండ శిఖరమున నిలిచి ఒక ఉపమాన రీతిగా వారితో మాట్లాడి, "నా తండ్రి మీ నిమిత్తము తన ప్రాణమును నిర్లక్ష్యపెట్టి యుద్ధము చేసి మిద్యానీయుల చేతినుండి మిమ్మును విడిపించాడు. అయితే నా తండ్రి కుటుంబము మీదికి లేచి, ఒక రాతిమీద అతని కుమారులైన డెబ్బదిమంది మనుషులను చంపి, అతని పనికత్తె కుమారుడైన అబీమెలెకు మీ సహోదరుడైనందున షెకెము వారి మీద అతని రాజుగా నియమించి యున్నారు. గిద్యోను యెడలను, అతని యింటివారి యెడలను మీరు ఉపకారము చేయక, అతని క్రియలకు మీరు ప్రతి క్రియలు చేయుకయు అబీమెలెకును రాజుగా నియమించుకొనిన విషయములో మీరు న్యాయముగాను, యథార్థముగాను ప్రవర్తించిన యెడల మీరు అబీమెలెకునందు సంతోషించుడి. అతడు మీయందు సంతోషించును గాక! లేనియెడల అబీమెలెకు నుండి అగ్ని బయలుదేరి షెకెమువారిని, మిల్లో ఇంటివారిని కాల్చివేయునుగాక. షెకెము వారిలో నుండియు, మిల్లో యింటి నుండియు అగ్ని బయలుదేరి అబీమెలెకును దహించును గాక' అని చెప్పి అబీమెలెకునకు భయపడి యోతాము బెయేరుకు పారిపోయి అక్కడ నివసించాడు.

దృష్టాంతములుగా ఇశ్రాయేలీయుల మధ్యన జరిగిన విషయాలు యుగాంతమందు జీవించుచున్న మనకు బుద్ధి కలిగించేవిగా ఉన్నాయి. గిద్యోను ద్వారానే ఇశ్రాయేలీయులకు మిద్యానీయుల నుండి రక్షణ కలిగింది. అట్టి రక్షకుడైన న్యాయాధిపతియైన గిద్యోను ఉపకారమును ఇశ్రాయేలీయులు మరచి ముఖ్యముగా షెకెమువారు గిద్యోను పనికత్తె కుమారుడైన అబీమెలెకుకు 70 వెండి రూకలు ఇచ్చి గిద్యోను కుమారులను ఒక్క రాతిమీద చంపించినట్లు ఈ జగత్తుకు రక్షకుడైన యేసుప్రభువును 30 వెండి రూకలకు అమ్ముకుని యేసుప్రభువుని శాపగ్రస్తమైన సిలువలో ఊరి వెలుపల చంపారు. షెకెము యజమానులు తమ రక్తసంబంధియైన అబీమెలెకుతో కలిసి గిద్యోను యొక్క 69 మంది కుమారులను ఒక్క రాతిమీద చంపినట్లు యేసుప్రభువుని చంపుటకై అంతవరకూ విరోధులుగా ఉన్న హేరోదు, పిలాతులు ఆ రోజే స్నేహితులయ్యారు. ఆత్మీయతతో రక్తసంబంధముగాని, స్నేహితము గానీ పాత్ర వహించకూడదు. అబీమెలెకు తన తండ్రి కుమారులనందరినీ తాను రాజై చంపినట్లు ఈనాడు మనమందరము మన పరలోక తండ్రియైన దేవుని కుమారుడైన యేసు ప్రభువుని సిలువమీద చంపేశాము. మన పాప జీవితాలకు రాజులైపోయాము. అబీమెలెకు 3 సంవత్సరములు మాత్రమే రాజుగా ఉండినాడు. దుష్టునికి విజయము కొంతకాలమే. అలాగే 2రాజులు 11:1 లో అహజ్యా తల్లియైన అతల్యా తన కుమారుడు మృతినొందెనని తెలిసికొని లేచి రాజకుమారులైన తన మనుమండ్లనందరిని నాశనము చేసి 6 సంవత్సరములు మాత్రమే రాణిగా దేశాన్ని ఏలింది.

న్యాయాధి 9:22-25 లలో, అప్పుడు గిద్యోను డెబ్బయిమంది కుమారులకు చేయబడిన ద్రోహఫలము వారిని చంపిన అబీమెలెకు వారి సహోదరుని మీదికిని, అతడు తన సహోదరులను చంపినట్లు అతని చేతులను బలపరచిన షెకెము యజమానుల మీదికిని వచ్చినట్లును, వారు చేసిన ప్రాణహత్య వారిమీదకు వచ్చునట్లును దేవుడు అబీమెలెకును, షెకెము యజమానులకును వైరము కలుగజేయుటకై వారి మీదికి దురాత్మను పంపెను. అప్పుడు షెకెము యజమానులు అబీమెలెకును వంచించిరి అని వ్రాయబడియున్న ప్రకారము, ప్రభువును చంపుటలో రోమీయులతో ఏకమైన యూదులు వీనిని సిలువ వేయుము అని చెప్పి కేకలు వేసిన యూదులు యేసుప్రభువు రెండవ రాకడలో వచ్చునపుడు జెకర్యా 12:10 ప్రకారము, దావీదు సంతతివారి మీదను, యెరూషలేము నివాసుల మీదను దురాత్మను కాక కరుణనొందించు ఆత్మను, విజ్ఞాపన చేయు ఆత్మను ప్రభువు కుమ్మరించినపుడు వారు పొడిచిన యేసుప్రభువు మీద దృష్టియుంచి, ఒకడు తన ఏక కుమారుని విషయమై అభినందించినట్లు తన జ్యేష్ఠకుమారుని విషయమై యొకడు దుఃఖించునట్లు ప్రలాపిస్తారు.

న్యాయాధి 9:44 లో అబీమెలెకుపై దురాత్మ వచ్చినప్పటికీ షెకెము యజమానులు అతనిని వంచించినప్పటికీ అతడు 'అరూమా' పట్టణములోనున్న జనులను చంపి పట్టణమును పడగొట్టి దాని స్థలములో ఏ పంటలు పండకుండునట్లు అతడు ఆ స్థలములో

ఉప్పు చల్లించాడు. ఆ తరువాత షెకెము యజమానులు ఈ సంగతి విని ఏల్‌బెరీతు గుడి యొక్క కోటలోనికి చొరబడగా అబీమెలెకును, అతని జనులందరునూ ఒక్కొక్క కొమ్మను నరికి ఆ కోట దగ్గర వాటిని పెట్టి వాటి వలన ఆ కోటకు అగ్నిచేత కాల్చగా, షెకెము గోపుర యజమానులు, స్త్రీ పురుషులు ఇంచుమించు వెయ్యిమంది చచ్చిపోయారు. ఈలాగున అబీమెలెకుపై దురాత్మ వచ్చినా, అరూమ పట్టణము మీదను, షెకెము గోడ యజమానుల మీదను విజయము వచ్చినది. యోబు 20:4 బట్టి దుష్టులకు విజయము కొంతకాలమే కానీ అతని అంత్యమెలా ఉందో క్రింది వచనాలలో తరువాత చదువుతాం.

ఈ సందర్భంగా గిద్యోనును గురించి కూడా కొంత ఆలోచిద్దాం. గిద్యోను ఇశ్రాయేలీయులకు ఎంతో ఉపకారం చేశాడు. మిద్యానీయుల చేతులనుండి వారిని రక్షించాడు. దేశం నలువది సంవత్సరములు నెమ్మదిగా ఉండింది. ఇది మంచి మాదిరియే. మనమందరమూ అతనిని అభినందించవలసిందే. కానీ అతడు అనేకమంది భార్యలను వివాహం చేసుకొని వారివలన డెబ్బదిమంది కుమారులను కన్నాడు. కానీ ఏమి ప్రయోజనం? గిద్యోను తన కార్యాలతో తృప్తిపడక తన పనికత్తెను ఉపపత్నిగా చేసుకొనుట ద్వారా అతనికి పుట్టిన అబీమెలెకు అనే కుమారుడు గిద్యోను యొక్క 69 మంది కుమారులను ఒక్క రాతిమీద చంపేశారు. ఒక్క పాపాత్ముడు అనేకమైన మంచి పనులను చెరుపును అని ప్రసంగి 9:18 లో వ్రాయబడినట్లు ఒక్క పాపాత్ముడైన అబీమెలెకు అంతమంది తన అన్నలను చంపేశాడు. గిద్యోను తనకు 70 మందిని కనిన భార్యలతో తృప్తిపడి పనికత్తెను ఉపపత్నిగా చేసుకొనక ఉంటే బాగుండేది. అపుడు అబీమెలెకు పుట్టి ఉండేవాడు కాదు. అబీమెలెకు 70 మంది అన్నలను చంపివుండేవాడే కాదు.

ఆలాగే గిద్యోను తాను చనిపోకముందే కుమారుల భవిష్యత్తును గురించి ఆలోచించి, వారు భవిష్యత్తుగా ఏమి చేయాలి? అనే సంగతులు వారికి సూచించి, తెలిపి ఉంటే బాగుండేది. చనిపోకముందే తన ఇంటిని, ఇంటివారిని చక్కబెట్టి ఉంటే అబీమెలెకు తన అన్నలను చంపి రాజయ్యేవాడు కాదు. క్రీస్తు ప్రభువు చనిపోకముందు తన తల్లియైన మరియు బాధ్యత యోహానుకు అప్పగించాడు. హిజ్కియాను దేవుడు ఇల్లు చక్కబెట్టుకోమన్నాడు. మనమందరము చనిపోయే లోపల మన ఆత్మీయ జీవితాలను, కుటింబీకుల జీవితాలను, ఆస్తిపాస్తుల విషయాలను చక్కబెట్టుకోవడం మంచిది. మన నిష్క్రమణ తరువాత వారిలో భిన్నాభిప్రాయాలు, పోట్లాటలు తలెత్తుతాయి.

ఇపుడు తేబేసు స్త్రీని గురించి ఆలోచిద్దాం. న్యాయాధి 9:50 లో అబీమెలెకు తేబేసునొద్ద దిగి దానిని పట్టుకొనగా ఆ పట్టణము నడుమ ఒక బలమైన గోపురము ఉండగా స్త్రీ పురుషులు ఆ పట్టణపు యజమానులు అక్కడికి పారిపోయి తలుపులు వేసికొని గోపుర శిఖరము మీదికి వెళ్ళినట్లు చదువుచున్నాము. ఈ బలమైన గోపురమే మన ప్రార్థనా గది. మత్తయి 6:6లో ప్రభువు చెప్పినట్లు, సమస్యలు వచ్చినప్పుడు అవి పెద్దవి గాని, చిన్నవి గానీ మనము మన ప్రార్థన గోపురానికి వెళ్ళాలి. ప్రార్థనా జీవితాన్ని కలిగి ఉండాలి. అప్పుడు రహస్యమందు చూచే తండ్రి మన ప్రార్థనను ఆలకిస్తాడు.

తేబేసు అను పేరుకు 'ప్రకాశము' అని అర్ధము. ఈనాడు ప్రభువు తన సంఘానికి ఇచ్చిన ప్రకాశము ఏమిటి? అని ఆలోచిస్తే 2కొరింథీ 4:4 లో, దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనపరచు సువార్త ప్రకాశమును క్రీస్తు సంఘానికి ఇచ్చాడని మనకు అర్ధమౌతుంది. సువార్త వినుట వలన పాపాంధకారములో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన ప్రభువు స్వరము వినుట వలన ఈనాడు అనేకులు ప్రభువును నమ్మి సంఘములో చేర్చబడుతున్నారు. ఆలాగున తేబేసు స్త్రీ పురుషులు సువార్త ప్రకాశమును తన హృదయాల్లో కలిగి యుండగా అట్టి సంఘాలనే ఈనాడు అబీమెలెకు అనే సాతాను దేవుని సంఘాలను పట్టుకున్నాడు. పట్టుకున్నాడు అనగా 1పేతురు 5:8 ప్రకారము విశ్వాసులకు విరోధియైన సాతాను ఎవని మ్రింగుదునా అని గర్జించు సింహమువలె వెదకుచు, తిరుగుచు పట్టుకొనుచూ ఉన్నాడు. అలాంటి సమయంలో తేబేసు పట్టణస్థులు తమ పట్టణము మధ్యన ఉన్న బలమైన గోపురములలోనికి పారిపోయి, తలుపులు వేసికొనినట్లు మనమును మన మధ్యలో ప్రార్ధన అనే బలమైన గోపురములోనికి వెళ్ళి రహస్యమందు చూచే తండ్రికి (మత్తయి 6:6) ప్రార్ధన చేయాలి. ఆలాగున 1) వ్యక్తిగత ప్రార్ధన గోపురం, 2) కుటుంబ ప్రార్ధన గోపురం, 3) సంఘ ప్రార్ధన గోపురం అనే ప్రార్ధనా గోపురాలను కలిగి ప్రార్ధించాలి. మన ప్రభువే మనకు ఉన్నత గోపురముగా ఉన్నాడు.

ఆనాడు తేబేసులో ఉన్న గోపురానికి స్త్రీ పురుషులు, పట్టణ యజమానులు అక్కడికి ఎక్కి వెళ్ళారు. ఆలాగుననే మన ప్రభువు ప్రార్ధన ఆలకించువాడు. సర్వశరీరులు ఆయన యొద్దకు వస్తారు అను మాట ప్రకారము (కీర్తన 65:2) సర్వశరీరులు ప్రార్ధనా మీటింగ్‌కు రావాలి. కానీ ఈనాడు సంఘానికి ఆదివారమున 500 మంది వస్తే, బైబిల్ స్టడీకి 50 మంది వస్తే, ప్రార్ధనా కూటానికి 10 మంది, లేక 15 మంది వస్తారు. అందరూ రావాలని ప్రభువు వాక్యము చెబుతుంది. సంఘ సమస్యల కొరకు సంఘమంతయూ, కుటుంబ సమస్యల కొరకు కుటుంబమంతయూ, భార్యభర్తల సమస్యల కొరకు భార్యభర్తలిద్దరూ ప్రార్ధిస్తే నిజంగా జవాబులు పొందగలము. అన్నిటికి సమయము దొరికించుకుంటున్నాము. ప్రార్ధనకు మాత్రమే సమయం లేదంటాము. అందుకే సమస్యలకు పరిష్కారం దొరుకుట లేదు. ఒక భక్తుడిలా అన్నాడు, 'ఆదివారం మందిరాలు తాజ్‌మహల్‌వలే మనుష్యులతో క్రిక్కిరిసి ఉంటాయి. ప్రార్ధనకూటం రోజు మందిరాలు నిల్‌గా కనబడతాయి."

నేడు చాలామంది ఇళ్ళలో ప్రార్ధించుకుంటాము అని అనవచ్చు. ఏ ఇద్దరు భూమి మీద ఏకీభవించి ప్రార్ధనలో వేటినైనా బంధిస్తారో పరలోకంలో అవి బంధించబడతాయని, ఏ యిద్దరు భూమి మీద ఏకీభవించి సమస్యలను విప్పుతారో అవి పరలోకంలో విప్పబడతాయి అని ప్రభువు చెప్పినట్లు కనీసము కొన్ని ప్రత్యేకమైన, ప్రాముఖ్యమైన అంశముల కొరకైనా తప్పకుండా మందిరానికి వెళ్ళి 'హన్నా' లాగా ప్రార్ధించాలి. కీర్తన 18:6 లో 'నా శ్రమలో నేను యెహోవాకు మొఱ్ఱపెట్టితిని. నా దేవునికి ప్రార్ధన చేసితిని,

ఆయన తన ఆలయములో (సంఘములో) ఆలకించి నా ప్రార్థన అంగీకరించెను. నా మొఱ్ఱ ఆయన సన్నిధిని చేరి ఆయన చెవుల జొచ్చెను' అని దావీదు వ్రాస్తున్నాడు. అలాగే పేతురు హేరోదుచే చెరసాలలో ఉంచబడినపుడు, సంఘమైతే అతని కొరకు అత్యాసక్తితో ప్రార్థించెను అని అపొ.కా. 12:5 లో చదువగలము. అపొ.కా. 12:12 లో సంఘములో 'అనేకులు కూడి ప్రార్థన చేయుచుండిరి' అని చదువుతున్నాము. 'రొదే' అనే చిన్నది కూడా ఆ ప్రార్థనా కూడికలో ఉందని చదువుతున్నాము. ఆలాగున ఎజ్రా 10:1 లో ఎజ్రా ఏడ్చుచూ దేవుని మందిరము ఎదుట సాష్టాంగపడుచు పాపమును ఒప్పుకొని ప్రార్థన చేయగా ఇశ్రాయేలీయులలో పురుషులు, స్త్రీలు, చిన్నవారు మిక్కిలి గొప్ప సమూహముగా తన యొద్దకు ప్రార్థనకు కూడివచ్చి బహుగా ఏడ్చారని వ్రాయబడింది. కనుక ఈ వచనాలన్నిటిని బట్టి సర్వశరీరులు ప్రభువు నొద్దకు ప్రార్థనా గోపురమునకు రావలెనని నేర్చుకుంటున్నాము. ప్రియసోదరీ, నీవునూ నీ సంఘ ప్రార్థనా కూడికకు వెళ్ళడానికి తీర్మానం చేసుకుంటావా? హన్నాకు, దావీదుకు, వచ్చినవారందరికీ ఇచ్చిన జవాబు ప్రభువు నీకును ఇస్తాడు.

న్యాయాధి 9:52 లో అబీమెలెకు ఆ బలమైన గోపురము యొద్దకు వచ్చి దానిమీద పడి యుద్ధము చేసి అగ్నిచేత దాని కాల్చుటకు గోపుర ద్వారమునొద్దకు వచ్చారని వ్రాయబడినట్లు, ఈనాడు దేవుని పిల్లల మీద యుద్ధము చేయుటకు మనలను మన సమయాన్ని, సాక్ష్యాన్ని, డబ్బును, ఐక్యతను, ఆనందాన్ని, ఆరోగ్యాన్ని మ్రింగుటకు కృపాకాలంలో ప్రయత్నిస్తున్నారు. దాని 7:21 లో ఏడేండ్ల శ్రమల కాలములో కూడా యూదా పరిశుద్ధులతో సాతాను యుద్ధం చేస్తాడు. ప్రకటన 12:7 లో పరలోకంలో కూడా ఘటసర్పము మిఖాయేలు దూతతో యుద్ధము చేస్తాడని వ్రాయబడింది. అంతమాత్రమే కాక ప్రకటన 17:14 లో భూరాజులు, రాజులరాజును ప్రభువుల ప్రభువునైన గొఱ్ఱెపిల్లతో కూడ యుద్ధము చేస్తారు. ప్రభువు వారిని జయిస్తాడు. ఇలా సాతాను అన్నికాలాల్లో మనతో యుద్ధము చేయునపుడు ద్వితీ 1:30 ప్రకారము ఆయన మన పక్షముగా యుద్ధము చేస్తాడు. ద్వితీ 20:4 ప్రకారము ఆయన మన శత్రువులలో యుద్ధము చేసి మనలను రక్షిస్తాడు. మన పాఠ్యభాగంలో ఆయన ఎలా ఈ తేబేసువారిని రక్షించాడో చూద్దాం.

అబీమెలెకు తేబేసు వారితో యుద్ధము చేసి అగ్నిచేత కాల్చుటక గోపుర ద్వారానికి వచ్చాడు. అలాగు దేవుని పిల్లల్ని అగ్నితో కాల్చివేయాలనుకున్న సాతానుకు, వాని దూతలకు అగ్ని గంధకములతో మండే గుండాన్ని ప్రభువు సృజించి మనల్ని పరలోకంలో చేర్చే దేవుడుగా ఉన్నాడు. సాతాను ఇలా తేబేసు మనుష్యులపై యుద్ధము చేసి, కాల్చుటకు గోపుర ద్వారము యొద్దకు వచ్చినట్లు, ఈనాడు తన సువార్త స్వరము విని హృదయపు తలుపును తెరిచే వారిని వెదకి రక్షించుటకు ప్రభువు వారి హృదయ ద్వారము దగ్గరికి వచ్చి నిలబడుతున్నారు (ప్రకటన 3:20).

న్యాయాధి 9:47 లో ఎల్‌బెరీతు గుడి యొక్క కోటలోనికి చొరబడినవారిని అబీమెలెకు చెట్ల కొమ్మల ద్వారా అగ్నితో కాల్చబడినట్లు 53 వచములో తేబేసువారిని అగ్నిచేత దహించుటకు రాగా ఒక స్త్రీకి దేవుడు సమయస్ఫూర్తి, జ్ఞానము, వివేకమును చక్కని ఆలోచనను ఇచ్చుట ప్రశంశనీయము. ఆ స్త్రీ యొక్క అడ్రస్ మనకు తెలియదు. ఒక పేరు ప్రతిష్ఠ లేని అమాయకురాలిగా ఉంది. భర్త పిల్లలను గురించి వ్రాయబడలేదు. శత్రువును హతమార్చాలనే తలంపు, ఆలోచనను ఆ భారమును దేవుడామెకు ఇచ్చాడు. సాధారణముగా ఏ సమస్య వచ్చినా పురుషులు చూసుకుంటారులే అని స్త్రీలనుకుంటారు. మాకు ఇంటి పనులే తెలుస్తాయి, చేయగలము అనుకుంటాము. కానీ ఈ స్త్రీకి దేవుడు తన పట్టణాన్ని శత్రువైన అబీమెలెకు వేసే అగ్నినుండి కాపాడుకోవాలనే జ్ఞానము కలిగి ఉన్నది. దేవుడే ఈ సమయంలో ఆమెకు ఈ ఆలోచన ఇచ్చాడు. అబీమెలెకును చంపడానికి ఆ గోపురము మీద ఏ కత్తులు, బాణాలు, అంబులు ఆమెకక్కడ దొరకలేదు. ఒకవేళ అవన్నీ ఉండినా, అవి వాడగల నేర్పు, సామర్థ్యము ఆమెకు ఉండకపోవచ్చును. చుట్టూ చూస్తే, ఆ గోపురము మీద తిరుగటిరాయి ఆమెకు కనబడింది. ఆ తిరుగటి రాయి అక్కడ ఎవరు పెట్టారో, ఎప్పుడు పెట్టారో, ఎందుకు పెట్టారో ఏమీ తెలియదు. కానీ ఆ తిరుగటి రాయితో అబీమెలెకును చంపడానికే దేవుడు దానిని అక్కడ పెట్టి ఉంచాడని వాక్యము చదివిన మనకు అర్థమవుతుంది. ఆమెకు సడన్‌గా దేవుడు ఆలోచన ఇచ్చుటచే ఆమె అబీమెలెకు తలమీదికి 'తిరుగటిమీది రాయి'ని పడవేయుట ద్వారా అతని కపాలము పగిలినట్లుగా చూస్తున్నాము. ఈ స్త్రీలు బలహీన ఘటాలు, వీరు నన్నేమి చేయగలరు? అని అబీమెలెకు స్త్రీలను గమనించకుండా ఉండి ఉండవచ్చును. అదే అదనుగా ఈ స్త్రీ ఆ రాతిని గురి చూసి సరిగ్గా అతని తలమీద ఒక్క దెబ్బతో చావుదెబ్బ వేసేసింది. ఒక్క క్షణములో ఒక అబల సబలగా మారిపోయింది. దేవుడు కీర్తన 92:6 లో చెప్పినట్లు, తన గంభీర ఆలోచనను ఆమెకు ఇచ్చాడు. యెషయా 28:29 ప్రకారము ఆయన ఆశ్చర్యమైన ఆలోచన శక్తిగలవాడు. యిర్మీయా 32:19 ప్రకారము ఆలోచన విషయములో ఆయనే గొప్పవాడు. యెషయా 11:2 ప్రకారము, ఆయన ఆత్మ ఆలోచన, బలములకు ఆధారమైన ఆత్మ. దేవుడామెకు ఈ ఆలోచనను మాత్రమే కాక, బలాన్ని కూడా తన ఆత్మ ద్వారా ఇచ్చాడు. కనుకనే ఆమె బలమైన తిరుగటిరాయిని ఎత్తి శత్రువుల మీద వేయగలిగింది. ఈనాడు మన ఇళ్ళలోకి, సంఘాలలో, పట్టణాలలో, దేశాల్లో చెలరేగుతున్న సాతాను మీద మనము ఎత్తివేయగల రాయి దేవుని వాక్యమే. యేసుప్రభువు శోధన కొండమీద సాతానుచేత శోధింపబడినపుడు, సాతాను దేవుని వాక్యములో శోధించినప్పటికీ మూడు రకములైన శోధనలలో ప్రభువు వాక్యముతోనే సాతానును అని వ్రాయబడియున్నది అని మూడుసార్లు జవాబిచ్చారు. దావీదు గొల్యాతును చంపింది దేవుని వాక్యానికి గుర్తుగా ఉన్న రాయితోనే కదా.

ప్రియ సోదరీ, నీవు చనిపోయిన తరువాత నిన్ను గూర్చి బ్రతికియున్న నీ సంఘపువారు, బంధువులు, అక్కచెల్లెళ్ళు, స్నేహితులు, తోటి విశ్వాసులు, ఇరుగుపొరుగు వారు నిన్ను గూర్చి ఏమనుకుంటారని నీవు అనుకుంటున్నావు? ఫలాని అక్క 'నన్ను

రక్షణలోకి నడిపించింది' అనుకుంటారా? నా ఇబ్బందిలో సహాయం చేసింది అనుకుంటారా? అక్క ఎప్పుడూ మా ఇంటిని దర్శించేది అని అనుకుంటారా? మా కొరకు ప్రార్థించేది అని అనుకుంటారా? ఎన్నో సత్క్రియలు చేసేది అని అనుకుంటారా? ఆత్మల భారం కలిగి ఉండేది అనుకుంటారా? నమ్మకంగా పరిచర్య చేసేది అని అనుకుంటారా? 'ఆమె సంఘానికి అన్ని విధాల అవసరమైంది' అని అనుకుంటారా? ఆ అక్క మాకిచ్చిన బట్టలివిగో, వస్తువులివిగో అని సాక్ష్యాధారాలు చూపిస్తారా? లేక చెడ్డ సాక్ష్యం నిన్ను గూర్చి చెప్పుకుంటారా? మన పాఠ్యభాగంలో అబీమెలెకు చేసినవన్నీ చెడ్డపనులే అయ్యుండగా తన చావును గురించి మంచిగా చెప్పుకోడానికి యుద్ధములో వీర మరణమైనా చెందాడా? లేదే!

ఈలాగున అ వివేకాన్ని ఆ స్త్రీకి దేవుడిచ్చాడు. నీ సేవకుడు వివేకముగా ప్రవర్తించును, మహాఘనుడుగా ఎంచబడును అని యెషయా 52:13 లో వ్రాయబడినట్లు దేవుడామెకిచ్చిన వివేకాన్నిబట్టి ఆ తేబేసు ఊరివారు ఆమెను ఎంతగా ఘనపరచి ఉంటారో కదా. సామెతలు 14:18లో, వివేకుడు జ్ఞానమును కిరీటము ధరించుకొందురు అని వ్రాయబడిన ప్రకారము ఆ ఊరివారు ఆమెకు 'కిరీటమును' ధరింపజేసి వందనము చేసి ఉంటారేమో కదా. జ్ఞానము వలన ఇల్లు కట్టబడును. వివేకము వలన అది స్థిరపరచబడును అని సామెతలు 24:3 ప్రకారము ఆ ఊరు అబీమెలెకుకు కాక, తేబెసు వారికో మరొకమారు స్థిరపరచబడినదేమే కదా. ప్రియ సోదరీ, బహిరంగంగా నీవు బయటికి కనిపించకపోయినప్పటికీ నీవు చేసే ప్రార్థన ద్వారా, తెలివితో, జ్ఞానముతో, వివేకముతో నీవు చేసే చిన్న పనుల వలన నీ యింటిలో, సంఘములో, నీ రాష్ట్రములో, నీ దేశములో మనుషులందరిని చంపి, నరకములో పడవేసి, లోకాన్ని అడవిగా చేయుటకు పూనుకొని ఉన్న సాతానును అడ్డుకట్ట వేయగలవు. శత్రువును జయించగలవు. శత్రు కార్యములను నిర్వీర్యము చేయగలవు. ఇట్లు శ్రేష్ఠమైన కార్యములను వివేచించగలవారమగుటకు (ఫిలిప్పీ 1:9) సామెతలు 2:3 లో వ్రాయబడినట్లు అట్టి తెలివికై మొఱ్ఱపెడితే వివేచనకై మనవి చేస్తే దేవుడు మనకునూ వాటిని దయచేస్తాడు ప్రభువు.

ఇలా ఒక అనామక స్త్రీచేత ఘోరపరాజితుడైన అబీమెలెకు తన ఆయుధములు మోయు బంటును త్వరగా పిలిచి 'ఒక స్త్రీ అతనిని చంపెనని ఎవరునూ అనుకొన కుండునట్లు నీ కత్తి దూసి నన్ను చంపుము' అని చెప్పగా ఆ బంటు అతని పొడవగా అతడు చచ్చినట్లు 54వ వచములో చదువుచున్నాము. తన బంటు తను చంపినా, దేవుడు మాత్రము 'ఒక స్త్రీ అతని కపాలమును పగులకొట్టిందనే' వ్రాయించాడు. న్యాయాధి 4:9 లో ఒక స్త్రీ చేతికి సీసెరాను అప్పగించాడని దేవుడు వ్రాయించాడు. మనము ఎంత 'మేకప్స్' చేసుకున్నా 'ఒరిజినాలిటీ' బయటపడక తప్పదు. నేను ఒక స్త్రీచేత చంపబడ్డానని బ్రతికినవాళ్ళు ఎవరూ అనుకోకూడదు అని అనుకొంటున్నాడు. కానీ, తాను చనిపోతే ఎక్కడికెళ్తాను? నన్ను గూర్చి దేవుడు ఏమనుకుంటాడు? నన్ను గూర్చి

దేవుడు ఏమని తీర్పు చెబుతాడు? చనిపోయే ముందు నా పాపాలన్ని దేవుని దగ్గర ఒప్పుకుని క్షమించబడదాము అనే తలంపులు అబీమెలెకులో లేవు. కానీ, నన్ను గూర్చి నా మరణం తరువాత ఇతరులు గొప్పగా అనుకోవాలి అనుకుంటున్నాడు. పాప క్షమాపణ కోరుకోలేదు. ప్రెస్టీజ్‌నే కోరుకుంటున్నాడు.

ప్రియ సోదరీ, విశ్వాసులముగా మన చావు దినమెప్పుడో మనమెరుగము, ఆయన రాకడ ఎప్పుడో మనమెరుగము కానీ మరికొన్ని క్షణాలకు చనిపోతామని తెలిసినప్పుడైనా మన ఆలోచనలు 'నన్ను గురించి ఇతరులు ఏమనుకుంటారు?' అని మన స్వప్రయోజనాన్ని గూర్చి ఆలోచింపక, లోక సంబంధమైన తలంపులతో నింపబడక దైవిక తలంపులతో పరలోక చింతనతో పౌలు వలె నేను బాగా పరుగెత్తాను, నా విశ్వాసాన్ని కాపాడుకున్నాను. నాకు నీతి కిరీటమున్నది' అని చెప్పగలిగేవారంగా ఉండాలి.

53 వచనములో తేబేసు స్త్రీ అబీమెలెకు తలమీద తిరుగటి రాయి వేయుటలో వాక్యాధారమున్నది. ఆది 3:14,15 వచనాలలో వ్రాయబడినట్లు, 'మరియు నీకును, స్త్రీకును నీ సంతానమునకును, ఆమె సంతానమునకు వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును. నీవు దానిని మడిమెమీద కొట్టుదువు' అన్న వాక్యప్రకారమే సాతానుకు సాదృశ్యముగా వున్న అబీమెలెకు తలమీదనే కొట్టబడ్డాడు. అతని తల పగిలిపోయింది. ఈనాడు ప్రతి సర్పమును మనమందరము తలమీదనే కొడుతున్నాము. మన నిజ జీవితంలో కూడా సాతానును వాక్యమనే రాతితోనే కొట్టి చంపవలసిన వారముగా ఉన్నాము.

అయితే, అబీమెలెకు గురించి దేవుడు ఏమనుకున్నాడో 56 వచనము చెబుతోంది. 'అట్లు అబీమెలెకు తన డెబ్బదిమంది సహోదరులను చంపుట వలన తన తండ్రికి చేసిన ద్రోహమును దేవుడు మరల అతనిమీదికి రప్పించెను' అని చదువుతున్నాము. అట్లయితే అతడు తన సహోదరులకు చేసిన ద్రోహము వలన చనిపోయారని, దేవుడే అతనిని ఒక స్త్రీ చేతికి అప్పగించి చంపించాడని అందరూ అనుకుంటూ వచ్చారు. దైవగ్రంథములో అలాగే వ్రాయబడినట్లు తెలుస్తోంది. అట్లయితే అబీమెలెకు తన అన్నలైన 70 మందిని చంపి తండ్రికి ద్రోహము చేశాడు. వారిలో ఎవ్వరూ రాజు అవ్వకుండునట్లు ఉపపత్ని కుమారుడైన తానే రాజవ్వాలని వారందరినీ చంపేశాడు. ఇదీ తండ్రికి అతడు చేసిన ద్రోహము.

ఈనాడు అనేకులు బయటివారికి కాదు, ఇంటివారికే అన్నదమ్ములకే, తండ్రి తల్లికే ద్రోహము చేస్తున్నారు. బైబిల్లో అలా తల్లిదండ్రులకు ద్రోహము చేసి మొట్టమొదటి ద్రోహి కయీను. నీ తమ్ముడెక్కడ అని దేవుడడిగితే నా తమ్మునికి నేను కావలివాడనా? అని దేవునితో దురుసుగా మాట్లాడుతూ, ద్రోహము చేసినవాడుగా కనబడుతున్నాడు. మనకు ప్రాణమునిచ్చిన దేవుడు మన ప్రాణాలను తీసుకోవాలి. కానీ ఇతరులు ప్రాణాలను తీసే ద్రోహములను కాకూడదు. 2తిమోతి 3:3 లో అంత్యదినాలలో అనురాగరహితులు, అతి ద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జన ద్వేషులు, ద్రోహులు,

మూర్ఖులు, గర్వాంధులు దేవునికంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగలవారివలె ఉండియూ దాని శక్తిని ఆశ్రయించనివారునై ఉందురు. అట్టివారికి అనగా అబీమెలెకు వంటివారికి విముఖుడవై యుండుమని దేవుని వాక్యము సెలవిస్తోంది. అట్టివారికి ముఖము కూడా చూపించకూడదట. ఎంత స్ట్రిక్ట్‌గా దేవుడు చెబుతున్నాడో కదా. ఈనాడు వున్న తల్లిదండ్రులను పోషించని ద్రోహులు ఎంతోమంది ఉన్నారు. వారు తల్లిదండ్రులకు ప్రత్యుపకారము చేయుటకు నేర్చుకొనవలెను అని 1తిమోతి 5:4లో వ్రాయబడింది.

సంఖ్యా 5:13 ప్రకారం ఈనాడు అనేకమంది భార్యలు, భర్తలకు ద్రోహము చేస్తున్నారు. 1దిన 9:1 ప్రకారం యూదా చేసిన ద్రోహముకై దేవుడు వారిని బబులోనుకు చెరకు అప్పగించాడని చూస్తున్నాము. 2దిన 26:16 లో ఉన్నట్లు ఉజ్జియా మనసున గర్వించి యెహోవా మీద ద్రోహము చేయగా అతని నొసట కుష్ఠురోగము వచ్చినట్లు చూస్తున్నాడు. యిర్మీయా 2:19 లో నీవు చేసిన ద్రోహము నిన్ను గద్దించును అని దేవుడు వ్రాయించాడు. చివరకు యూదా ఇస్కరియోతు ప్రభువును సహితము అమ్ముకొని ద్రోహము వలన 30 వెండి రూకలు సంపాదించాడు. కానీ అనుభవించలేకపోయాడు. మన పాఠ్యభాగములోని అబీమెలెకు కూడా 3 సంవత్సరములే రాజుగా రాజ్యమేలాడు. కీర్తన 20:7 ప్రకారము దుష్టుడైన అబీమెలెకు విజయము కొద్దికాలమే ఉండింది. 56 వచనము ప్రకారము అబీమెలెకు చేసిన ద్రోహమును దేవుడే అతని మీదికి రప్పించాడట. మనకు ద్రోహము చేసినవారికి మనము ద్రోహము చేయుట కాదు. దేవుడే చేస్తాడట. 'పగ తీర్చుట నా పని. నేనే పగతీర్చుతాను. నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు' అని ప్రభువు చెప్పాడు. న్యాయాధి 9:23 లో గిద్యోను డెబ్బదిమంది కుమారులకు చేయబడిన ద్రోహ ఫలము వారిని చంపిన అబీమెలెకు మీదికిని. అతడు తన సహోదరులను చంపునట్లు డెబ్బది తులముల వెండిని ఇచ్చి అతని చేతులను బలపరచిన షెకెము యజమానుల మీదికి ఆ ప్రాణహత్య దోషము వచ్చునట్లు దేవుడే చేశాడు. అట్లు దేవుడు దురాత్మను పంపగా షెకెము యజమానుడు న్యాయాధి 9:4లో అబీమెలెకు వంచించాడు. న్యాయాధి 9:4 లో 70 మందిని ఒక్కొక్కరిని ఒక్కొక్క తులము వెండి చొప్పున 70 వెండి తులములిచ్చి అతని చేతులు బలపరచిన షెకెము యజమానులు 9:24 లో అబీమెలెకు దురాత్మ ద్వారా వంచించినట్లు చూస్తున్నాము. ద్రోహము చేసినవారికే కాక, దానిని చేయించిన వారి మీదికి కూడా ద్రోహ ఫలితాలను దేవుడు పంపాడు. అలాగైతే వంచించుట, ద్రోహము చేయుట ఇవన్నీ దురాత్మ పనులే కానీ, పరిశుద్ధాత్మ పనులు కావు. సహోదరులమైన మనము, సహోదరీలమైన మనము ఎవ్వరికినీ ద్రోహము చేయకూడదు. మన ద్రోహ ఫలితము తిరిగి ఎన్నటికైనా మనమీదకే వస్తుందని భయము నొంది పాపము చేయకుండా ఉండాలి. అందుకే యెషయా 33:1లో, దోచుకొనబడక పోయినను దోచుకొనుచుండు నీకు శ్రమ. నీవు దోచుకొనుట మానిన తరువాత నీవు దోచుకొనబడెదవు. నీవు వంచించుట ముగించిన తరువాత జనులు నిన్ను వంచించెదరని దేవుడు వ్రాయించాడు.

ఎస్తేరు 9:25 లో హామాను యూదులకు విరోధముగా తలపెట్టిన చెడు యోచన తన తలమీదకే వచ్చినట్లుగా చేసి వాడును, వాని కుమారులును ఉరికొయ్య మీద ఉరితీయించబడునట్లుగా దేవుడు చేయించాడు. కీర్తన 7:15,16 లో వ్రాయబడినట్లే 'వాడు గుంట త్రవ్వి దానిని లోతుచేసియున్నాడు. తాను త్రవ్విన గుంటలో తానే పడిపోయెను.' కీర్తన 94:23 ప్రకారము, ఆయన వారి దోషమును వారి మీదికి రప్పించును. వారి చెడుతనమును బట్టి వారిని సంహరించును.' ఈ వాక్యములన్నిటి ప్రకారము అబీమెలెకు దోషఫలితము, హత్య ఫలితము, ద్రోహఫలితము అతని మీదికి రాగా అతడు చనిపోయినట్లు చూస్తున్నాము. తన సహోదరులను ఒక్క రాతిమీద చంపిన రాతితోనే చచ్చాడు. అలాగే న్యాయాధి 4వ అధ్యాయములో 900 ఇనుప రథములతో ఇశ్రాయేలీయుల మీదికి యుద్ధానికి వచ్చిన కనానీయుడైన సీసెరా యాయేలు అను స్త్రీ ద్వారా ఒక్క ఇనుప మేకుచే కణతలలో కొట్టబడి చంపబడ్డాడు.

ప్రియసోదరీ, ఇంతవరకు మనము చూచిన లేఖనాలన్నింటిలో మనుషులకు ఎవరైనా ద్రోహమ చేస్తే ఆలా చేసిన వారి మీదికి తిరిగి ఆ ద్రోహ ఫలితము వచ్చేట్లు దేవుడు చేశాడు. కానీ తన ప్రియ కుమారుని ఊరి వెలుపల మన దోషములను, అతిక్రమములను బట్టి మనము ఆయనను సిలువవేసి చంపగా 2కొరింథీ 5:19 ప్రకారము, తండ్రి మన పాపములను, అపరాధములను మనమీద మోపక క్రీస్తు మీద మోపాడు. మన దోష ఫలితము మన మీద మోపడానికి తండ్రికిష్టము లేదు. యెషయా 53 అధ్యాయము ప్రకారము ఆయన మన దోషములను భరించాడు. మన వ్యసనాలను భరించాడు. మన అతిక్రమములనుబట్టి ఆయన గాయపరచబడ్డాడు. మన దోషములను బట్టి నలుగగొట్టబడ్డాడు. మన సమానార్థమైన శిక్ష అతని మీద పడింది. మన స్వస్థత కొరకై ఆయన దెబ్బలు తిన్నాడు. యెహోవా మన అందరి దోషములను అతని మీద మోపాడు. అతనిని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమైంది. తండ్రి ప్రేమ మన మీద ఈలాగురండగా కుమారుడైన యేసుక్రీస్తు కూడా తన కలిగిన వేదనను చూచి తృప్తి పొందాడు. ఎవరైనా ఆకలిగొనినపుడు అన్నం తింటే తృప్తి కలుగుతుంది. ఎవరికైనా దప్పికయైతే నీరు త్రాగితే తృప్తి అవుతుంది. వేదన చూచి ఎవరైనా తృప్తిపొందుతారా? కానీ, నీ, నా పక్షముగా ప్రభువు మరణవేదన, నరకవేదన, ఆకలి, దాహం, బలహీనత, దిగంబరత్వము, నింద, అవమానం, హేళన, దూషణ, నింద, అన్యాయపు తీర్పు అన్నీ అనుభవించి తృప్తి పొందాడంటే, ఆయన ప్రేమ పాపులైన మనమీద ఎంత గొప్పగా ఉన్నదో కదా. కావున ప్రేమ చేతనో ఆ ప్రభువుతాను పొందిన గాయముల ద్వారా పాపము లేని తన పరిశుద్ధ రక్తాన్ని చిందించాడు. ఎవరైతే ఆయన రక్తమునందు తన పాపములను కడుగుమని విశ్వాసముతో అడుగుతారో వారి పాపములను కడిగి పాప క్షమాపణను, నిత్యజీవ భాగ్యం ఇస్తాడు. ప్రియ సోదరీ, నీ పాపములను ప్రభువు రక్తంలో కడిగించుకున్నావా? జీవగ్రంథములో నీ పేరున్నదా? ఇదే రక్షణ దినము, ఇదే మిక్కిలి అనుకూల సమయం. ద్రోహి ఫలితము, దోష ఫలితము వద్దు. దోషముల నుండి రక్షణ పొందాలని క్రీస్తు పక్షమున నిన్ను వేడుకుంటున్నాను. నీ శత్రువుకైనా నరకశిక్ష వద్దు.

# 10

# పలికి సిగ్గుతెచ్చిన పడతి - సంమ్సోను భార్యయైన తిమ్నాను స్త్రీ

సమ్సోను యొక్క భార్యను గురించి ధ్యానిద్దాము అనుకుంటే అందరికీ గుర్తొచ్చేది దెలీలాయే. దెలీలా సమ్సోను భార్య కాదు గానీ దెలీలాయే ఆయన భార్య అనుకొని ఆయన జీవితాన్ని చాలామంది తృణీకరిస్తూ ఉంటారు. కానీ సమ్సోను జీవితంలో ఎన్నో మాదిరికరమైన అంశాలున్నాయి. సమ్సోను జీవితం నలుగురు స్త్రీలతో ముడిపడి ఉంది. ఆ స్త్రీలలో మొదటిది తనకు జన్మనిచ్చిన తల్లి. ఆమె పేరు బైబిల్‌లో లేదు. తండ్రి పేరు మానోహా అని వ్రాయబడింది. కనుక ఆయన తల్లి పేరు మిస్సెస్ మానోహా అనుకుందాము. రెండవ స్త్రీ ఆయన పెళ్ళి చేసుకున్న తిమ్నానులో ఉండిన ఫిలిష్తీయ స్త్రీ. ఈమె పేరు కూడా బైబిల్‌లో వ్రాయబడలేదు. కనుక ఆమెను 'మిస్సెస్ శ్యామ్‌సన్' అందామ. మూడవ స్త్రీ ఒక అర్ధరాత్రి తనతో గడిపిన గాజాలోని వేశ్య. ఆమె పేరు కూడా బైబిల్‌లో వ్రాయబడలేదు. కానీ నాలుగవ స్త్రీ ఫిలిష్తీయ వేశ్య. ఈమె పేరు మాత్రమ 'దెలీలా' అని శిలాక్షరాలతో వ్రాయబడినట్లుగా అందరికీ ఈమె పేరు వెల్‌నోటెడ్‌గా తెలిసిపోయింది.

ఈ సమయంలో పేరు తెలియని ఈయన మొదటి భార్యను గూర్చి వాక్యమేమి సెలవిస్తుందో ధ్యానిద్దాం. ఈమెను గూర్చి ధ్యానించక మునుపు సమ్సోనును గురించి కొంత ధానిద్దాం. మానోహా దంపతుల కుమారుడే ఈ సమ్సోను. తల్లి యొక్క ప్రార్థనతో ఈయన జన్మించాడు. ఈయన తల్లి ఈయనకు పెట్టినపేరు సమ్సోను. సమ్సోను అనగా సూర్యుని ఎండగలవాడు అని. అనగా సూర్యుని వెలుగు, లేదా ప్రకాశము కలిగినవాడు అని అర్థము. చంద్రుని వెన్నెలలో తన కుమారుడు పెరగాలనుకోలేదు ఆ తల్లి. మలాకీ 4:2 లో వ్రాయబడినట్లు, నీతి సూర్యుడైన మన ప్రభువు కాంతిలో ఆరోగ్యమునిచ్చే ఆయన రెక్కల నీడ క్రింద తన కుమారుడు దేవుని సేవ చేయాలని ఆ పేరు తల్లి అతనికి పెట్టింది. కానీ ఈ నీతిసూర్యుడు ఆయన నామమందు, భయభక్తులు గలవారికే ఉదయిస్తాడని వ్రాయబడింది. ఇందుమూలముగా సమ్సోను దేవునియందు భయభక్తులు గలవాడని అతని పేరు యొక్క అర్థమునుబట్టియు, అతడు జీవించిన జీవితమును బట్టియు మనము చెప్పగలుగుచున్నాము. ఈలాగున తనయందలి భయభక్తులు గలవారికి ఆయన రెక్కలు ఆరోగ్యాన్ని కలుగజేస్తాయని చదువుతున్నాము. అందుకే సమ్సోను మంచి ఆరోగ్యము గలవాడుగా, బలిష్ఠుడుగా బైబిల్‌లో పేరు గడించాడు. సొలొమోను బైబిల్‌లో జ్ఞానానికి ప్రతీకగా ఉన్నట్లు సమ్సోను బలమునకు ప్రతీకగా ఉన్నాడు. కానీ,

తనయందు భయభక్తులు లేనివారికి ఈ నీతిసూర్యుడు ఎలా ఉంటాడో మలాకీ 4:1 లో వ్రాయబడినది. ఆయనయందు భయభక్తులులేక గర్వించేవారు దుర్మార్గులందరిని ప్రభువు తన రెండవ రాకడలో వారిని కొయ్యకాలు వలె కాల్చుతాడని వ్రాయబడింది.

ప్రియ సోదరీ, ప్రభువునందు నీవు భయభక్తులు కలిగి ఉన్నావా? ఆ నీతిసూర్యుని రెక్కల క్రింద సురక్షితమా? క్షేమమా? ఆరోగ్యమా? లేక గర్విష్టివై, దుర్మార్గురాలివై కొయ్యకాలువలె వేరైనను, చిగురైనను లేకుండా కాల్చివేయబడతావా? నేడే ఆలోచించి ప్రభువుతో పాపాలు ఒప్పుకొని ఆయన రక్తముతో కడిగించుకొని ప్రభువును నీ స్వంత రక్షకునిగా స్వీకరించాలని కోరుతున్నాను.

**I. ఎదుగుచూ ఆశీర్వదించబడిన సమ్సోను (న్యాయాధి 13:24):** కనుక మొదటి అంశములో సమ్సోను యెహోవా యందు భయభక్తులు కలిగిన సమ్సోనుగా సూర్యుని ప్రకాశత కలిగిన సమ్సోనుగా కనిపిస్తున్నాడు. న్యాయాధి 13:24 లో ఎదుగుతూ ఆశీర్వదించబడిన సమ్సోనుగా చదువుచున్నాము. ఆలాగున ప్రభువును నమ్మిన మనము ఏ ఏ విషయాలలో ఎదిగితే మనము ఆశీర్వదించబడతామో వాక్యములో చూద్దాం.

## సమ్సోను మొదటి భార్య

పిల్లవాడు పుట్టడమైతే పుట్టాడుగాని ఎదిగినపుడు ఆశీర్వదించబడ్డాడు అని వాక్యము చెబుతున్నది. పిల్లలు గాని, యవ్వనస్తులు గాని, స్త్రీలమైన మనము గాని కోరుకునేది అభివృద్ధి, ఆశీర్వాదము. శాపం ఎవరికీ ఇష్టము లేదు. దీవెన అందరము కోరుకుంటాము. ఏ దీవెన పొందాలన్నా ఎదుగుదల ఉండాలి. యేసుక్రీస్తు ద్వారా తండ్రికి కుమార్తెలమని మనమెరుగుదుము. పుట్టటము క్రీస్తును నమ్ముకొనగానే జరుగుచున్నది. పుట్టుక తర్వాత ఎదుగుదల. ఎదిగినపుడే ఆశీర్వాదము. దేవునిలో పుట్టారా? పుడితే ఎదుగుచున్నారా? ఏ విషయాల్లో మనము ఎదగాలి?

**1. రక్షణ విషయంలో ఎదుగుట:** 1పేతురు 2:2, రక్షణ విషయంలో ఎదుగునట్లు నిర్మలమైన వాక్యమను పాలను అపేక్షించాలి, రక్షింపబడడము మాత్రమే కాదు, రక్షణలో ఎదగాలి. పుట్టిన శిశువు పాలకొరకు తల్లి రొమ్మును ఎప్పుడంటే అప్పుడు అపేక్షిస్తాడు. టైమింగ్స్ ఏమీ ఉండవు. 3 నెలల శిశువు అయినపుడు టైమింగ్స్ పాటిస్తాము. కాని పుట్టినపుడు టైమింగ్స్ ఉండవు. అదే విధంగా దేవుని వాక్యాన్ని ఎప్పుడంటే అపుడు చదువుకునేవాళ్ళుగా ఉండాలి. ఎంత ఎక్కువగా చదువుకుని రక్షణలో ఎదుగుతామో అది మనకే ఆశీర్వాదము. సహో. భక్తసింగ్‌గారు రక్షింపబడిన రోజు రాత్రిలోనే క్రొత్త నిబంధన ముగించారట.

అలాగే బైబిల్‌ను ద్వేషించిన ఒక అబ్బాయి ఒకరోజు రాత్రి నెమ్మది లేక తన అక్కను బైబిల్ అడిగి తీసుకున్నాడు. పాత క్రొత్త నిబంధనలను 3 రోజులలో చదివి ముగించాడు. ఎంత ఆపేక్ష ఆ బిడ్డలో ఉందే మనము ఆలోచించవచ్చు. ఎంతమంది ఎంతగా బైబిల్ చదువుచున్నాము? ఎన్నిసార్లు చదివాము అనికాదు, కాని ఎంతగా

గ్రహించుకుంటున్నాము? ఎంతమటుకు వాక్యాన్ని పాటిస్తున్నాము? అనునది ప్రాముఖ్యము. అది మన ఎదుగుదలకు దోహదం చేస్తుంది. జార్జి ముల్లర్‌గారు బ్రదరన్ సంఘాల మొదటి స్థాపకుడు. ఆయన తన జీవితంలో 200 సార్లు అర్థవంతంగా బైబిలు చదివాడట. ఎంత జ్ఞానము సంపాదించాడో! మీరు సమస్త ఉపదేశంలోను, సమస్త జ్ఞానంలోను ఐశ్వర్యవంతులైతిరి అని 1కొరింథీ 1:6 చెబుతుంది. దేనిలో ఐశ్వర్యము? డబ్బులో, హోదాలో, ఆస్తిలో, అంతస్థులో, జీతంలో కాదు, బైబిలు జ్ఞానంలో, బైబిలును ఉపదేశించుటలో ఐశ్వర్యవంతులు.

సమస్త ఉపదేశములో అంటే ఈ బోధ నాకు రాదు అనకుండా ఏ సమయానికి, ఏ సందేశాన్నైనా ఉపదేశించగలిగే సామర్థ్యము కొరింథీయులకు ఉంది. వారివలె బెరయ క్రైస్తవులవలె దేవుని వాక్యాన్ని తరచి తరచి చూచేవాళ్ళుగా ఉండాలి. అందుకు దేవుని వాక్యాన్ని బాగుగా పఠించాలి, ధ్యానించాలి.

**2. ప్రేమలోను, సత్యములోను ఎదుగుట:** ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె అన్ని విషయములలో ఎదగాలి. దాని ముందు రెండు చెప్పాడు. ప్రేమ కలిగి సత్యము చెప్పుచూ ఎదగాలి. ప్రేమలో ఎదగాలి. సత్యములో ఎదగాలి, ఇంకా ప్రార్థనలో ఎదగాలి. సేవించుటలో ఎదగాలి, సమర్పించుటలో ఎదగాలి. ఇలా చాలా వాటిల్లో ఎదగాలి. ఎదుగుట ఉంటే ఆశీర్వదిస్తాడు. లోకరీతి ఆశీర్వాదాలు మన వెంట రావు. మనవెంట వచ్చేవి ఆత్మీయ ఆశీర్వాదాలే. వీటిని సంపాదించుకోవాలి.

**3. గడ్డిపూవులు ఎదుగునట్లు ఎదగాలి:** అడవి పువ్వులు ఎలా ఎదుగుచున్నవో ఆలోచించుడి. తమ సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో ఒకదాని వలెనైనను అలంకరింపబడలేదు (మత్తయి 6:29). గడ్డిపూవుకు ఉన్న అలంకరణ సమస్త వైభవముతో ఉన్న సొలొమోనుకు కూడా లేవు. గడ్డిపువ్వు ఎదిగిన రీతిగా అలంకారముగా ఎదగాలి. పువ్వులోని రేకులు వంకరటింకరగా ఉండవు. చక్కగా క్రమంగా ఉంటాయి. మనము కూడా చక్కగా క్రమంగా అందంగా ఎదగాలని ప్రభువు ఇష్టపడుతున్నాడు.

**4. సమూయేలు ఎదిగినట్లు ఎదుగుట:** బాలుడగు సమూయేలు యెహోవా సన్నిధిని ఉండి ఎదుగుచుండెను (1సమూ 2:21). ఎదగడానికి అనువైన స్థలం దేవుని సన్నిధి. అందుకే పాలు విడిచిన బాలుడు యెహోవా సన్నిధిలో ఉండగలుగుచున్నాడు. అతడు పనిచేసినా, ప్రార్థించినా, పడుకున్నా దేవాలయంలోనే. అందుకే దేవుని ప్రత్యక్షత పొందాడు. మహావృద్ధుడు, ప్రధాన యాజకుడైన ఏలీకి తెలియని మర్మాలు, క్రొత్త సంగతులు, భవిష్యత్ విషయాలు తెలుపబడ్డాయి. ఆ చిన్నవాడు పలికిన మాటలు గమనించండి, నీ దాసుడు ఆలకించుచున్నాడు, సెలవిమ్ము. ఎంత విధేయత! ఈ మాటలు ఏలీ దగ్గర నేర్చుకున్నాడు. నేర్పిన ఏలీతో దేవుడు మాట్లాడలేదు గాని విధేయత కలిగిన ఆ చిన్నబిడ్డతోనే మాట్లాడాడు.

నేడు బైబిల్ ద్వారా దేవుడు నీతో మాట్లాడాలి అంటే యెహోవా సన్నిధిలో కనిపెట్టాలి. అబ్రాహాము యెహోవా సన్నిధిని నిలుచుండెను (ఆది 18:22). యెహోవా

అబ్రాహాముతో మాటలాడుట చాలించి వెళ్ళిపోయెను. అబ్రాహాము తన ఇంటికి తిరిగి వెళ్ళెను (ఆది 18:33). దేవుడు మాటలు చాలించినంతవరకు అబ్రాహాము యెహోవా సన్నిధిలో ఉన్నాడు. కొద్దిమంది ప్రార్థన ముగించకముందే, వాక్యము అయిపోకముందే వెళ్తారు. ఆయన సన్నిధిలో సంపూర్ణ సంతోషము ఉంది. సగము కాలము ఉంటే సగము సంతోషము. పూర్ణకాలము ఉంటే పూర్ణ సంతోషము, పూర్ణ ఎదుగుదల ఉంటుంది. ప్రభువు సన్నిధి అనుభవించి ఆశీర్వదించబడుదువు గాక.

**II. ఆశీర్వాదం పొందిన సమ్సోను (న్యాయాధి 13:24):** ఈలాగున మనమును ఆశీర్వదించబడాలని ప్రభువు కోరుతున్నాడు. పైన చెప్పబడిన నాలుగు విషయాలలో మాత్రమే కాక, ఎఫెసీ 4:15 లో వ్రాయబడినట్లు, 'ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగవలసినవారమై యున్నాము. ఆశీర్వాదము లేదంటే మనల్ని మనము ఎదుగుచున్నామో లేదో పరీక్షించుకోవాలి. అలాగైతే మన పాఠ్యభాగములోని సమ్సోను ఏ రీతిగా ఆశీర్వదించబడ్డాడు? భూసంబంధమైన ఆస్తిపాస్తులు, మేడలు, ధనధాన్యాలు అనే ఈ ఆశీర్వాదాలతో కాదు గాని దేవుని ఆత్మతో నింపబడి ప్రేరేపించబడే ఆశీర్వాదముతో దేవుడతనిని నింపాడు. దేవుని ఆత్మతోనే దాను గోత్రపు దండులోనే ఆయన సేవచేసే ఆశీర్వాదంతో నింపబడ్డాడు. ప్రియ సోదరీ, మీ స్వంత గ్రామంలో, స్వంత పట్టణంలో, మీ స్వంత బంధువుల మధ్య ప్రభువు పని నీవు కాక మరెవరు చేస్తారు? సమ్సోను తన సరిహద్దులెరిగి 'జొర్యా' నుండి 'ఎష్తాయోలు' వరకు ఆత్మతో నింపబడి సేవచేసినట్లు మీరును మీ సరిహద్దులలో పనిచేయవలసిన వారుగా ఉన్నారు.

ఇలా ఆత్మీయ ఆశీర్వాదాన్ని పొందగోరుచున్నావా? సమయముండగానే ఆ ఆత్మీయ ఆశీర్వాదాలను పొందుకోండి. ఏశావు సమయమంతా దాటిపోయిన తరువాత ఆశీర్వాదం పొందగోరి కన్నీళ్ళు విడుచుచు దానికోసరము శ్రద్ధతో వెదకినను మారుమనసు పొంద అవకాశములేక విసర్జించబడ్డాడు (హెబ్రీ 13:17). ఇలాగున దేవుడు సమ్సోను చేయవలసిన సేవ అంతటిలో అతడు చనిపోయే చివరి దినము వరకూ అతనికి ఆత్మ ప్రేరేపణ ఇస్తూ వచ్చాడు.

మహనెదాను అను పేరుకు చక్కని అర్థము ఉంది. అది దానునుండు పేట అని అర్థం. దాను అంటే గోత్రమని తెలుసుకదా. దాను గోత్రములోనే పుట్టాడు సమ్సోను. సమ్సోను తండ్రి దాను గోత్రికుడని చదువుచున్నాము. తన సొంత గోత్రములో ప్రేరేపించబడుచున్నాడు. దానుదండుపేట అనగా దాను సైన్యం, దానీయులు మిలటరీ భాగంలో దేవుడు ఆయనను ప్రేరేపించుచున్నాడు. ఈనాడు మన మధ్య ఉండేది స్త్రీల దండు. మరి ఈ దండు పేటలో మనకు ఆత్మ ప్రేరేపణ ఉందా? ఒక పాట పాడడానికైన, ప్రార్థన చేయడానికైనా, సాక్ష్యము చెప్పడానికైనా బయటకు వెళ్ళి పాంప్లేట్స్ పంచడానికైనా, ఇతరుల ఇళ్ళకెళ్ళి వారిని మీటింగ్స్‌కు తీసుకురావడానికైనా వెళ్దాము, లేక ఫలానావాళ్ళను దర్శిస్తాము అని అలాంటి ఆశ, ప్రేరేపణ మనలో కలుగుచున్నదా? అలాగైతే మనము

నిజముగా రక్షింపబడినవారమే. ఏ ప్రేరేపణ లేదు అంటే మన సంగతి మనమే తేల్చుకోవాలి. మొట్టమొదట దేవుడు మనలను ఎక్కడ ప్రేరేపిస్తాడు? మన స్థానిక సంఘములో స్థానికుల మధ్య మనలను రేపడానికి ఆయనకు ఇష్టము. కాని అనేకసార్లు ఈ ప్రేరేపణను అణచుకుంటున్నాము. ఈ ప్రేరేపణ అణచుకునే విషయము యిర్మీయా చెప్పాడు కాదా. దేవుని వాక్యము నాలో మండుచున్నది, చెప్పకుండా ఉందామనుకున్నాను, చెప్పితే దినమెల్ల నవ్వులపాలు అవుతాను, చెప్పకపోతే అది అగ్నివలె నాలో మండుచున్నది. నేను చెప్పక ఊరక ఉండలేను అంటున్నాడు. అంటే దేవుని ఆత్మ ఎంత దండిగా యిర్మీయా మీద ఉందో చూస్తున్నాము. కావున రక్షింపబడిన బిడ్డలలో, ఎదుగుదల ఉన్న బిడ్డలలో ఆత్మ ప్రేరేపణ తప్పనిసరిగా ఉంటుంది.

**III. తన వివాహ విషయులో ప్రేరేపించబడుచున్న సమ్సోను (న్యాయాధి 14:1-4):** 14:1 - తిమ్నాతులో సమ్సోను దేవునిచేత రేపబడ్డాడు. ఫిలిష్తీయుల అమ్మాయిలలో ఒకతెను చూచి ఇంటికి వచ్చాడు. వాళ్ళ నాన్న, అమ్మతో చెప్పాడు. నాకు ఫలానా అమ్మాయి ఇష్టమైంది. ఆ అమ్మాయిని నా కొరకు తెప్పించండి అన్నాడు. కానీ ఈనాటి యవ్వనస్థుల్లాగా ఆ అమ్మాయిని దొంగగా పెళ్ళి చేసుకొని ఇంటికి తెచ్చేసుకోలేదు. సమ్సోను తన పెళ్ళి భారాన్ని తలిదండ్రుల చేతికి అప్పగించాడు. వాళ్ళ నాన్న, అమ్మ అన్నారు గదా, వారు సున్నతిలేని ఫిలిష్తీయులు, మన జనులలో నీకు స్త్రీ లేదనుకొని ఆ అన్యుల మధ్యకు వెళ్ళి అక్కడి అమ్మాయిని తెప్పించమంటావా? అని అన్నారు. కాని ఇక్కడ ఒక ప్రత్యేకమైన మాట ఉంది. 14:4 - ఫిలిష్తీయులకేమైన చేయుటకై యెహోవా చేత రేపబడుచున్నాడని అతని తల్లిదండ్రులు తెలుసుకోలేదు. తల్లిదండ్రులకు తెలియని ప్రేరేపణ కుమారునికి ఉంది. ఈ అన్యుల అమ్మాయిని చేసుకొనమని సమ్సోనుకు చెప్పినదెవరు? యెహోవాయే రేపుచున్నాడు. మొట్టమొదట స్థానిక సంఘములో రేపిన పరిశుద్ధాత్ముడు ఇప్పుడు రెండవ ప్రదేశం తిమ్నానుతో కూడా రేపుచున్నాడు.

తన సొంత ఇచ్ఛనుబట్టి ఆ అమ్మాయి నాకు ఇష్టమయింది అని చెప్పడం లేదు. కాని తన హృదయంలో దేవుని ఆత్మ అతనిని ప్రేరేపిస్తున్నాడు. అంటే తన వివాహ విషయమై ప్రేరేపణ ఎక్కడనుండి వచ్చింది? అంటే యెహోవా వద్దనుండి వచ్చింది. ఇక్కడ వివాహము చేసుకోవలసిన యవనులు ఉన్నారు. వివాహము చేసే బాధ్యత గల తల్లిదండ్రులమున్నాము. వివాహము గూర్చిన ఆలోచన యెహోవా చేత కలుగుతుందా? ఫ్రెండ్స్ ఇచ్చిన ఆలోచనతో కలుగుతుందా? లేదా సైతాను ఆలోచన చేత కలుగుతుందా? బంధువులు ఇచ్చిన ఆలోచన చేతనా? సమ్సోను తల్లిదండ్రులు కూడా తమ కుమారుని పట్ల దేవుని చిత్తాన్ని తెలుసుకోలేదు. కొన్నిసార్లు తల్లిదండ్రులను మించిన భక్తి పిల్లలకు ఉంటుంది. ప్రియ యౌవనస్తురాలా, మీ తల్లిదండ్రులకు మించిన భక్తి నీకు ఉందా? మీ తల్లిదండ్రులకు తెలియని వాక్యము నీకు తెలుసా? మీ తల్లిదండ్రులు చేయలేని సేవ మీరు చేస్తున్నారా? మీ తల్లిదండ్రులు దేవునికి ఆనందము కలిగించేదానికంటే

మించి మీరు దేవునికి ఆనందము కలిగిస్తున్నారా? తల్లిదండ్రులకు లేని అవకాశాలు నీకు ఇచ్చాడు. కావున నీవు దేవుని సంతోషపరచాలి. సమ్సోను జీవితం మనకు మాదిరిగా ఉంది కదా. తల్లికి దేవదూత రెండుసార్లు, తండ్రికి ఒక్కసారే యెహోవా దూత ప్రత్యక్షమయినట్లు చూస్తున్నాము. కాని వారి కుమారుడైన సమ్సోనుకు వీరికంటే ఎక్కువ ప్రత్యక్షలు కలిగాయి. సమ్సోను దేవుని ప్రత్యేకతనుబట్టి పెండ్లి చేసుకొనుటకు ఇష్టపడుచున్నాడు. ప్రియమైన సహోదరీలారా, మీకు వివాహ ప్రయత్నములు జరుగుచు ఉండవచ్చు. సంబంధాలు చూస్తూ ఉండవచ్చు. కనిపెట్టి ప్రార్థిస్తూ ఉండవచ్చు. కాని పెద్దలు కొన్నిసార్లు పొరపడుటకు అవకాశముంది. మన యోగక్షేమాలు కోరుకునే తల్లిదండ్రులు కూడా తప్పులు చేయవచ్చు. జాగ్రత్త, మన ఇంటికి వచ్చే అబ్బాయిని మార్చుకోవచ్చు అనుకుంటారు. మన ఇంటికి వచ్చిన అమ్మాయి మన మాట వినకుండా ఉంటుందా అనుకోవచ్చు. రక్షణ మనది కాదు. యెహోవాది. రక్షణ ఇచ్చువాడు, రక్షించేవాడు ప్రభువే. మనము దేవుని మాటలు చెప్పగలము, ప్రార్థన చేయగలము కాని కార్యాలు జరిగించువాడు పరిశుద్ధాత్ముడు. 'ఓ స్త్రీ నీ భర్తను రక్షించెదెవరో నీకేమీ తెలియును? అని 1కొరింథీ 7:16 చెబుతుంది. నా భర్తను నేను మార్చుకోలేనా? అని అనుకుంటున్నాము. మన కడుపున పుట్టిన పిల్లలను మనము మార్చుకోలేకపోవు చున్నాము. ఎవరో కడుపున పుట్టిన పిల్లలను ఏమి మార్చగలము?

చాలామంది సంఘానికి వెనకే ఉంటారు. ఎంతమంది మారుచున్నారో, ఎంతమంది మారలేదో మనకు తెలుసు. తమ భర్తలు ఏండ్ల తరబడి మారక ఎంతోమంది సోదరీలు ఎంతో కష్టపడుచున్నారు. అబీగయీలు మంచి ఆత్మీయురాలు. భర్త నాబాలు మూర్ఖుడు, త్రాగుబోతు, ఎవరితో మాట్లాడనీయడు. అలాంటి భర్తతో ఆమె ఎంత కష్టము అనుభవించిందో ఎవరికి తెలుసు? ఆమె తల్లిదండ్రులు నాబాలు ఓలిగా ఎక్కువ డబ్బులు ఆశించి అబీగయీలును ఇచ్చారేమో. అబీగయీలును బలవంతముగా ఒప్పించారేమో. ఎంత వేదన పొందిందో. కానీ నాబాలు మరణించిన తరువాత ఆమెకు దావీదు భర్తగా లభించాడు. ఆమెకు దావీదును ఇచ్చినవాడు దేవుడే. ఆమె కంటే దావీదు చక్కని ఆత్మీయుడు. మనము అలా ఆత్మీయ భర్తలను ప్రార్థనలో కోరుకోవాలి. అబీగయీలులాగా మనము కూడా రెండవ వివాహము చేసుకుందాము అనుకోకూడదు. ఏక పత్నీవ్రతులై ఉండాలని ప్రభువు చెప్పాడు. మొదటి పెళ్ళినే అర్జంటుగా కాక, చాలా ప్రార్థనా పూర్వకంగా ప్రభువు చిత్తమును ఎరిగి పెళ్ళిచేసుకోవాలి.

భార్యను ఇచ్చువాడు ప్రభువు. పిల్లలకు వివాహాలు చేయువాడు ఆ ప్రభువే. ఏదేను తోటలో మొట్టమొదటి పెళ్ళి రిజిస్టార్ ఆ ప్రభువే. ఆ ప్రభువుకే మనము అప్పగించుకోవాలి. నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు అన్నాడు ప్రభువు. మంచిది ఏదో, సరియైన సమయములో మనకిచ్చువాడుగా ఉన్నాడు. ఆదాము పెళ్ళి చేసిన దేవా, నా పెళ్ళి కూడా నువ్వే చేయాలి అని ప్రార్థించాలి. సమ్సోనుకు కలిగిన ప్రేరణ దేవుని ద్వారానే కలిగింది.

రిబ్కా అన్న అయిన లాబాను ఎలియాజరుతో 'రిబ్కా నీ యెదుట ఉన్నది. ఈమెను తీసుకొని పొమ్ము' అన్నాడు. దేవుడు సెలివిచ్చిన ప్రకారము నీ యజమానుని కుమారుడైన ఇస్సాకుకు భార్య అగును గాక' అన్నాడు. దేవుడు సెలవిచ్చిన ప్రకారము నీ యజనుని కుమారుడైన ఇస్సాకు భార్య అగును గాక' అన్నాడు. దేవుడు సెలవిచ్చిన ప్రకారము అనే మాట గమనించాలి, మన సెలవు కాదు గాని దేవుని సెలవును కనిపెట్టి సాగాలి.

తల్లిదండ్రులకు లేని ప్రత్యక్షత సమ్సోనుకుంది. స్వజనులలో అమ్మాయిలు లేరా అని తల్లిదండ్రులన్నారు. సమ్సోను తల్లిదండ్రులకు వివరించి చెప్పి ఉంటాడు. 'అమ్మా నాన్నా, ప్రభువు నన్ను ప్రేరేపించుచున్నాడు కనుక పోదాం పదండి' అని ఉంటాడు. అమ్మాయిని తల్లిదండ్రులు చూడకముందే సమ్సోను చూశాడు. ఇలా అంటున్నాడు, 'ఆమె నాకు ఇష్టమైనది కనుక నా కొరకు తెప్పించండి (న్యాయాధి 14:3) అన్నాడు. (నాకు ఇష్టమైంది అంటున్నాడు. అందమైనదని, ఆస్తికర్త అని చెప్పలేదు). యెహోవా నన్ను రేపుచున్నాడు అనుచున్నాడు. కనుక దేవుని ప్రేరణతో ఇష్టపడుచున్నాడు.

ఫిలిష్తీయుల అమ్మాయి సున్నతి లేనివారి అమ్మాయి. అన్యులలో నుండి దేవుడు ఒకమ్మాయిని సమ్సోనుకు ఇవ్వాలి అనుకున్నాడు. అక్షరము చంపును, ఆత్మ జీవింపజేయును అన్నమాట ప్రకారం ఆత్మీయ అర్థాన్ని ధ్యానిద్దాము. ఆత్మీయంగా ప్రభువైన యేసుకు సమ్సోను చక్కని పోలిక. సమ్సోను భార్యను అన్యజనాంగము నుండి ఇవ్వడానికి ఇష్టపడినట్లే నీతిసూర్యుడైన ప్రభువైన యేసుకు పెండ్లి కుమార్తె (యూదా జనాంగములో నుండి) అన్యజనాంగములో నుండి వచ్చింది.

అందుకే యూదుల రాజుగా పుట్టినవాడు ఎక్కడ అని ప్రవచనము చెబుతున్నది. ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను వారు ఆయనను అంగీకరించలేదు. కావున ఎందరంగీకరించిరో వారందరికీ ఆయన కుమారులు, కుమార్తెలు అయి ఉండే అధికారమును దేవుడు ఇచ్చాడు. అన్యజనులమైన మనము ఆయనను రక్షకునిగా అంగీకరించాము. కావున యేసుప్రభువుకు పెండ్లికుమార్తె అన్యజనులలో నుండి వస్తాది.

**IV. ఆత్మతో నింపబడి సింహాన్ని చంపిన సమ్సోను (న్యాయాధి 14:5-6):** సమ్సోను దేవుని ప్రేరేపణ ప్రకారం తన పెళ్ళి చూపుల కొరకు ఫిలిష్తీయుల అమ్మాయిని తల్లిదండ్రులకు చూపించి దేవుని చిత్తప్రకారం ఇశ్రాయేలీయులను తమ శత్రువులైన ఫిలిష్తీయుల నుండి విమోచించే పనికి ఉపక్రమించే పనిలో ఉండగా, ఆదిలోనే సమ్సోనును చంపుటకు రాగా తాను గర్జించు సింహము రూపములో వచ్చినట్లు చదువుచున్నాము. కానీ దేవుని ఆత్మ అతనిని ప్రేరేపించగా అతని చేతిలో ఏమియూ లేకపోయిననూ అతడు ఒక సాధువైన మేకపిల్లను చంపినట్లు క్రూరమైన సింహాన్ని చంపగలిగాడు. అలాగే దేవుని సేవ చేసే ప్రతి ఒక్కరి జీవితంలో కూడా సాతాను ఎప్పుడూ మారువేషములోనే మన మీద అటాక్ చేస్తూ ఉంటాడు. అయినా ప్రభువు మనలను

ఆశ్చర్యకరంగా కాపాడుతూనే ఉంటాడు. 1పేతురు 5:8 ప్రకారము, సాతాను ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు, తిరుగుతూ ఉన్నాడు. కీర్తన 119:85-87 వరకు వ్రాయబడినట్లు సాతాను మనల్ని చిక్కించుకొనుటకై గుంటలు త్రవ్వుచున్నాడు. నిర్నిమిత్తమున మనలను తరుముచున్నాడు. మనము భూమి మీద ఉండకుండా నాశనమగుటకు సాతాను ప్రయత్నిస్తుండగా దేవుడు కొంచములోనే మనల్ని తప్పిస్తాడు. కీర్తన 97:5 ప్రకారము మనకు సాతాను వలన మనకు వచ్చే సమస్యలు పర్వతములవంటి పెద్దవైనా, సర్వలోకనాధుని సన్నిధిలో, ప్రార్థనా సన్నిధిలో అవి మైనము వలె కరిగిపోతాయి. ఇక్కడ సమ్సోను జీవితంలో సింహము వంటి సాతాను శోధన మేకపిల్లలాగా తేలికగా దేవుడు చేశాడు. మన సేవలో వచ్చే ఆటంకాలన్నిటినీ ఈలాగే దేవుడు మనలను కాపాడతాడు. ఆయన ఆత్మ సహాయము ఎప్పుడూ దేవుడు మనకిస్తాడు. ఇపుడు సమ్సోను భార్యను గురించి ధ్యానిద్దాం.

**1. చూడగా ఇష్టమైన సమ్సోను భార్య (న్యాయాధి 14:7) :** ఫిలిష్తీయుల అమ్మాయిని చూచినప్పుడు ఇష్టపడినట్లు మనము చదువుచున్నాము. మలను చూచినప్పుడు మన ప్రభువుకు మనము ఇష్టముగా కనిపిస్తున్నామా? మనమింక బలహీనులమై యుండగా, మనమింక పాపులమై యుండగా, శత్రువులమై ఉండగా యేసుక్రీస్తు ద్వారా తండ్రియైన దేవుడు ప్రేమించాడు (రోమా 5:6-10). మనలో ఆయనకు ఇష్టమైనవి ఏవీ కనిపించకపోయినా కష్టమైన పాపాలే మనలో కనిపించినా ఆయన మనలను ప్రేమించాడు. అయిష్టులైన మనలను తన రక్తములో కడుగుకొని ఇష్టము కలిగే పరిస్థితులు మనలో కలుగజేసాడు. మన జీవిత పటము యెహె 16 అధ్యాములో వ్రాయబడిఉంది.

నీవు పుట్టిననాడే బయట నేలను పారవేయబడి రక్తంలో పొర్లుచూ చూడ అసహ్యముగా ఉంటివి. నీకు బొడ్డును కోసినవారు లేరు. నిన్ను శుద్ధిపరచుటకు నీళ్ళతో కడిగినవారు ఎవరు లేరు. నీకు వస్త్రములు ధరింపజేసినవారు ఎవరు లేరు. అయినా నేను నిన్ను చూచాను. రక్తంలో పొర్లుచున్న నిన్ను, పారవేయబడిన నిన్ను చూచాను అంటున్నాడు. పారవేయబడ్డాము అంటున్నాడు. బ్రతికి ఉంటే పారవేయలేవీ. చనిపోయినవారినే పారవేస్తాము. అంటే పుట్టిననాడే చనిపోయాము అని అర్థము. పాపములోనే నా తల్లి నన్ను గర్భము ధరించెను అని దావీదు అన్నాడు. దేవుని దృష్టిలో మనము చనిపోయాము. దేన్నిబట్టి చనిపోయాము? పాపముల చేతను, అపరాధముల చేతను చచ్చినవారము. బ్రతుకుచున్నట్లు కనబడుచున్నాము కాని దేవుని దృష్టికి చనిపోయాము.

ఇలాంటి మనలను ప్రభువు ప్రేమించాడు. తన రక్తంలో మనలను శుద్ధీకరించాడు. అంతమాత్రమే కాదు, ఆత్మీయ వస్త్రాలు మనకనుగ్రహించి చిగురాకువలె వృద్ధిని కలిగించి ఇష్టమైన ప్రాయము వచ్చినప్పుడు నీకు అవమానము కలుగకుండ నేను నిన్ను పెండ్లి చేసుకొంటిని గదా అంటున్నాడు. మన విషయంలో ఇంకా పెండ్లి

చేసుకోలేదు గాని ప్రధానం జరిగింది. మనలను పెండ్లి చేసుకొనుట ఆయనకు ఇష్టము. మనకు అవమాను కలుగకుండా మనలో ఉండే అవమాన క్రియలను తొలగించాడు. అయిష్టులుగా ఉన్న మనలను ఆయనే ఇష్టులుగా మలుచుకున్నాడు. అట్టి సంఘములో మనమున్నాము.

దేవునికి ఇష్టమైనవి కొన్ని ఉన్నాయి. అవేంటో చూద్దాం. హెబ్రీ 11:6 ప్రకారం, విశ్వాసము లేకుండా దేవునికిష్టులై యుండుట అసాధ్యమ. అంటే విశ్వాసులే దేవుని కిష్టమని తెలుస్తోంది. కీర్తన 16:3 ప్రకారము భక్తులే దేవునికిష్టులు. కీర్తన 51:16 ప్రకారం, విరిగి నలిగిన మనస్సు దేవునికిష్టమైన బలి. సామెతలు 21:3 ప్రకారం, న్యాయము ఆయనకు ఇష్టం. యెషయా 5:7 ప్రకారం, యూదా మనుష్యులు ఆయనకు ఇష్టులు. యూదా అనగా 'స్తుతి' అని అర్థము. స్తుతించువారు ఆయనకిష్టులు. యెషయా 58:3 ప్రకారము, ఆహారము ఆకలి గొనినవారికి పెట్టుట, రక్తసంబంధికి ముఖము తప్పించకుండుట, వస్త్రహీనునికి వస్త్రములిచ్చుట ఇవియేగదా దేవునికిష్టమైన ఉపవాసము ఫిలిప్పీ 4:18 లో వ్రాయబడినట్లు ప్రభువు పేరట మనము భక్తులకు పంపే వస్తువులు ప్రభువుకు ప్రీతికరమైన ఇష్టమైన యాగములట. ఈలాగున ప్రభువు కిష్టమైన యివన్నియూ మనలో ఏ ఒక్కటియూ లేకపోయినను ప్రేమగల దేవుడు తన కుమారుని రక్తముతో మన పాపములన్నీ కడిగి మనలో తనకిష్టమైనవన్నీ ఉండులాగున తన వాక్యముతో మనల్ని హెచ్చరిస్తూ వాటితో మనల్ని నింపి తనకిష్టమైన వారినిగా తయారుచేస్తున్న మన తండ్రియైన దేవునికి మనమెంతగానో కృతజ్ఞులమై ఉండాలి, స్తోత్రములు చెల్లించాలి.

**2. మాట్లాడగా ఇష్టమైన సమ్సోను భార్య (న్యాయాధి 14:7) :** తన తలిదండ్రులతో కూడ తిమ్నాతుకు వెళ్ళి ఆ స్త్రీతో మాటలాడినప్పుడు, ఆమెయందు సమ్సోనుకు ఇష్టము కలిగెను అని చదువుచున్నాము. అలాగుననే ఆదినుండి దేవుడు తన బిడ్డలతో దేవుడు మాట్లాడే దేవుడుగా ఉన్నాడు. నోరుండియు మాట్లాడని దేవుడు, దేవతల లాంటివాడు కాదు. ఆది ఆదాము హవ్వలతో ప్రతి చల్లపూటను దేవుడు వారితో మాట్లాడేవాడు. మనతో చల్లనిపూట మాత్రమే కాదు, ఎండపూట, ఉదయముపూట, రాత్రిపూట, ఏ పూటయైనా మనతో మాట్లాడుతాడు. హెబ్రీ 1:1 ప్రకారము, పూర్వము నానా సమయములలోను, నానావిధములుగా ప్రవక్తల ద్వారా మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు తన కుమారుని ద్వారా 331/2 సంవత్సరములు మాటలాడెను. పాత నిబంధనలోని 39 పస్తకాల ద్వారాను, 4 సువార్త ద్వారాను, క్రొత్త నిబంధనలోని పత్రికలన్నిటి ద్వారాను, ప్రకటన గ్రంథము మొత్తము 66 గ్రంథముల ద్వారా మనతో మాట్లాడుచున్నాడు. సమరయ స్త్రీ యోహాను 4:25 లో 'క్రీస్తు అనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును. ఆయన వచ్చునపుడు సమస్తమును తెలియజేయునని' చెప్పినట్లు మనము చదువుచున్నాము. ఏ దేవుడును, ఏ జనాంగముతోను ఈలాగున తన సంకల్పమంతటిని మాట్లాడలేదు. మన ప్రభువు మనతో మాట్లాడే దేవుడు. వాక్యము చదివినప్పుడెల్లా ప్రభువు మనతో మాట్లాడుతూనే ఉంటాడు.

ఆలాగున సమ్సోను ఆ ఫిలిష్తీయులతో ఏమి మాట్లాడాడో మనకు తెలియదు. ఒకవేళ యెహోవా దేవుని గూర్చి, ఆయన ధర్మశాస్త్రమను గూర్చియు, ఆయన పది ఆజ్ఞలను, కట్టడలను, శాసనములను గూర్చి, ఆయన పండుగలను గూర్చియు, ఆయనయందలి భయభక్తులు గూర్చియు, ఆయనను నమ్ముకొనవలెనను సంగతియు సమ్సోను చెప్పియుండవచ్చును. ఆయన చెప్పిన సంగతులన్నిటి ననుసరించి నడుచుకుంటానని తన సమ్మతిని ఆ అమ్మాయి తెలుపుటనుబట్టియే ఆమెతో మాట్లాడగా సమ్సోనుకు ఆమెయందు ఇష్టము కలిగి ఉంది. అలాగే ప్రియ సోదరీలారా, ప్రభువు మనతో ఎన్నోసార్లు, ఎన్నో రీతులుగా, ఎన్నో సంవత్సరాల నుండి మాట్లాడుతున్నాడు. కానీ ఆయన మాటలన్నిటికి మనము స్పందించి, ప్రభువా, నీకు నాతో మాట్లాడిన ప్రకారం నేను నడుచుకొంటాను అని చెప్పినపుడే ఆయనకు విధేయత చూపుటకిష్టపడుట. మనతో మాట్లాడుట ఆయనకు ఇష్టమౌతుంది. అందుకే ప్రభువు ప్రకటన 1:3 లో, సమయము సమీపించియున్నది గనుక ఈ ప్రవచన వాక్యములు చదువువాడును, వాటిని విని, యిందులో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులు' అని వ్రాయించారు. ఆయన మనతో మాటలాడిన మాటలను విని గైకొంటే ఆయనకెంతో ఇష్టము. ఆలాగున మనతో మాట్లాడుట ఆయన కిష్టం. వినుటకు చెవులు గలవాడు వినునుగాక అన్నాడు. వినుటకు వినుబుద్ధి పుట్టించేవాడు మన ప్రభువు. ఒకసారి 3 దినములు కొండమీద తన మాటలు వినిపించాడు. ఆయన మనతో మాట్లాడుటకు ఇష్టపడుతున్నాడు. మనము ఆయన మాటలు వినడానికి వేగిరపడి వింటున్నామా? చెవులతో వినడానికి మాత్రమే కాదు, గైకొనడానికి కూడా ఇష్టపడాలి. అప్పుడే ఆయనకు మనతో మాట్లాడడానికి ఇష్టము కలుగుతుంది. మాతో మాట్లాడే దేవా, నీకు స్తోత్రమని ప్రభువుతో చెబుదాము.

అయితే, దేవుడు మనతో మాట్లాడాలనుకున్న మాటలు ఎలాంటి మాటలుగా ఉన్నాయో కొన్ని లేఖనాలు జ్ఞాపకం చేసుకుందాము:

**1) యోబు 6:25 –** ఆయన యథార్థమైన మాటలు ఎంతో బలమైనవి.

**2) కీర్తన 12:6 –** యెహోవా మాటలు పవిత్రమైనవి.

**3) కీర్తన 119:140 –** ఆయన మాట మిక్కిలి శ్రేష్టమైనది.

**4) యెషయా 45:23 –** ఆయన నోటి మాటలు నీతిగలవి.

**5) యెషయా 50:4 –** ఆయన మాటలు అలసినవారిని ఊరడించే జ్ఞానము గలది

**6) ద్వితీ 8:3 –** ఆయన మాటల వలన నరులు బ్రతుకుతారు

**7) కీర్తన 81:8 –** అయ్యో, ఇశ్రాయేలూ, ఈలాటి నా మాటలు నీవు విని ఉంటే ఎంత మేలు అన్నాడు దేవుడు. ఆయన మాటలు ఇశ్రాయేలీయులు విని వుంటే 'నేను వేగిరమ వారి శత్రువులను వేగిరమే అణగద్రొక్కేవాడిని. వారి విరోధులను కొట్టేవాడిని. యెహోవాను ద్వేషించేవారు వారికి లొంగివుండేవారు. వారి కాలము శాశ్వతముగా ఉండేది. అట్టివారిని నేను అతి శ్రేష్టమైన గోధుములను అనుగ్రహించి పోషించేవాడిని. కొండతేనెతో నిన్ను తృప్తిపరిచేవాడిని' అని ఇశ్రాయేలీయులతో చెప్పాడు. కానీ,

**8) కీర్తన 106:25 -** వారు యెహోవా మాట ఆలకింపక తమ గుడారములో సణుగుచున్నారట. అలా సణిగితే పైన వ్రాయబడిన వాగ్దానాలన్నీ కోల్పోతాము. అంతమాత్రమే కాక, కీర్తన 106:9 లో వ్రాయబడినట్లు, ఆయన కోపమునకు గురికావల్సి వస్తుంది. గనుక ఎన్నోవిధాలుగా మనము ప్రయోజనకరమైన దేవుని మాటలకు చక్కగా మనము విధేయత చూపిద్దాము. అప్పుడే మనము కూడా ఆయనతో మాట్లాడుతూ ఇష్టమైన సంఘ వధువుగా, భార్యగా ఉంటాము.

**3. లాలన చేసిన సమ్సోను భార్య (న్యాయాధి 14:15) :** ఈ ఫిలిష్తీయ అమ్మాయి పెండ్లికాకమునుపు సమ్సోనుకు (1) చూడగా ఇష్టమైన భార్యగా ఉండింది, (2) మాట్లాడగా ఇష్టమైన భార్యగా ఉండింది. కానీ వివాహమైన తరువాత కష్టమైన భార్యగా కనబడుతోంది. వివాహపు రోజున సమ్సోను ఫిలిష్తీయులకు ఒక విప్పుడు కథ వేశాడు. 7 రోజులలోగా వారు విప్పుడు కథ భావాన్ని చెబితే సమ్సోను వారికి ముప్పది సన్నపునారబట్టలు, ముప్పది దుస్తులు అన్నీ కలిపి 60 దుస్తులు వారికి ఇచ్చేటట్లు, వారు విప్పుడు కథ భావాన్ని చెప్పలేకపోతే వారే సమ్సోనుకు ఆ 60 దుస్తులు ఇచ్చేట్లు వారిని అతడు ఒప్పించాడు. 'బలమైన దానిలోనుండి తీపి వచ్చెను. తినుదానిలో నుండి తీపివచ్చెను' అని విప్పుడు కథను సమ్సోను చెప్పగా ఆ ఫిలిష్తీయులు 3 దినములకు కూడా ఆ విప్పుడు కథను విప్పకపోగా, వారు సమ్సోను భార్యతో, "నీ పెనిమిటి ఆ విప్పుడు కథ భావమను మాకు తెలుపునట్లు అతని లాలన చేయుము. లేనియెడల మేము అగ్నిచేత నిన్నును నీ తండ్రియింటివారిని కాల్చివేసెదము. మా ఆస్తిని స్వాధీనము చేసికొనుటకే మమ్మును పిలిచితివా' అని అన్నారు. అందువలన ఆ అమ్మాయి సమ్సోనును లాలన చేసినట్లు చదువుచున్నాము. అసలు లాలన చేస్తారో సామెతలు 7:19 లో చదువుదాము. అక్కడ వేశ్యవేషము వేసుకొనిన స్త్రీ లాలన చేస్తున్నట్లు చదువుచున్నాము. ఇచ్ఛకపు మాటలు మాట్లాడుతున్నట్లు చూస్తున్నాము. అది పెళ్ళికాని పడచువానిని పట్టుకొని, 1) ముద్దుపెట్టింది, 2) సమాధాన బలులు మ్రొక్కుబడులు చేశానని చెబుతోంది. అంటే ఈలాటి స్త్రీలు తన వ్యభిచారములాంటి పాప కార్యాలు చక్కగా జరగాలని వారి దేవతలకు పూజాబలులు కూడా చేసేవాళ్ళుగా ఉంటారని తెలుస్తోంది, 3) నేను నిన్ను కలుసుకొనవలెనని రాగా నీవే నా దగ్గరికొచ్చావు అని చెబుతోంది. 4) నా మంచము మీద రత్నకంబళ్ళను, ఐగుప్తువంటి ఫారిన్ విచిత్ర పనిగల నార దుప్పట్లును పరచియున్నానని చెబుతోంది, 5) నా పరుపు మీద బోళము, అగరు కారపుచెక్క చల్లి ఉన్నాయి, 6) ఉదయము వరకు వలపుతీర తృప్తి పొందుము 7) పురుషుడు ఇంట లేడు, దూర ప్రయాణము వెళ్ళియున్నాడు. సొమ్ముసంచి చేతపట్టుకొనిపోయాడు. పున్నమినాటి వరకు ఇంటికిరాడు అని ఈ 7 రీతుల అధిక లాలన మాటలు, ఇచ్ఛకపు మాటలు చేత ఆ పడుచువానిని లోబరచుకొని, ఈడ్చుకొని చంపి పాతాళమునకు పంపెనని చదవుచున్నాము. ఈ స్త్రీ లాలన చేసినట్లు క్రీస్తు కన్యకగా ఉండిన మనము దినములు, సంవత్సరములు గడిచిన తరువాత శోధనలు, కొన్ని కష్టాలు కలిగినప్పుడు

ముందు మన పరమ సమ్సోనుయైన ప్రభువును చూడగా యిష్టమైన భార్యగా, మాట్లాడగా యిష్టమైన భార్యగా ఉండిన మనము కాలము గతించిన తరువాత లాలన చేసే స్త్రీలుగా మారిపోయామా? పరమ భర్తయైన పరలోకానికి దూర ప్రయాణము చేశాడు. ఆయన రాకడ ఇప్పుడే కాదు, పెండ్లి కుమారుడు ఆలస్యం చేస్తున్నాడు అని శరీర కోరికలతో తృప్తి పొందుతూ, శరీర పరస్పర మోహములచేత సంతప్తినొందుచూ ఉన్నామా? ఈ వ్యభిచార మద్యములో ఈనాడు చాలామంది యువతీయువకులు, పెద్దవారు, చిన్నవారు, రక్షించబడినవారు, సేవకులు సహితము పడిపోతున్నారు.

'వ్యభిచరించకూడదు' అను ప్రత్యేకమైన ఆజ్ఞ దేవుడు ఇచ్చినప్పటికీ, విగ్రహారాధన చేస్తే కూడా వ్యభిచరించినట్లే అని దేవుని వాక్యము చెప్పుచున్నప్పటికీ, స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే ఆమెతో వ్యభిచరించినట్లే అని దేవుని వాక్యము వ్రాయబడినప్పటికీ, మత్తయి 15:19లో, వేశ్యాగమనములు హృదయములో నుండే వస్తాయని వాక్యము చెబుచున్ననూ, 2పేతురు 2:14 లో వ్రాయబడినట్లు, వ్యభిచారిణికిని చూచి ఆశించుచూ, పాపము మానలేని కన్నులు కలిగినవారు నేడు ఎందరో ఈ వ్యభిచార పాపములో మునిగిపోయి ఉంటున్నారు. ఈ తరము పేరే 'వ్యభిచార తరము' అని ప్రభువు వ్రాయించాడు. యెషయా 1:21 లో 'అయ్యో, నమ్మకమైన నగరము వేశ్య ఆయనే' అని యెరూషలేము నగరము విషయమై వ్రాయబడినట్లు నేడు ప్రపంచ నగరాలన్నీ, గ్రామాలన్నీ, వీధులన్నీ, గృహాలన్నీ, మనుషులందరూ, ఒకప్పుడు నమ్మకంగా సేవచేసిన భక్తులందరూ వేశ్యవలె మారిపోయి ఉన్నారేమో! పరీక్ష చేసుకుంటే మంచిది. శరీరములను అపవిత్రపరచుకొనకుండా ఉంటే మంచిది. దేవుని దగ్గరినుంచి దండన తెచ్చుకోకుండా, తమ్మునుతాము నాశనము చేసుకొనకుండా ఉంటే మంచిది (యూదా 7-10). శరీర సంబంధమైన అపవిత్రతను ఏమాత్రమును యోసేపు వలె ఒప్పుకొనక దానిని వినగా శరీరము వలన డాగుపడిన అంగీని అసహ్యించుకొనుచు భయముతో జీవించాలని ప్రభువు యూదా 23 లో వ్రాయించాడు.

పెండ్లి చేసుకొనువారికి శరీర సంబంధమైన శ్రమలు కలుగునని వ్రాయబడిన ప్రకారము పెండ్లియైన మొదటి దినము నుండియే సమ్సోను కుటుంబ జీవితంలో శ్రమలు ప్రారంభమయ్యాయి. ఈ శ్రమ భార్యా భర్తల వలన రాలేదు గానీ, బయటివారి నుండి ఈ సమస్య వచ్చింది. ఎప్పుడు కథ భావము తన భర్తనడిగి వారికి చెప్పకపోతే ఆమెను, ఆమె ఇంటివారిని అగ్నివేసి కాల్చి చంపుతామని ఫిలిష్తీయులు సమస్యను తీసుకుని వచ్చినపుడు, ఆ ఫిలిష్తీయ అమ్మాయి ఈ సమస్యను సమ్సోనుకు తెలియజేసి ఉంటే బాగుండేది. తరువాత అధ్యాయాల్లో ఫిలిష్తీయులతో యుద్ధము చేసి దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులను కాపాడుతూ వచ్చిన తన భర్తయైన సమ్సోను, భార్యయైన ఆమెను రక్షించుకొనలేడా? ఆలాగున ఈ సమస్యను భర్తకు తెలుపకుండా తానే హ్యాండిల్ చేసుకోవాలని, మ్యానేజ్ చేసుకోవాలనుకుంది. అలానే ఈనాటి భార్యలమైన మనము కుటుంబ జీవితములో కానీ, అత్తమామల ద్వారా గానీ, ఏ రకమైన సమస్యలు కానీ మన పరమ భర్తయైన ప్రభువుతో చెప్పకుండా మనమే మ్యానేజ్ చేసుకుందామనుకుంటే,

'మ్యానేజ్' కాదు కదా 'డ్యామేజ్' చేసుకుంటాం. అలాగే ప్రతి సమస్యకు కుటుంబాల్లో మన భర్తలకు తెలియజేసి ఇద్దరూ ప్రార్థన ద్వారా పరిష్కారము దేవుని యొద్ద నుండి పొందుకోవాలి.

కానీ, సమ్సోను భార్య అన్యులైన తన ఫిలిష్తీయ జాతి నేర్పిన నేర్పుతో భర్త దగ్గర లాలన చేయడం నేర్చుకుంది. భర్త దగ్గర, భర్త నమ్మి దేవుని దగ్గర నేర్చుకోలేదు. సమస్యను తన హృదయంలోనే పెట్టుకొని తాను నెమ్మదిగా ఉండలేకపోయింది. భర్తకు కూడా నెమ్మది లేకుండా చేసింది. తన భర్త ఎంత ఆత్మనింపుదల కలిగి, ఎన్ని బలమైన కార్యాలు చేయువాడో ఆమెకు అర్థం కాలేదు. అలాగే మన పరమ సమ్సోనుయైన పరమ యేసుక్రీస్తు శక్తిని (ప్రభావాన్ని), జ్ఞానాన్ని, ఆయన గుణగణాన్ని అర్థం చేసుకోక, ఆయనకు సమస్యలను తెలియజేయడం స్వంత జ్ఞానాన్ని అనుసరించి అనేక సమస్యలలో కూరుకొని పోతున్నావేమో. ప్రియ పాఠకులారా, ఆలోచించండి. విప్పుడు కథ భావాన్ని చెప్పమని తన భర్తను భార్య అడిగింది. ఆయన చెప్పలేదు. కారణం సమ్సోను ఫిలిష్తీయుల మీద గెలిచి ఆ 60 దుస్తులను దాసత్వములో ఉన్న ఇశ్రాయేలీయులకిచ్చి సహాయం చేయాలనుకున్నాడు. 7 రోజులలో కథను విప్పకపోతే ఈమెను ఈమె తండ్రి ఇంటివారు చావాల్సి వస్తుందని ఈమె బాధపడుతోంది. ఈ విప్పుడు కథ భావాన్ని భర్త ద్వారా చెప్పించుకోడానికి ఈమె అతని దగ్గర వేశ్యవలె లాలన చేయడం ప్రారంభించింది. నేటి క్రైస్తవ విశ్వాస సంబంధులైన భార్యలు 1పేతురు 3:1 ప్రకారము, భర్తలకు అన్ని విషయములలో లోబడి ఉండాలి. ఆలాగు శారా తన భర్తకు లోబడి ఉండింది. పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలు తమ భర్తలకు లోబడుట వలన తమ్మును అలంకరించుకున్నది. అలాగు శారా తన భర్తను లోబడుచు ఆయనను 'యజమానుడు' అని పిలిచింది. అలాగే ప్రతి స్త్రీ యోగ్యముగా నడుచుకొనుచ అనగా భర్తలకు మేలు చేయుచు, ఏ భయమునకు భయపడక బెదరక యున్నయెడల వారు 'శారా'కు పిల్లలగుదురని వ్రాయబడింది. సమ్సోను భార్య తన సమస్య విషయమై లోలోపల ఏ భయమునకు బెదరక భర్తకు ఓటమి రాకుండ, అతనికి మేలు చేస్తూ లోబడి ఉంటే ఆమెయు శారాకు కుమార్తెయై ఉండేది. కానీ ఆలాగు చేయక లాలన చేయడం నేర్చుకుంది. ప్రియ సోదరీలారా, మీ కుటుంబ జీవితంలో వారు శారా తల్లిని పోలియున్నారా? లేక లాలన చేసిన సమ్సోను భార్యలాగ ఉన్నారా? సమ్సోను భార్యవలె అలాగే మన యిచ్ఛలు, కోరికలు తీర్చుకొనుటక ప్రభువును లాలన చేసిన స్త్రీ వలే మీరు కూడా మాటిమాటికి అడుగుతున్నామా? 'తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్లు' అని కేవలము మన కోరికల కోసం దేవుణ్ణి ప్రార్థిస్తున్నామా?

**4. పాదముల మీద పడి ఏడ్చిన సమ్సోను భార్య (న్యాయాధి 14:16):** ఫిలిష్తీయులు ఆమెను అగ్నివేసి కాల్చివేస్తారని భయపెట్టిన కారణాన ఆమె తన భర్తయైన సమ్సోను పాదాలమీద పడి పడి 7 రోజులు ఏడ్చినట్లు ఒక ఏడ్పుగొండిగా మారిపోయింది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు హన్నావలె ప్రభువు పాదాలు ఆశ్రయించాలి కానీ భర్త

పాదాలు పట్టుకుంటే ఎలా? రాహేలు తనకు పిల్లలు కలుగకపోవుట చూచి భర్తతో, నాకు పిల్లలను ఇవ్వలేకపోతే నేను చస్తాను అనింది. ఈమె మరొకమెట్టు ఎక్కి భర్తయైన యాకోబును 'బ్లాక్ మెయిల్' చేసేదిగా ఉంది. సమ్సోను భార్య, 'నీవు ద్వేషించితివి గానీ ప్రేమించలేదు' అని అంటోంది. ఏదో ఒక సంగతిని చెప్పనంతమాత్రాన భర్త తనను ప్రేమించనట్టేనా? చెబుతాను 7 దినములు తరువాత చెబుతానని ఉంటాడు. భర్త ఓటమిపాలైనా పరవాలేదు కానీ ఆమెకు విప్పుడు కథ భావము కావాలి.

అలాగే ఈనాడు అనేకమంది భార్యలు భర్తలపట్ల లోబడే గుణం లేకపోవడం వలన, మనసులోని భయాలు యథార్థంగా భర్తలకు రివీల్ చేయకపోవుట వలన తమ సంసారములో భర్తలకు ఆనందము కలిగించక ఏడ్పుగొండులుగా ఉంటున్నారు. ఆదాము నొద్దకు దేవుడు హవ్వను తెచ్చినప్పుడు, 'నా ఎముకలలో ఒక ఎముక, నా మాంసములో మాంసము' అని తన నోటికి హవ్వ పాటను తెప్పించింది. ఇంతకుమునుపు ఎన్నో పక్షులు, పశువులు, ప్రాకు పురుగులు ఎన్నో ఆయన వద్దకు వచ్చి పేర్లు పెట్టించుకొని పోయాయి. ఎన్ని జీవులు వచ్చినను అతని నోటిలో ఆనందగానము రాలేదు. ఈనాడు మీరు మీ భర్తలచేత ఆనందగానము పాడించేవారుగా ఉన్నారా? లేక మీరే శోకరాగాలు తీస్తున్నారా? సమ్సోను భార్య శోకరాగాలే, ఏడ్పురాగాలే, దుఃఖరాగాలే ఏడుస్తుంది. క్రొత్తగా పెండ్లియైన వారిని బంధువులు అందరూ విందులు చేస్తుంటే విందు దినములన్నిటిలో ఆమె ఉపవాస దినములుగా చేసేసింది. తాను తినలేదు, సమ్సోనుకు కూడా పెట్టలేదు. స్త్రీలు ఇంట ఉండి పనిచేసుకోవాలంటే కొద్దిమందికి ఏడ్చేపనే, మరొక పని లేదు.

అమ్మా, ప్రియ సోదరీ, ప్రస్తుతము ఈ రోజు మీ భార్యభర్తల దాంపత్య జీవితం ఎలా ఉంది? నీ ఇంటిలో ఒక ఏడ్పుగొంటిగా ఉన్నావా? మీ విందు దినాలు ఉపవాస దినములుగా మారిపోయాయా? సంతోషం, సమాధానం లేకుండా ఉన్నారా? మన కన్నీరు విలువైనది. మనము ప్రార్థనల కన్నీరు కార్చినప్పుడు మనమెన్ని బాటిల్స్ కన్నీటిని కార్చామో మనకు తెలియదు కానీ ప్రభువు మన కన్నీటిని విలువగా భావించి వాటిని బుడ్డిలో దాచి ఉంచాడు. హిజ్కియా రాజుతో నీవు కన్నీళ్ళు విడుచుట నేను చూచితిని' అన్నాడు. ప్రభువు దగ్గర కన్నీటికి విలువ ఉంది. పాప క్షమాపణ కొరకు ఏడ్వవచ్చును. 'మీ కొరకు మీ పిల్లల కొరకు ప్రార్థనలో ఏడ్వండి' అని ప్రభువు అన్నాడు. కానీ పనికిమాలిన వాటన్నింటిని మన స్వయంకృత అపరాధాలను సృష్టించుకొని పనికిమాలిన ప్రాబ్లమ్స్ కొరకు ఏడుస్తూ ఎదుటివారిని యేడ్పించేవాళ్ళుగా ఉన్నామా? అసలు ఈ ఇంటిలో ప్రాబ్లమ్ ఆ భార్య, భర్తలది కాదు. తర్డ్ పర్సన్స్ అయిన ఫిలిష్తీయుల ద్వారా వచ్చిన సమస్య. ఏ సమస్యయైన వచ్చినపుడు అది ప్రభువు పాదాల దగ్గర పెట్టి ప్రార్థించినట్లయితే ప్రభువు పరిష్కారాన్ని చూపించేవాడు. కానీ సమ్సోను భార్య తన సమస్యను తానే పరిష్కరించుకోవాలని సంగతిని జటిలం చేసుకుంటోంది.

బైబిల్లో తన కుమారుని కొరకు మొట్టమొదటిగా ఏడ్చిన స్త్రీ హాగరు. ఆమె తన కుమారుని చావు చూడలేక వింటివేత దూరము వెళ్ళి యెలుగెత్తి ఏడ్వగా ఆమె కళ్ళు

తెరువబడగా ఆ బిడ్డకు అవసరమైన నీళ్ళు ఆమెకు కనబడగా ఆ నీళ్ళు తన కుమారునికి ఆమె త్రాగనిచ్చింది. రాహేలు, హన్నా, యెరూషలేము కుమార్తెలు అలాగున తమ పిల్లల కొరకు ఏడ్చారు. యిర్మీయా 31:15లలో, అంగలార్పుతో, రోదన ధ్వనితో రాహేలు తన పిల్లలు చెరలోకి వెళ్ళినందుకు ఓదార్పు పొందనొల్లక ఏడ్చింది. 16వ వచనములో అట్టిరీతిగా ఏడ్చిన రాహేలుతో దేవుడు 'ఏడువక ఊరుకొనుము, కన్నీళ్ళు విడువకుము. నీ క్రియకు ఫలమైన జనులు శత్రువుని దేశములో నుండి తమ స్వదేశమునకు తిరిగి వచ్చుదురు' అని తాను ఏడువకూడదని రాహేలుకు ఆజ్ఞ ఇచ్చాడు. తన పిల్లలు తిరిగి స్వదేశము వస్తారని దేవుడు వాగ్దానమిచ్చిన తరువాత తాను ఇక ఏడువకూడదని మామూలుగా చెప్పుట కాదు. అది ఆజ్ఞ అంటున్నాడు. కనుక స్త్రీలమైన మనము మన విలువైన కన్నీటిని అనవసరంగా ఏడ్చుట ద్వారా అతి వ్యసనంగా మనకు పరిణమిస్తుంది. వ్యసనపడకుము , అది కీడుకే కారణమని దేవుని వాక్యం చెబుతోంది. మనము నిరీక్షణలేని ఇతరులవలె ఏడ్వకుండునట్లు దేవుడు మనకెన్నో వాగ్దానాలిచ్చాడు. ఆ వాగ్దానాలన్నీ క్రీస్తునందు అమూల్యములుగా, అత్యధికములుగా 'అవును' అన్నట్టుగానే ఉన్నాయి గనుక వాటి విషయమై రాబోవు దినములలో మనకు మేలు కలుగుతుందను నమ్మకముతో ఏడ్వకుండా ఆ వాగ్దాన నెరవేర్పు కొరకు సందేహించక ఓరిమితో వాగ్దాన ఫలమును అనుభవించుటకు ఎదురుచూడాలి. ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాదు.

సమ్సోను, ఆయన భార్య ఇద్దరూ కలిసి కాపురం చేసింది 7 రోజులే. 7 రోజులు ఆమె అతని యొద్ద ఏడుస్తూనే వచ్చింది. సామెతలు 27:15 లో వ్రాయబడినట్లు 'ముసురు దినమున ఎడతెగ కారు నీళ్ళును గయ్యాళియైన భార్యయు సమానము. దానిని ఆపజూచువాడు గాలిని ఆపజూచు వానితోను, తన కుడిచేత నూనెపట్టుకొను వానితోను సమానుడు.' సమ్సోను భార్యను ఏడ్వకుండా ఆపచూచేవారు ఎవరూ లేకపోయినట్లు ప్రియ సోదరీ, నీవు ఆ సమ్సోను భార్యవలే ఉండకూడదు. ప్రసంగి 9:9 లో 'దేవుడు నీకు దయచేసిన నీ ఆయుష్కాలమంతయు నీవు ప్రేమించి నీ భార్యతో సుఖించుము' అని దేవుడు చెబితే, ఆమె భర్తను సుఖపెట్టకుండా ఏడుస్తూనే వచ్చింది. సామెతలు 5:18లో 'నీ యవ్వనకాలపు భార్యయందు సంతోషించుము. ఆమె ప్రేమచేత నిత్యము బద్ధుడవై యుండుము' అని దేవుడు వ్రాయించి ఉండగా ఈనాటి వివాహమైన యౌవనస్థురాండ్రందరూ తమ భర్తలకు సంతోషాన్ని కలిగించే వారుగానే ఉండాలని భర్తలను ప్రేమించాలని నేర్చుకోవాలి. తీతు 2:3-5 లో, పతిప్రియులుగా, శిశుప్రియులుగా ఉండాలని చెబుతున్నాడు. కనుక పెండ్లియైన భార్యలు ముందు పతిప్రియులుగా ఉండాలనేది నేర్చుకోవాలి. పిల్లలకు పెళ్ళిళ్ళు చేయడానికి ముందుగా తల్లులు తమ పిల్లల కుటుంబ జీవితములో భర్తలను పిల్లలను, అత్తమామలను ఎలా చూసుకోవాలో అన్ని విషయాలు కౌన్సిలింగ్ ఇచ్చి ఆ తరువాత పెళ్ళిళ్ళు చేయాలని సంఘాలు కూడా స్త్రీల కూడికలలో ఈలాంటి విషయాలను గురించి వృద్ధ స్త్రీలు వారికి చెప్పాల్సిన అవసరత

ఈ దినాల్లో చాలా అత్యవసరముగా ఉన్నది. ఇది సంఘపెద్దలందరూ, తల్లిదండ్రులందరూ, ప్రాముఖ్యంగా గమనించాలి. మనమెల్లప్పుడూ, యూత్ మీటింగ్స్‌లో, స్త్రీల కూటాలలో ఆత్మీయ పాఠాలే చెబుతున్నాము. కానీ దాంపత్య జీవితాన్ని గురించి, పిల్లలు పుట్టకమునుపు పిల్లల కొరకు ఎలా ప్రార్థించాలి? పిల్లలను ఏలాగు ప్రేమించాలి? వారిని ఎలా పెంచాలి? ఈ అంశాలన్నిటి నిమిత్తం ఉపదేశాలు (ప్రాక్టికల్ లెసెన్స్) ఇచ్చుట లేదు. ప్రయోగాత్మకమైన సందేశాల మనము వారికిస్తే వాటిని అనుసరించి పెండ్లియైన మన పిల్లలు తమ తప్పు మార్గాలు దిద్దుకొనే అవకాశము ఎంతైనా ఉంటుంది.

**5. తొందరపెట్టిన సమ్సోను భార్య (న్యాయాధి 14:17):** విప్పుడు కథ భావాన్ని చెప్పమని తన భార్య తన యొద్ద ఏడ్చినపుడు సమ్సోను, లేదు, నా తల్లిదండ్రులకైనను దానిని తెలుపలేదు. నీకు తెలుపుదునా? అన్నాడు. క్రొత్తగా పెళ్లి చేసుకున్న భార్య ఎదుట సమ్సోను తన తల్లిదండ్రులను ఘనపరుస్తున్నాడు. ఈనాడు చాలామంది యౌవనస్థులు పెళ్లి చేసుకున్న తరువాత వాళ్ళకు పెళ్ళాము బెల్లమైపోతుంది. ఆ క్రొత్త భార్య ఎదుట తల్లిదండ్రులను నీచపరచి మాట్లాడుతు, వారిని సన్మానించనివారు ఎంతోమంది ఉంటూ ఉండగా వారికి మాదిరిగా ఉన్నాడు సమ్సోను. తన జన్మకై ప్రార్థించి తనను జాగ్రత్తగా, నాజీరుగా పెంచి, న్యాయాధిపతిగా అభివృద్ధి పొందడానికి ప్రయాసపడిన తన తల్లిదండ్రులను గొప్ప చేస్తున్నాడు. మీకా 7:5 లో 'నీ కౌగటిలో పండుకొనియున్న దాని యెదుట నీ పెదవుల ద్వారమునకు కాపుపెట్టుము' అను మాట ప్రకారము సమ్సోను తన భార్య దగ్గర తన మాటలు జాగ్రత్తగా మాట్లాడుతూనే ఉన్నాడు. నా తల్లిదండ్రులకే తెలుపలేదు అంటే, దానికి కారణముంది. ఆ విప్పుడు కథ భావమును ఇప్పుడే చెబితే ఆయన ఓడిపోయే అవకాశముంది. కనుక ఆయన చెప్పలేదు. అందువల్ల సమ్సోను భార్య సమ్సోనును తొందరపెట్టిందట. తొందరపెట్టిందంటే ఏడ్పులు ఎక్కువ య్యాయేమో, ఆయన మాట వినుటలేదమో, ఆయన మీద సణుగుతుందేమో, ఆయనను నిద్రపోనివ్వలేదేమో, ఆయనకు పరిచర్య చేయుట లేదేమో, ఆయనను సతాయిస్తుందేమో, ఆయనకు టెన్షన్ క్రియేట్ చేస్తుందోమే, అలుగుతుందేమో, ఆయనతో మాట్లాడడంలేదేమో వివరాలు వ్రాయబడలేదు. కానీ తొందరపెట్టిందని వ్రాయబడింది. సమ్సోను తన తల్లిదండ్రులను గొప్ప చేసినంత మాత్రాన భర్తకు తొందర కలుగజేయాలా? చాలామంది తమ అత్త మామలను ప్రేమించుటలేదు. వీరికి అత్తమామలు వద్దు కానీ, అత్తమామలు కనిన భర్త మాత్రమే కావాలి. అత్తమామలు వద్దు. వారు చనిపోతే వారి ఆస్తిపాస్తులు మాత్రం కావాలి. నేను నిన్ను పెళ్ళి చేసుకున్నాను కానీ నీ తల్లిదండ్రులను కాదు. అత్తమామలు ఇంట్లో ఉంటే నేను సంసారానికి రాను, లేక నీ అన్నదమ్ములు, ఆడబిడ్డలు ఇంట్లో ఉంటే నేను సంసారానికి రాను అని తొందరపెట్టేవాళ్ళు ఈనాడు చాలామంది ఉన్నారు. అత్తమామల మీద పోలీస్ కంప్లైయింట్స్ ఇచ్చేవారు, కోర్టులో కేసులు వేసేవాళ్ళు ఉన్నారు. వేరే ఇల్లు తీసుకుంటే నేను వస్తాను, లేకపోతే రాను అని తల్లిగారింటికి వెళ్ళిపోయినవారూ ఉన్నారు.

ఈ సమయంలో భర్త చనిపోయినా జన్మభూమికి, తండ్రి యింటికి వెళ్ళని రూతు మనకు గుర్తొస్తుంది. మరణము తప్ప నన్ను, నిన్ను ఎడబాసేది ఏదీ ఉండదని తెగేసి అత్తతో రూతు చెప్పేసింది. మరువుము నీ తండ్రి ఇంటిని. మరువును నీ స్వజనమును అని దేవుని వాక్యము చెబుతూంటే, దాన్ని చక్కగా ఫాలో అయ్యింది రూతు మాత్రమే. ఒక అన్యురాలు తన అత్తను ఇలా ప్రేమిస్తూ, గౌరవిస్తుంటే పుట్టుక క్రైస్తవులు అలా మాదిరిగా ఉండకపోవడం కడు శోచనీయము. అన్యులే మేలుగా ఉన్నారు. ఈ విషయములో రూతు అత్తకు తొందర కలుగజేయలేదు. ఉండిన తొందరలు తీసివేయడానికే ప్రయత్నిస్తోంది. సామెతలు 19:13 లో, భార్యతోడి పోరు ఎడతెగక పడుచుండు బిందువులతో సమానము' అని వ్రాయబడియున్నట్లు సమ్సోనుకు కూడా తన భార్య తొందర కలుగజేస్తున్నది.

ఈ స్త్రీవలె మనమునూ మన భర్తలను తొందర చేసేవాళ్ళుగా ఉన్నావేమో పరీక్షించుకుందాం. వారికి బి.పి. తెప్పించే వాళ్ళముగా ఉన్నామా? పరీక్షించు కుందామా. ఈ ఇంటికి వస్తే నెమ్మది ఉండదు, సంతోషమండదు అంటున్నారా మన భర్తలు?

**6. భర్త పట్ల నమ్మకత్వంలేని భార్య (న్యాయాధి 14:17) :** పై విధంగా తన భార్య తనను 7 రోజులుగా తొందరపెట్టుటచే ఈ తొందరకు ఆయన తట్టుకోలేక విప్పుడు కథ భావమును ఆమెకు తెలుపగా ఆమె ఆ విప్పుడు కథ భావాన్ని తన జనులకు తెలియజేసింది. భర్తయైన సమ్సోను విప్పుడు కథ భావాన్ని భార్యకు తెలిపినప్పటికీ తాను గెలిచేంతవరకు అది ఫిలిష్తీయులకు తెలియజేయవద్దని చెప్పి ఉంటాడు. కానీ నమ్మకద్రోహం చేసినట్లు ఆమె ఫిలిష్తీయులకు ఆ రహస్యాన్ని చెప్పేసింది. భార్యలు భర్తలకు నమ్మకంగా ఉండాలి. సామెతలు 11:13లో 'నమ్మకమైన స్వభావమ గలవాడు సంగతి దాచును' అని వ్రాయబడినట్లు సమ్సోను చెప్పిన సంగతిని సమయమొచ్చేవరకు అతని భార్య దాచిపెట్టవలసి ఉంది. కానీ భర్తకు నమ్మకస్థురాలిగా లేకపోయింది. నమ్మకమైన వానికి దీవెనలు మెండు అని సామెతలు 28:20 లోని వాక్యము చెబుతుంది. దేశంలో నమ్మకమైన వారి కొరకు దేవుడు వెదకుతూ ఉన్నాడు. మనము మనుషుల యెదుట, దేవుని యెదుట, ఉద్యోగములో, వ్యక్తిగతంగా జీవితమంతటిలో నమ్మకంగా ఉండాలి. ముఖ్యముగా మన దేవుడు నమ్మకమైన సత్యసాక్షి. 2తిమోతి 2:13 ప్రకారము, మనము నమ్మదగనివారమైనను, ఆయన నమ్మతగిన వాడైయున్నాడు. విలాప 3:23 లో, నీవు ఎంతైన నమ్మదగినవాడవు అని వ్రాయబడింది. హెబ్రీ 10:23లో వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడై యున్నాడని వ్రాయబడింది. మన దేవుడు నమ్మదగినవాడుగా ఉండగా ఆయన పిల్లలమైన మనమును నమ్మదగినవాళ్ళముగా ఉండాలి.

నెహెమ్యా 7:3 హనన్యా నమ్మకమైన మనుష్యుడట. నమ్మకమైన మనుష్యులని పేరుపొందిన షెలెమ్యా, సాదోనిపెదాయా అనువారిని నెహెమ్యా 13:13 లో కనిపిస్తున్నారు. దానియేలు 6:1 లో దానియేలు నమ్మకస్థుడై ఏ తప్పయినను చేయువాడు కాదని వ్రాయబడింది. 'నా యొద్ద నివసించునట్లు నమ్మకస్థులైన వానిని నేను

కనిపెట్టుచున్నానని ప్రభువు కీర్తన 101:6లో చెబుతున్నాడు. దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడుగా మోషే ఉన్నాడని హెబ్రీ 3:2లో వ్రాయబడింది. స్త్రీలు అన్ని విషయములలో నమ్మకముగా ఉండాలని 1తిమోతి 3:11 లో వ్రాయబడింది.

మన భర్తల విషయములో ముఖ్యంగా 3 విషయములలో మనము నమ్మకముగా ఉండాలి

**(1) వారు మనకిచ్చిన డబ్బులో మనం నమ్మకంగా ఉండాలి.** కొద్దిమంది భార్యలైనవారు భర్త ఇంటి ఖర్చులకిచ్చిన వాటిలో డబ్బు దాచుకొని, మరికొద్దిమంది భర్తల ప్యాంట్స్, షర్ట్‌లలో డబ్బులు దొంగిలించి తమకు ఇష్టము వచ్చిన చీరెలు కొనుక్కుని, మా అన్న పెట్టాడు, మా బంధువులు పెట్టారని అబద్ధాలాడుతున్నారు. మరికొద్దిమంది భర్తలకు తెలియకుండా అప్పులు చేసేస్తున్నారు. చీటీలు కడుతున్నారు. వడ్డీలకు అప్పులు ఇస్తున్నారు. ఇది మంచిది కాదు. ఒక స్త్రీ తన భర్తకు తెలియకుండా భర్త కష్టార్జితమైన 60 వేల రూపాయలను తన తల్లికి ఇచ్చింది. ఆయనకు తెలియచేసి ఇచ్చి ఉంటే బాగుండేది. అలా భర్త డబ్బును నమ్మకంగా వాడలేకపోతున్నారు.

**(2) వారు చెప్పిన పనిని మనము నమ్మకంగా చేయాలి.** ఉదాహరణకు, ఒక భర్త టైలర్‌చేత 2 అంగుళాల పొడవెక్కువగా కుట్టబడిన ఫ్యాంట్‌ను 2 అంగుళాలు లోపలికి మడిచి పొడుగును తగ్గించమని తన భార్యతో చెప్పాడు. భార్య ఇంటిపనిలో పడిపోయి భర్త చెప్పిన పని మరచిపోయింది. ఆమె కుట్టలేదని ఆ భర్త అదే పనిని తన చెల్లికి చెప్పాడు. ఆమె కూడ తన చదువుల్లో పడి అన్న చెప్పిన పని మరచిపోయింది. ఆ భర్త తన భార్య, చెల్లి తాను చెప్పిన పనిని వారు చేయనందున తన తల్లికి ఆ పనిని అప్పగించాడు. తల్లి కుమారుడు చెప్పిన పనిని వెనువెంటనే 2 అంగుళాలు పైకి మడతపెట్టి కుట్టి ప్యాంట్‌ను సరిచేసింది. ఇది తెలియని చెల్లి కాలేజీనుండి వచ్చిన వెంటనే మరి రెండు అంగుళాలు పైకి మడతపెట్టి కుట్టింది. ఇది తెలియక భార్య తన పనులన్నీ ముగించుకున్న తరువాత రాత్రి పడుకునే ముందు ఆమె కూడా 2 అంగుళాలు పైకి మడతపెట్టి ప్యాంట్ కుట్టేసింది. ముందు 2 అంగుళాలు పొడవుగా ఉన్న ప్యాంట్ ఇప్పుడు 4 అంగుళాలు పొట్టిగా అయిపోయింది. ఇప్పుడు ఆ ప్యాంట్ భర్త తొడుక్కోవడానికి పనికివస్తుందా? భర్త చెప్పిన వెంటనే భార్య ఆ పని వెంటనే చేసి ఉంటే ఈ నష్టము వచ్చేది కాదు. కనుక భర్తలు చెప్పిన పనిని ఇన్‌స్టంట్ ఒబీడియన్స్‌తో వెంటనే చేయాలి అని పాఠం నేర్చుకుంటున్నాం. భార్యను దేవుడు సాటియైన సహాయమ చేయుటకే 'సూటబుల్ హెల్పర్'గా ఉండుటకే ఆమెను తయారుచేశాడు. ఈ సంగతులను భార్యలైన వారందరూ గ్రహించాలి.

**(3) శీలము విషయములో కూడా భార్యలు నమ్మకముగా ఉండాలి.** సామెతలు 7 అధ్యాయములోని వేశ్యావేషము వేసికొన్న కపటము గల స్త్రీ భర్త ఇంటిలో లేనపుడు పెళ్ళికాని ఒక పడుచువానిని తనతో శయనించమని ఎంత ఇచ్చకపు మాటలతో అతనికి ఆహ్వానిస్తున్నదో గమనిస్తున్నాం. పురుషుడు ఇంట లేడు, దూర ప్రయాణము వెళ్ళాడు.

పున్నమినాటి వరకు ఇంటికి రాడు అని తన శీలము విషయములో ఎంత అపనమ్మకస్తురాలుగా ఉందో మనకర్థమవుతుంది కదా. పనులలో, డబ్బులో, శీలములో నమ్మకముగా లేకపోతే వచ్చే దుష్ఫలితమేంటి? సామెతలు 28:20 ప్రకారం, నమ్మకమైనవానికి దీవెనలు మెండు, నమ్మకత్వము లేనివారికి దీవెనలు కాదు శాపమే వస్తుంది. దీవెనయందు ఇష్టము లేనివాళ్ళుగా అలా చేయడం మనకు మంచిదా? భార్యలారా, ఆలోచించి నమ్మకంగా ఉండడానికి నిర్ణయం తీసుకుందాం. మన భర్తలు ఎప్పుడైనా కొన్ని రహస్య సంగతులు మనతో పంచుకొన్నపుడు వాటిని కాన్ఫిడెన్షియల్‌గా ఉంచాలి. మాటల్లో నమ్మకంగా ఉండాలి. అప్పుడే వారి ప్రేమను మనము సంపాదించు కుంటాము. సంసారం సజావుగా సాగుతుంది.

**7. తన స్వంత తోటను దున్నుకోలేకపోయిన దూడలాంటి సమ్సోను భార్య (న్యాయాధి 14:18):** సమ్సోను భార్య విప్పుడు కథ భావానిన తన జనులకు తెలిపినపుడు ఆ ఊరివారిని, 'తేనెకంటే తీపియైనదేది? సింహముకంటే బలమైనదేది?' అని అతనితో అనినపుడు అతడు – 'నా దూడతో దున్నకపోయిన యెడల నా విప్పుడు కథను మీరు విప్పలేకవుందురని' వారితో చెప్పాడు. ఆయన దూడ అనగా ఆయన భార్యను ఒక దూడతో పోల్చుతున్నాడు. ఆ దూడ తన కుటుంబమనే తోటను దున్నుకోలేదు కానీ, ఫిలిష్తీయులు అనే పరాయితోటను దున్నుతోంది. దున్ని వాళ్ళ ప్రాబ్లమ్ సాల్వ్ చేసింది. వీళ్ళిద్దరి భార్యభర్తల మధ్య ఉన్న ప్రాబ్లమ్ సాల్వ్ చేసుకోలేకపోయింది. పరమ 1:6 లో ఇక్కడ షూలమ్మితి, 'నేను నా సహోదరుల ద్రాక్షతోటకు నేను కావలికత్తెగా ఉన్నాను. అయితే నా సొంత తోటను నేను కావలికాయకపోతిని' అని అంటోంది. ఈ మాట ప్రకారం, ముందు మనము మన కుటుంబ సమస్యలను దిద్దుకొని, ఇతరులను దిద్దవలసిన వారమై యున్నాము.

**8. భర్తకు ఓటమి తెచ్చిన భార్య (న్యాయాధి 14:19):** ఫిలిష్తీయుల 7వ దినము సూర్యుడు అస్తమించకమునుపే విప్పుడు కథ భావాన్ని చెప్పుట వలన తన భార్య ద్వారా ఓటమి పొందిన సమ్సోను ఫిలిష్తీయులకు 60 బట్టలనియ్యాలి. యోగ్యురాలు తన పెనిమిటికి కిరీటమ. సిగ్గు తెచ్చునది; వాని ఎముకలకు కుళ్ళు అని సామెత 12:4లో వ్రాయబడిన ప్రకారము సమ్సోను భార్య సమ్సోనును ఓడింపచేసి అతనికి సిగ్గు కలుగజేసినది. తల దించుకొనేలా చేసింది. యోగ్యురాలుగా భర్తకు మేలు చేసి కిరీటము పెట్టలేదు కానీ సిగ్గుతెచ్చిన భార్యగా ఉంది. ఎముకలకు బోన్ టి.బి., లేక బోన్ క్యాన్సర్ తెచ్చిన స్త్రీగా చూస్తున్నాం.

కనుక అతడు అష్కెలోనుకు వెళ్ళి యెహోవా ఆత్మతో నింపబడి వారితో ముప్పదిమందిని చంపి, వారి సొమ్మును దోచుకొని ఆ కథ భావము చెప్పినవారికి బట్టలను ఇచ్చాడు. అష్కెలోను ఫిలిష్తీయుల దేశములో ఉన్న ప్రధానమైన పట్టణాలలో ఇదొకటి. అయిదుగురు ఫిలిష్తీయ సర్దారులు ఆ పట్టణాలను ఏలుబడి చేసేవారు. అష్కెలోను సర్దారుల మీదను, ఆ ఫిలిష్తీయుల మీదను యుద్ధము చేసి వారి సొమ్మును,

దుస్తులను దోచుకునే విషయంలో యెహోవా ఆత్మ సమ్సోనుకు సహాయము చేయుటచే ఆయన ఆ దుస్తులను కథ భావము చెప్పినవారికి ఇవ్వగలిగాడు. సమ్సోనుకు దేవుని సహాయమే గాని, సాటియైన భార్యగా ఆమె యొద్దనుండి ఇతనికి సహాయము రాలేదు. పైగా ఈ యుద్ధము ఆమెను బట్టియే చేయాల్సివచ్చింది. భార్యలు చేసే అవివేక, నమ్మకద్రోహ పనులకు భర్తలు కష్టపడాల్సి వస్తోంది.

అలాగే, మనము చేసిన అజ్ఞాన కృత్యముల కోసరమే ప్రభువు సిలువలో సాతానుతో, పాపముతో, ఈ లోకములో యుద్ధము చేయవలసి వచ్చింది. సమ్సోనుకు యెహోవా ఆత్మ సహాయము దొరికింది. కానీ యేసుప్రభువు, నా దేవా, నా దేవా, నన్నేల చేయి విడిచితివని సిలువలో తండ్రితో చెప్పడం మనమెరుగుదుము. ఒంటరిగా ప్రభువు మనకొరకు సిలువ యాగమును చేసి ఎవరిని చంపక తానే మన పాపముల కొరకు చనిపోయి తిరిగి లేచాడు. మరణాన్ని, మృతుల లోకాన్ని, సమాధిని, సాతానుని జయించి, మూడవ దినమున తిరిగి లేచాడు. తన స్వంత పాపములేని రక్తము చిందించుట ద్వారా మన పాపముల కొరకు విలువైన రక్తమును క్రయధనమును సిలువలో చెల్లించి మనకు పాప విడుదల కలిగించాడు. సిగ్గుతెచ్చిన వారిగా ఉన్న మనకొరకై ప్రభువు సిలువలో ఉమ్మి వేయించుకున్నాడు. ఆయనను సిగ్గుపరిచే పనులు మనము ఎన్ని చేసినా మన నిమిత్తము సిగ్గు ఆయన ముఖమును కప్పినా ఆయన సిగ్గుపడకుండా సిగ్గు పడనని ఎరిగి తన ముఖమును చెకుముకి రాతిగా చేసుకున్నాడు (యెషయా 50:7). ఆలాగున మనము ఆయనకు సిగ్గుతెచ్చి అయన ఎముకలకు కళ్లు తెచ్చాము.

**9. భర్తకు కోపము తెచ్చించిన భార్య (న్యాయాధి 14:20):** తనకు నమ్మకద్రోహం చేసిన భార్య యెడల కోపము తెచ్చుకున్నవాడై తన తండ్రియైన మనోహ ఇంటికి వెళ్ళాడు. ఈనాడు భార్య మీద కోపము వస్తే బీర్ షాపులకు, బార్ షాపులకు, వేశ్యాగృహాలకు వెళుతుండగా తల్లిదండ్రులచే భక్తిగా నాజీరుగా పెంచబడిన సమ్సోను సంఘమునకు పోల్చబడే తండ్రి ఇంటికి వెళ్ళాడు. అతడు నేటి యువకులకు మంచి మాదిరిగా ఉన్నాడు. హన్నాకు హృదయంలో పెనిన్నా వలన దుఃఖము కలిగినపుడు తండ్రి యింటిని పోలిన షిలోహులో ఉన్న దేవుని దేవాలయము లోనికి వెళ్ళి ప్రార్థించగా దేవుడు ఆమె గర్భములో ఒక కుమారుని కని గొడ్రాలితనము నుండి విడిపించబడింది. ప్రియ దేవుని బిడ్డలారా, కుటుంబ జీవితంలో ఎవరికైనా సమస్యలు వచ్చినపుడు అన్యుల యొద్దకు, ఇరుగుపొరుగువారి యొద్దకు, స్నేహితుల యొద్దకు, మనుషమాత్రుల యొద్దకు కాక దేవుని సన్నిధికే, దేవుని యొద్దకే వెళ్తే గొప్ప సహాయం మనకు దొరుకుతుందని మనం గ్రహించాలి.

భార్య భర్తతోటి తన సాహచర్యములో ఎలా ఉంటే భర్త ఇష్టపడతాడో, ఎలా ఉంటే భర్తకు ఇష్టమో, ఎలా చేస్తే ఆయనకు కోపము రాదో, ఇల్లు ఎలా సర్దితే ఆయన ఇష్టపడుతాడో, ఏ కూర ఎలా చేస్తే ఆయనకిష్టమో, ఆయన ఇష్టా అయిష్టాలు గమనించి అలా మెళకువలతో నడుచుకుంటే, భర్తకు కోపమే రాకుండా ఉంటుంది. కానీ, భార్య

తన భర్తకు విరుద్ధముగా మూర్ఖముగా మాట్లాడితే, యోబు, "మూర్ఖురాలు మాట్లాడినట్లు మాట్లాడుచున్నావు" అని భార్యతో అనవలసి వస్తుంది. కనుక భార్య భర్తతో మాట మాటకు ఎదురుచెప్పడం ఉండకూడదు. రాహేలు కూడా తన భర్తయైన యాకోబుతో 'గర్భఫలమిమ్ము, లేనియెడల నేను చచ్చెదను' అని అనింది. యాకోబు రాహేలును అమితంగా ప్రేమించాడు. కానీ ఆమె మాట్లాడిన మాట యాకోబుకు కోపాన్ని రవులుకునేట్లు చేసింది. కొందరు భార్యలు, తన భర్తలను తాము కోరిన కోర్కెలు తీర్చకుంటే చిన్నదానికీ, పెద్దదానికి, ప్రతిదానికి చచ్చిపోతాను, చచ్చిపోతాను అని భయపెడుతూ, బెదిరిస్తూ, బ్లాక్‌మెయిల్ చేస్తూనే ఉంటారు. కోరిక తీరకపోతే వారు అడిగినంత కొనివ్వకపోతే వారడిగిన బట్టలు, సొమ్ములు తీసివ్వకపోతే అలిగి, వంట చేయకుండా దుప్పటి కప్పుకొని పడుకునే అవివేకపు స్త్రీ ఎందరో లోకంలో లేకపోలేదు. క్రైస్తవ సోదరీలు కూడా అలానే ఉందామా? అన్యజనులకు వేరై జీవించాలి కదా. మనము వారివలే జీవిస్తే మనము క్రీస్తు బిడ్డలమని పిలువబడుటలో మాదిరి ఏముంటుంది?

కావున భర్తల అభిరుచులు ఎరిగి అలానే నడుచుకుంటే భర్తలకు కోపమొచ్చే ప్రసక్తే ఉండదు. ఈ చిన్న మర్మము భార్యలైన మనమెరిగితే ఇద్దరి మధ్య సమస్యలే తెలెత్తకుండా ఉంటాయి. వారి కొరకు మనల్ని దేవుడు తయారుచేశాడు. కానీ, భార్యల కొరకు భర్తలను దేవుడు తయారుచేయలేదు. ఆదాములోనుండే హవ్వ వచ్చింది కానీ, హవ్వలోనుండి ఆదాము రాలేదు. ఆదాముకున్న 206 ఎముకల్లో ఒక ఎముక ద్వారానే హవ్వను దేవుడు రూపించాడు. ఈనాడు భర్తతోపాటు ఈక్వల్‌గా భార్యలు చదివి, ఉద్యోగాలు చేసి, జీతాలు సంపాదించినంత మాత్రాన కుటుంబ జీవితంలో భర్తలకంటే భార్యలు అధికులు కారు. కనుక ఈ సంగతి బాగుగా గ్రహించినవారై భర్తలకు అనుకూలంగా, సహాయకరంగా, లోబడుతూ వారికి కోపం తెప్పించకుండా భార్యలు చూసుకోవలసిన బాధ్యత ఎంతనైన ఉన్నదని గ్రహిస్తే మంచిది. 'మీ పిల్లలకు కోపము రేపకుడి' అని తల్లిదండ్రులతో ఎఫెసీ 6:4లో చెప్పిన దేవుడే, 'మీ భర్తలకు కోపము రేపకుడి' అని చెప్పినట్లు భార్యలు గ్రహించుకోవాలి. సామెతలు 15:1 లో, నొప్పించు మాట కోపము రేపును' అని వ్రాయబడినట్లు, భర్తకు కోపము వచ్చే మాటలు మాట్లాడకూడదు. ఒక భార్య తన భర్తతో 'నిన్ను పెళ్ళి చేసుకోవడమే నేను చేసిన పెద్ద తప్పు' అనింది. ఈ మాటను భర్త మరచిపోలేకపోయాడు. ఈ మాటతో ఆయన మనసు విరిగిపోయింది. మనసులో గాయపడిన భర్త నాటనుండి భార్యతో మాట్లాడుట లేదు. ఈమె కూడ 'ఏమండీ, పొరపాటున అనరాని మాట అని మిమ్మల్ని బాధపెట్టి కోపమొచ్చేటట్లు చేశాను. దయచేసి 'అయామ్ సారీ' అని చెప్పడానికి నేనెందుకు తగ్గాలి? అనుకుంది. అంతే కొద్దికాలానికి ఆ భర్త ఆ భార్యకు దూరమైపోయాడు. జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టుకొనును అని వాక్యం సెలవిస్తుంది. చిన్న చిన్న విషయాలను చిలికి చిలికి గాలివాన అయినట్లుగా పెద్ద సమస్యలుగా బూతద్దాలలో వాటిని చూసుకుంటూ క్షమాగుణము లేకుండుట వలన ఈనాడు అనేకమంది భార్యాభర్తలు ఒకరికొకరు

దూరమైపోతున్నారు. కుటుంబాలు కట్టుకోవలసిన భార్యలు, ఒక చిన్న క్షమాపణ అడుగుటకు తమ్మును తాము తగ్గించుకొనకపోవుటచే కాపురాలు కూలజేసుకుంటున్నారు. మన పాఠ్యభాగంలో తప్పకుండా సమ్సోను భార్యదే, కానీ ఆమె భర్తను క్షమాపణ కూడా అడుగలేదు. అలా అడిగి వుంటే వారి కాపురం సజావుగా సాగిపోయేది. మనము ఆలాగు చేయుకుందుము గాక.

అలాగే మన ప్రభువుకు కూడా సంఘ వధువైన మనము కోపము పుట్టించ కూడదు. ఇశ్రాయేలీయులు అరణ్యములో యెహోవాకు కోపము పుట్టించినట్లు ద్వితీ 9:7లో చదువుచున్నాము. దేవునికి మనమీద కోపము ఎందుకు వస్తుంది?

**1) కీర్తన 2:12 లో** 'కుమారుని ముద్దుపెట్టుకొనుడి, లేనియెడల ఆయన కోపించును' అని వ్రాయబడింది. ఈ మాట ప్రకారం, మనుషులందరూ యెహోవా దేవుని కుమారుడైన యేసుప్రభువుని రక్షకునిగా స్వీకరించి ఆయనను మాత్రమే ప్రేమించాలి. ఆయననే సేవించాలి. లేకపోతే దేవుడు కోపిస్తాడు. కీర్తన 106:32 లో 'మెరీబా జలముల యొద్ద ఇశ్రాయేలీయులు ఆయనకు కోపము పుట్టించారు.' ఆలాగున దేవునికి ఇశ్రాయేలీయుల మీద కోపము రావడానికి కారణం వారి అవిశ్వాసపు మాటలే.

**2) ద్వితీ 1:26-27 లలో** వ్రాయబడినట్లు, వారు యెహోవా వారికిచ్చుచున్న మంచి దేశమునకు వెళ్ళక ఆయన సెలవిచ్చిన మాటకు తిరుగబడి, యెహోవా మనయందు పగబట్టినందున మనలను సంహరించునట్లు అమోరీయుల చేతికి మనలను అప్పగించుటకు ఐగుప్తు దేశమునుండి మనలను రప్పించియున్నాడు. మనమెక్కడికి వెళ్ళగలము? మన సహోదరులు అక్కడి మనుష్యులు మనకంటె బలిష్టులును ఎత్తరులునైయున్నారు. ఆ పట్టణములు గొప్పవై ఆకాశమునంటు ప్రాకారములతో నున్నవి. అక్కడ అనాకీయులను చూచితిమి. మా హృదయాలు కరిగిపోయాయి అని వారు చెప్పిన మాటలను బట్టియు, రాత్రి అగ్నిలోను, పగలు మేఘములోను వారి ముందర నడిపిన దేవుడైన యెహోవాయందును వారు యెహోవా యందు విశ్వాసముంచని దానిబట్టియు యెహోవాకు కోపము వచ్చినట్లు చూస్తున్నాం. కనుక దీనిని బట్టి మన అవిశ్వాసపు మాటలు దేవునికి కోపము రప్పిస్తాయని నేర్చుకుంటున్నాం.

**3) నెహెమ్యా 4:1-5** వచనాలలో యూదులు గోడు కట్టుచున్నసమాచారము విని సన్బల్లటు అను శత్రువు మిగుల కోపగించి, రౌద్రుడై యూదులను ఎగతాళి చేసి షోమ్రోనుదండు వారి యెదుట తన స్నేహితుల యెదుట ఇలా అన్నాడు, దుర్బలులైన ఈ యూదులు ఏమి చేయుదురు? తమంతట తామే ఈ పని ముగింతురా? కాల్చబడిన చెత్తగా కుప్పలుగా పడియున్న రాళ్ళను మరల బలమైనవిగా చేయుదురా? మరియు అమ్మోనీయుడైన టోబియా అతని యొద్ద వుండి, వారు కట్టిన దానిపైకి ఒక నక్క యెగిరినట్టయిన వారి రాతిగోడ పడిపోవునది.' ఇటువంటి తిరస్కారపు మాటలు శత్రువులైన వీరు యూదులను అనినపుడు దేవునికి వారి శత్రువులమీద కోపము వచ్చినట్లు

చూస్తున్నాము. కావున దేవుని సేవను చేయు దేవుని దాసుల పనిని మనము విమర్శిస్తూ తేలికగా, తిరస్కారముగా మాట్లాడితే దేవునికి కోపము పుట్టించినవారమౌతాము. కనుక అలాంటి మాటలు దేవునికి కోసం పుట్టిస్తాయి. ఇలాంటి మాటలు మాట్లాడడం మనము మానుకోవాలి.

**10. వేరొకనిచెంతకు వెళ్ళిపోయిన సమ్సోను భార్య (న్యాయాధి 15:1):** సమ్సోనుకు భార్య ఓటమిని, కోపమును తెప్పించుటను బట్టి అతడు తన తండ్రి యొద్దకు వెళ్ళగా కొన్ని రోజులకైనా తన కోపాన్ని మరచి తన యొద్దకు వస్తాడు అన్న ఆలోచన లేక, ఈ తప్పుకు తానే కారణమన్న పశ్చాత్తాపము లేక భర్త ఏనాటికైనా మళ్ళీ వస్తాడు, అప్పుడైనా ఆయనను క్షమాపణ అడుగుతాను అని అనుకోకుండా ఆమె అర్జెంట్‌గా సమ్సోను స్నేహితుణ్ణి పెండ్లి చేసుకొని వెళ్ళిపోయినట్లు వాక్యంలో చూస్తున్నాము. ఒక అనామకుణ్ణి, పేరుప్రఖ్యాతులు లేనివాణ్ణి, బలహీనుణ్ణి, ఏ అధికారము లేనివాణ్ణి పెండ్లి చేసుకుంది. దేమా ఇహలోకాన్ని స్నేహించి థెస్సలొనికకు వెళ్ళినట్లు ప్రియసోదరీ, నీవూ అలాగే నీ ప్రభువుకు దూరముగా ఉన్నావా? భర్త తన తండ్రి యింటికి వెళ్ళినట్లు యేసుప్రభువు మన ఆత్మీయ భర్త. మనకు స్థలము సిద్ధపరచడానికి వెళ్ళియుండగా, ఆయన రాకడ ఏమాయెను అని ఆయన రాకడ ఆలస్యమైనదనుకొని ఈనాడు అనేకులు ఆయన రాకడ కొరకు కనిపెట్టక, తమ స్వంత మార్గాల్లోకి వెళ్తున్నారు. సమ్సోను భార్య సమ్సోను బ్రతికియుండగా భర్తను విడిచి, మరచిపోయి, మరొకని చెంతకు చేరి 'వ్యభిచారి' అయిపోయింది. ఆ మరొకడు సమ్సోను పెండ్లి రోజున సమ్సోను ప్రక్కన కూర్చుండిన తోడి పెళ్ళికొడుకని నేను 'కెథోలిక్ బైబిల్' అనువాదములో చదివాను. ఈనాడు చాలామంది భర్తను విడిచి, భర్త ఫ్రెండ్స్‌తో స్నేహము, వారితో తిరగడము, వారితో క్లబ్స్‌కు వెళ్ళడము, ఈలాటివన్నీ చేస్తున్నారు. వంకర త్రోవల్లో నడుస్తున్నారు. హెబ్రీ 10:37 లో వ్రాయబడినట్లు ఆయన ఆలస్యము చేసినట్లు మనకనిపిస్తుందంటే, 2 పేతురు 3:9 లో వ్రాయబడినట్లు 'యెవడూ నశింపవలెనని యిచ్ఛయింపక, అందరూ మారుమనస్సు పొందవలెనని కోరుచు, మన యెడల దీర్ఘశాంతము గలవాడైయున్నాడు.' అట్టి దేవుని దినపు రాకడు కొరకై మనము ఆశతో అపేక్షించుచు (మూలభాషలో త్వరపెట్టుచు అని ఉంది) పరిశుద్ధ ప్రవర్తనతోను, భక్తితోను, ఎంతో జాగ్రత్తతోను ఉండవలెనని 2పేతురు 3:12లో వ్రాయబడింది.

కానీ, సమ్సోను భార్య సమ్సోను తన తండ్రి ఇంటికి వెళ్ళినపుడు పరాయివాని పంచలో ఉంటున్నావా? ఎందుకనగా 2కొరింథీ 11:2 లో వ్రాయబడినట్లు పవిత్రురాలైన కన్యకలాగా ఒక్కడే పరుషునికి అనగా క్రీస్తుకు మనము సమర్పింపబడునట్లు మనము ఆయనకు ప్రదానము చేయబడ్డాము. కానీ సర్పము తన కుయుక్తిచేత హవ్వను మోసగించినట్లు మన మనసులను చెరిపి క్రీస్తునందున్న సరళత నుండి, పవిత్రత నుండి తొలగిస్తాడేమో అని ఆనాటి కొరింథు సంఘమును గూర్చి పౌలు భయపడినట్లు చదువుతున్నాము. ఆ భయము ఈనాడు సార్వత్రిక సంఘములో వున్న మనమును

శరీరాశ, నేత్రాశ, జీవపుదంబములోనికి వెళ్ళక జాగ్రత్తపడదాము. ఇక సమ్సోను భార్య సమ్సోనును ఎన్నడూ కలువలేకపోయింది.

కానీ, సంఘ కన్యకలమైన మనము అలా దారి తొలగిపోయినప్పటికీ ఇంకను మనల్ని యిర్మీయా 3:1,14,22; ఇంకా 4:1 ద్వారా, 'నీవు అనేకులైన విటకాండ్రతో వ్యభిచారము చేసినను నాయొద్దకు రమ్మని ప్రభువు పిలుస్తున్నాడు.' 'భ్రష్టులైన పిల్లలారా, తిరిగి రండని పిలుస్తున్నాడు. ద్రోహివివగు ఇశ్రాయేలూ, తిరిగి రమ్మని పిలుస్తున్నాడు. ఇశ్రాయేలూ, నీవు తిరిగి రానుద్దేశించిన యెడల నా యొద్దకే రావలెను. నీవు ఇటు అటు తిరుగుట మాని నీ హేయ క్రియలను నా సన్నిధి నుండి తొలగించుకొనుము అని ప్రభువు ప్రేమతో పిలుస్తూనే ఉన్నాడు.

న్యాయాధి 15:1 లో సమ్సోను కూడా వెళ్ళి కొన్ని దినములైన తరువాత గోధుమల కోతకాలమున సమ్సోను మేకపిల్లనొకటి తీసుకుని తన భార్యను చూడడానికి వచ్చి అంతఃపురములోనున్న తన భార్య యొద్దకు వెళ్తానని తన మామతో చెప్పినట్లు చదువుచున్నాము. సమ్సోను తన భార్య తన మామ ఇంటిలోనే ఉన్నదనుకొని, తన కోపాన్ని మానుకొని వారమురోజులుగా క్రొత్త దంపతులు పురవాసంతో గడిపాడు గనుక ఈ రోజు డిన్నర్ చేసుకొని, భార్యాభర్తలకు కోపమొస్తే సూర్యాస్తమయమందే కోపము విడిచిపెట్టి ప్రేమించాలి. కొంతమందికి సూర్యుడు ఎన్నిసార్లు అస్తమించినను వారి కోపము మాత్రము అస్తమించదు. సమ్సోను వచ్చినపుడు ఆమె ఇంట్లో లేదు. అలానే ప్రభువైన యేసుక్రీస్తు పరలోకాన్ని సిద్ధపరచడానికి వెళ్ళి తిరిగి రెండవ రాకడలో ఏ కాలమున వస్తాడో తెలియదు. ఆయన వచ్చినపుడు మనం ఎత్తబడడానికి సిద్ధంగా ఉండాలి. వచ్చినపుడు సమ్సోను మేకపిల్లను తెచ్చాడు. ప్రభువు మన కొరకు సిద్ధపరచిన జీతాన్ని తీసుకొని వస్తాడు. అంతఃపురములోనికి వెళ్దామనుకుంటే సమ్సోను మామ అతనిని అడ్డగించినట్లు సంఘమును ప్రభువు సంఘమును మధ్యాకాశమునకు తీసికొని వెళ్ళేటప్పుడు ఆకాశమండములోని దురాత్మల సమూహము మనలను అడ్డగించకుండునట్లు రెప్పపాటు కాలములో ప్రభువు మనల్ని తీసుకొనివెళ్తాడు. సమ్సోను మామ సమ్సోనును లోపలికి వెళ్ళనియ్యక – నిశ్చయముగా నీవు ఆమెను ద్వేషించితి వనుకొని ఆమెను నీ స్నేహితునికిచ్చితిని. ఆమె చెల్లెలు ఆమెకంటే చక్కనిది కదా. ఆమెకు ప్రతిగా ఈమె నీకుండవచ్చును, చిత్తగించుము అన్నాడు. ఇక్కడ సమ్సోను మామ తన మరదలు తన భార్యకంటే చక్కనిదని చెప్పినా సమ్సోను ఆమె చక్కదనమునకు హృదయములో ఆశ పడలేదు. సామెతలు 6:25 లో 'అది తన కనురెప్పలను చికిలించి లోపరచుకొననియ్యకుము' అని దేవుడు వ్రాయించినట్లే తల్లి తండ్రి ఆజ్ఞలు, ఉపదేశములననుసరించి (సామెతలు 6:20) సమ్సోను మరదలిని తన జీవితంలో ఆహ్వానించలేదు. మామగారే పర్మిషన్ ఇచ్చినా అలాగు చేయలేదు. సమ్సోను ఈ శోధనను చక్కగా జయించగలిగాడు. నేటి దినములలో త్రాగుడు, వ్యభిచారము, ధనమోహములలో అనేకమంది తొలగిపోవుచుండగా సమ్సోను జయించగలిగాడు.

లేవీ 18:18 లో 'నీ భార్య బ్రతికియుండగా ఆమెను పీడించుటకు ఆమె సహోదరి మానాచ్ఛాదమును తీయుటకు ఈమెను ఆమెతో పెండ్లి చేసికొనకూడదు' అని ధర్మశాస్త్రములో వ్రాయబడిన సంగతి 'నాజీరుగా' నేర్చుకున్నాడు కాబట్టి, తన మామ చెప్పినట్లు చేయలేదు. వాక్యము చెప్పినట్లు చేశాడు. నేటి యువతీయువకులు కూడా తమకు శోధన వచ్చినపుడు వాక్యము ఏమి చెబుతుందో వాక్యము చదివి ఆలాగున ప్రవర్తించాలి. కీర్తన 119:104 లో వ్రాయబడినట్లు, 'ఆయన ఉపదేశము వలన నాకు వివేకము కలిగెను. తప్పు మార్గములన్నియు నాకు అసహ్యములాయెను' అని మనమందరము చెప్పగలము.

**11. అగ్నిచేత కాల్చబడిన సమ్సోను భార్య (న్యాయాధి 15:6):** సమ్సోను తన భార్యను తన మామ వేరొకనికిచ్చి పెళ్ళి చేసినందున, సమ్సోను 300 నక్కలను తోకతట్టు తోకను త్రిప్పి వాటన్నిటిని దివిటీకి కట్టి వాటిలో అగ్నిని మండచేసి ఫిలిష్తీయుల గోధుమల చేలలో పనల కుప్పల మీదికి వాటిని పోనిచ్చి, ద్రాక్షతోటలను, ఒలీవ తోటలను తగులబెట్టాడు. ఫిలిష్తీయులు ఇది ఎవరుచేశారని చెప్పుకుంటూ తిమ్నాతీయుని అల్లుడైన సమ్సోను భార్యను, ఆమె తండ్రి తీసికొని అతని స్నేహితునికిచ్చెను గనుక అతడే చేశాడని చెప్పారు. గనుక ఫిలిష్తీయులు ఆమెను, ఆమె తండ్రిని అగ్నితో కాల్చారు. పెండ్లి చేసుకున్న మొదటి రోజు నుండి ఆమెను ఫిలిష్తీయులు సమ్సోనును లాలన చేసి విప్పుడు కథ భావము తెలుకోమన్నారు. లేకపోతే తనను, తన తండ్రిని అగ్నితో కాల్చుతామన్న ప్రకారమే, విప్పుడు కథ భావము ఆమె ఫిలిష్తీయులకు తెలిపినప్పటికీ వారి ద్రాక్ష తోటలను సమ్సోను కాల్చివేసిన కారణాన ఆమెను ఆమె తండ్రిని వారిప్పుడు అగ్నితో కాల్చివేసినట్లు తెలుస్తుంది. ఈ స్త్రీ తన సమస్యను తన భర్త దగ్గర దాచుకొని తన్నుతాను రక్షించుకోవాలనుకుంది. తన్నుతానే తన జీవితాన్ని కాల్చుకుంది. తండ్రి చావుకు కారణమైంది. ఇతరుల తోటలు కాల్చబడుటకు కారణమయ్యింది.

ప్రియ సోదరీలారా, పరమ సమ్సోనైన ప్రభువు మీద ఆనుకొని ఆయనను నమ్మకుండా ఉంటే మనకు మనమ నాశనము చేసికుంటాము. యెహోవాను విడిచి వేరొకని అనుసరించు వారికి శ్రమలు విస్తరించునని కీర్తన 16:4 లో వ్రాయబడినట్లే ఆమె శ్రమలు ఎదుర్కొంది. నన్ను కనుగొననివాడు తనకు తానే హాని చేసికొనును అని సామెతలు 8:36 లో వ్రాయబడింది. మనము దేవునిచే కాపాడబడి ఇతరులను రక్షించవలసినవారముగా ఉన్నాము. మనము లోకానికి రక్షణ కలిగించవలసిన వారము. కానీ మనమునూ, వారునూ ఏకముగా పనికిమాలినవారమై నరకాగ్నిలో పడవేయబడి నడిస్తే ఏమి లాభము?

ఈ స్త్రీ తన భర్తకు నమ్మకముగా లేక భర్త బ్రతికి ఉండగా వేరొకని పంచకు వెళ్ళిపోవడం వలన ఆ రెండవ భర్త ఏమైనా ఆమెను రక్షించగలిగాడా? కీర్తన 73:27 లో 'నిన్ను విసర్జించువారు నశించెదరు, నిన్ను విడచి వ్యభిచరించు వారందరిని నీవు సంహరించెదవు. నాకైతే దేవుని పొందు ధన్యకరము' అని చెప్పబడిన ఈ మాట ప్రకారము, సమ్సోను భార్య సమ్సోనును వదిలి మరొకని దగ్గరకు వెళ్ళి వ్యభిచరించినట్లు ప్రభువును

విసర్జించిన వారందరూ నరకాగ్ని పాలవుతారు. దేవుణ్ణి విడవడం వ్యభిచారముతోనే సమానం. సమ్సోనుకు ఎందుకోసం ఈ భార్యను పెండ్లి చేసుకోమని దేవుడు ప్రేరేపించాడు?

పెండ్లి చేసుకున్నప్పటి నుండి 7 రోజులై వారిద్దరూ కలిసి ఉన్నా, ఆమె ఎప్పుడూ ఏడుస్తూనే ఉండింది. భర్తను సుఖపెట్టలేదు. తానూ సుఖపడలేదు. తప్పు తానే చేసి, కనీసం భర్తను క్షమాపణ అడుగలేదు. తండ్రి ప్రేరణతో రెండవ పెళ్ళికి వెంటనే వెళ్ళింది. ఫిలిష్తీయుల మాట వినింది. భర్త మాట వినలేదు. తన ద్వారా ఇతరులకు కూడా నష్టం కలిగించింది. చివరకు, తాను, తన తండ్రి, ఇద్దరూ కలిసి చేసిన తప్పులకు ఇద్దరూ అగ్నిపాలయ్యారు. కొద్దిమంది స్త్రీలు పెళ్ళి అయ్యాక కట్టుకున్న భర్త మాట వినరు, తలిదండ్రుల మాట, పరాయివారి మాటలు వింటారు. అలా వారి మాట విని, అజ్ఞానంతో కుటుంబ జీవితాన్ని పాడుచేసుకుంటున్నారు. కీర్తన 45:10 లో, 'కుమారీ, ఆలకించుము, ఆలోచించి చెవియొగ్గుము. మరువుము నీ తండ్రి యింటిని, మరువుమూ నీ స్వజనమును. ఈ రాజు నీ ప్రభువు అతనికి నమస్కరించుము' అని వ్రాయబడిన వాక్య ప్రకారము తండ్రి యింటిని మరువమని దేవుడు చెబుతూ భర్తకు నమస్కరించమని చెప్పిన మాటను ఈనాటి యవన స్త్రీలు గమనించలేక, కొన్నిసార్లు తన ఐశ్వర్యాన్ని బట్టి, తమ అందాన్నిబట్టి గర్విస్తూ దేవునియందు భయభక్తులు లేక, వాక్యజ్ఞానం లేక, భర్తకు అన్ని విషయాల్లో లోబడి ఉండాలనే విషయాన్ని పాటించలేక సమ్సోను భార్యలాగా కుటుంబ జీవితాన్ని పాడుచేసుకుంటూ, ఇటువైపు తల్లిదండ్రులకు, అటువైపు అత్త మామలకు ఎంతో నష్ట కష్టాలను, నెమ్మదిలేనితనాన్ని తెచ్చిపెడుతున్నారు. చిన్న విషయాలను భూతద్దంలో చూచుకుంటూ భర్తలను విడిచి, తల్లిగారింటికి చేరి, భర్తల మీదనే పోలీస్ కంప్లెయింట్, కోర్టు కేసులు వేయించి పండంటి కాపురాలను కాల్చుకుంటున్నారు. అటువంటి స్త్రీలలో కొద్దిమంది పిల్లలను కనినవారు కూడా ఉంటున్నారు. ఇలాగున భార్య, పిల్లలు తమ తల్లిగారింటికి పోవుట వలన, భార్య, పిల్లలు లేని భర్త ఒంటరివాడై ఇతను ఎన్ని బాధలు పడాల్సివస్తుందో ఆ భార్యకు తెలియడం లేదు. ఎవరిది తప్పయినా, జ్ఞానవంతురాలుగా తన కుటుంబాన్ని కట్టుకోవాల్సింది భార్యయే. వాక్యం అలాగే సెలవిస్తున్నది (సామెతలు 14:1).

ఇట్టి భార్యయైననూ దేవుడు ప్రేరేపించాడు గనుక సమ్సోను చేసుకున్నాడు కానీ ఫిలిష్తీయులను చంపి ఇశ్రాయేలీయులకు మేలు, క్షేమము, దాసత్వం పోగొట్టి వారికి న్యాయం జరిగి, రక్షించులాగున దేవుడు సమ్సోనుకు అలాటి భార్యనిచ్చాడే కానీ, భార్యతో సుఖించాలని కాదు. ఈనాడు చాలామంది దైవసేవకుల భార్యలు కూడ భర్తలను, వారి భార్యలు సాటియైన సహాయంగా ఉండక, వారిని అర్థంచేసుకొనక చాలామంది వారికి వ్యతిరేకంగా నడుచుకొంటున్నారు. లోకస్థుల్లాగానే ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి భర్తలు, భార్యలున్నా, భార్యలు లేనట్లే వీరు కాలం గడపాల్సివస్తోంది. సమ్సోనుకు ఈ భార్య వలన సుఖము, క్షేమము కలుగలేదు గానీ, దేవుని చిత్తము ఇశ్రాయేలీయుల పక్షంగా నెరవేర్చబడింది.

మనం కూడా ఈ లోకంలో భార్యా పిల్లలతో, ఉద్యోగాలతో సుఖించడం కాదు గానీ, మనమనేక శ్రమలు అనుభవిస్తూనే దేవుని చిత్తాన్ని చేసి ఆయనను మహిమపరచి ప్రభువునొద్దకు వెళ్ళాలని నేర్చుకుంటున్నాము. మన ప్రభువు కూడా అనేక కష్టాలు అనుభవించి ప్రాణం పెట్టి తిరిగి లేచి తండ్రి యొద్దకు వెళ్ళాడు. కానీ సమ్సోను భార్య ఇంటిలో ఉండినట్లయితే న్యాయాధి 16:1 లో సమ్సోను వేశ్యతో ఒక అర్ధరాత్రి గడుపుట అనే శోధనలో పడేవాడు కాదు. ఆ తరువాత దెలీలాను మోహించేవాడే కాదు. సమ్సోను అంత త్వరగా చనిపోయి ఉండేవాడు కాదు. స్త్రీలోలుడై ఉండేవాడే కాదు. హిందూ పురాణాల్లో భార్య యొక్క ప్రేమ వలన భర్త యొక్క ఆయుస్సు రెట్టింపు అవుతుందని వ్రాయబడింది. ప్రేమించే భార్య ఇంటిలో లేని కారణాన భర్తయైన సమ్సోను 21 సంవత్సరాలు మాత్రమే న్యాయాధిపతిగా ఉండి, అంతకు మునుపు, అనగా పెండ్లి కాకమునుపు అతని వయసు 20 సంవత్సరాలు ఉండినట్లయితే ఇంచుమించు 40 యేండ్ల కాలములోనే చాలా 'షార్ట్ టైమ్'లోనే అతను చనిపోయినట్లు మనము గ్రహించగలము. భార్యలు ఆత్మీయంగా అందమైనవారుగా ఒంటరితనములో సాటియైన సహాయురాలుగా, భర్తకు ఆహారము వడ్డించే విషయములో తల్లిలాగ, ఆలోచన చెప్పే విషయములో మంత్రిలాగా, భర్త అనారోగ్యంలో నర్సులాగా ఉండవలసిన భార్య ఇల్లు విడిచి వెళ్ళిపోతే అలా చేయడం ఆమెకు, ఆమె భర్తకు అపార నష్టాన్ని తెచ్చిపెడుతుంది. విడిపోయిన భార్య భర్తలలో ఎవరు సంతోషంగా ఉండగలుగుతున్నారు?

తల్లిదండ్రులైనా, అలాగు తన భర్తను విడిచి ఇల్లు చేరిన పిల్లలకు వివాహ జీవితమును గూర్చిన కౌన్సిలింగ్ ఇచ్చి, లేక ఇప్పించి, నచ్చచెప్పి, ఒప్పించి పిల్లలను భర్త ఇంటికి పంపించే ప్రయత్నం చేయాలి. భర్త తప్పులేవైనా చేసివుంటే వాటిని ప్రభువులాగా క్షమించుకొని, ప్రార్థన ద్వారా, ఆయనను ప్రేమించుట ద్వారా, తన పవిత్ర ప్రవర్తన ద్వారా భర్తను రాబట్టుకొనవలెననే 1పేతురు 3:1-3 వచనాలను గురించి పిల్లలకు గుర్తుచేసి ధైర్యము చెప్పి భర్త దగ్గరకు పంపించే ఏర్పాటు చేయాలి.

కనుక భర్తలను విడిచి, సంసారాన్ని విడిచి తల్లిగారిల్లు చేరిన సోదరీలారా, పెద్దమనసు చేసుకొని, మారుమనసు పొంది, మీ భర్తలు దారితప్పి, చెడిపోకముందే, మరో స్త్రీతో సంబంధాలు పెట్టుకోకముందే, దుర్వ్యసనాలు నేర్చుకోకముందే మీ భర్తల యొద్దకు వెళ్ళి, క్షమాపణ పొందుకోండి. లేక, వారిని క్షమించుకొని సమాధానంగా మెలగండి. ఒకరినొకరు క్షమించుకోండి. సంసారాలను కట్టుకోండి. మీ భర్తల తప్పులేవైనా ఉంటే, ప్రభువు మిమ్ములను క్షమించినలాగున మీరునూ క్షమించండి. ప్రభువును మహిమపరుస్తూ నిందించుటకు విరోధికి అవకాశమివ్వకుండా ముందుకు సాగండి.

దేవుడు మిమ్మును, మీ కుటుంబాన్ని దీవించి అనేకులకు దీవెనకరముగా, రక్షణకరముగా ఉండునట్లు ఆశీర్వదించాలని కోరుకుంటూ సమ్సోను భార్యను గురించిన ధ్యానాన్ని ముగిస్తున్నాను.

ఇట్లు
మీ **కెజియక్క**
9440469046